
# దూరతీరాలు

దాసరి శిరీష



# దూరతీరాలు

(నవల)

దాసరి శిరీష

ఆలంబన ప్రచురణలు

# Doorateeralu

(A novel in Telugu)

**Dasari Sireesha**

## దూరతీరాలు

నవల

(23-11-88 నుంచి 8-3-89 వరకూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా ప్రచురితం)

© 2016 by Dasari Sireesha

**Published by: Alambana Prachuranalu**
H.I.G. 85, Balajinagar,
Kukatpalli, Hyderabad - 500072
Phone: 040-23055904
email: aalambana.sireesha@gmail.com

*Typesetting*: Kolluri Soma Sankar

*Copies available at:*
**All Leading Book Shops**
*and with the publisher.*

For eBook and Online Sales:
**www.kinige.com**

Printed at:
**Rainbow Print Pack,**
Ameerpet, Hyderabad 500016
Ph: 040-23731620, 23741620

**₹ 120/-**



దాసరి శిరీష – మనిషి మనిషిగా జీవించే పరిస్థితులు అంతరిస్తున్నందుకు ఆవేదన చెందుతారు. సాహిత్యం అనేక రూపాలలో ఒకనాడు సమాజానికి దిక్సూచిలా పనిచేస్తే, ఇప్పుడు అదే సాహిత్యం వెర్రితలలు వేస్తూ వికృత పరిణామాలకు దారితీయడం పట్ల వ్యథ చెందుతారు. తల్లి భాషను నిర్లక్ష్యం చేస్తూ.. సాహితీ స్పర్శకి దూరమవుతున్నందుకు విచారిస్తూ, శైశవదశనుంచే భవిష్యత్ పోరాటాలు ప్రారంభించడాన్ని నిరసిస్తున్నారు. అందువలనే యువత సరైన మార్గదర్శకులు లేక సాహితీ ప్రపంచానికి దూరమై వ్యక్తిత్వ వికాసాలలో గందరగోళ పరిస్థితులని దారుణంగా ఎదుర్కొంటున్నారని ఆవేదనపడుతున్నారు. తరాలమధ్య అంతరాలు తగ్గి సాహితీ ప్రయాణాలు సజావుగా సాగాలని అభిలషిస్తున్నారు.

ఒకప్పుడు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం. స్వచ్ఛంద పదవీ విరమణ. అనంతరం స్నేహితులతో కలసి ఆలంబన అనే సంస్థని స్థాపించి మరికొంతమంది మిత్రుల సహకారంతో సంతృప్తికరంగా నడిపిస్తున్నారు.

ఆనాడు చలం, శరత్, కొడవటిగంటి లాంటి వారితో పాటు, ఈనాడు చైతన్యపరుస్తున్న అనేకమంది రచయితలను అభిమానంగా చదువుతారు, నేర్చుకుంటారు. పాటలు, ప్రకృతి తన నేస్తాలని బలంగా విశ్వసిస్తారు.

# కృతజ్ఞతలు

ముందుగా నా రచనలకి ఒక రూపాన్ని ఇవ్వాలని సంకల్పించి... బాధ్యతగా, వేగంగా తన పనితనం చూపించిన మిత్రుడు కొల్లూరి సోమ శంకర్‌కి చాలా కృతజ్ఞతలు.

" 'ఆలంబన' నడిపిస్తున్నావు, బాగానే ఉంది కాని బొత్తిగా రాయడం మానేశావు" అని నిష్ఠుర ప్రేమతో మందలించిన స్నేహితుల ప్రోద్బలం, ప్రోత్సాహం మరువలేను. ఇంక కుటుంబసభ్యుల సహకారం కొత్తగా వివరించనక్కరలేదు. వారంతా సాహితీ వారధులు... వారసులు గూడా. ఆ కొనసాగింపు నాకు గొప్ప ప్రేరణ.

వీటన్నింటికన్నా ముందు కొన్నేళ్ళ క్రితం "స్ప్రెడింగ్ లైట్" ద్వారా నా సాహితీ ఉదాసీనతని వదిలించి నన్నే గాక అనేకమందిని ఇదొక "సాహితీ ఉద్యమం" సుమా అనుకునేలా పురికొల్పి అన్ని దిశలా పుస్తక సామ్రాజ్యాన్ని విస్తరింపజేస్తున్న డాక్టర్ సూర్యప్రకాశ్, కామేశ్వరీ గార్లు సాహిత్యానికి కొత్త బాటలు వేశారు. నన్నూ అందులో భాగస్వామిని చేశారు.

కృతజ్ఞతాభినందనలు ఈ దంపతులకి.

"సాహిత్యంతో మనం" అంటూ ఆలంబనలో వేదికని ఏర్పరిచిన అనిల్ అట్లూరి ఆగమనం మరో కొత్త మలుపు. ఈ సాహితీ యాత్రలో ఎంతోమంది రచయితలూ, కళాకారులూ, పాత మిత్రులూ శ్రద్ధగా పాల్గొంటూ మార్గాన్ని సుగమం చేస్తున్నారు. వారి ఆదరాభిమానాలకి మరీ మరీ కృతజ్ఞతలు.

ఎన్నో ఏళ్ళక్రితమే అత్యున్నమైన సాహిత్యాన్ని సృష్టించి – రచయితలు సామాజిక విశ్లేషకులుగా ఉండాల్సిన ఆవశ్యకతని తమ రచనల ద్వారా నొక్కి వక్కాణించి... ప్రభావితం చేసి... నిష్క్రమించిన అద్భుతమైన వ్యక్తులకి ఎంతగా ఋణపడివుంటామో? వారి సాహితీ సౌరభాలు నేటికీ నిత్య నూతనాలు. అనుసరణీయాలు.

ఒక రచన పుస్తకంగా రావాలంటే అనేకమంది తెర వెనుక వ్యక్తుల కృషి ఉంటుంది. "దూరతీరాలు" ఆంధ్రప్రభలో సీరియల్‌గా వస్తున్నప్పుడు శ్రద్ధగా చదివి ఎంతోమంది మిత్రులు అభిప్రాయాలు చెబుతూ వచ్చారు. వారిలో మరీ సన్నిహితంగా వచ్చిన నాదెళ్ళ అనూరాధ ఈ నవలకి ముందుమాట రాయడం ఆనందదాయకం. అలాగే, మా కుటుంబానికి ఆప్తులూ, ఆత్మీయులు అయిన వేమూరి సత్యనారాయణ గారి అభిప్రాయం అమూల్యం.

చిన్నప్పటి నుంచి సాహితీ వాతావరణంలో పెంచిన అమ్మ నంబూరి పరిపూర్ణ... తమ్ముళ్ళు అమరేంద్ర, శైలేంద్ర, మరదళ్ళు లక్ష్మి, పద్మా.... నా ప్రాణ స్నేహితులూ, శేషుబాబు, పిల్లలు అరుణ్, లావణ్య, అపర్ణ, కృష్ణమోహన్, బాలాజీ, శైలజల ప్రోత్సాహమూ, సహకారమూ మరువలేనివి.

ఎన్నో విలువైన విషయాలతో ముందుకొచ్చే 'వేదిక', 'సాహితీ సమాలోచన' సంస్థల మిత్రులకు ఈ పుస్తకం ద్వారా నా అభినందనలు తెలియజేస్తున్నాను.

**దాసరి శిరీష**

# నా మాట

దాదాపు ఇరవయి ఆరేళ్ళ క్రితం సమాజాన్ని ఆశావాదంతో, భావుకతతో పరిశీలిస్తున్న రోజులలో “దూరతీరాలు” రాయడం జరిగింది. తరాలు మారినా స్త్రీ పురుష సంబంధాల్లో వైరుధ్యం అభివృద్ధికరంగా మారడం లేదు. అరవయ్యేళ్ళ క్రితం స్త్రీలు ధీరత్వాన్ని, శూరత్వాన్ని సంతరించుకుంటే ఆ తర్వాత తరంలో స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించుకునే ప్రయత్నం ముమ్మురంగా సాగించింది. ఫలితాలు బావున్నాయి.

ఆర్థిక స్వావలంబనని పెళ్ళికి ముందూ... పెళ్ళి తరువాత గూడా స్త్రీ కుటుంబాలకే వాడింది. తోబుట్టువుల కోసం పెళ్ళిని గూడా వాయిదా వేసిన వాళు ్ళ కొందరయితే, భర్తకీ, పిల్లలకీ ఆలంబనయిన వివాహితలు మరికొంతమంది. ఈ క్రమంలో స్త్రీ జీవితం బరువెక్కింది. తనని తాను మరచి “త్యాగమే” పెద్ద సవాలుగా భావించిన భావజాలం ఆవరించింది. అటువంటి సంఘటనలలో స్త్రీలు పోరాడారు, దుఃఖించారు. అప్పుడప్పుడు ఓటమిని తట్టుకుంటూ కుటుంబాన్ని పదిలంగా తమ రెక్కల కింద దాచుకుని కాపాడుకోవాలని ఆరాటపడ్డారు.

స్త్రీ పురుషుల నైతికతలో తేడాల వల్ల పురుషుడికి సమాజం సానుకూలత ఏర్పరిచింది. చాలావరకూ వివాహేతర సంబంధాల ఘర్షణ నించి ఎలాగో ఒకలాగా బయటపడుతున్నాడు. స్వాతంత్ర్యేచ్ఛతో, అమాయకత్వంతో కొంచెం భిన్నంగా బ్రతకాలనే స్త్రీ మాత్రం దెబ్బతింటోంది. ఒక్కసారి ఆ అఘాతానికి జీవితాలే తారుమారవుతూ ఉండేవి. నేటి యువతా, స్త్రీలూ ఆ నైతికత కలిగించిన ఇబ్బందుల

నుంచి (ఆర్థికాభివృద్ధి వల్ల) కొంతవరకూ బయటపడినా – మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి స్త్రీలూ పేదవాళ్ళూ చాలా దారుణంగా మోసపోతున్నారు. వివాహేతర సంబంధాల పరిణామాలు స్త్రీ పురుషులిద్దరికీ విముక్తీ, రక్షణా కల్పించలేని మరో రకపు సంకెళ్ళయ్యాయి.

స్థిరమైన బంధాలకి ఏ కాలంలోనూ సరయిన నిర్వచనాలు చెప్పలేం. అనేక సామాజిక పరుగుల వల్ల మనం తయారు చేసుకున్న విలువలు మనల్నే వెక్కిరించేలా తయారయ్యాయి. విభ్రాంతిగా చూడడం మినహా మారే విలువలని బంధించలేం.

మనస్సాక్షి అనే అర్థవంతమైన పదం ప్రపంచీకరణ పుణ్యమా అని హుష్ కాకీ అయిపోయింది.

"వ్యాపార సరళి" అనేది అంతర్గతంగా అన్ని అనుబంధాల లోనూ చాపకింద నీరులా ప్రవేశించినా, మానవాళి ఎప్పుడూ ప్రశాంతమైన, నిశ్చలమైన, నిశ్చింతకరమైన ప్రేమాన్వేషణ మానరు. ఆదర్శ ప్రపంచం గురించి కలలూ, నిజాయితీతో కూడిన లక్ష్యాలూ ఎప్పుడూ తమ శక్తిని చూపిస్తూనే ఉంటూంటాయి.

ఎన్నో... దీర్ఘమైన అనుభవాలతో సాగుతున్న జీవితనావ పూర్తిగా మునగక పోయినా.... అప్పుడప్పుడు ప్రమాదాలకు గురువతూనే ఉంటుంది. కొంతమంది ముందే గ్రహించి ప్రమాదాల నుండి సురక్షితంగా బయటపడవచ్చు. ఈ సమస్యల సంఘర్షణలోంచి రూపొందిన ఈ "దూరతీరాలు" నవల. ఇది ఈ తరం పాఠకులకు కూడా చేరువవుతుందని ఆశిస్తున్నాను.

**దాసరి శిరీష**

# భిన్న కోణాల నుంచి అర్థం చేసుకోవాల్సిన నవల

ముందుమాట రాయమని కోరుతూ ఈ నవల నా చేతికిస్తూ రచయిత్రి ఒక మాట అన్నారు... "ఎప్పుడో రాసిన ఈ నవల ఇప్పటి పరిస్థితులలో అవుట్‌డేటెడ్‌గా ఉందని అనిపిస్తే చెప్పండి.. ప్రచురించకుండా వదిలేద్దాం" అని. ఆ ప్రశ్నకు సమాధానం నేను ఈ ముందుమాటతో ముందుకెళ్ళడమే.

*"సుఖపడే సంసారాలన్నీ ఒకలాగే ఉంటాయి. సుఖం లేని సంసారాలకి మాత్రం దేని బాధలు దానివి.*

*అబ్లాన్‌స్కీ ఇంటిలోని ప్రతి విషయం అయోమయంగా ఉంది. ఇది వరకు ఉపాధ్యాయురాలుగా ఉన్న ఒక ఫ్రెంచి యువతితో తన భర్తకు సంబంధం ఉందని అతని భార్య కనిపెట్టింది. ఇక ఆ ఇంటిలో అతనితో కలసి కాపురం చెయ్యనని అబ్లాన్‌స్కీతో ఖచ్చితంగా చెప్పింది. భార్యాభర్తలే కాక ఆ ఇంటి పరివారమంతా బాధపడ్డారు."*

ఈ వాక్యాలతో మొదలైంది ప్రఖ్యాత రష్యన్ రచయిత టాల్‌స్టాయ్ నవల ఆన్నా కరేనినా.... దాదాపు 150 ఏళ్ళ క్రితం వచ్చిందీ నవల.

ఇప్పుడు, 26 సంవత్సరాల క్రితం తొలిసారిగా ప్రచురితమైన ఈ నవల 'దూరతీరాలు' (ఆంధ్రప్రభ వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది) ఇలా ప్రారంభమైంది.

*"చుట్టూ పుస్తకాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. వాటి మధ్య జీవం లేనిదానిలా, పిచ్చిదానిలా ఎటో చూస్తూ కూచుండిపోయింది సంధ్య."* ఈ నవల తొలి వాక్యాలకూ కారణమూ అదే. తన భర్తకి మరో స్త్రీతో ఉన్న సంబంధం గురించి తెలిసిన స్త్రీ మనోవేదన. ఇక్కడ కూడా టాల్‌స్టాయ్ తొలి వాక్యాలు అన్వయిస్తాయి మరి. *సుఖంగా ఉండే కుటుంబాలన్నీ ఒక్కలాగే ఉంటాయి. సుఖం లేని కుటుంబాలలో దేని కష్టాలు దానివే!*

మంచి రచయితగా పేరొంది, లెక్చరర్‌గా పని చేస్తున్న తన భర్త రాజాకి, అతని దగ్గరే విద్యార్థినిగా ఉన్న సుమిత్రతో సంబంధం ఉందని సంధ్యకి తెలియడంతో ఈ నవల ప్రారంభం అవుతుంది. తరువాత కథంతా ఆ సమస్యని పరిష్కరించుకోవటానికి సంధ్య చేసిన ప్రయత్నం... ఆ ప్రయత్నం ద్వారా ఏర్పడ్డ కొత్త చిక్కులు... వాళ్ళ సంసార జీవితాన్ని కుదిపేసిన సంఘటనలూ... ప్రధాన పాత్రలయిన సంధ్య, రాజా, సుమిత్రల 'పాత్ర పోషణలూ'... ఇవీ ప్రధాన అంశాలు.

ఇటువంటి కథలు చదివినప్పుడు పాఠకులకు విభిన్నమైన అభిప్రాయాలు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సంధ్య ఆ సమస్యను ఎదుర్కొన్న తీరు 'నచ్చని వాళ్ళు' ఉండొచ్చు. అలా అనిపించే నేనీ నవలని రచయిత్రి అనుమతితోనే – మా బంధువులలోని పెళ్ళయి ఎనిమిదేళ్ళ కూతురున్న ఒక యువతికిచ్చి చదవమన్నాను.

నవల చదివి "చాలా బాగుంది అంకుల్" అంది. "అది సరే, సంధ్య స్థానంలో నువ్వుంటే ఏం చేసేదానివి?" అని అడిగితే "నేనా స్థానంలో వుంటే ఈ నవల మరోలా వుండేది. నిర్ధారణగా ఆ విషయం నాకు తెలిస్తే, 'గెట్ లాస్ట్' అని అతనితో సంబంధం తెంచేసుకునేదాన్ని. అలా అని సంధ్య కూడా అలా చేసి ఉండాలని నేను అనను" అని నవ్వింది. అలా సంధ్య ప్రయత్నాన్ని ఎన్నో కోణాలలో అర్థం చేసుకొనే అవకాశం ఉంది.

బహుశా రచయిత్రికి కూడా ఈ ఆలోచనే ఉండడం వల్ల కావచ్చు... కథనానికి భంగం కలగకుండా, బహుశా ప్రయత్నపూర్వకంగానే ఇతర పాత్రలను సృష్టించుకున్నారు. అంతేకాకుండా సందర్భానుసారంగా ఆయా పాత్రలు ఈ సమస్యను ఎలా చూశాయో, ఎలా రియాక్ట్ అయ్యాయో ప్రభావవంతంగా వివరించారు రచయిత్రి.

సంధ్య పని చేసే కాలేజీలో పని చేసే రవూఫ్‌కు సంబంధించిన ఘట్టాలు వాటంతట అవే ఒక చక్కని ప్రత్యేకమైన కథగా రూపొందాయి. వ్యక్తులూ, ప్రేమలూ, ప్రకటించుకోవటాలూ, పరిమితులూ, ఆసక్తికరంగా చిత్రించబడ్డాయి.

సంధ్య స్నేహితురాలు దుర్గ విషయమే తీసుకుంటే వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను ప్రత్యేకంగా చెప్పాలి. సుమిత్ర విషయం తెలిసిన దుర్గ "ఎవతే ఆ దొంగముండ? నీ ఉసురు పోసుకుంటోంది? నేనొస్తా పద. సూట్‌కేస్ బయటకి విసిరేసి గెటౌట్ అంటాను" అని ఆవేశపడితే, "అందుకేనే దుర్గా నువ్వంటే నాకు ఇష్టం. తాత్కాలికంగా నీ వ్యక్తిగత జీవితాన్ని మరచి నాకు అన్యాయం తలపెట్టినవాళ్ళ పని పడతానని బయలుదేరావు. స్నేహానికి ఎల్లలూ, హద్దుల్లేవు. కొలబద్దలు లేవు.." అంటుంది సంధ్య. నవల చదివే ప్రతీవారు ఈ ఘట్టం దగ్గరకొచ్చేసరికి ఒక్కసారి ఆగి ఆలోచించక తప్పదు. అంతటి విషమమైన సందర్భం అది.

అలాగే ఒక సందర్భంలో సంధ్య గిరిజ అనే స్నేహితురాలితో చెప్పిన ఈ మాటలు – "...స్త్రీల సహనాన్ని, మంచితనాన్నీ, బానిసత్వాన్నీ వ్యాపారస్తుడు వ్యాపార ప్రకటనలు

చేసినట్లుగా కీర్తిస్తూ, ఆకాశానికెత్తేస్తూ, స్త్రీల వెనుకబడినతనాన్ని కేష్ చేసుకుంటూంటారు మగవాళ్ళు. సమాజ స్వరూపమే పూర్తిగా మారనంతవరకూ చదువుకుని ఉద్యోగాలు చేసినా ఆడవాళ్ళ స్థితిగతుల్లో మార్పులుండవు. ఇంటి బానిసత్వపు చాకిరీలో విమోచన ఉండదు. కాకపోతే ఉత్పత్తి రంగాలలో, సాంకేతిక రంగంలో వస్తున్న 'అభివృద్ధిని పెంచే ఆధునిక యంత్రాల'ను వాడినట్టుగా ఈ చదువుకున్న స్త్రీలు ఉపయోగపడుతున్నారు" – ఆసక్తికరంగా తోచాయి నాకు.

ఛీ పాడు అనుకునే 'సెక్స్' అనే అంశానికి జీవితంలో ఎంతటి కీలకమైన ప్రాసంగిత ఉందో చూపిస్తుందీ నవల... పరాయి స్త్రీతో సంబంధం పెట్టుకున్న భర్తని అసహ్యించుకొంటూనే... నాలుగు 'పశ్చాత్తాపపు' మాటలు చెప్పి, ఒప్పించే ప్రయత్నంలో ఏర్పర్చుకొనే శారీరక స్పర్శల ప్రభావానికి లోబడిపోయి భర్త చర్యలకు లొంగిపోయేలా చేసేంత బలమైనది 'సెక్స్' అనే అంశం.

అన్నట్లు, ఈ సమస్య తాలూకు బరువుకి అలసిపోయి భర్తతో, "మీరంతా అప్పుడప్పుడు, పోనీ చాలా అరుదుగానైనా తాగుతూ ఉంటారు కదూ! నాకీ రోజు తాగాలనుంది. తెస్తావా?" అని భార్య అడిగేటంత తెగువ పాతికేళ్ళ క్రితమే చూపించారు రచయిత్రి శిరీష. ఈ సందర్భంలో ఆశ్చర్యకరంగా మరో కథ తలపుకొచ్చింది నాకు. షాజహానా రాసిన "మనిషి పగిలిన రాత్రి" (30 జూలై 2015, సారంగ వెబ్ మాగజైన్)... తరాలు మారినా సంసారాల్లో స్త్రీ స్థానం ఎలా 'పదిలంగా' ఉంటుందో అనిపించింది. ఒక కారణంతో... 25 ఏళ్ళ క్రితం ఒక భార్య (సంధ్య) మందు తాగాలని అనిపించే స్థితికి రావడంతో ఈ నవల ముగిస్తే, ఇప్పుడు మరో కారణంలో మరో భార్య మందు తాగడంతో కథ మొదలైంది... విచిత్రం!

***

ఎవరి జీవితంలోనైనా సమస్య మొలకెత్తిందంటే ఊబిలో అడుగు పడినట్లే. సమస్యలో చిక్కుకున్న వారి హితులు వారిని ఆ ఊబి లోంచి బయటకి లాగేందుకు ప్రయత్నిస్తే, సమస్యకు కారణమైనవారు ఊబి వైపు లాగుతూంటారు. సమస్యలో చిక్కుకున్న వ్యక్తి ప్రతి అడుగు జాగ్రత్తగా వెయ్యటానికి ప్రయత్నించినా, తెలియకుండానే తడబడ్డ అడుగులు ఊబిలోకి లాగే ప్రమాదమూ ఉంది. ఈ అంశాలన్నీ కనబడ్డాయి నాకీ నవలలో.

వివాహేతర సంబంధం సృష్టించిన ప్రకంపన ఈ నవల. వ్యక్తులు రకరకాల సందర్భాలలో, అప్పటి అవసరాల కోసం ఎలా రాజీపడతారో, ఎలా ఓర్పుగా ఉంటారో, ఎలా స్వార్థపరులవుతారో, ఎలా నిస్సహాయులవుతారో, ఎలా వాళ్ళు వాళ్ళు కాకుండా పోతారో తెలియజెప్పే నవల 'దూరతీరాలు'.

నవల మొదట్లో చాలా కీలకంగా అనిపించిన నిర్మల, రఘు పాత్రలను విదేశాల

కెళ్ళటం కారణంగా అవాయిడ్ చేయబడటం అంతగా అవసరంగా తోచలేదు... ఉంటేనే బాగుండేదేమో.

ఇకపోతే, కథా నిర్మాణంలో సందర్భానుసారంగా రాయబడ్డ కొన్ని వాక్యాలు ఉదహరించక తప్పదు.

"చిత్రాతిచిత్రంగా వర్తమానం తన చుట్టూ ఓ వల అల్లుతోంది. తను తెలిసి తెలిసీ చిక్కుకుపోతోంది."

"పీలికలయిపోతున్న ఈ తెరని పట్టుకుని వేలాడడం శుద్ధ తెలివితక్కువ. ఎందుకీ ముసుగులాట?"

"తప్పు ఒప్పుల విశ్లేషణ కాదు. అసలింక ఎలా మనం బ్రతికితే శ్రమ లేకుండా ఉంటుంది? అదీ ఆలోచించాలి."

ఇలాంటి వాక్యాలు నవలకి వన్నెలద్దాయి.

***

మనం సృష్టించుకున్న కుల మత సమస్యలు తీరిపోయి ఆపళంగా ఆదర్శవంతమైన సమాజం ఏర్పడి, ఆ చిక్కులను చర్చించే సాహిత్యం అవసరం లేని రోజును ఊహించగలమేమో గాని, సృష్టిలోనే ఉన్న స్త్రీ పురుష వ్యత్యాసాలు, సెక్స్ కోరికలూ, పొసెసివ్‌నెస్‌లూ... వీటి ద్వారా ఏర్పడే ఎన్నో ఇబ్బందులు తీరిపోయి, అవి సాహిత్య వస్తువులుగా అవసరం లేని రోజు గురించి 'ఆశ' కూడా పడకూడదేమో. మనిషిలోని ఈ లక్షణాలకి కుల, మత భేదాలుండవు మరి!

ముందుమాట ముగించటం అంత తేలిగ్గా తేలే వ్యవహారం కాదు. నవల్లోని ఏదో విశేషం నా దృష్టికి రాలేదేమో.... ఇంకా చెప్పవలసిందేమైనా ఉందేమో... ఈ సందేహం సశేషంగానే ఉంటోంది. అందుకే ఇంకో విషయం తప్పకుండా చెప్పాలి. నవల రాయటం కష్టమా? ఆ నవలకు ముందుమాట రాయటం కష్టమా? అంటే ఖచ్చితంగా రెండోదే నా మాట అని తప్పకుండా చెప్పాలి.

**వేమూరి సత్యనారాయణ**

## ఆవిష్కృతమైన పాతికేళ్ళనాటి సమాజం

మనిషి మనుగడలో మానవ సంబంధాలకున్న ప్రాముఖ్యత దేనికీ లేదేమో! ప్రేమ, అవగాహన, గౌరవం అనే పునాదుల మీద ఏర్పడే ఈ సంబంధాలు సమాజంలోని వ్యక్తుల మధ్య ఒక బంధాన్ని, జీవితం పట్ల ఒక మమకారాన్ని కలిగిస్తాయి. సమాజాన్ని నడిపించే స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేది కాలానుగుణంగా సమాజమే నిర్ణయిస్తూ వస్తుంది. వాటిని నిర్లక్ష్యం చేసినపుడు జీవితాలు అల్లకల్లోలమవుతాయి. వ్యక్తుల మధ్య సంబంధాల్లో పరస్పరం బాధ్యతను గుర్తెరగవలసిన అవసరం ఉంది.

శ్రీమతి దాసరి శిరీషగారు రాసిన 'దూరతీరాలు' నవల దాదాపు పాతికేళ్ల క్రితం ఆంధ్రప్రభ వారపత్రికలో సీరియల్‌గా వచ్చి, అనేక మంది పాఠకుల ఆదరణ పొందింది. ఒక వివాహితుడికి, ఒక అవివాహితతో ఏర్పడిన సంబంధం ఏ విధంగా వారి జీవితాల్లో కల్లోలాన్ని సృష్టించిందో ఈ నవల చెబుతుంది. కథలోకి వెళ్తే.....

***

పాతికేళ్లనాటి సమాజాన్ని ఈ నవలలో సహజంగా, అందంగా ఆవిష్కరించారు రచయిత్రి. నవల చదువుతుంటే ఆ కాలంలోకి వెళ్లిపోతాము. చదువుకుని, ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడిన స్త్రీలను ఈ నవలలో చూస్తాం. విద్యావంతులైన కొందరు దంపతులు మిగిలిన వారికంటే భిన్నంగా స్నేహితులు, సరదాలు మధ్య స్వతంత్ర్యమైన ఆలోచనలతో, విశాల దృక్పథంతో ఆదర్శవంతంగా జీవించటం కనిపిస్తుంది. అలాటి ఒక జంట కథే ఇది.

ప్రేమించి వర్ణాంతర వివాహం చేసుకున్న సంధ్య, రాజాల జీవితాల్లోకి సుమిత్ర అనే పెళ్లికాని యువతి ప్రవేశిస్తుంది. రాజా రచయిత, లెక్చరర్‌గా పనిచేస్తుంటాడు. తన స్టూడెంట్ సుమిత్రతో అతను సన్నిహితమైన సంబంధం పెట్టుకుని, అది భార్య వరకూ వెళ్లకుండా జాగ్రత్త పడతాడు. అనుకోని పరిస్థితిలో రాజా సుమిత్రల మధ్య సాన్నిహిత్యం గురించి సంధ్యకి తెలుస్తుంది. ఆమె ప్రపంచం ఒక్కసారిగా తలక్రిందులవుతుంది. అతనికి దూరంగా వెళ్లిపోవాలని అనుకుంటుంది. కానీ ఆమె తనని వదిలి వెళ్తే తాను బ్రతకలేననీ, ఆత్మహత్య చేసుకుంటాననీ రాజా దుఃఖిస్తాడు.

రాజా భార్య పట్ల మరింత శ్రద్ధగా ఉంటూ, తన తప్పుని ఒప్పుకుని, మన్నించమని వేడుకోవటంతో సంధ్య తనని తాను విమర్శించుకుంటుంది. తను రాజాని శ్రద్ధగా పట్టించుకోకపోవటం వల్లనే అతను బయట ప్రేమని వెతుక్కున్నాడని, అతని ప్రేమలో కల్తీ లేదని సంధ్య రాజీ పడే ప్రయత్నం మొదలెడుతుంది.

సంధ్య తన చిన్ననాటి స్నేహితురాళ్లు రమ, దుర్గ జీవితాలని చూస్తుంది. రమ భర్త ముగ్గురి పిల్లల్ని కన్నాక ఒక ఉద్యోగస్తురాలైన అమ్మాయిని పెళ్లి చేసుకుని ఇంటికి తీసుకొస్తాడు. చదువు, ఉద్యోగం లేక పిల్లల్ని, ఇంటిని వదిలి వెళ్లలేని స్థితిలో రమ తనకొక చిన్న ఉద్యోగం చూడమని సంధ్యని కోరుతుంది. తను ఆర్థికంగా స్వతంత్రురాలై ఉంటే భర్త తనని ఇలా అవమానపరచలేడు కదా అంటుంది. కుటుంబ కారణాలతో పెళ్లి ఆలస్యం అయి దుర్గ ఒక వివాహితుడితో సహజీవనం మొదలు పెడుతుంది. సంధ్యకి తన జీవితంలో సుమిత్ర ప్రవేశించిన తర్వాతే స్నేహితురాళ్ల జీవితాల్లో విషాదం అర్థం అవుతుంది. సుమిత్రకి ఏదైనా దారి చూపించి, పంపేయాలనుకుంటుంది. ఆమె పట్ల తనకూ, భర్తకూ ఒక బాధ్యత ఉందని నమ్ముతుంది.

సుమిత్రని ఇంట్లో పెట్టుకోవటం గురించి స్నేహితురాలు గిరిజ సంధ్యని నిలదీస్తుంది, 'నీ సున్నితమైన మనసుని నొప్పించానంటూ భోరుమన్న వ్యక్తి తను సంబంధం పెట్టుకున్న మనిషిని ఇంత త్వరగా ఇంటికి తీసుకువచ్చి నీ ఎదురుగా తిరిగే పరిస్థితి కల్పించేదేమిటి?' అంటూ. రాజాని విమర్శించటం భరించలేక 'స్త్రీ పురుష సంబంధాల్లో ఎన్నెన్నో అసమానతలు ఉన్నప్పుడు వ్యక్తిగతమైన ఆరోపణలతో పరిష్కారాలు ఎలా వెదుకుతాం?' అంటూ సంధ్య భర్తని వెనకేసుకొస్తుంది. చదువు, ఉద్యోగం లేని మామూలు గృహిణి మీద పెత్తందారుగా, 'నా ఇష్టం, ఉంటే ఉండు, లేకపోతే పో' అని తన ప్రవర్తనను సమర్థించుకునే మగవాడు ఉద్యోగిని అయిన

భార్య విషయంలో క్షమాపణలతో, పశ్చాత్తాపాలతో ఆమె స్వతంత్ర్య మార్గాలని మూసివేసే ప్రయత్నం చేస్తాడని గిరిజ అంటుంది.

ఒక సమయంలో 'కేవలం లైంగిక నేరాన్ని పెద్ద నేరంగా ఊహించి బాధపడి ద్వేషించటం వలన ఒరిగేదేమిటి? గతాన్ని చెరపలేము కదా, ఇష్టమైన ఆహారాన్ని తీసుకున్నట్టే ఇష్టమైన మనుషులతో గడిపే అవకాశాలుంటే తనలాటి వారు ఏడ్వటం, భర్త సంజాయిషీలు తప్పుతాయి. ప్రేమ ఒట్టి మాయ. దాని సంగతి మరిచి తనేమితో, తన అస్తిత్వం ఏమిటో వెతుక్కోవాలి' అనుకుంటుంది సంధ్య, మానసికంగా తనని తాను కూడదీసుకుంటూ. అంతలోనే భర్తతో పాటు సాహిత్య సభకి వెళ్లి అక్కడ రాజా తనను 'నా బెటర్ హాఫ్' అని అందరికీ పరిచయం చేసినప్పుడు గర్వంగా ఫీలవుతుంది.

నవల ప్రారంభంనుంచీ కూడా సున్నిత మనస్కురాలైన సంధ్య పట్ల స్నేహం, ఆమె పడుతున్న మానసిక సంఘర్షణ పట్ల సానుభూతి పాఠకులలో కలుగుతాయి. ఆమె మనకు ఆత్మీయురాలన్న భావన కలుగుతుంది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తి పట్ల అవధులు లేని ప్రేమ, అవగాహన, చేసిన తప్పుని ఒప్పుకున్నప్పుడు అతని పట్ల ఆమె చూపిన క్షమ, తన భర్త వలన అన్యాయం జరిగిన స్త్రీకి అవమానాలు ఎదురు కాకుండా ఆమెకు ఒక మంచి భవిష్యత్తును చూపాలన్న తపన, సంధ్య పాత్రలోని ఉదాత్తతను, ఉత్తమ సంస్కారాన్ని తెలియజేస్తుంది. భర్త ప్రవర్తనతో తనలో తను ఘర్షణ పడుతూ కూడా ప్రపంచం దృష్టిలో భర్త తేలిక కాకుండా, తానే ఒక అపరాధిగా నిలబడిపోయిన ఆమెను చూస్తే సానుభూతితో పాటు కొంత అసహనం కూడా కలుగుతుంది. ఆ వయసుకి ఆమెలోని పరిణితి ఆశ్చర్యం కలిగించక మానదు.

కానీ,

ఆమె పడుతున్న వ్యథ, భర్తను క్షమించి, అతని ప్రేమతో మునుపటి జీవితాన్ని పొందాలన్న ఆరాటం ఆమె వయసుకి అత్యంత సహజమేనేమో! పాతిక ముప్పై ఏళ్ల వయసులో, పెళ్ళయిన ఐదేళ్లకి, ఇద్దరు చిన్నపిల్లలతో ఆమెకు భవిష్య జీవితం పట్ల ఎంతో మమకారం ఉంటుంది. ఎన్నెన్నో రంగురంగు ఆశలు ఆమెను వ్యామోహ పరుస్తుంటాయి. ఆమె కలలు గన్న జీవితం కంటిముందు ఇంకా ఊరిస్తూనే ఉంటుంది. ఆ యౌవన దశ దాటాక , ప్రపంచాన్ని మరింత విపులంగా చూసిన అనుభవాలతో మధ్య వయసులో ఇటువంటి సమస్యని ఎదుర్కొని ఉంటే ఆమె మరొక విధంగా స్పందించి ఉండేదేమో తన సమస్యకి. అప్పటికి ప్రేమ ఒక్కటే

ఆమె జీవితాన్ని శాసించేదిగా ఉండకపోవచ్చు. ఉన్నా ఆ ప్రేమ మరింత విశాలమైన అర్థంలో చుట్టూ ఉన్న సమాజం వైపుకి మొగ్గే అవకాశం ఉండొచ్చు. నిస్సహాయంగా భర్త ప్రేమ తిరిగి తనకు మాత్రమే స్వంతమవ్వాలన్న ఆమె ఎదురుచూపు, తపన ఆ వయసుకి న్యాయమేనేమో! ఇక్కడ సంధ్య మనఃస్థితిని అతి సూక్ష్మంగా పరిశీలించి ఒక మానసిక శాస్త్రవేత్తలా ఆమె పాత్రను ఆవిష్కరించారు రచయిత్రి. ఏమైనా సంధ్య పాత్ర ఈ నవల చదివిన తరువాత మనలని చాలాకాలం వెంటాడుతుందన్నది వాస్తవం.

ప్రేమ తప్ప మరేం వద్దని అనుకుంటూ లోకం ఒప్పని అనుబంధాల్లోకి దిగే స్త్రీ పురుషులు ఆ ఉధృతం తగ్గాక తగ్గిపోతున్న పరువుప్రతిష్ఠల్ని పునరుద్ధరించుకోవటంలో పడుతుంటారని సంధ్య ఆలోచిస్తుంది. మగవాడు రెండో భార్యని ఒక ఎస్సెట్‌గా భావిస్తే, స్త్రీ పెళ్లిని ఒక లైసెన్స్‌గా భావిస్తోందని అనుకుంటుంది.

సంధ్య పనిచేసే కాలేజీలో రవూఫ్ అనే లెక్చరర్ ఆమె వ్యక్తిత్వం పట్ల ఆకర్షితుడవుతాడు. ఆమె పట్ల తన ఇష్టాన్ని వ్యక్తం చేస్తాడు. సంసారంలో చిక్కుముడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న సంధ్య మనసు ఆ మాటలతో ఊగిసలాడుతుంది. కానీ ఇటువంటి ఆకర్షణలు జీవితాలను తారుమారు చేస్తాయన్న ఇంగితం ఆమెను హెచ్చరిస్తుంది. రవూఫ్ పట్ల తన మనసులో కలిగిన ప్రేమ భావన తలుచుకుని రాజాని విమర్శించే హక్కు ఇక తనకెక్కడిది అనుకుంటుంది.

రవూఫ్ అనుకోకుండా పెళ్లి చేసుకున్నానన్న విషయం తెలియబరిచినపుడు, మనసులో ఒక్కసారి స్తబ్ధత ఆవరించినా మనిషిగా తాను ఓడిపోకూడదనీ, రవూఫ్‌కి శుభాకాంక్షలు చెబుతూ ఉత్తరం రాయాలని అనుకుంటుంది విజ్ఞత కలిగిన సంధ్య.

నవల పొడవునా భర్త పట్ల ఆమె ప్రేమ నిజాయితీగా వెల్లడవుతూనే ఉంటుంది. కానీ ఆమె ప్రేమ అతన్ని తప్పులు చెయ్యకుండా మాత్రం ఆపలేకపోతుంది. అతను ఆమెతో ముడిపడి ఉన్న జీవితంలోని సుఖాన్ని, శాంతిని వదులుకుందుకు ఎట్టి పరిస్థితిలోనూ సిద్ధంగా లేడన్న విషయాన్ని తెలియజేస్తూనే ఉంటాడు. తన బలహీనతలు అధిగమించలేక మళ్ళీ మళ్ళీ తప్పు చేస్తూనే భార్య దగ్గర పసివాడిలా క్షమాపణ కోరే అతనిలో అవకాశవాదం స్పష్టంగా కనిపిస్తుంది. తనను ప్రేమించే భార్య కోసం మారే ప్రయత్నమైనా చెయ్యడు. అదంతా కేవలం తన బలహీనత అని తేలిగ్గా అనుకుంటాడు.

బదిలీ రీత్యా దూరంగా ఉంటున్న భర్త పాత తప్పుల్నే చెయ్యటం తెల్సి

సంధ్య విరక్తిగా నవ్వుకుంటుంది. జీవితం మరింతగా తనని విసిగిస్తే తనక్కావలసిన జీవితాన్ని తాను వెతుక్కోవాలని, అతడిని తన ప్రేమతో కట్టిపడేసే ప్రయత్నాలు తానిక చెయ్యలేదని అనుకుంటుంది. కాలేజీలో ఎదురైన సమస్యల్ని పరిష్కరించటంలో చూపిన చొరవ ఆమెలోని ధైర్యసాహసాలు, సత్యం పట్ల నిబద్ధత తెలుపుతాయి. ఇలాటి సంధ్య తన సమస్యకి నిస్సహాయంగా నిలబడిపోవటం విస్మయం కలిగిస్తుంది.

ప్రేమించి పెళ్లి చేసుకుని, రచయితగా సమాజంలో ఒక ప్రత్యేక స్థానంలో సంతృప్తికరమైన జీవితాన్ని అనుభవిస్తూ, చుట్టూ ఉన్న వారికి ఆదర్శప్రాయంగా ఉండే వ్యక్తులు బలహీనత పేరుతో జారుడు మెట్ల మీదకి చేరటం బాధ కలిగిస్తుంది. ఆకర్షణలు ఉండచ్చు కానీ తనమీద తనకి నియంత్రణ, తన జీవితంతో పెనవేసుకున్న జీవితాల పట్ల ఆలోచన, బాధ్యత లేకపోవటం కేవలం స్వార్థం అవుతుంది. భర్తలో మార్పుకోసం ఎదురు చూసి, ఎదురు చూసి జీవితం పట్ల ఒక నిర్లిప్తతని ఏర్పరచుకుని జీవితంతో రాజీ పడిపోయిన సంధ్యను చూస్తే దిగులేస్తుంది.

ఈ నవల ఆంధ్రప్రభలో సీరియల్‌గా వస్తున్నప్పుడు రచయిత్రికి నేను ఉత్తరం రాయటంతో మా పరిచయం మొదలైంది. ఆ ఉత్తరానికి జవాబు రాసి, ఆ వెంటనే ఏలూరులో అత్తవారింటికి వచ్చినప్పుడు కుటుంబంతో కలిసి మా ఇంటికి వచ్చిన స్నేహశీలి శిరీషగారు. పాతికేళ్లనాటి తొలి పలకరింపు ఇప్పటికీ తాజాగా ఉంది. అప్పట్లో సంధ్య పాత్రని ఆరాధించిన నేను ఇప్పుడు ఆ పాత్రని సమర్థించలేకపోతున్నాను. చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండి, చొరవ ఉన్న వ్యక్తిగా తన జీవితాన్ని దుఃఖమయం చేస్తున్న భర్త పట్ల గుడ్డిప్రేమతో ఎందుకుంది? అతని తప్పుల్ని పదే పదే ఎందుకు క్షమించింది? ఈ కాలంలో అయితే సంధ్యలు ఉంటారనుకోను.

ఈ నవలను పరిచయం చేయటంలో రచయిత్రి ఆలోచనను పట్టుకోగలిగానో లేదో చదివి పాఠకులే చెప్పాలి.

**నాదెళ్ళ అనూరాధ**

# 1

చుట్టూ పుస్తకాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. వాటి మధ్య జీవం లేనిదానిలా, పిచ్చిదానిలా ఎటో చూస్తూ కూచుండిపోయింది సంధ్య. వీపు కుర్చీకోడుకి ఆనించకపోతే నేల మీద పడిపోయి ఉండేది. ఓ పక్కగా నీలం రంగు అట్టతో ఉన్న బైండింగ్ నోట్స్ తిరగేసి పెట్టి ఉంది.

"వదినా!" అంటూ నిర్మల వచ్చింది. బొమ్మలా కూచున్న సంధ్యని కుదుపుతూ, "అలా ఉన్నావే. అల్మారా నేను సర్దిపెట్టనా?" అంది లాలనగా.

సంధ్యకి వెంటనే జవాబు చెప్పడానికి నోరు పెగల్లేదు. నిర్మల వైపు బేలగా చూస్తూ, "నిర్మలా నాకు భయమేస్తోంది" అంది దీనంగా.

నిర్మలకి ఆ చూపు లేమీ అర్థం కావడంలేదు. వదినంటే ఎంతో ఇష్టం. ఆమె పరిస్థితి వింతగా అనిపిస్తోంది. చేయి పట్టి లేవదీస్తూ, "సెలవు రోజయినా రెస్ట్ తీసుకోకుండా ఉదయం నించీ ఏదో ఒక పని చేస్తూనే ఉన్నావు. కళ్ళు తిరుగుతున్నాయేమో? లే, ఈ మంచం మీద పడుకో. కాఫీ తెస్తాను." సంధ్యని లేపి మంచం దగ్గరికి నడిపించింది.

సంధ్య భారాన్నంతా దిండు మీద వేసేసినట్లు తలానించి నిస్త్రాణగా కళ్ళు మూసుకుంది. నిన్న సాయంత్రం నెల్లూరు వెడుతూ టాటా చెబుతున్న రాజా మొహం గుర్తుకు తెచ్చుకుంటుంటే దుఃఖం ముంచుకొస్తోంది. మనోవీధిలో అతని మొహం చాలా కొత్తగా, అపరిచితంగా అనిపిస్తోంది.

సూట్‌కేస్ పట్టుకొని చకచకా నడుస్తూ వెళ్ళిపోయే ఈ భారీ విగ్రహం చూడడం తనకి చాలా ఇష్టం కదూ! ఈ మనిషి నా స్వంతం, ఆ పొడవాటి చేతులూ, ఆ అందమైన నడకా – ఇవన్నీ కేవలం తనకే సంబంధించిన వరాలు అనుకుంటూ సందు మలుపు తిరిగేవరకూ తృప్తిగా చూస్తూండిపోయింది కదూ!

"వదినా! కాఫీ తీసుకో." నిర్మల కప్పు అందించి వదిన తాగుతుంటే చూస్తూ ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"వదినా! జ్వరం వచ్చే లక్షణాలు కనిపిస్తున్నాయి. డాక్టర్ దగ్గరికి వెడదామా?"

దిండు గోడకానించి వెనక్కి చేరబడింది సంధ్య. నిర్మలకి చెప్పాలా, మానాలా? ఈ ఘోరమైన సత్యాన్ని తను ఒంటరిగా హరాయించుకోలేదు. కాని చెబితే అన్నగారి పట్ల నిర్మల అభిప్రాయాలు శాశ్వతంగా దురభిప్రాయాలుగానే ఉండిపోతాయి. అయినా రాత్రికి హైదరాబాదు వెళ్ళిపోతుంది ఈ అమ్మాయి. వెళ్ళేముందు మనసు పాడు చేయడం భావ్యం కాదేమో!

“వదినా! ఏమిటలా చూస్తున్నావ్! నాకు కంగారుగా ఉంది.” నిర్మల గట్టిగా అంది.

బరువుగా నిట్టూర్చి, “సారీ నిర్మలా” అంటూ నవ్వబోయింది.

“అలా నవ్వకపోతేనేం? ప్లీజ్, అటువంటి నవ్వు నాకు భయం తల్లీ. అసలు మనం మ్యాట్నీకి వెళదామనుకున్నాం. నీకు గుర్తుందో లేదో? ఏం జరిగిందో చెప్పు” గది ఊడుస్తూ చీపురు కింద పడేసి కిందున్న పుస్తకాలన్నీ ఓ వరుసలో పేర్చడం ప్రారంభించింది.

ఆ నోట్స్ ఇంకా నిర్మల ముట్టుకోలేదు. ఆ ఒక్క నోట్స్ తన విశ్వాసాలనీ, నిర్భయత్వాన్నీ తారుమారు చేసి పడేసింది? ఎంత చెడ్డ రోజు?

“నిర్మలా, ఆ నోట్సిలా ఇవ్వమ్మా” సంధ్య అంది.

“మళ్ళీ ఏమన్నా కథ రాశాడా అన్నయ్య?” అని నోట్స్ తిరగేస్తూ, “అన్నయ్య రాతలా లేదు, ఎవరిదో మరి” అంటూ అందించింది.

నోట్స్ అందుకుంటూ వెర్రిదానిలా నిర్మల వైపు చూసింది. అసలీ నోట్స్ కాల్చేస్తే ఇక ఏమీ తెలిసే అవకాశం ఉండదు. ఒడిదుడుకులు లేని సంసారంలా ఎప్పట్లా సజావుగా సాగిపోతుంది తన కాపురం. ‘సంధ్యా సంధ్యా’ అంటూ తన పేరే స్మరిస్తున్నట్లు రాజా ఈ ఇంట్లోనే తిరుగుతూ ఉంటాడు. కాని ఎలా… తన మైండ్‌లో ఇదంతా రికార్డయిపోయిందే. ఎంత దురదృష్టం!

“ఈ కథ అంత దయనీయంగా ఉందా ఏమిటి వదినా? నువ్వు చాలా మూవ్ అయినట్టున్నావ్?”

సంధ్య నోట్స్ వైపే చూస్తూ, ఓ నిశ్చయాని కొచ్చింది. తన మొహమాటమే తనెకెన్నో చిక్కులు తెచ్చిపెట్టింది. నిర్మల తనకు ఆడబిడ్డ మాత్రమే కాదు. మంచి స్నేహితురాలు. చెప్పక తప్పదు. ఎంతకని ఇముడ్చుకోగలదు?

“అవును నిర్మలా, ఎంత వాస్తవంగా ఉందంటే చదివితే నువ్వూ నాలాగానే తయారవుతావని ఆలోచిస్తూ నేనివ్వడం లేదు. ఈ కథ… ఈ కథ… చాలా బావుంది.” సంధ్య గొంతు వణికింది. మనస్సు మరీ మొద్దుబారడం వల్ల కన్నీళ్ళు రావడం లేదు.

వదినగారి పక్కనే చేరి తనూ గోడకి ఆనుకుంటూ నోట్స్ ఉత్సాహంగా అందుకుంది నిర్మల. సంధ్య నిర్మలను జాలిపడుతూ చూసి కళ్ళు మూసుకుంది.

కళ్ళ ముందు ఎన్నెన్నో దృశ్యాలు. తీపి గుర్తుల సన్నివేశాలు. మనసుని ఉల్లాసపరిచే ప్రేమోద్రేకాలు. ఏ చిన్న తప్పు నయినా తన ముందు ఒప్పుకొని చిన్నపిల్లాడిలా సంజాయిషీ చెప్పే రాజాని తను ఖంగుమనే గొంతుతో గద్దించడం…

పిల్లలతో, ఉద్యోగంతో నీరసపడిపోతుంటే రాత్రుళ్ళు తన కాళ్ళు నొక్కుతూ లాలింపుగా మాట్లాడే రాజా మాటలు... అబద్ధం! అబద్ధం! తన ముందు తప్పు లొప్పేసుకునే రాజాని చూస్తూ, సగర్వంగా నవ్వుకునేది. తన అహంకారాన్ని ఛా.... ఛా! అసలు అహంకారంగా తాను భావించలేదు. ఎంతో నమ్మకం తన దాంపత్యం పట్ల. ఆ నమ్మకం తన కళ్ళలో తొణికిసలాడుతూ ఉంటే 'రాజా' అని గోముగా పిలిచేది, తిట్టేది, కసురుకునేది.

ఇప్పుడు కూడా "అది కాదురా సంధ్యా" అంటూ అనునయిస్తూ సంజాయిషీ ఇచ్చుకుంటాడు. అసలు అతనికా అవకాశం తనిస్తుందా? రేపొస్తాడు, ఎలా అతనితో మాట్లాడడం? ముందే తను పారిపోతే?

నిర్మల చెయ్యి సంధ్య భుజం మీద పడింది. నిర్మల స్టన్నయిపోయి ఉంటుంది. పిచ్చి పిల్ల. సంధ్య కణతలు రుద్దుకుంది.

"వదినా ఇదేమిటి?" నిర్మల ఏడవబోయి సంధ్యని చూసి తమాయించుకుంది.

"అర్థమయిందిగా నిర్మలా? ఇక చదవద్దులే. ప్రతి చిన్న విషయం అందులో ఉంది."

నిర్మల పెదిమలు పళ్ళతో నొక్కి పడుతూ గబగబా చదువుతూ పోయింది. ఆమె మొహం జేవురించింది. "ఎంత బరితెగించింది కాకపోతే ఇంత ఓపికగా... ఛీ! ఛీ!" అంటూ పుస్తకం విసిరికొట్టింది.

"ఆ అమ్మాయి వయస్సుకీ, పెరిగిన విధానానికీ ఆ మాత్రం జ్ఞానమే ఉంది నిర్మలా! ఎందుకు ఆ పిల్లని తిట్టడం?"

"నిజమే. ఈ దౌర్భాగ్యుడు, ఈ వెధవ..." నిర్మల శివమెత్తినదానిలా అన్నగార్ని తిట్టడం మొదలుపెట్టింది.

సంధ్య – "ఇష్ నిర్మలా! మన మాటలన్నీ పక్క పోర్షన్‌లోకి వినబడతాయి. ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు?" అంది బలహీనంగా.

"ఏముంది? ఈ పుస్తకం విసిరేసి ఏం సమాధానం చెబుతావని కడిగెయ్యి."

"అసలు నేనలా అడగగలనా? రాత్రికి నీ ప్రయాణం లేకపోతే చాలా బాగుండేది నిర్మలా. అసలు ఆలోచించే శక్తి నాకు లేదు." దీనంగా చూసింది.

ఆ చూపులకి కరిగి నీరయిన నిర్మల వదినని దగ్గరికి తీసుకుంది.

కన్నీటి బొట్లు వీపు మీద పడుతుంటే – "నిర్మలా, నీకు తెలుసుగా? నాకు ఏడవడమంటే ఎంత భయమో? నీతో కలసి ఏడ్చి గుండె బరువు దించుకోడం నాకు రాదు. నాకు సలహా చెప్పు. నువ్వే ఇలా డీలా పడిపోకు" అంది నెమ్మదిగా.

నిర్మల తమాయించుకుంది. ఎంతకీ ఈ చిక్కుముడి విడదీసే ఉపాయం తోచడం లేదు. వదిన మనస్తత్వం తనకి బాగా తెలుసు. ఆమె భవిష్యత్తులో అన్నయ్యని ఇంక భరించలేదు. విడాకులు తప్పకుండా తీసుకుంటుంది. అసలు వదిన మాటే కాదు, తను మాత్రం... తనకే ఇటువంటి సంఘటన ఎదురైతే సహించగలదా? వదినలా నిబ్బరంగా కూర్చోగలిగేదా? ఈపాటికి హిస్టీరియా వచ్చిన దానిలా ప్రవర్తించేది.

"నీ ఇష్టం వదినా. నువ్వే నిర్ణయం తీసుకున్నా నా అండదండలు నీకుంటాయి." ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకుని నిమురుతూ తన కళ్ళతో ఆర్ద్రంగా అంది.

"అసలు నిర్ణయమని కాదు నిర్మలా. మళ్ళీ మీ అన్నయ్య కంటబడకుండా పారిపోవాలని ఉంది. ఇక అతని మొహం చూడలేను. అసలింకేమీ అడగలేను."

నిర్మల కేదో చెడ్డ ఆలోచన కలిగి వణికిపోయింది. "వదినా మా ఆడబిడ్డ కూతురు పెళ్ళి కాకపోతే అసలు నేను హైదరాబాద్ ప్రోగ్రాం కాన్సిల్ చేసుకునేదాన్ని. పైగా పిల్లల్ని తీసుకుని మా అత్తగారు వెళ్ళిపోయారాయె. నాకో మాటివ్వు. ఎటువంటి అఘాయిత్యం చేయనని మాటివ్వు." ఆమెని కుదుపుతూ ఆరాటంగా అంది.

"భలేదానివి నిర్మలా! నా పిల్లలంటే నాకెంత ప్రాణమో నీకు తెలియదూ? ఈ పిచ్చి కూనలని వదిలి నేనెక్కడికి పోతాను? పైగా ఎల్లుండి కాలేజీలు తెరుస్తున్నారాయె."

"అయినా సరే. ఇటువంటి షాక్ భరించలేక చాలామంది ఆడవాళ్ళు ప్రాణాలు తీసుకుంటూ ఉంటారట. అసలు ఈ పెళ్ళికి మీరు కూడా వస్తే బాగుండేది."

"ఆ రోజుకి మీ అన్నయ్య ఎలాగూ రావాలనుకున్నాడు. ఈ పిల్లలతో ప్రయాణం చికాగ్గా ఉంటుంది. పైగా రీ-ఓపెనింగ్ కదాని నేను డ్రాపయ్యాను. ఇంతకీ నీ భయం నేను ప్రాణాలు తీసుకుంటానని కదూ? నిజమే. ఈ మోసాన్ని భరించడం కన్నా శాశ్వతంగా నిద్రపోవడం మంచిది. అదే గొప్ప విశ్రాంతి అనిపిస్తోంది నిర్మలా! కాని తల్లీ, తండ్రీ లేని లోటు నాకు తెలుసు. అందుకే వీళ్ళని అనాథలుగా చెయ్యను."

నిర్మల మనస్సు స్థిమితపడింది. దూరంగా మంచం మీద సంధ్య రెండేళ్ళ కొడుకు ఉలిక్కిపడి లేచి కూర్చుని తల్లి వైపు చూస్తూ ఏడవడం ప్రారంభించాడు. నిర్మల తీసుకొచ్చి సంధ్య ఒళ్ళో వేసింది.

"పాపేది?" అంది సంధ్య బాబు వీపు నిమురుతూ.

"ఎదురింట్లో ఆడుకుంటోందిలే. నీకు నేను ఉపయోగపడలేకపోవచ్చు కాని నేనంటూ నీ కోసం ఒకదాన్ని ఉన్నానని మాత్రం మరచిపోకు." అటూ ఇటూ తిరుగుతూ బట్టలు మడలు వేసి తన బాగ్ సర్దుకుంటూ ధైర్యవచనాలు చెబుతోంది నిర్మల.

సంధ్యకెందుకో నవ్వొచ్చింది. ఈ ఉద్యోగాల మూలంగా అలిగి పుట్టిళ్ళకి పారిపోయే అవకాశం ఆధునిక యువతులకి లేదు. అయినా తనకి పుట్టిల్లేది? ఇద్దరు అన్నయ్యలు ఫారిన్‌లో, ఒక అన్నయ్య బొంబాయిలో ఉన్నారు. ముగ్గురికీ తనంటే ఎంతో ప్రేమే కాని ఎప్పుడు పడితే అప్పుడు తన కోసం వచ్చే అవకాశాలు తక్కువ. అయినా ఇంతవరకూ అటువంటి అవసరాలు రాలేదు.

నిర్మల తన సూట్‌కేస్ సర్దుకుని పనిపిల్ల సహాయంతో చకచకా వంట చేసేసింది. సంధ్య నిస్సత్తువగా అలా పడుకునే ఉంది.

సాయంత్రం ఆరయింది. రోడ్డు మీద ఆడుకుంటున్న పిల్లల కేకలు వినిపిస్తున్నాయి. పాప మీనా రెండుసార్లు లోపలికి వచ్చి తొంగి చూసి మళ్ళీ ఆటలకి పరిగెత్తింది. మళ్ళీ ఓ ఐదు నిమిషాలకి “ఆ ఆంటీ వాళ్ళొచ్చారు” అంది రొప్పుకుంటూ.

“ఎవరమ్మా?” అంది చిన్నగా.

“అపు డొచ్చేవాళ్ళు... వాళ్ళు.”

“నువ్వు లేవకులే వదినా. నేను చూసొస్తాను.” అంటూ నిర్మల వరండాలోకి వెళ్ళింది. వాళ్ళ అడుగుల చప్పుడు, కుర్చీలు లాగిన చప్పుడు, కూర్చున్న సవ్వడి వినవచ్చాయి. ఎవరో మరి తనే లేచి వెళ్ళడం మంచిదేమో అనుకుంటూ లేవబోయింది. ఇంతలో నిర్మల వచ్చింది.

“వాళ్ళని ఇక్కడే ఎప్పుడో చూశాననుకుంటా వదినా. నాకూ గుర్తులేదు. మీ స్టూడెంట్సేమో – వెళ్ళగలవా?” అంది సానుభూతిగా.

సంధ్య లేచి, తల పైపైన దువ్వుకుని పమిట సరిగ్గా వేసుకుంది. కొన్ని గంటల వ్యవధిలో లంఖణాలు చేసినట్లుగా, భరించలేనంత నీరసంగా ఉంది. చిరునవ్వు పులుముకుని వరండాలోకి వస్తున్నదల్లా “నమస్తే మేడం” అనడంతో నవ్వుతూ “నమస్తే” అంటూ బిత్తరపోయింది.

సుమిత్రని చూడడం తనకేమీ కొత్త కాదు. రాజా స్టూడెంట్‌గా ఎన్నోసార్లు తను తమ ఇంటి దగ్గరే చూసింది. పక్కనే ఉన్న అమ్మాయిని తను ఎక్కువసార్లు చూడకపోయినా, మొత్తానికి ముఖపరిచయం ఉంది. సుమిత్ర చొరవగా “అరుణ తెలుసు కదా మేడమ్? మా ఇద్దరికీ ఫస్ట్ క్లాసొచ్చింది.” అంది స్వీట్ పాకెట్ అందిస్తూ.

“కంగ్రాట్స్” అంది మనస్ఫూర్తిగా. వాళ్ళకెదురుగా కుర్చీలో కూర్చుంది. ఫస్టు క్లాసొచ్చిందనే ఆనందం మొహం నిండా ఉన్నా కొంగు కప్పుకున్న సుమిత్ర మొహంలో ఏదో దైన్యం, బాధా బాగా కనిపిస్తున్నాయి.

“మాస్టారు లేరాండీ?” అంది సుమిత్ర వినయంగా అన్ని వైపులా చూస్తూ.

“లేరమ్మా, ఊరెళ్ళారు.”

"ఎప్పుడొస్తారు?"

"రేపు."

ఏదో ఇటువంటి పొడి పొడి ప్రశ్నలతోనే సంభాషణ నడిచింది. ఇంతలో నిర్మల బిస్కట్లూ, టీ కప్పులూ తెచ్చింది.

"తీసుకోండమ్మా."

"వద్దండీ" మొహమాటపడ్డారు ఇద్దరమ్మాయిలూ. సంధ్య బలవంత పెట్టడంతో బిస్కట్స్ కొరికి టీ సిప్ చేయడం ప్రారంభించారు. సంధ్య సుమిత్ర వైపు తదేకంగా చూస్తోంది. మధ్యలో ఆర్థిక స్తోమత లేక రెండేళ్ళు చదువు మానేసిందట. అయినా ఎన్నెన్నో చేదు అనుభవాల మధ్య డిగ్రీ సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేసింది. సంధ్య మనస్సు వాత్సల్యంతో నిండిపోయింది.

"సుమిత్రా, నువ్వు చాలా ఇంటలిజెంట్‌వని మాస్టారెప్పుడూ అంటుండేవారు. నిజంగానే నిరూపించావు. మరి యూనివర్సిటీలో చేరుతావా?"

"నాకయితే అసలేమీ చేయాలని లేదు మేడమ్!"

"ఎందుకని?" జాగ్రత్తగా ఆమె ముఖ కవళికలు గమనిస్తూ అంది సంధ్య.

"ఎంత మెరిట్ స్కాలర్‌షిప్ ఉన్నా ఇంకా ఖర్చు పెట్టాలిగా. అసలే మా ఇంట్లో వాళ్ళకి ఛాందస భావాలెక్కువ. ఆడపిల్లలు బాగా చదువుకోవడం ఇష్టం ఉండదు. వాళ్ళ మూర్ఖత్వం వల్ల డిగ్రీ తీసుకునేసరికి నాకు ఇరవై రెండొచ్చాయి" అంది కినుకగా.

"ఎదిరించే సాహసం ఉండాలేగాని ఏదయినా నెరవేర్చుకోవచ్చు." అంది సంధ్య అర్థవంతంగా.

సుమిత్ర సంధ్య మొహంలోకి చూసింది. సంధ్య పెదిమలు కొంచెంగా విడివడ్డాయి.

"ఆ ఇంటి కన్నా ఈ ఇల్లు చాలా బావుంది మేడమ్. కాకపోతే మాస్టారి కాలేజికి దూరం" అరుణ అంది. ఇంతలో బాబు తప్పటడుగులతో వచ్చాడు, సుమిత్ర చటుక్కున వాణ్ణి ఎత్తుకుని, "అబ్బా ఎన్ని రోజులయిందో మీ బాబుని చూసి" అంటూ వాడి బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించింది.

"సుమిత్రా, బాబు ఎవరి పోలిక?" అంది సంధ్య.

"ఇంకెవరు, మాస్టారే కదండీ!" బాబుని హత్తుకుంటూ అంది సుమిత్ర.

అరుణేదో మాట్లాడడం మొదలుపెట్టింది. దాదాపు మూడేళ్ళుగా రాజా స్టూడెంట్స్ అందరూ తెలుసు సంధ్యకి. అతని సబ్జక్టులో చాలా తక్కువ మంది స్టూడెంట్స్ ఉండడం వల్ల, అందులోనూ ఉన్న వాళ్ళలో లేడీసే ఎక్కువ కావడం వల్ల చాలామందితో

అంతో ఇంతో పరిచయం సంధ్యకి కూడా ఉంది.

"ఇంక వెడదామే, పొద్దుపోతోంది" అంటూ అరుణ లేచి నిలబడింది. సుమిత్ర అయిష్టంగా బాబుని దించి లేచి నిలబడింది.

వాళ్ళని సాగనంపడానికి గేటు దగ్గర కెళ్ళింది సంధ్య. తనూ వెళతానంటూ చేతులు చాపాడు బాబు. సుమిత్ర బాబుని అందుకుంటూ, "మీ బాబుని మాకిచ్చేయండి" అంది నవ్వుతూ.

"తప్పకుండా సుమిత్రా! బాబునే కాదు, మా పిల్లల్నెంతో శ్రద్ధగా చూస్తావని నమ్మకం నాకు." నవ్వింది సంధ్య.

"మేడమ్, మీరు చాలా నీరసంగా అనిపిస్తున్నారు" అంది అరుణ.

"కాస్త నలతగా ఉందమ్మా. మరిక ఉంటాను. బాబూ, రామ్మా." అంటూ అందుకొని గేటు వేసేసి లోపలి కొచ్చింది.

నిర్మల తల చిక్కు తీసుకుంటూ – "ఆ పెద్ద కళ్ళ అమ్మాయిని మీ పాతింట్లో చాలా సార్లు చూశాను వదినా!" అంది.

"కాలేజీ దగ్గరే కదా, వస్తుండే వారెప్పుడూ."

"లేదు. ఈ అమ్మాయొక్కతే నేనున్న రెండు మూడు రోజుల్లోనే రోజూ వచ్చేది."

"మార్నింగ్ షిఫ్ట్ వీళ్ళది. క్లాసంటూ జరగకపోతే మరీ పదకొండింటికే వీళ్ళు కాలేజి అయిపోయి, అటు ఇటు ఫ్రెండ్స్ దగ్గరికీ, లెక్చరర్స్ దగ్గరికీ తిరుగుతూ ఉండేవారు. అందుకే తరచూ మన వీధిలో కనబడేవారు."

"వదినా! నువ్వు స్నానం చేసొస్తే మనం భోజనం చేద్దాం. అసలు నిన్నొదిలి హైదరాబాద్ ఎలా వెళ్ళడమా అని దిగులుగా ఉంది" నిర్మలకి ఇందాకటి విషయమంతా గుర్తొచ్చి మొహం వాడిపోయింది. సంధ్య జబ్బు పడిన మనిషిలా ఉంది.

"పర్వాలేదులే నిర్మలా. చదువుతున్నప్పుడు నాకు స్పృహ తప్పుతోందా అనిపించింది. ఇప్పుడు చూడు.." విషాదంగా నవ్వుతూ, "అదే అమ్మాయి ఎదురుగా వచ్చి కూర్చున్నా మాములుగా మాట్లాడాను." అంది సంధ్య.

నిర్మల షాక్ తిన్నదానిలా – "అంటే.. ఈ అమ్మాయేనా... నాకెందుకో డౌటొచ్చింది. నంగనాచిలా ఫస్టు క్లాసొచ్చిందని చెబుతోందా? సిగ్గులేదు?" ఆవేశంగా అంది.

"నాతో మాట్లాడడం కొత్త కాదుగా నిర్మలా ఆమెకి. అసలు నాతో టర్మ్స్ బాగా ఉంటేనే ఇంటికి స్వేచ్ఛగా రాకపోకలు ఉంటాయి. అయినా ఆ అమ్మాయి బాధలు ఆ అమ్మాయివి." విరక్తిగా అంది సంధ్య.

ఇంతలో సుమిత్ర మళ్ళీ వచ్చింది. నిర్మల విసురుగా ఏదో అనబోతుంటే – సంధ్య కళ్ళతో వారించి – "ఏమ్మా?" అంది సౌమ్యంగా.

"మేడమ్, నా పర్స్ మర్చిపోయానండీ" టీపాయ్ మీద పర్స్ అందుకుంటూ, "వస్తానండీ" అంది వెనక్కు తిరిగి. గుమ్మం దాటింది గానీ వరండా దిగలేదు. ఇంకేదో చెప్పాలన్నట్లుగా తటపటాయింపుగా నిలబడింది. సంధ్య లేచి కిందకి వచ్చి – "ఏమిటి సుమిత్రా?" అంది మృదువుగా.

ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. సంధ్యకీ బాధనిపించింది. "ఏమయిందమ్మా?" అంది చెయ్యి పట్టుకుని.

"మా ఇంట్లో చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు మేడమ్. మాస్టారిని ఒక్కసారి మా ఇంటికి రమ్మనమని చెబుతారా?"

"చెబుతాను. నువ్వు చాలా చిక్కిపోయావు"

"అసలు నాకు ఎటైనా పారిపోవాలనుంది." సుమిత్ర బాధగా అంది.

సంధ్యకీ పరిస్థితి విచిత్రంగా అనిపించింది. ఇద్దరికీ తమ తమ స్థానాలేమిటో తేడాలేవిటో తెలుసు. అయినా ఏమీ తెలియని వాళ్ళలా ఇద్దరూ మాట్లాడడం... అసలు ఇటువంటి పరిస్థితి వస్తుందని తనెప్పుడయినా...!

"వదినా!" నిర్మల ఎంత మాత్రం సహించలేకపోతోందని ఆమె పెట్టిన గావుకేకలో తెలుస్తోంది.

సుమిత్ర తేరుకుని, "వస్తాను మేడమ్. ఏదో మాస్టారు చెబితే మా నాన్న వింటాడని నా ఆశ" అంటూ వేగంగా నడుచుకుంటూ సందు మలుపు తిరిగింది.

సంధ్య లోపలికి వస్తుంటే, నిర్మల కోపంతో ఊగిపోతూ – "ఈ అమ్మాయి ఎదురుపడితే కడిగి పారెయ్యక, ఏమిటి నువ్విలా? నీది అవధులు దాటిన మంచితనమా? లేక చాతకానితనమా? రాజా నిన్ను ఇలా పప్పెట్‌లా ఆడిస్తున్నాడా? నువ్వు ఆడుతున్నావా? ఛీ... ఛీ!" అంది ఆవేశంగా.

"నిర్మలా. నెమ్మది. నేనేం చేయను చెప్పు? మన బంగారం మంచిది కానప్పుడు ఎదుటివాళ్ళను ఎందుకూ అనుకోవడం? అయినా నిర్మలా, ఆ అమ్మాయి సంక్షోభం ఎవరికీ వద్దు. నాలాగా తన బాధని పైకి చెప్పుకునే స్వాతంత్ర్యం ఈ పిల్లకి లేదు కదా! ఇంట్లో ఈ అమ్మాయి మీద అనుమానం వచ్చి హింసిస్తున్నారని ఆ పుస్తకంలో రాసుకుంది. రాజా దగ్గర తప్ప ఆ అమ్మాయికి ఓదార్పెక్కడా దొరకదు."

నిర్మల విస్మయంగా చూస్తూ సంధ్య దగ్గరికొచ్చింది.

"ఏం నిర్మలా, మీ వదినింత సిగ్గుమాలిందేమా అని చీదరించుకుంటున్నావా?"

"వదినా... వదినా...!" నిర్మల వచ్చి సంధ్య ఒళ్ళో తల పెట్టుకుని ఏడవడం ప్రారంభించింది. వదిన గుండెల్లో అగ్నిపర్వతాలు పేలుతున్నాయని తెలుసు. అయినా ఎంత నిబ్బరంగా ప్రవర్తిస్తోంది. తను బస్సెక్కాక రాత్రంతా ఏడుస్తూ కూర్చుంటుందేమో? నిర్మల ఏడుస్తూనే ఉంది. సంధ్య చేతులు నిర్మల తల నిమురుతున్నాయి. నిర్మల తమాయించుకుని లేచి – "నీ సంస్కారానికి చేతులు జోడిస్తున్నాను. ఏ ఆడదీ ఇటువంటి పరిస్థితులలో ఆ పిల్ల ఇలా వెంటనే కనిపిస్తే మాములుగా వదలదు. నిన్ను అంచనా వేయడం నాకు చాతకావడం లేదు వదినా." అంది గద్గదంగా.

"పద, భోజనం చేద్దాం. నా గురించి ఆలోచిస్తూ నువ్వు మనస్సు పాడు చేసుకోకు."

ఇద్దరూ కంచాల్లో అన్నీ వడ్డించుకున్నా ఏమీ తినలేకపోయారు. పది కావస్తుండగా నిర్మల సూట్‌కేస్ పట్టుకుని రోడ్డు మీదకి వచ్చింది. వెళ్ళిపోతున్న రిక్షాని ఆపింది సంధ్య.

"నిర్మలా జాగ్రత్త! ఉత్తరం రాయి."

"రాస్తాను వదినా. నా ప్రామిస్ మరిచిపోకు." నిర్మల రిక్షాలోంచి వంగి చేయి అందుకుంది.

సంధ్య నవ్వింది "మరిచిపోను.." అంటూ.

"ఆ రాస్కెల్ ఏం చెబుతాడో అంతా వివరంగా రాయి."

నిర్మలకీ రాజాకీ ఎక్కువ వయస్సు తేడా లేకపోవడంవల్ల పేరు పెట్టే పిలుస్తుంది. కాని ఎంత ఏవగించుకుంటోందో ఈ మాటలతో తెలుస్తోంది. సంధ్య మనస్సు కలుక్కుమంది. ఒక్కసారి ఎంత హీనస్థితికి వెళ్ళాడు తమ మనస్సులో రాజా!

## 2

గంట గణగణలాడించుకుంటూ రిక్షా వెళ్ళిపోయింది. లోపలికొస్తుంటే, ఇంటావిడ పలకరింపుగా – “పొద్దుటినుంచీ కనబళ్ళేదు, ఒంట్లో బాగాలేదా అమ్మాయ్?” అంది.

“మా ఆడబిడ్డని రిక్షా ఎక్కించొస్తున్నాను పిన్నిగారూ, భోజనాలయ్యాయా?” అంది సంధ్య.

“అయ్యాయమ్మా, మీ ఇద్దరూ అక్కచెలెళ్ళలా ఉంటారు. మహా ముచ్చటగా అనిపిస్తుంది.” నిండుగా నవ్వుతూ అంది.

సమాధానంగా నవ్వి లోపలికి వెళ్ళింది.

పిల్లలిద్దరూ మంచం మీద ఆదమరిచి నిద్రపోతున్నారు. మంచం పక్కనే విన్న స్టూలు మీద ఫోటో ఫ్రేమ్‌లో పిల్లల్ని ఎత్తుకుని తామిద్దరూ. ఆ ఫోటో తనెంతో తృప్తిగా చూసుకుంటుంది ప్రతీ రోజూ! ఇలా చేశాడేమిటి రాజా! ఈ పిల్లలైనా గుర్తుకురాలేదా?

ఏడిస్తే బావుండననిపిస్తోంది గాని, ఏడ్చే ఓపిక లేదు ప్రస్తుతం.

కిటికీలోంచి వెన్నెల పిండారబోసినట్లుగా కనిపిస్తోంది. పక్కనే సన్నజాజి రెమ్మల పరిమళం హాయిగా తేలి వస్తోంది. తన మనసు మాత్రం ఆవిర్లు కక్కుతోంది. కుర్చీ కిటికీ దగ్గరకు లాక్కుని అయిదేళ్ళ జీవితాన్ని సమీక్షించుకోవడం ప్రారంభించింది. అతనితో పరిచయం, ప్రేమ, పెళ్ళి అన్నీ సినిమా రీళ్ళలా గిర్రున కళ్ళముందు తిరిగిపోతున్నాయి.

***

“సంధ్యా!”

“ఊఁ.”

“నిన్నెంత చూసినా తనివి తీరదు. ఇంత సుకుమారంగా పెరిగిన అమ్మాయిని నేనెలా ట్రీట్ చేస్తానో అని భయపడుతూ ఉంటాను.” రాజా తన గడ్డం పట్టుకుని, కళ్ళలోకి చూస్తూ తగ్గు స్వరంతో అన్నాడు.

“అద్భుతం!”

“ఏమిటో?”

“నువ్వు సిగ్గు పడే విధానం. ఎవ్వరి ముందూ సిగ్గుపడవు. నిస్సంకోచంగా

చూస్తూ మాట్లాడుతావు. కాని నేనేది మాట్లాడినా సిగ్గుగా నవ్వుతావు. ఏ కవీ వర్ణించలేనంత చక్కటి ఎక్స్‌ప్రెషన్ ఇస్తావు." గడ్డం వదలకుండా అలాగే చూస్తూ మురిపెంగా అన్నాడు రాజా.

"మీరు రచయితలు గదా! పైగా కావల్సిన మనిషి ఎదురుగా ఉండడం...!"

"మన పెళ్ళి సెటిలయినప్పట్నించీ గమనిస్తున్నాను. మీరు మీరు అంటున్నావు. నాకిదేం నచ్చలేదు."

"మరి?"

"ఎప్పట్లా 'రాజా' అను." చెవిలో మృదువుగా అన్నాడు. అతనో ముద్దిచ్చినా పర్వాలేదు. లేదా పూర్తిగా దూరం జరిగి మాట్లాడినా బావుండును. ఇంత సమీపంగా ఊపిరి వదులుతూ మాట్లాడుతుంటే తనకి భయంగా ఉంది. చటుక్కున లేచి నిలబడి "పోదాం" అంది.

రాజా మొహం నల్లబడింది. "ఇంకా పూర్తిగా చీకటి పడలేదు. మళ్ళా రెండు నెలల వరకూ కనిపించను. ఇంకాస్సేపు వుందాం." అన్నాడు.

"వాళ్ళెవరో వస్తున్నారు. మనల్ని చూసుకుంటూ వెళుతున్నారు."

"పోనియ్యి"

"నాకేమిటో అదో రకంగా ఉంది. పోదాం."

అయిష్టంగా ఆమెని అనుసరించాడు. రిక్షా చూడగానే ఉత్సాహంగా పిలిచాడు. సంధ్య గత్యంతరం లేక రిక్షా ఎక్కి అతని పక్కన కూర్చుంది. చేయి భుజం చుట్టూ వేసి, కబుర్లు చెప్పడం ప్రారంభించాడు రాజా.

"ఇదంతా కలేమో అనిపిస్తోంది. అయిదేళ్ళ నుంచీ నిన్ను చూస్తున్నా, నా మనసులో భావం బయటపెట్టలేకపోయాను. రఘు పుణ్యమా అని రెండేళ్ళ క్రితం నీతో బాగా మూవ్ అయ్యే అవకాశం వచ్చింది. అసలు మీ పెద్దన్నయ్య ఒప్పుకునేవరకూ నాకు డౌటే."

"నిజమే రాజా! అమ్మా నాన్నా ఇద్దరూ యాక్సిడెంట్లో పోతే, అన్నయ్యే పెద్ద దిక్కయ్యాడు. వదిన కూడా ఎంతో మంచిది. వాళ్ళని కాదని నేనేం చేయలేను."

"నన్ను కూడానా?" కొంటెగా అడిగాడు.

సంధ్య సిగ్గుపడకూడదన్నట్టుగా అలవోకగా నవ్వింది.

ముగ్ధుడయిన రాజా ఎంతో అందంగా ఆమెని వర్ణించాడు. ఉక్కిరిబిక్కిరి అయిన సంధ్య ఎటూ తోచక అతని భుజం మీదే తల వాల్చి, అతని మాటలు వినసాగింది.

ఆ కనుచీకట్లో, ఆ తారు రోడ్డు మీద, ఆ రిక్షా ప్రయాణం వాళ్ళ కెంతో బావుంది.

***

ఏదో ధబ్‌మని పడిన చప్పుడు. గిన్నెలన్నీ రణగొణధ్వని చేసుకుంటూ, ఠంగు ఠంగుమంటూ కింద పడిన చప్పుడు. సంధ్య ఉలిక్కిపడి వంట గదిలోకి వెళ్ళింది. పిల్లి పెరుగు పారబోసింది. అంతా నేలమీద ఒలికింది. చీపురుతో శుభ్రం చేస్తూ 'ఒలికినవి ఎలాగూ దక్కవు. తన మనసుని శుభ్రపరుచుకుని ధైర్యంగా బ్రతకాలి' అనుకుంది.

మళ్ళీ వచ్చి కూర్చున్నాక ఇంకేదో దృశ్యం.

***

ఎప్పుడూ చేయి చేసుకోని అన్నయ్య – రాజాని పెళ్ళి చేసుకుంటానని మొండి పట్టు పట్టిందని – చెంపలు వాయించాడు. "నిన్నెంతో ముద్దుగా పెంచాం. నువ్విలా కులాంతర వివాహం చేసుకుంటే, మాతో ఏ సంబంధాలూ వద్దు." అన్నాడు రౌద్రంగా.

వదిన ఏడుపాపుకుంటూ తన వైపు చూస్తోంది.

తను ఏడుస్తూ – "నేను పెళ్ళి చేసుకోను." అంది.

అన్నయ్య కోపం చల్లారిపోయింది. "ఆ రాజాని మరచిపోతావుగా? ఆస్తిపాస్తుల గురించి కాదు నా బాధ. అతనంటే నాకెందుకో మంచి అభిప్రాయం కలగడం లేదు. నువ్వు చిన్నదానివి. కాస్తో కూస్తో వెనకాల ఆస్తిపాస్తులు ఉన్నదానివి. ఎంతోమంది గాలం వేస్తూంటారు. పిచ్చిదానిలా పడిపోకూడదమ్మా!" అన్నాడు చెంపలు నిమురుతూ.

తనకి దుఃఖం ముంచుకొచ్చింది. "అన్నయ్యా నువ్వు నన్ను కొట్టు, చంపు. రాజాని మరచిపోవడం జరగదు. అసలు నాకు మీరేమీ ఇవ్వద్దు."

"ఇవ్వడమా? నిన్నసలు ఇంట్లోంచి తరిమేస్తాం" కసిగా అన్నాడు.

"నేను వెళ్ళను!" తల అడ్డంగా ఊపింది.

"మరి?"

"నేను రాజాని పెళ్ళి చేసుకోను."

అందరి కళ్ళలోకి వెలుగొచ్చింది. ఒకరినొకరు సంబరంగా చూసుకున్నారు.

సంధ్య ఏడుపు దిగమింగుకుంటూ – "అసలు నేనెవర్నీ పెళ్ళి చేసుకోను. పెళ్ళంటూ చేసుకుంటే – అదీ రాజానే. మీ అనుమతితోనే." అంది వెక్కిళ్ళతో.

"మా అనుమతితోనే ప్రేమించావా?" హేళనగా చూశాడు.

దూరంగా నిలబడ్డ సురేష్, రమేష్‌లకి తమ అన్నయ్య ధోరణి కష్టమనిపించింది. అయినా ఏమీ అనలేక ఊరుకున్నారు.

"మీ అనుమతే తీసుకోవడం జరిగితే నువ్వు ఇంకెవర్నో రికమెండ్ చేసుండేవాడివి. నువ్వు నన్ను మొండిదనుకున్నా బాధ లేదు. నువ్వు ఒప్పుకుంటేనే రాజాని పెళ్ళి చేసుకుంటా. లేకపోతే నాకే పెళ్ళే చేయవద్దు. నిన్ను ఎదిరించి ఈ పెళ్ళి కోసం నేను ఇంట్లోంచి బయటకు నడిచి... ఇదంతా నేను చేయను..." చేతులు మొహానికి కప్పుకుంటూ తన రూంలోకి వెళ్ళిపోయింది.

సుదర్శనానికి చెల్లిలి ఉద్దేశాలేమీ అంతుబట్టలేదు. వారం రోజుల తర్జనభర్జనల అనంతరం తమ్ముళ్ళు కూడా బ్రతిమాలడం వల్ల, సంధ్య విచారాన్ని చూస్తూ భరించే శక్తి లేక సరే అన్నాడు. రిజిస్టర్ మారేజ్ చేసి, రైస్ మిల్లర్స్ హాల్లో గ్రాండ్‌గా రిసెప్షనిచ్చాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలని అప్పుడప్పుడే ఒంటపట్టించుకుంటున్న సంధ్య కింత ఆడంబరంగా రిసెప్షన్ జరగడం ఇష్టం లేదు. అయినా పెద్దన్నయ్యకి జడిసి ఊరుకుంది.

ఓ రెండేళ్ళు జీవితం మధురమైన అనుభూతులతో దివ్యంగా గడిచిపోయింది. అసలు రాజాలో రచయితనే తనెక్కువగా అభిమానించింది. చక్కగా కథలు రాసేవాడు. కాని, ఆ కథల్లో పాత్రల ఔదార్యం, సంస్కారం, ఆ ప్రిన్సిపల్స్ – రాజా స్వంత జీవితంలో ఎక్కువగా చూపించేవాడు కాదు. అందుకని తను వాదం వేసుకునేది. అప్పుడప్పుడు చిన్నబుచ్చుకున్నా, తన వాదనని నవ్వుతూ సరదాగా తీసుకునేవాడు.

వైరుధ్యాల మధ్య, వాదాల మధ్య తమ దాంపత్య జీవితం అనుకూలంగానే సాగిపోయింది. తనకీ ఓ ప్రైవేటు కాలేజీలో లైబ్రేరియన్ ఉద్యోగం వచ్చింది. ఆర్థిక బాధలు లేకుండా సజావుగానే సాగిపోతోంది సంసారం. తన నీరసాలు, కాన్పులు, పనిమనుషుల సమస్యలు ఇవన్నీ మామూలే.

రాజాకి ఇవేమీ పట్టేవి కావు. "ఉద్యోగం మానేసెయ్యరా!" అనేవాడు తేలికగ్గా.

రేపో మాపో ఆ కాలేజీకి గ్రాంట్స్ వస్తాయి. గవర్నమెంట్ కాలేజీలో లాగానే అందరికీ జీతాలందుతాయి. అందుకే పళ్ళ బిగువన అతి కష్టం మీద ఉద్యోగం చేస్తునే ఉంది. తన కెన్ని అసంతృప్తులున్నా, అతని చేష్టలు నచ్చకపోయినా అతన్నేమీ అనలేదే! అతన్ని ప్రేమించడంలో ఎప్పుడూ లోటు చూపించలేదే! మరెందుకు ఇలా చేశాడు?

✣✣✣

ఎక్కువ సేపలా కూర్చోలేక లైటు తీసేసి బాబు పక్కనే ఒరిగింది. ఈ రాత్రి ఎలా తెల్లవారుతుందా అని కొండంత దిగులుగా ఉంది. రేపటి సన్నివేశాలను ఊహించలేక మళ్ళీ ఎంతకీ తెల్లారకపోతేనే మంచిది – అనిపిస్తోంది. అటూ ఇటూ ఆలోచనల మధ్య పొర్లి పొర్లి ఎప్పటికో నిద్రలోకి జారిపోయింది సంధ్య.

తెల్లవారింది. పిల్లల పనయ్యాక, 'వద్దు వద్దు' అనుకుంటూనే మళ్ళీ ఆ నోట్స్ తిరగేసింది. సుమిత్ర రాసుకున్న కథలో రాజా కొత్త అవతారంలో ఉన్నాడు. అది డైరీ లాంటిది. సుమిత్ర ప్రతీ ఫీలింగునీ ఎంతో బాగా వర్ణిస్తూ రాసింది. రాజా సంసారంలో ఎన్నో బాధలు పడుతున్నాడనీ, అది చూసి తను ఎంతో దుఃఖపడుతున్నట్లుగా ఎన్నో రాసుకుంది.

ఈ పిల్ల గురించి అదే కాలేజీలో పని చేస్తున్న తన నేస్తం గిరిజ తననెంతో హెచ్చరించింది! తనెంత ఘోజుగా మాట్లాడింది! తనకీ శాస్తి జరగాల్సిందే. జరగాల్సిందే!

"సంధ్యా!"

సంధ్య ఉలిక్కిపడి నోట్స్ దూరంగా పడేసి లేచి నిలబడింది.

రఘు నవ్వుతూ నిలబడున్నాడు.

"రాజా లేడా?"

"లోపలికి రా రఘూ" అంటూ సంధ్య పిల్చింది. అతను బిస్కట్ పాకెట్ బాబు ముందు పెట్టి స్వీట్స్ పాకెట్ సంధ్యకి అందిస్తూ – "నేను వాషింగ్టన్ వెళుతున్నాను. మీ అన్నయ్యని కూడా కలుస్తాను. దాదాపు అన్నీ పూర్తయినట్టే. ఓ గంట మీతో గడుపుదామని వచ్చాను. సమయానికి రాజా లేడే?" అన్నాడు నొచ్చుకుంటూ.

సంధ్య కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

ఆ కన్నీళ్ళకి ఇంకో అర్థం చెప్పుకున్నాడు రఘు.

"మీ వదినయితే మరీ శోకాలు.. కానీ నువ్వు కూడా ఏడుస్తున్నావా? పిచ్చిదానా?" అన్నాడు కన్నీళ్ళు తుడుస్తూ.

"అందుక్కాదు. అసలు రాత్రే నువ్వెందుకో గుర్తు కొచ్చావు. ఇప్పుడు కనబడి అమెరికా అంటున్నావు. నాకేమిటో అంతా గందరగోళంగా ఉంది. నీతో ఎన్నో చెప్పాలి."

సంధ్య రాజాల పెళ్ళి విషయంలో రెండు మూడు తరాల నుంచీ ఈ కుటుంబంతో స్నేహ సంబంధాలున్న రఘు పాత్ర ఎంతో ఉంది. పైగా దూరపు బంధుత్వం. సుదర్శనాన్ని కాళ్ళావేళ్ళా పడి, బ్రతిమాలి ఒప్పించడంలో సఫలీకృతుడయ్యాడు రఘు. దాదాపు ఆ కుటుంబంలోని వ్యక్తిగానే అతన్ని అందరూ పరిగణిస్తారు, ప్రేమిస్తారు.

సంధ్య ఇంక నిగ్రహించుకోలేకపోయింది. క్లుప్తంగా అంతా చెబుతూ – "నీకు నేను ఉత్తరం రాద్దామనుకుంటున్నా. నువ్వు కూడా వెళ్ళిపోతున్నావ్. రాజా చూశావా, ఎంత దారుణంగా..." ఇంకేమీ అనలేక దుఃఖం బిగపడుతూ, వణుకుతూ – "నాకేం తోచడం లేదు." అంది.

రఘు తల తిరిగిపోయింది. రాజా అతనికి చిన్నప్పట్నుంచి తెలుసు. సంధ్య కోసం ఎంత తాపత్రయపడ్డాడో బాగా తెలుసు. ఇంత మోసం చేస్తాడా? సంధ్య ఏడవడానికి కూడా అభిమానపడే స్త్రీ. తనకి ఆమె స్వభావం బాగా తెలుసు.

"సంధ్యా, ఇవన్నీ అపోహలేమో? నిజం కాకపోవచ్చు" అన్నాడు తల విదిలిస్తూ.

"ఎవరైనా మూడో మనిషి చెబితే నేనూ అలాగే అనుకుని ఉండేదాన్ని. అసలు శ్రేయోభిలాషులు కొందరు కిందటి సంవత్సరమే అటువంటి హెచ్చరికల్ని చేసినా నేను నిర్లక్ష్యంగా నవ్వేశాను. ఇప్పుడు వాళ్ళ పరిచయం, ప్రేమ, సెక్స్ సంబంధాలూ అన్నీ వివరంగా ఈ పుస్తకంలో..." సంధ్య కళ్ళల్లోంచి ధారాపాతంగా నీళ్ళు కారసాగాయి.

రఘు గుండెల్లో చేయి పెట్టి దేవినట్టయింది.

"సంధ్యా! నాకే గాభరాగా ఉంది. ప్లీజ్, ఏడవకు."

"రఘూ! రాజా ఎంత ఎదిగిపోయాడంటే, ఈ అమ్మాయికి అబార్షన్ కూడా చేయించాడు. ఇప్పుడేమో 'ఎం.ఎ.చదివిస్తాను, మంచి భవిష్యత్తు చూపిస్తాను' – అంటున్నాడట. పెళ్ళి చేసుకోడానికి రెడీగా లేడట. పాపం! ఆ అమ్మాయి ఈ వ్యవహారం వల్ల ఎన్నెన్ని బాధలు పడుతోందో అన్నీ రాసుకుంది. ఎన్ని చిక్కులో చూడు."

రఘుకి చాలా బాధగా ఉంది. పైగా అట్టే టైం లేకపోవడం, ఈ పరిస్థితులో సంధ్యని వదిలి వెళ్ళడం చాలా ఘోరం అయినా తప్పదు. ఇంత విషాదంగా వీడ్కోలు తీసుకోవాల్సి వస్తుందని తనెప్పుడూ ఊహించలేదు. కారడివిలో చిక్కుకుపోయిన కుందేలు పిల్లలా ఉంది సంధ్య. ఎన్నెన్నో చెప్పి ఊరడించి నిష్క్రమించాడు రఘు.

మళ్ళీ ఒంటరితనం. భయంకరమైన ఒంటరితనం. రోడ్డు మీదకు పరిగెత్తి – "రాజా నా మొగుడు కాదండీ" అని అరవాలనుంది.

సెలవులు కావడంవల్ల స్నేహితులంతా ఊళ్ళకి వెళ్ళారు. గిరిజకి ట్రాన్స్‌ఫరయింది. ప్రస్తుతం ఈ బాధని పంచుకునే నేస్తాలే లేరు. రఘు దాదాపు అన్నయ్యలతో సమానం. అతను కూడా బ్రతుకు పోరాటంలో దూరంగా వెడుతున్నాడు. తనని పూర్తిగా ఓదార్చడానికి కూడా టైం లేక తల్లడిల్లుతూ పరిగెత్తాడు. ఫారిన్ వెళ్ళే అతని మనసుని తన గొడవతో పాడుచేసింది. అసలు నిగ్రహించుకోలేకపోయింది. రఘు ఈ రహస్యాన్ని ఎవరికీ చెప్పడు కానీ మనసు బాగా పాడు చేసుకుంటాడు కదా. ఎంత పొరపాటు చేసింది తను! తన ఏడుపేదో తనేడవక రఘు కెందుకు చెప్పింది?

కూరగాయలమ్మాయి కేకేస్తుంటే బయటకొచ్చి కూరగాయలు తీసుకుంది. ఏమీ బేరం చేయకుండా వెంటనే తీసేసుకునే ఆమె వైఖరి చాలామందికి నచ్చదు.

"అంతంత రేట్లు చెబుతుంటే తీసుకోవడానికి మాకేం రెండు జీతాల్లేవు" అంటారు, ఎదురింటి మేడల్లో ఆడవాళ్ళు. సంధ్య అక్కడే నిలబడ్డా, ఆ మాటలనడానికి వాళ్ళకేమీ అభ్యంతరం ఉండదు. 'పెద్ద పెద్ద కట్నాలతో, నగలతో కాపురాలకి వచ్చే ఆడవాళ్ళ మనసుల్లో బూజులు దులపడం అసాధ్యం' అనుకుంటూ ఉంటుంది సంధ్య వాళ్ళని చూసినప్పుడల్లా. కూరగాయలు తీసుకుని ప్లాస్టిక్ బుట్టలో వేసుకుంటుండగా రిక్షా ఆగింది. ఎక్కడో ఆడుకుంటున్న పాప "నాన్నగారూ!" అంటూ పరుగు పరుగున వచ్చింది. రాజా ఎప్పటిలానే నవ్వుతూ దిగి, డబ్బులిచ్చేసి, సంధ్య వైపు చూస్తూ, "హలో" అంటూ కళ్ళెగరేశాడు.

ఆ చిరునవ్వు, ఆ మొహంలో ప్రసన్నత చాలా కృతకాలు! అతన్నెలా ఫేస్ చేయాలా అని తబ్బిబ్బవుతుంటే, అతను ఇంట్లోకి రావడం అతి మామూలుగా జరిగిపోయింది.

బట్టలు మార్చుకుంటూ, "ఈ రోజు ఏం కూరలు సంధ్యా?" అన్నాడు హుషారుగా.

'ఛా! ఎంత మామూలుగా మాట్లాడుతున్నాడు, ఎంత సహజంగా మాట్లాడుతున్నాడు?'

"నిర్మల వెళ్ళిపోయిందా? నేను స్నానం చేసొస్తాను" అంటూ సంధ్యకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

ముందుగా నోట్స్ తీసి యథాప్రకారంగా ఉంచేసింది. ఇల్లంతా సర్ది డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దింది. అలా సర్దుతుండగా తాను అనుభవిస్తున్న బాధ ఒక్కసారే రేగిపోయి గజగజా వణికింది. అలా వణుకుతూనే బాత్‌రూం దగ్గరకొచ్చి తలుపు కొట్టింది. తలనిండా షాంపూ పట్టించుకుంటున్న రాజా "ఏమిటి సంధ్యా" అన్నాడు తాపీగా.

సంధ్య ఆవేశం దిగజారింది. అతని ప్రతి మాటా, ప్రతి చేష్టా కొత్తగా అనిపిస్తోందిప్పుడు.

"టవల్ కావాలా?"

"తెచ్చుకున్నాగా!"

"తల రుద్దాలా?"

"ఎందుకు, నేను రుద్దుకోలేనా? పరా పరా" తల రుద్దుకుంటూ అన్నాడు.

"వీపు తోమాలా?"

"సిల్లీ గర్ల్"

"ఇవన్నీ భార్యలు చేస్తే మగవాళ్ళకి సంతోషమటగా?" నిర్లిప్తంగా అంది. అసలీ సంభాషణ అర్థం పర్థం లేనిదని తెలుసు. అయినా అతన్ని ఏదో అనాలి.

"భార్యల పనుల గురించి కొత్తగా ఈ రోజెందుకు గుర్తు చేసుకుంటున్నావ్? అసలెవరయినా స్నానం చేస్తుంటే వచ్చి మాట్లాడడం నీకిష్టం ఉండదు కదా! వెళ్ళు, వెళ్ళు. భోజనం వడ్డించు." నవ్వుకుంటూ మీద నీళ్ళు గుమ్మరించుకున్నాడు.

కంచాల్లో వేడి వేడి అన్నం వడ్డిస్తూ అనుకుంది భోజనం అయ్యాక సాయంత్రం ఎక్కడికైనా బయటకి తీసుకెళ్ళి తన నిర్ణయాలు చెప్పాలి. ఊరి చివర షికారుకెళ్ళే పెళ్ళి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు విడిపోయే నిర్ణయాలు కూడా అటువంటి చోటే తీసుకోవాలి.

లాల్చీ, పైజామా వేసుకుని పౌడర్ లైట్‌గా రాసుకుని ఈల వేసుకుంటూ టేబుల్ దగ్గరకి వచ్చాడు రాజా. అనుకోకుండా అన్నీ అతనికి ఇష్టమైన అధరువులే వున్నాయి.

"బాబేడీ?" అడిగాడు సాంబారు పోసుకుని కలుపుకుంటూ.

"పక్కింట్లో ఉన్నాడు."

"మన పక్కింటి వాళ్ళు చాలా మంచివాళ్ళులా ఉన్నారు. పిల్లల్ని బాగా ముద్దు చేస్తారు."

"సుమిత్రకి కూడా చాలా ముద్దు కదూ! ముఖ్యంగా బాబంటే!" అతని భావాలని పసిగట్టాలని అతని ముఖంలోకి చూస్తూ అంది. అతను జాగ్రత్తపడగలడు. "ఆఁ, ఏదో పెళ్ళిగాని పిల్ల గదా! చిన్న పిల్లలంటే సరదా! రేపు పెళ్ళయితే ఈ శ్రద్ధ లేమీ ఉండవు."

"ఆ అమ్మాయి వేరు రాజా. ఎందుకోగాని మన పిల్లలన్నా, మన ఇల్లన్నా చాలా శ్రద్ధ."

సంధ్య మాటలకి అతనేం సమాధానం చెప్పలేదు.

"నిర్మల ఆడబిడ్డ పెళ్ళికి వెళ్ళక తప్పదంటావా?" అన్నాడు ఆమ్లెట్ తుంపుతూ.

"వెళ్ళాలేమో! బావుండదు కదా!"

"నువ్వూ వస్తే బావుండేదిరా."

సంధ్య శ్రద్ధగా అన్నం తినలేకపోతోంది. ప్రయాణాలకి మాత్రం పక్కన భార్య ఉండాలా? ప్రియురాలు పనికిరాదు పాపం!

"ఏమిటంత పరధ్యానం సంధ్యా? పెరుగులో సాంబారు పోసుకుంటున్నావ్?"

"ఇదొక రుచి" పంతం పట్టినట్టు ఆ అన్నమే ముద్దలుగా చేసి తింటూ అంది.

అతను గమ్మత్తుగా చూసి నవ్వేసి, ఆ రోజు పేపరు తీసుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

ఎంత కులాసాగా భోజనం చేశాడో! ఎంత హాయిగా తిరుగుతున్నాడో! ఆ అమ్మాయి ఓ రకంగా, తనింకో రకంగా కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంటే ఈ మనిషికి ఏమీ ఆందోళన లేనట్టుగా ఉంది. ఈ కులాసా, ఈ నిశ్చింత ఎంత సేపో చూస్తాను – విసురుగా లోపలికెళ్ళింది. అతను సిగరెట్ తాగుతూ దిండుకు చేరగిలబడి పేపరు చదువుతున్నాడు. ఆ ఫోజులో అతను చాలా ఠీవిగా ఉన్నాడు. బావున్నాడు. ఛీ! తనకెంత సిగ్గు లేదు! ఇప్పుడు కూడా అతని భంగిమలని పరిశీలిస్తోంది పాడు మనసు!

"రా సంధ్యా, తలుపేసి రాకపోయవా?"

"ఎందుకు?"

"ఇందుకు" గభాల్న మంచం మీదకి లాగాడు. సంధ్యకి ఒళ్ళంతా చీమలు పాకినట్లయింది. విడిపించుకుని దూరంగా కూర్చుంటూ – "నిన్న సుమిత్ర, అరుణ వచ్చారు." అంది.

"ఊఁ" అన్నాడు అంతగా పట్టించుకోనట్టు.

"ఇద్దరికీ ఫస్ట్ క్లాసు లొచ్చాయి."

"వెరీ గుడ్"

"బహుశా రేపు సుమిత్ర వస్తుందేమో! ఇంట్లోనే ఉండండి. నిన్న కూడా మీరుంటారనే వచ్చినట్లుంది. చాలా గొడవల్లో ఉందనుకుంటా పాపం!"

"వాళ్ళు లేని వాళ్ళు. సంతానం ఎక్కువ. ఏవో గొడవలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి."

"మనం ఉన్నవాళ్ళమా?"

"వాళ్ళకన్నా. అసలు సుమిత్రకీ, నీకూ పోలికేమిటీ?" ఈ ఒక్క మాటలో రాజా తన ప్రపంచం నుంచి బయటకొచ్చాడు. "నువ్వు కావాలని అడగాలే గాని, నీ పేర ఉన్న ఆస్తిని మీ అన్నయ్యలు క్యాష్ చేసి ఇవ్వరూ?"

"వాళ్ళకిష్టం లేని పెళ్ళి చేసుకుని, ఆస్తిపాస్తుల గురించి ఎలా మాట్లాడగలను?"

"నువ్వు మాట్లాడాలా ఏమిటి? వాళ్ళే ఇస్తారు. నువ్వంటే వాళ్ళందరికీ బాగా ముద్దు కదా! అయినా నీకు మామూలు ఆడవాళ్ళ లక్షణాలు లేవు. అసలు ఓ ఆడపడుచుగా నువ్వెంత డిమాండు చేయవచ్చో" హాస్యంగా అన్నాడు.

"అందరాడవాళ్ళ కన్నా భిన్నంగా ఉంటాననే కదూ నువ్వు నన్ను ఇష్టపడింది? ఇప్పుడీ భిన్నత్వం నీకే మాత్రం ఇష్టం లేదనుకుంటా?" సూటిగా చూస్తూ అంది.

"ఛా... ఛా. ఎవరన్నారలా? ఎందుకమ్మా వచ్చినప్పటి నుంచీ నాతో దెబ్బలాడుతున్నావ్?" ఆమె చేయందుకోడానికి ప్రయత్నిస్తూ గోముగా అన్నాడు. సంధ్య దూరంగా జరిగి, సాలోచనగా చూస్తూ అంది – "రాజా! నేను నీతో చాలా మాట్లాడాలి. సాయంత్రం అలా బయటకు వెడదాం."

రాజా నిర్ఘాంతపోయినట్లు చూశాడు. ఈ ప్రతిపాదనలో విశేషం అతన్నెందుకో భయపెట్టింది. సిగరెట్ వెలిగిస్తూ – "ఏం మాట్లాడుతావ్ సంధ్యా? ఇప్పుడే చెప్పు." అన్నాడు లేచి అటూ ఇటూ తిరుగుతూ.

"ఊహూఁ, ఇంట్లో అయితే మన ఎమోషన్స్‌నీ, నోటినీ అదుపు చేసుకోకుండా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుకుంటాం. అదే బయటైతే చాలా బాలన్స్‌డ్‌గా సంభాషణ జరుపుతాం."

అతనికేదో సందేహం వచ్చి నిలువునా ఒణికిపోయాడు.

సంధ్య మొహం ప్రశాంతంగా ఉంది. ఊహూఁ, ఆ విషయం అయ్యుండదు. అదే గాని తెలిస్తే సంధ్య ఈ తీరులో ఉంటుందా?

"అబ్బ నేను సస్పెన్స్ భరించలేను. చెప్పు సంధ్యా. మెల్లగా మాట్లాడుకుందాం. చెప్పు. ఆ ముందు గది తలుపేసి రా."

"ఏమీ లేదులే. నాకెందుకో ఈ టాపిక్ మాట్లాడడం ఇష్టంగా లేదు. పడుకో." సంధ్య కదలబోయింది.

భుజాలు పట్టుకుని కూర్చోబెట్టాడు రాజా. "మన మధ్య రహస్యాలేమిటి సంధ్యా? నా పొరపాటుంటే దులిపిపారేయ్యి. అంతేగాని ఇదేదో సీరియస్‌గా చేసి బయటకే వెళ్ళి మాట్లాడుకోవాల్సినంత అవసరం ఏమిటీ?"

"సీరియస్ విషయమే." తల వంచుకుని అంది సంధ్య.

రాజా ఒద్దికగా కూర్చుని అనునయంగా "చెప్పు" అన్నాడు.

సెకండ్లు, నిముషాలు జరిగిపోతున్నాయి. ఓ పిచ్చుక లోపలికొచ్చి వెంటిలేటర్ మీద శబ్దం చేసి రివ్వుమని ఎగురుతూ బయటకు పోయింది.

ఎక్కడో వేళగాని వేళ కోడిపుంజు కొక్కొరోకో అని కూసింది.

బయట "మల్లెపూలోయ్" అంటూ కేక వినిపించింది.

గొంతు పెగలడం లేదు. ఈ నిశ్శబ్దం ఇద్దరికీ భయాన్ని కలిగిస్తోంది. సంధ్య తనకి తాను ధైర్యం చెప్పుకుని తల పైకెత్తి చూసింది. రాజా చూపులు కలిసాయి.

"అవునూ, సుమిత్రకి ఆర్నెల్ల క్రితం అబార్షన్ అయిందిట. నువ్వే స్వయంగా దగ్గరుండి అన్నీ చూశావట?"

రాజా మొహం పాలిపోయింది. కూర్చున్న మంచం గిరగిరా తిరుగుతున్నట్లనిపించింది అతనికి. ఆ అవస్థలో అతన్ని చూడాల్సి వచ్చినందుకు సంధ్య చాలా సిగ్గుపడింది.

"నీకెవరు చెప్పారు సంధ్యా?" బొంగురు గొంతుతో అన్నాడు.

"నిజమా కాదా అనేది నా ప్రశ్న."

"అసలు నీకెలా తెలిసింది? ఎవరు చెప్పారు?" బాధ, భయం, ఆదుర్దా అన్నీ మిళితం చేసి ఆత్రంగా అన్నాడు.

"అది చెబితేగానీ చెప్పవా? ఈ అమ్మాయి గురించి గతంలో నేనేదో స్నేహపూర్వకంగా హెచ్చరిస్తే... అసలలా హెచ్చరించడానికే ఎంత సిగ్గుపడ్డానో.. నీ పట్ల నా నమ్మకం అటువంటిది." దగ్గొత్తికతో అంది. "అప్పుడేమన్నావ్? ఆ అమ్మాయి చాలా చురుకయిందీ, అకౌంట్స్ క్లియర్ చేసుకోవడం కోసం – ఇల్లు కాలేజికి దగ్గర కాబట్టి వస్తుందని చెప్పావు." బాగా దూరం జరిగి "నాకేం కోపం లేదు నీ మీద. ఓ స్టూడెంట్‌ని అటువంటి క్రిటికల్ కండీషన్‌లో అందరి మొగాళ్ళలా మోసం చేసి వదలక, దగ్గరుండి ఎంతో బాధ్యతగా అన్నీ చూశావు. నిజాయితీగా నిలబడ్డావు." మనస్ఫూర్తిగా అంది సంధ్య.

రాజా మనసులో లావా ఉబికి పొర్లి ప్రవహించడానికి సిద్ధంగా ఉంది. ఇటువంటి రోజును ఎదుర్కోకుండా కట్టుదిట్టమైన ప్రయత్నాలు అతను చేసుకున్నాడు. అయినా ఇదెలా సంభవించిందో ఆశ్చర్యంగా ఉంది.

"సంధ్యా! నన్ను కరుణించి ఇవన్నీ నీకెలా తెలిసాయో చెప్పు." గద్గదంగా అన్నాడు. అతని కళ్ళలో నీళ్ళూరుతున్నాయి.

ఈ క్షణాల్లో తాను బలహీనురాలైతే తను చాలా సిగ్గుమాలినదవుతుంది. కారణాలేవయినా అతనింకో జీవితం గడిపాడు. తనకి సమాధానాలు తప్ప, సంజాయిషీలు అక్కర్లేదు. అసలు సమాధానం మాత్రం ఎందుకటా? తనకి తెలియకపోతే కదా!

"సంధ్యా! నన్ను తిట్టు. కొట్టు. అలా చూడకు. నీకెలా తెలిసాయో చెప్పు. అంత దుర్మార్గులెవరో చెప్పు." ఆమె రెండు చేతులూ పుచ్చుకుని ప్రాధేయపడుతూ అన్నాడు.

సంధ్య విరక్తిగా, విషాదంగా చూస్తూ జీవం లేని నవ్వు నవ్వింది. "మనుషులెవరూ అంత దుర్మార్గానికి పూనుకోలేదులే. అలమారా సర్దుతుంటే ఆ నోట్స్..."

రాజా చేతులు ఆమె చుట్టూ బిగుసుకున్నాయి. "ఆ... ఆ... ఆ నోట్స్" అన్నాడు భయంగా ఆమెని దగ్గరకి లాక్కుంటూ.

# 3

"క్షమించాలి రాజా. నీ కథలు రఫ్‌గా ఎక్కడపడితే అక్కడ రాస్తుంటే, నేను చదువుతూ ఉంటానుగా! అటువంటిదే ఇదనుకుని, చేతి రాత చాలా అందంగా ఉండడంతో ఇంకెవరో రచయిత ఫ్రెండ్ రాసిన కథేమో అనుకుంటూ – చదువుకుంటూ పోయాను. ఆ కథాసాగరం నన్ను లోపలికి లాగేసింది. ఫలితంగా నీ భార్యగా నిన్ననే చచ్చిపోయాను."

సంధ్య ఇంక నిగ్రహించుకోలేకపోయింది. కళ్ళలోంచి ప్రవాహాలు వేగంగా కిందకి ఉరుకుతున్నాయి. శబ్దమవుతుందని భోరుమనలేకపోతోంది గాని, నర నరం కంపిస్తోంది.

రాజా చలించిపోయాడు. "సంధ్యా!" అంటూ హృదయానికి హత్తుకుని చేతులు గట్టిగా ఆమె కదలకుండా ఆమె చుట్టూరా బిగించాడు.

సంధ్య గింజుకున్న కొద్దీ అతని పట్టు ఎక్కువయింది.

"సంధ్యా, నా సంధ్యా! ఎలా తట్టుకున్నావ్ సంధ్యా! అసలు నన్నిలా ఊహించుకోలేవని తెలుసు. ఎంత గిలగిలలాడి ఉంటావో?" రాజా కూడా ఏడవడం ప్రారంభించాడు. ఆమె తలని పదే పదే హత్తుకుంటూ నిమురుతూ ఏడుస్తున్నాడు.

సంధ్య కళ్ళు బైర్లు కమ్మినట్టయి చేతులు వేలాడేసింది.

రాజా జాగ్రత్తగా ఆమెని పడుకోబెట్టి మంచినీళ్ళు తీసుకొచ్చి తాగించాడు. ఆమె తాగేసి మళ్ళీ పడుకుంది. రాజా ఆమె తల నిమురుతూ వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించాడు.

"ఊరుకో. ఎందుకూ ఏడవడం? అంది ఓదార్పుగా అతని చెయ్యి తడుతూ.

అతను ఆమె కాళ్ళ మీద తల పెట్టి – "నన్ను క్షమిస్తావా?" అన్నాడు రుద్ధ కంఠంతో.

సంధ్య అశక్తురాలిలా చూస్తోంది. రాజా ఇంత దీనాతిదీనంగా ఏడుస్తుంటే తన ప్రాణం విలవిలలాడుతోంది. కాని ఇలా జాలిపడడం ప్రారంభిస్తే తను ఓడిపోవడం ఖాయం!

"నువ్వు చాలా కావాలనుకునే ఆ అమ్మాయికి దగ్గరయ్యావు కదా! ఇప్పుడెందుకిలా...?"

"నన్ను నమ్ము. నీకిచ్చిన స్థానం ఎవరికీ ఇవ్వలేను. అసలలా ఎందుకు జరిగిందో నువ్వు స్థిమితపడ్డాక అన్నీ వివరంగా చెబుతాను. ఈ వెధవని క్షమించు."

స్థిమితపడడమా? అసలింకా కలిసుందామనేనా ఇతని ఉద్దేశం?

"రేపు నేను ఊరెళతాను. నీ జీవితానికి అడ్డు రాను. ఆ అమ్మాయిని అన్యాయం చేయకు." అంది పొడిగా.

"చేయను. చేసేవాణ్ణయితే ఇన్ని చిక్కుల్లో ఎందుకు పడతాను? నువ్వెక్కడికి వెళ్ళేదీ? నన్నొదిలి ఎక్కడికీ వెళ్ళొద్దు." ఆమెను కౌగిలించుకుని ముద్దు పెట్టుకుని కళ్ళు తుడుస్తూ అన్నాడు.

"దయచేసి నన్నిక వదిలేయి."

"నాకింకేం చెప్పకు సంధ్యా! నువ్వు గాని నా దగ్గరనుంచి వెళ్ళిపోతే చచ్చిపోతాను. ఇది బెదిరించడం కాదు. నిజం! నువ్వు నన్నలా శిక్షిస్తే నేను శాశ్వతంగా ఈ ప్రపంచం నుంచి తప్పుకుంటాను." ఉద్రేకంగా అన్నాడు.

"ఆ పని నేను నిన్ననే చేసుంటే చాలా బాగుండేది. నిర్మలే గాని ఆ సమయంలో లేకపోతే, ఏమో నేనేమయేదాన్నో!" పక్కకి తిరిగి పడుకుంటూ అంది.

"అవును కదూ?" అతను రిలీఫ్‌గా ఆమెని వదిలి ఆమె గుండెల మీద తల పెట్టాడు. "నేను చాలా అదృష్టవంతుడిని డియర్! అమ్మో నువ్వేదయినా అఘాయిత్యం చేసుంటే..!"

"నీ మీదకి రాకుండా ఓ ఉత్తరం రాసిపెట్టి మరీ చచ్చిపోయేదాన్ని రాజా!" అంత దుఃఖంలోనూ సరదాగా అంది సంధ్య.

"వద్దు సంధ్యా! మనకి మంచి రోజులున్నాయి. నేనన్నీ వివరంగా చెబుతానుగా. నువ్వు మాత్రం నన్ను వదిలిపెట్టవద్దు. నేను ఊబిలో కూరుకుపోయి ఉన్నాను. నీ చేయూత లేనిదే పైకి రాలేను. నన్ను రక్షించమ్మా! ప్లీజ్. నువ్వు కూడా కక్ష గట్టకు." రాజా చిన్నపిల్లాడిలా ఏడవసాగాడు.

సంధ్యకేమీ పాలుపోవడం లేదు. అతనిని ఇక సహించలే ననుకుంది. కాని జరుగుతున్నదేంటి? ఇతన్నే తను ఓదార్చవలసి వస్తోంది. తనెందుకిలా దిగజారిపోతోంది?

"సంధ్యా, సుమిత్ర నిన్న సాయంత్రం వచ్చిందా? అంటే అప్పటికి నువ్వు ఆ డైరీ చదివేశావా?"

"భయపడకు. ఆ అమ్మాయిని నేనేమీ అనలేదులే. అదేమిటో విచిత్రంగా అది చదివిన గంటకే వచ్చిందా అమ్మాయి. మళ్ళీ ఒక్కర్తే వెనక్కి తిరిగొచ్చి, 'మాస్టారు ఎప్పుడొస్తారు' అని అడిగింది. పాపం, చాలా విచారంగా ఉంది. వయస్సుకి మించిన కష్టాలు" నిట్టూర్చింది సంధ్య.

"ఆ అమ్మాయి ఒంటరిగా దొరికినా కూడా ఏమీ అనకుండా... నా సంధ్యా, అయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యు. ఈ రత్నాన్ని గుర్తించలేక నేను... నేను శుంఠని కాబట్టి ఆలస్యంగా విలువని గుర్తించాను. నీ వ్యక్తిత్వం ముందు మాలాంటి వాళ్ళం ఎందుకూ కొరగాం. ఎంత ఆత్మ సంయమనం, సంస్కారం ఉండాలి? అటువంటి లక్షణాలతో ఉన్నతమైన పాత్రలు నా కథలలో సృష్టించి, నేను మాత్రం నిజజీవితంలో చాలా అల్పుడిలా ప్రవర్తించాను. చక్కటి సాహిత్యాన్ని మథించిన నువ్వు నీ విజ్ఞతనీ, ఔన్నత్యాన్ని ఎంతో గొప్పగా పాటించావు! ఎవరికీ అందనంత ఎత్తుకి ఎదిగిపోయావు."

అతను పదే పదే పొగుడుతూ, ముద్దులాడడం ప్రారంభించాడు. సంధ్య వారించినా వినడం లేదు. సంధ్యకి నిస్సత్తువతో కళ్ళు మూతలు పడ్డాయి. ఆమె తల సవరించి ఫాను ఫుల్ స్పీడ్‌లో పెట్టి తను కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు. నిద్రపోతున్న భార్యని చూస్తుంటే అతని హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోసాగింది.

ఆమెని ఇంత దారుణంగా గాయపరిచే హక్కు తనకెవరిచ్చారు? ఈ రెండేళ్ళ రహస్యాన్ని అతి గోప్యంగా ఉంచాడు. సంధ్యకి తెలిస్తే గాజుపాత్ర బద్దలైపోయినట్టుగా తమ సంసారం విచ్ఛిన్నమవుతుందనే భయంతో, ఈ వ్యవహారంలో ఎంత లోతుగా ఇరుక్కుపోయినా, సంధ్యకి ఏ మాత్రం అనుమానం రాకుండా ప్రవర్తించాడు.

"నీ గుండెల్లో బరువు తగ్గించుకోవాలంటే, నీ ఘర్షణనంతా అక్షర రూపంలో పెట్టు. నువ్వు రచయిత్రివయ్యే లక్షణాలున్నాయి. ఉత్తరాలు ఎంతో బాగా రాస్తావు కదా." అని హాస్యంగా తనన్న మాటలని ఆచరణలో చూపించింది సుమిత్ర. తనసలు సగం చదివి భరించలేక అలమారాలో ఎక్కడో అడుగున పెట్టాడు. రేపో మాపో రిటర్న్ చేద్దాం – అనుకుంటుండగానే, ఇదిగో, ప్రయాణం తగిలి తన మోసపు జీవితం ఇలా బయట కొచ్చింది. సంధ్యని మాములు మనిషిని చేసి, ఎప్పటి తన సంధ్యలా మార్చుకోడానికి చాలా కష్టమవుతుంది. తప్పదు. విషమ పరీక్షని ఎదుర్కోవాలి. ఈ పిల్లలు, ఈ తీరైన జీవితం, సంధ్య – ఇవన్నీ తనకెంతో ముఖ్యం. ఆ తరువాతే ఏమైనా. ఇవి పోగొట్టుకుని తనుండలేడు.

ఎన్ని సిగరెట్లు కాల్చాడో అతనికే తెలియలేదు. చీకటి పడ్డాక గాని చుట్టూ పరిసరాలని గమనించలేదు. పనిపిల్ల సుభద్ర – "అయ్యగారూ, గిన్నెలు అన్నీ సర్దేశా" అంది.

నిద్రపోతున్న సంధ్య వైపు చూసి వంటగదిలోకి నడిచాడు. పచ్చడి సీసా తీసి కంచాల్లో వడ్డించి, ఆ పిల్ల సాయంతో ఆమ్లెట్లు వేశాడు. పిల్లలకి అన్నాలు తినిపించి, వాళ్ళని నిద్రపుచ్చి, ఓసారి రోడ్డు మీద కెళ్ళి సిగరెట్ పాకెట్ తెచ్చుకున్నాడు. నిజానికి సిగరెట్స్ ఎక్కువగా తాగడు, కాని ఇప్పుడు అవసరం.

సంధ్య ఇంకా నిద్ర లేవలేదు. నుదుటి మీద చెయ్యి వేశాడు. ఒళ్ళు కొద్దిగా వెచ్చబడింది. తనని తాను శపించుకుంటూ – "సంధ్యా!" అన్నాడు ఆర్ద్రంగా.

సంధ్య కళ్ళు తెరచి మళ్ళీ మూసుకుంది. మూసుకున్న కనురెప్పల మీద ముత్యాల బిందువుల్లా కన్నీళ్ళు బయటకి వస్తున్నాయి. పెదిమలు అదురుతున్నాయి.

"సంధ్యా! నిద్రలో గూడా ఏడుస్తున్నావా? ఏమ్మా?" తల సవరిస్తూ ప్రేమగా అన్నాడు.

"చాలా తలనొప్పిగా ఉంది" నూతిలోంచి పలికినట్టుగా ఉంది కంఠం.

"నేను తల పడతాను గానీ, కొంచెం ఓపిక చేసుకుని బాత్‌రూంలోకి వెళ్ళి కాళ్ళూ, చేతులూ, మొహం కడుక్కో. లేవగలవా?"

ఆమెని లేపి కూర్చోబెట్టాడు. సంధ్య స్లిప్పర్స్ వేసుకుని, టాయిలెట్‌కి వెళ్ళింది. గోడకున్న అద్దంలోంచి రేగిన జుత్తుతో ఉబ్బిపోయిన కళ్ళతో తన మొహం భయంకరంగా ఉంది. ఈ రెండ్రోజులు ఒట్టి పీడకలే అయితే ఎంత బావుండును? చన్నీళ్ళతో మొహం కడుక్కుని టవల్‌తో అద్దుకుంటూ లోపలి కొచ్చింది. టేబుల్ మీద అన్నీ వడ్డించి తన కోసం ఎదురుచూస్తున్నాడు రాజా. ఎందుకో నవ్వొచ్చింది. తనవల్ల ఏదైనా పొరపాటు జరిగినప్పుడు తన వెనకే తిరుగుతూ, చాలా పనుల్లో సహాయపడుతుంటాడు. మళ్ళీ ఉత్తప్పుడు చాలా ఆకతాయినతంగా చేయాల్సినవి కూడా ఎగ్గొడుతుంటాడు.

టేబుల్ దగ్గరికి నడుస్తుంటే ఎందుకో కడుపులో తిప్పినట్టయింది. ఓ పచ్చి మోసగాడు తన కోసం నక్కలా కాచుకుని కూర్చున్నట్లుగా అనిపించి జుగుప్స కలిగింది. "నువ్వు తినెయ్" అంది అవతలికి నడుస్తూ.

"నా మీద ఒట్టే." ఆమెని బలవంతంగా కుర్చీలో కూలేసి, తనే అన్నం కలిపి ముద్దలు చేసి, "ఊఁ, నోరు తెరవరా" అన్నాడు.

"వద్దు"

"నా తల్లివి కదూ! తినేసి నన్ను తిట్టు. నువ్వు బాగా తిడితేనే నాకు మనశ్శాంతి."

"నేనెవర్ని?"

"నువ్వెవరో తరువాత చెబుతా...!" రహస్యంగా అని బలవంతంగా ముద్ద నోట్లో పెట్టాడు. సంధ్య అయిష్టంగా నమలడం ప్రారంభించింది. రాజా ఏదేదో మాట్లాడుతూ అలాగే తినిపించాడు. ఆమె చెయ్యి కంచంలో స్వయంగా తనే కడిగి – "సుభద్రా, సుభద్రా" అని పిలిచాడు. ఆ అమ్మాయి వచ్చి పళ్ళాలు తీసింది. తనూ గబగబా తింటూ – "నీకొంచెం జ్వర మొచ్చినట్లుగా ఉంది." అన్నాడు.

"అవును, తగ్గే జ్వరం కాదు." కఠినంగా అంది.

"నేనుండగా నీకేంటమ్మా? ఊరికే ఆలోచించి మనసు పాడుచేసుకోకు."

టేబుల్ మీద తలానించి అతని మాటలు వింటూ పేలవంగా నవ్వింది. ఆ నవ్వు చూసి తనని తాను శపించుకున్నాడు రాజా. తనకు గుర్తున్నంత వరకూ సంధ్య మొహంలో అపజయపు చిహ్నాలు ఎప్పుడూ చూళ్ళేదు. ఇప్పుడు సర్వస్వం కోల్పోయినదానిలా డీలా పడిపోయింది.

అందరూ నిద్రపోయారని నిర్ధారణ చేసుకున్నాక, తలుపులన్నీ జాగ్రత్త వేసి, సంధ్య దగ్గరికి అమృతాంజనం సీసాతో వచ్చాడు. జరిగే విషయాలలో తన ప్రమేయం ఏమీ లేనట్టుగా నిర్లిప్తంగా చూస్తూ పడుకుంది. అతని చేతులు సుతారంగా కణతల్ని నొక్కుతూ, మర్దిస్తున్నాయి.

మధ్యలో సంధ్య దగ్గింది. జలుబు చేసినట్టుగా అనిపిస్తోంది.

"జలుబు కూడా చేసింది, గుండెల మీద రాస్తాను" అన్నాడు పమిట తొలగిస్తూ.

"వద్దు వద్దు." దగ్గుతూ వారించింది.

"కాస్త రాయనివ్వరా, పొద్దుటికి రిలీఫ్‌గా ఉంటుంది."

"వద్దన్నానా? అసలు చెయ్యి తీసేయ్యి. ఇక పడుకుంటాను." విసుగ్గా అంది.

అతను వినలేదు. మెడకింద, గుండె కింద మెల్లగా రాయడం మొదలు పెట్టాడు. సంధ్యకి హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చి అతని చేయి తీసేయబోయింది.

"ఉండ్రా!" అని ముద్దుగా విసుక్కుంటూ రాయడం కొనసాగించాడు.

సంధ్య తల అటూ ఇటూ విదిలించింది.

"ఏమిటి, నొప్పి బాగా వస్తోందా?"

లేదన్నట్లు తలాడించింది.

"వేడిగా ఏమైనా తాగుతావా?"

తల అడ్డంగా ఊపింది. గుండె ఎగిసి పడుతూంది. రాజా అది గమనించలేదు.

"మరేమిటి నిద్రపోదామా?"

"నువ్వు దూరంగా వెళ్ళు... న... న్ను... న... న్ను... ముట్టుకోవద్దు... ప్లీజ్! నన్ను తాకిన చేతులతో ఇంకొకర్ని... ఇంకో మనిషిని కూడా... నాలాగే..." సంధ్య ఏడుపు ఆపుకోడానికి విశ్వప్రయత్నం చేస్తూ, వణుకుతూ అంటోంది. "నన్ను అనుభవించిన శరీరంతో ఇంకొకర్ని... ఇంకొకర్ని..."

"సంధ్యా మాట్లాడకమ్మా! ఏమీ గుర్తు చేసుకోకు. పడుకో." సంధ్య మీదకి వాలిపోతూ అన్నాడు రాజా.

సంధ్య హిస్టీరికల్‌గా ప్రవర్తిసోందని తెలుసు. "ఎక్కువగా ఏడిస్తే ఇంత రాత్రప్పుడు ఎవరైనా వింటారు" తన పెదిమలతో ఆమె నోరు మూసేశాడు.

అతని తలని బలంగా లేపుతూ – "అంతా అయిపోయింది. ఇంకో మనిషితో ఇలాగే బ్రతికావు... అచ్చు నన్ను ముద్దు పెట్టుకున్నట్టే... ఆ అమ్మాయిని... అబ్బా!" వెక్కి వెక్కి పడుతూ, అస్పష్టంగా అంటోంది.

రాజాకేమీ తోచలేదు. మాటలతో కన్నా శరీరంతోనే ఊరడించడం మంచిదనిపించింది. పైగా సంధ్య ఇక తనని శారీరకంగా కలవనివ్వదేమో అనే భయంతో మరీ చొరవ చేస్తూ, ఆమె విదిలింపులని సహిస్తూ, చివరకు ఆమెని లొంగిపోయేలా చేశాడు.

తన నిస్సహాయతకు సిగ్గుపడిన సంధ్య నిశ్శబ్దంగా ఏడవడం ప్రారంభించింది. "ఛీ స్కౌండ్రల్!" అంది ఏడుస్తూ.

రాజాకేమీ కోపం రాలేదు. "తిట్టరా తిట్టు" అంటూ నుదురు మీద ముద్దు పెట్టుకున్నాడు.

"గెలిచావనుకుంటున్నావేమో... ని... న్ను... ని... న్ను..."

"ఊఁ, నన్ను కొట్టు మరి!" ఆమె చెయ్యందుకుని చెంప మీద చరుచుకున్నాడు. ఆమె కళ్ళలోకి చూసి నవ్వాడు.

సంధ్యకి మత్తుగా ఉంది. ఇంకేమీ మాట్లాడాలని లేదు. అలా నిద్రపోవడం కోసమే రాజా ఎదురుచూస్తున్నాడు. సంధ్య నిద్రపోయాక, కాళ్ళు సరిజేసి, గాఢంగా నిట్టూర్చి దూరంగా జరిగిపడుకున్నాడు.

***

ఓ వారం రోజులు జబ్బు పడింది సంధ్య. ఈలోగా పనిపిల్ల మానేసింది. పనితో, పిల్లలతో ఉక్కిరిబిక్కిరైంది. రాజా సాయపడుతున్నా కూడా ఇంటి పని ఒత్తిడి తప్పలేదు. అలా ఉక్కిరిబిక్కిరి అవుతున్న టైమ్‌లో ఒకసారి సుమిత్ర వచ్చింది.

"మేడమ్! మీకేమీ ఒంట్లో బాగోలేదట, రోజూ హాస్పిటల్‌కి వెడుతున్నారట" అంది దయగా.

తనకేం తెలుసుండదనే నమ్మకమే ఇంకా ధైర్యం చేస్తోందా?

సుమిత్రని పరీక్షగా చూసింది. వయస్సువల్ల ఆకర్షణీయంగా ఉంది గాని, పెద్ద అందగత్తె కాదు. స్వోత్కర్ష కాకపోతే బహుశా ఆ అమ్మాయి కన్నా తనే అందంగా ఉంటుందేమో.

సుమిత్ర చీపురు పట్టుకుని ఇల్లు ఉడవడం ప్రారంభించింది. సంధ్య గాభరాగా

– "అదేవిటీ?" అంది.

"పర్వాలేదండీ.  మా ఇంట్లో నాకు పని అలవాటే. పెద్ద కుటుంబం కదా! మీరలా కళ్ళు మూసుకుని పడుకోండి. చిటికెలో అంతా చేసేస్తాను." అంటూ కొంగు దోపుకుంది.

"సుమిత్రా, దయచేసి నువ్వు వెళ్ళిపోతావా?" ఆ మాటలు సంధ్య గొంతు దాటి బయటకు రావడం లేదు. ఎన్నెన్నో చదివి, చూసిన తను సుమిత్ర మీద నోరు చేసుకోవడం ఎందుకు? తన ఫ్రెండ్ దుర్గ – ఇలాగే పెళ్ళయి, పిల్లలున్న వాణ్ణే చేసుకుంది. ఇదే ఊళ్ళో ఉండడం వల్ల తరచూ కలుస్తునే ఉంటుంది. దుర్గని సానుభూతిగా అర్థం చేసుకున్న తను సుమిత్రని ఏమనగలదు?

"కాఫీ తీసుకోండి" చిరునవ్వుతో అందించింది సుమిత్ర. ఆమె ముఖం ఆనందంగా  ఉంది.

తను నోరు చేసుకుంటే ఆ ముఖం ముడుచుకుపోయి, ఆ కళ్ళు బెదిరి అపరాధభావంతో వణికిపోతూ ఏడుస్తుందేమో. మగవాళ్ళకి చిక్కేది ఇలాంటి స్టూడెంట్లే. లెక్చరర్లకీ, స్టూడెంట్స్‌కీ అఫైర్స్ కొత్త కాదు. తెలిసీ తెలియని వయస్సు.

కాఫీ తాగే లోపల పిల్లలకి స్నానాలు చేయించి తీసుకొచ్చింది. ఇంతలో రాజా మందుల పాకెట్‌తో వచ్చాడు. 'వద్దు వద్దు' అనుకుంటునే సుమిత్ర వైపు చూసింది సంధ్య. పిల్లలకి బట్టలు తొడుగుతున్న సుమిత్ర మొహంలో రాజాని చూడగానే వచ్చిన వెలుగుని ఆమె కళ్ళు పసిగట్టాయి. అంతా తమాషాగా ఉంది. సుమిత్రకి తన నీరసం మీద సానుభూతి కన్నా ఈ ఇల్లన్నా, రాజా అన్నా ఎంతో ఆపేక్ష. అందుకే ఆ కళ్ళు సంతృప్తితో మెరుస్తున్నాయి.

పిల్లలకి వేయమన్నట్టుగా రాజా పౌడరందించాడు. రాజాని, సుమిత్రని, పిల్లలని చెంపకి చెయ్యి చేర్చి అలాగే చూస్తున్న సంధ్యకి మనసంతా శూన్యంగా అనిపించి, అసలీ అనుబంధాలు, నాదీ అనుకునే పిచ్చి ఊహలు అంతా నాటకం! తను బ్రతికుండగానే ఇంకో మనిషిని వెతుక్కున్నాడు. అసలీ ఇంటికి తన అవసరమేముంది? – అన్న భావన కలిగి విరక్తిగా అందరినీ చూడసాగింది.

టాబ్లెట్స్ తీసుకొచ్చి, "సుమిత్రా, మంచినీళ్ళు పట్రా" అన్నాడు.

సుమిత్ర తీసుకొచ్చింది.

మంచినీళ్ళ గ్లాసుతో సుమిత్ర, చేతిలో టాబ్లెట్స్ ఉంచుకుని రాజా – పాపం, వీళ్ళిద్దరూ తను ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. అసలు ఏ నిద్ర మాత్రలో ఇచ్చేసి తన అడ్డు తొలగించుకోగూడదా?

ఆ అమ్మాయి భయస్తురాలట. ఎంతో సున్నిత మనస్కురాలట. తనకీ విషయం

తెలిసిందనగానే హడలిపోయి ఎందులోనన్నా దూకనన్నా దూకగలదట ఇలా అని రాజా చెబుతున్నాడు. ఆ అమ్మాయి యూనివర్సిటీకి వెళ్ళేవరకూ తను ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయట. రాజా అభిప్రాయం ఇలా ఉంది. తనకేం తెలీదనే భరోసా వల్ల ఆ అమ్మాయి ఈ ఇంట్లో ఇంత చలాకీగా తిరుగుతోందా? ఈ అనుబంధం పట్ల ఆ అమ్మాయి చాలా కాన్షస్‌గా ఉంది కదా! జీవితాంతం అలా తన కన్ను కప్పి రాజాతో ఎలా బ్రతుకుతుంది? సంధ్య నవ్వుకుంది.

సుమిత్ర వంట కూడా చేసేసి – "ఇంక వెళతాను మేడమ్!" అంది సంధ్య దగ్గరకొచ్చి.

"చాలా థాంక్సమ్మా! భోజనం చేసి వెళ్ళు" అప్రయత్నంగా అంది సంధ్య.

"వద్దు మేడమ్!"

"నన్ను మేడమ్ అని పిలవద్దులే సుమిత్రా. సంధ్య గారూ అను. సంధ్యా అని పిలిచినా పరవాలేదు."

సుమిత్ర ఏమీ మాట్లాడలేదు. చిన్నగా నవ్వింది.

రాజా ఏదో రాసుకుంటున్నాడు. "అవును సుమిత్రా. సంధ్యకీ నీకూ ఆరేళ్ళు మాత్రమే తేడా" అన్నాడు.

"తేడా గురించి కాదు కదా! సుమిత్ర మనకి బాగా కావలసిన మనిషి. అందుకే అలా పిలవమంటున్నాను."

ఈ మాటలకి ఇద్దరూ తల దించుకున్నారు. ఎందుకో సంధ్యకి వాళ్ళిద్దరి మీద చెప్పలేనంత జాలేసింది. ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు. అన్నాలు తిన్నాక, సుమిత్ర గిన్నెలన్నీ కడిగి బోర్లించింది. "వస్తాను సంధ్యగారూ!" అంది వెళ్ళడానికి సిద్ధపడుతూ.

"గుడ్." సంధ్య నవ్వింది.

"అవసరముంటే కబురు చెయ్యండి."

"తప్పకుండా."

"మందులు జాగ్రత్తగా వాడండి."

"రాజా ఉన్నారుగా" నవ్వుతూ సంధ్య రాజా వైపు చూసింది.

రాజా అవుననట్టు నవ్వాడు.

"పాపం, ఈ వారమంతా రాజా నా కోసం ఎంత శ్రమపడి ఉంటాడంటే – కన్నతల్లి కూడా అంత సర్వీస్ చేయలేదు." – సంధ్య మాటల్లో మామూలుతనం మాయమై అతిశయోక్తి, ఉడికించే ధోరణి వచ్చాయి.

సుమిత్ర తల వంచుకుని నిలబడింది.

"అసలు సుమిత్ర ఓ వారం ఇక్కడే ఉంటే నీకు చాలా రెస్టు దొరుకుతుంది సంధ్యా!" రాజా అన్నాడు.

రాజాని వంగదీసి 'నోర్మూస్తావా, లేదా? నోర్మూస్తావా, లేదా?' అని దబదబా దెబ్బలు వేయాలనిపించింది సంధ్యకి. హద్దులు దాటినవారికి ఉచితానుచితాలు తెలియవు. కోపం అణుచుకుంటూ, "సుమిత్రా, మీ ఇంట్లో మరీ ఆంక్షలెక్కువ కదా! మా గురించి నువ్వేమీ రిస్క్ తీసుకోవద్దు." అంది కచ్చితంగా.

సుమిత్ర మనస్సులో ఏమనుకుంటుందో తెలియదు ఇద్దరికీ. 'వెళ్ళొస్తానని' చెప్పి నిష్క్రమించింది.

ఆ సాయంత్రం ఓపిక చేసుకుని తెలిసిన వాళ్ళింటికి వెళ్ళి ఓ ముసలమ్మని కుదుర్చుకుని వచ్చింది సంధ్య. అప్పటికి గాని శాంతపడలేదు ఆమె మనసు.

రోజులు గడుస్తున్నాయి. అసలు ముందు ముందు తన కార్యక్రమమేమిటో నిర్ణయించుకోనివ్వడం లేదు రాజా. తన మాటలతో బంధించేస్తున్నాడు. ఆ అమ్మాయి యూనివర్సిటీకి వెడితే చాలు, ఆ తరువాత ఏదో ఒక ఉద్యోగంలో చేరేలా చూసి, పెళ్ళి చేసేస్తానంటున్నాడు. పదే పదే తన హృదయ వైశాల్యాన్నీ, మంచితనాన్ని పొగుడుతున్నాడు.

అసలు తనది కూడా చాలా తప్పుందేమో! రాజాని ఓ పసి పిల్లవాడిలా అన్నీ కనిపెట్టి చూస్తే ఇలా ఇంకోచోట ప్రేమని వెతుక్కునేవాడు కాదేమో.

ఈ పురుళ్ళతో, పిల్లలతో రాజాని చాలా నెగ్లెక్ట్ చేసిన మాట వాస్తవం. రోజులు గడుస్తున్న కొద్దీ అతని మీద కోపం తగ్గి, తనను తాను విమర్శించుకోడం ఎక్కువైంది సంధ్యకి. అందుక్కారణం రాజా చాలా శ్రద్ధగా, కంటికి రెప్పలా తనని చూసుకోడమే. తనని సంతోషపెట్టడానికి అహర్నిశలు శ్రమ పడడమే.

అసలు తన ఒప్పుకుని, తనతోనే కలసి ఉండాలనే ఖర్మ రాజాకేం పట్టింది? అవతల గొప్ప ఆరాధనతో, ప్రేమతో, గ్రాడ్యుయేట్ అయిన అమ్మాయి రడీగా ఉంది. రేపు సునాయసంగా పిజీ కూడా పూర్తి చేస్తుంది. అయినా తన అవకాశాలు కాదనుకుని, తన కోసమే తాపత్రయపడుతున్నాడంటే, రాజా ప్రేమలో కల్తీ లేదు. క్రమక్రమంగా తనని తాను సముదాయించుకుంటూ మామూలుగా తిరిగే ప్రయత్నం చేయసాగింది సంధ్య.

సంధ్యలో వస్తున్న మార్పుకి రాజా ఎంతో సంతోషించాడు. పనమ్మాయి కూడా దొరకడంతో ఇద్దరూ హుషారుగా సినిమాలకీ, షికార్లకీ తిరగసాగారు. ఒకసారి ఇద్దరూ కలసి సన్నగా పడుతున్న తుంపరలో నడిచొస్తుంటే, ఓ షాపు మెట్ల మీద

నిలబడ్డ అరుణ, సుమిత్ర కనబడ్డారు. ఇప్పుడు సుమిత్రని చూస్తుంటే మనస్సు మునుపట్లా కలవరపడడంలేదు. పాపం పూర్ గర్ల్ – అనిపిస్తోంది.

"ఏమ్మా బావున్నారా?" అంది ఆప్యాయంగా.

"నా పెళ్ళి సెటిలైంది మేడమ్." అంది అరుణ.

"మరి పి.జీ. చెయ్యవా?"

"చేస్తాను. ఆయన కూడా వైజాగ్‌లోనే ఇంజనీరు." అరుణ సిగ్గుపడుతూ అంది.

సుమిత్రతో కూడా రెండు ముక్కలు మాట్లాడి రాజాతో కలసి నడుస్తూ వెళ్ళిపోయింది. ఇంటికి రాగానే పాప బిక్కమొహంతో ఎదురొచ్చింది.

"ఎక్కడి కెళ్ళావ్?" అంది కోపంగా.

"షికారుకి" ఎత్తుకుంటూ అంది.

"నన్నూ, తమ్ముణ్ణి వదిలేసి షికారుకా..." పాప గింజుకుంది.

"రేపు నిన్నూ తీసుకెడతాగా?" ఎత్తుకుని లోపలికి నడుస్తూ అంది. బాబు నవ్వుతూ ఎదురొచ్చాడు. వెనకాలే రమ వచ్చింది.

"హాయ్ రమా, బావున్నావా?" అంది చేయి పట్టుకుని.

"ఎంతసేపూ నేను రావడమే గాని నువ్వు రావుగా?" నిష్ఠురంగా అంది రమ.

"ఇప్పుడు మా ఇల్లు మీ ఇంటికి దగ్గరేగా! తప్పకుండా వస్తా. ఏమిటి కబుర్లు? అంతా బావున్నారా?" రమ పక్కనే కూర్చుని విశేషాలు అడిగింది.

రమ, సంధ్య స్కూలు ఫైనల్ వరకూ కలిసి చదివారు. వెంటనే రమకి పెళ్ళయిపోయింది. మళ్ళీ ఇదే ఊరికి రమ భర్త ఉద్యోగరీత్యా రావడం వల్ల అడపాదడపా కలుస్తున్నారు.

"మీరు ఇల్లు కట్టుకున్నారని చెప్పావుగా. తప్పకుండా వస్తాను."

"సంధ్యా, నాకేదయినా ఉద్యోగం చూసి పెట్టవే. లేదా నీకు తెలిసినవాళ్ళ దగ్గరికైనా పంపించెయ్యి." రమ మళ్ళీ పాత పాటే పాడడం మొదలుపెట్టింది.

"ఎలా మరి? మీ ఆయన ఉద్యోగం చేయనీయడంటావ్. పిల్లల్ని వదలడంటావ్. నువ్వు వాళ్ళని వదిలి బయటకు రాలేవు."

"దానికి ఉద్యోగం ఉంది కాబట్టే మా ఆయనకంత మోజు. ఇప్పుడు గుంటూరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. రోజూ ట్రెయిన్‌లో వెళ్ళొస్తుంటుందిలే. దాన్నయితే శ్రద్ధగా స్టేషన్‌కి వెళ్ళి వెంటబెట్టుకుని తీసుకొస్తుంటారు. ఏమైనా ఈ రోజుల్లో ఆడవాళ్ళకి

సంపాదన లేనిదే విలువ లేదే" అంది రమ.

"నిజమే. కాని మొగుళ్ళు - సంపాదించే ఆడవాళ్ళని కూడా మోసగించరని నమ్మకం లేదు."

"మోసగించినా నా అంత అధ్వానంగా ఉండదు వాళ్ళ పరిస్థితి. నా సంగతే చూడు. సరిపడా కట్నమిచ్చి, పెళ్ళి చేసుకున్నాను. ముగ్గురు పిల్లల్ని కన్నాను. వాళ్ళతో పాటు అత్తామామలకి, వచ్చి పోయే వాళ్ళకి చాకిరి చేస్తూ మోటుబారిపోయాను. నేనంటే మోజు తీరిపోయింది మా ఆయనకి. ఎంచక్కా ప్రేమించి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. పక్క పోర్షన్‌లోనే తీసుకొచ్చి పెట్టాడు - ఆ మాయలాడిని."

"అలా ఎందుకు ఒప్పుకున్నావు?" తెల్సిన విషయమే అయినా మళ్ళీ అడిగింది సంధ్య.

"ఏం చేయను? నాకు డబ్బు లేదు. ఉద్యోగం లేదు. మంచి క్వాలిఫికేషన్ లేదు. ఆడపిల్లల పెళ్ళి చేసి, మా అమ్మా నాన్నా కూడా ఆరిపోయారు. నన్నూ, పిల్లల్ని పోషించే శక్తి లేదు వాళ్ళకి. అయినా ఈ దుర్మార్గుడు పిల్లల్నివ్వడు. వాళ్ళ నొదిలి నేను బయటకు రాలేను." రమ కన్నీళ్ళు పెట్టుకుంది.

సంధ్యకే సలహా చెప్పాలో పాలుబోవడం లేదు. రమలాంటి వాళ్ళది చాలా క్లిష్టమైన పరిస్థితి, విషవలయం.

"మా అత్త కూడా కొడుకుకే సపోర్టు. ఆ అమ్మాయి సహకారం లేనిదో ఇల్లు పూర్తయ్యేది కాదట. ఇల్లు కట్టమని నేనేడ్చానా సంధ్యా? నన్ను దారుణంగా అవమానిస్తున్నారు వాళ్ళు. అయినా అస్తిపాస్తుల కోసం సవతిని తీసుకురమ్మని ఏ ఆడదైనా అంటుందా?"

"రమా! నువ్వెప్పుడూ మీ ఇంటి విషయాలే ఆలోచిస్తుంటే నీకు పిచ్చెక్కుతుంది. నువ్వు ధైర్యం చేస్తే కొంతవరకు మనం పరిష్కారం వెతకచ్చు. నువ్వు ముందుకు రానిదే ఏ స్నేహితులు ఏమీ చెయ్యలేరు." ఓదారుస్తూ అంది సంధ్య.

"ఆ విషయం నిజమే" అంగీకరించింది రమ. చాలాసేపు మాట్లాడుకొన్నాక, రమని సాగనంపడం కోసం రోడ్డు వరకూ వెళ్ళింది సంధ్య.

రాజా ఎక్కడికి వెళ్ళాడో, కాంపౌండ్‌లో స్కూటర్ లేదు. వెళ్ళేముందు రమ అంది "మీ ఇద్దర్నీ చూస్తుంటే కన్నుల పండుగగా ఉంటుంది సంధ్యా. నీ స్నేహితులకెంతో విలువిస్తారు మీ ఆయన. అదే మా ఇంట్లో అయితే నా తరపు మనుషులతో కబుర్లు చెప్పుకోడానికయినా స్వేచ్ఛ లేదు."

"స్వేచ్ఛ వాళ్ళివ్వరు, మనం పోరాడాలి."

“ఏ ఆయుధాలు లేకుండా పోరాడితే అవతలి వాళ్ళదే పైచేయి అవుతుంది సంధ్యా!” రమ తెలివిగా అన్న మాటలకు సంధ్య మెచ్చుకోలుగా చూసింది.

“ఏది ఏమైనా నువ్వు చాలా అదృష్టవంతురాలివే సంధ్యా. మీ ఇంట్లో ముద్దొచ్చే ఆడపడుచువి, మీ ఆయనకి రెండో ప్రాణం నువ్వు. హాయిగా, దర్జాగా ఉద్యోగం చేసుకుంటున్నావు. నీ అంత అదృష్టవంతు లెవరూ ఉండరమ్మా. నేనూ ఉన్నాను మొద్దులా బ్రతుకుతూ...” అని “బస్సొచ్చింది. ఒకసారి ఇంటికి రా..” అంటూ రమ చేయి ఊపి బస్సు ఎక్కింది.

రమ గొడవంతా విన్నాక ‘నిజంగా నేను చాలా అదృష్టవంతురాల్ని’ అనుకుంటూ ఇంటికి నడిచింది. ఆ రాత్రి తన కాళ్ళు నొక్కుతూ మౌనంగా కూర్చున్న రాజాని చూస్తుంటే – ‘నిజంగానే నేను చాలా అదృష్టవంతురాల్ని’ అనుకుంది మనసులో. ఏమీ తోచకపోతే సంధ్య కాళ్ళని ఒళ్ళో పెట్టుకుని కాలి వేళ్ళు లాగుతూంటాడు లేదా నీరసంతో పడుకుందని తోస్తే కాళ్ళు పడుతుంటాడు.

రాజా ఏదో ఆలోచిస్తున్నాడు. రమ విషయం అతనికి చూచాయగా తెలుసు. ఏదైనా అడుగుదామా అనుకుని, అసలే నానా గొడవల్లో ఉన్నాడు. ఇప్పుడొద్దులే – అనుకుని ఊరుకుంది.

రాజా చేతులు అసంకల్పితంగా నొక్కుతున్నాయి. చూపు లిక్కడ లేవు. గంభీరంగా ఉన్నాడు.

# 4

"రాజా!"

"ఊc."

"ఏవిటాలోచిస్తున్నావు?

"ఏం లేదు సంధ్యా."

"చెప్పవా?"

"అంతా స్వయంకృతాపరాధం. నువ్వా హాలహాలం మింగినట్టు అంతా మింగి నన్ను భరిస్తున్నావు!"

రాజా గొంతులోంచి బరువుగా వచ్చాయి ఆ మాటలు. ఆమె చెయ్యి కళ్ళకీ, పెదిమలకీ తాకించుకుని వదిలాడు. సంధ్యకి వాత్సల్యం పెల్లుబికింది. లేచి అతన్ని హృదయానికి హత్తుకుని – "ఏంటమ్మా?" అంది బుజ్జగింపుగా.

వేడి కన్నీరు ఆమె పమిటని తడుపుతోంది.

మళ్ళీ ఏమయింది?

"రాజా!" అంది కుదుపుతూ.

రాజా ఆమె ఒళ్ళో పడుకుని జీరగా – "చెబుతాను" అన్నాడు.

అతని జుట్టు నిమిరుతూ వినడానికి సిద్ధంగా ఉన్నానన్నట్టు చూసింది.

"నా మీదా, సుమిత్ర మీదా అనుమానం కలిగేడట్టు ఎవరో చెప్పారు. ఊహూc, మేం హైదరాబాద్ వెళ్ళినప్పుడు సుమిత్రకి వరసకి అన్నయ్య అయిన ఒకతను మమ్మల్ని చూశాడు. అప్పట్నించీ ఇంట్లో గొడవలేనట. ఆ పిచ్చిపిల్ల ఇంతకాలం దాచి ఇంకేవేవో చెప్పింది. మొన్న కర్ర తీసుకుని గొడ్డుని బాదినట్టు బాదారట."

వింటున్న సంధ్యకి ఒళ్ళు గగుర్పొడిచింది. తనూ, రాజా హాయిగా నీతిమంతుల్లా బ్రతుకుతూ ఉంటే పిల్ల మాత్రం దెబ్బలు తింటోంది. ఆ అమ్మాయికి రక్షణ లేదు.

"నీకెలా తెలిసింది?" అనుమానంగా అంది.

"వాళ్ళ ఫ్రెండ్ నళిని ఇందాక కనిపించి చెప్పింది. ఆ అమ్మాయికి కొంతవరకూ ఈ వ్యవహారం తెలుసు."

"ఈ అమ్మాయి వైజాగో, గుంటూరో వెళ్ళాలంటే కనీసం రెండు నెలలు పడుతుంది. ఈలోపల ఎలాగో తెలియడంలేదు. పనికిమాలిన సంబంధాలు చూపించి పెళ్ళి చేసుకోమంటున్నారట. ఈ అమ్మాయి అందుకు ఒప్పుకోదు."

"ఇప్పుడెలా రాజా?" సంధ్యకి కూడా చాలా బాధనిపిస్తోంది. ఎంత హింసిస్తున్నరో గదా ఆ పిల్లని?

"నందిగామలో నా ఫ్రెండొకడున్నాడు. నేనిదివరకు ఈ విషయం చెబితే – "అంత అవసరం అయితే ఓ రెండు నెలలు మా ఇంట్లో ఉంచు, నేనేదో కథ అల్లి చెబుతాను. అంతేగాని పొరపాటున కూడా మీ ఇంటికి తీసుకెళ్ళి చెల్లాయి ఉసురుపోసుకోకు." అన్నాడు.

తనెప్పుడూ చూడని ఆ స్నేహితుడికి మనసులో ఎన్నో కృతజ్ఞత లర్పించింది సంధ్య.

రాజా విచారంగా అన్నాడు – "వాడు కూడా ప్రస్తుతం ఊళ్ళో లేడు. ఈ అమ్మాయి పరిస్థితి ఇలా ఉంది. రోజులు బావుండక ఆ అమ్మాయి ఏదైన అఘాయిత్యం చేసుకుంటే ఈ జీవితమంతా నన్ను నేను క్షమించుకోలేను సంధ్యా."

సంధ్యకి ఈ పరిస్థితి చాలా ఘోరమయిందనిపించింది. "పోనీ వాళ్ళ స్నేహితులెవరి ఇళ్ళలోనన్నా ఉండమను."

"స్నేహితులంతా ఇంకా పూర్తిగా స్వతంత్ర్యం లేని అమ్మాయిలు. ఏ తల్లిదండ్రులు ఉదారంగా ఆలోచించి ఇంట్లో పెట్టుకుంటారు చెప్పు? పైగా ఆ అమ్మాయిదీ ఇదే ఊరాయె."

నిజమే అన్నట్టు సంధ్య తలూపింది. తన సంసారంలో అపస్వరాలకి ఆ అమ్మాయి బలైందా అనిపిస్తోంది. తాము శ్రుతులు సరిజేసుకున్నారు, మరి ఆ అమ్మాయి గతి?

"అనవసరంగా నిన్ను కూడా బాధ పెడుతున్నాను సంధ్యా. నిద్రపో. నేను చేసిన తప్పుకి ఇలా మథనపడాల్సిందే" పక్కమీదకి ఒరుగుతూ నిట్టూర్చాడు.

సంధ్య రాజా తరపున నిలబడి ఆలోచిస్తోంది.

ఏమీ తోచడం లేదు. ఓ మానవత్వమున్న మనిషిగా అతన్ని ఈ పరిస్థితుల్లో అతని బాధలు అతన్ని పడనీయ్ – అని కామ్‌గా ఊరుకోగలదా? స్త్రీ సమస్యల గురించి అనర్గళంగా ఉపన్యాసాలిచ్చిన తను – కాస్తో కూస్తో కమ్యూనిస్టు సిద్ధాంతాలు ఆచరణలో పెట్టాలనే తాపత్రయమున్న తను – ఇప్పుడేం చేస్తుంది? ఉత్తమ ఇల్లాలుగా 'ఎవరేమయితే నాకెందుకు, నా కాపురం నిలబడింది. చాలు' అన్నట్టు నిశ్చింతగా బ్రతుకుతుందా? ఓ అమ్మాయి కన్నీటిలో తను అంతరాత్మను సముదాయించుకుని బ్రతక్కగలదా? రాజా భార్యగానే ఉండదలిస్తే రాజా నైతిక జీవితం పట్ల తనకి మాత్రం బాధ్యత లేదు?

"సంధ్యా!"

"ఊఁ."

"నిద్రపోవడం లేదా?"

"రావట్లేదు."

"కొంచెం టీ తాగుదామా?"

లేచి టీ తయారు చేసి తీసుకొచ్చి అతనికో కప్పు ఇచ్చి, తనూ సిప్ చేయసాగింది. ఇద్దరూ ఒకే విషయం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఎంతకీ ఆలోచనలు తెగడం లేదు.

"సంధ్యా! నువ్వు పెద్ద మనసుతో ఒప్పుకోగలిగితే నిన్నొకటి అడుగుతా" రాజా సంధ్య పమిట చెంగు చేతికి చుట్టుకుంటూ.

సంధ్య గుండె దడదడలాడింది. ఏమడుగుతాడు? ఇక్కడే ఆశ్రయం ఇమ్మంటాడా? తనకి జాలెక్కువని రాజా కోరరాని కోరికలు కోరుతాడు. శక్తికి మించిన త్యాగాలు చేయమనడు కదా!

"ఒకవేళ... ఒకవేళ... అవసరమైతే ఒక్క నాలుగు రోజులు షెల్టర్ ఇవ్వగలవా? ఆ నాలుగు రోజులు నేనెక్కడికయినా పోతాను."

"మీ కాలేజీ మూడు రోజుల్లో తెరుస్తారు గదా? నువ్వెక్కడికి వెడతావ్?" జాలిగా చూసింది.

"మాధవరావు ఉంటే చాలా బాగుండేది. ఫ్రెండ్స్ ఎంతో మందున్నా ఇటువంటి సమస్యని అందరిముందూ పెట్టలేం. ఏదో పెళ్ళికెళ్ళాడట. వచ్చేస్తే వైజాగ్ వెళ్ళేవరకూ వాళ్ళింట్లో ఉంటుంది."

"ఈ నాలుగు రోజులూ ఎలాగో ఓపిక పట్టమను." తను కూడా అవకాశవాదే అని తనని తాను తిట్టుకుంటూ నెమ్మదిగా అంది సంధ్య.

"ఎలా? అసలే మాట చెప్పడానికైనా వీలవడం లేదు. నా కొలీగ్ చంద్రం కూడా ఏమేమో చెత్తగా వాళ్ళ నాన్నతో చెప్పేశాడట. ఆ అమ్మాయికి కష్టాలు ఎక్కువయ్యాయి."

"పోనీ నే వెళ్ళనా వాళ్ళింటికి? నన్నేమీ ఈ విషయాలేవీ ఆ అమ్మాయితో కదపొద్దాంటావు." నిజాయితీగా అంది సంధ్య.

"నువ్వా? వాళ్ళింటికా? ఛాఛా వద్దమ్మా!" కృతజ్ఞతగా చూస్తూ అన్నాడు.

సంధ్య మౌనంగానే ఉండిపోయింది. కాని ఆ మౌనం ఆ మర్నాడు సుమిత్రని

చూడగానే పటాపంచలైంది. సుమిత్ర వచ్చిన టైంలో రాజా లేడు. ఎన్నెన్నో అడుగుదామని తమాయించుకుని మాములుగా కూరగాయలు కోసుకుంటూ పరామర్శించింది. కత్తి పీట తీసి, కూరగాయల గిన్నెతో నిలబడేసరికి ఏడుస్తూ సుమిత్ర కనిపించింది.

"అయ్యో, సుమిత్రా! ఏమయిందమ్మా?"

"ఆ చంద్రం మాస్టారు నా మీద పగబట్టినట్టు చాలా చెప్పారండీ." కళ్ళు తుడుచుకుంటూ అంది.

"అతని కెందుకంత కోపం?"

"అతను డిపార్ట్‌మెంట్‌లో ఓసారి వెకిలిగా ప్రవర్తించబోతే తిట్టానని ఇలా చేశాడు."

"ఛా ఛా! ఏం మగవాళ్ళు? అందరిక్కీ ఒకటే బుద్ధి. ఆడదనుకుంటే చాలు ఏదో ఓ రకంగా దొరికించుకుందామనే. తోడేళ్ళు."

"వెడతాను సంధ్యగారూ! పొద్దుబోతే అసలే మా ఇంట్లో చాలా అనుమానం. టైప్‌కని చెప్పి ఇలా వచ్చాను." సుమిత్ర నడిచింది.

ఆ క్షణంలో తను రాజా భార్యనని పూర్తిగా మర్చిపోయింది సంధ్య. పాపం, రాజా కనబడతాడేమోనని ఎంతో ఆశగా వచ్చుంటుంది. భరించలేనంత నిరాశతో వెళ్ళిపోతోంది.

"సుమిత్రా!" పిలిచింది.

సుమిత్ర ఆగి వెనక్కు తిరిగింది.

సంధ్య తడబడింది. ఏం చెప్పాలో తెలియడం లేదు.

"ఏవిటి సంధ్యగారూ? బహుశా మళ్ళీ మిమ్మల్ని చూస్తానో లేదో అనిపిస్తోంది. పరిస్థితులలా వచ్చాయి."

'నాకంతా తెలుసు సుమిత్రా! నీ బాధ నేనర్థం చేసుకోగలను' అని ఓదార్చాలనిపించింది. ఆ తరువాత తమ ఇద్దరి సంభాషణ రోతగానో, అసహజంగానో ఉండొచ్చు. చాలా చీప్‌గా అనిపిస్తోంది ఊహిస్తేనే.

"సుమిత్రా! మరీ దారుణమైన పరిస్థితులే వస్తే నువ్వు ఏమీ సంకోచించకుండా మా ఇంటికొచ్చెయ్. అంతేగాని పిచ్చి పిచ్చి పిరికి నిర్ణయాలు తీసుకోకు."

సుమిత్ర దిగ్భ్రాంతిగా చూసింది. ఆనందం దాచుకుంటూ – "నేనో శని గ్రహాన్ని. ఎందుకు మేడమ్ నా మీద మీకు దయ. నా వల్ల ఎవరూ ఇబ్బంది

పడకూడదు" అంది తల అడ్డంగా తిప్పుతూ.

కేవలం తను మాటన్నందుకే సుమిత్ర కళ్ళలో ఎంత రిలీఫ్ కనబడిందో సంధ్య దృష్టిని దాటిపోలేదు. అవధులు మించిన ఆర్ద్రతతో, "నిజం సుమిత్రా! నువ్వు బ్రైట్ స్టూడెంట్‌వి. తప్పకుండా యూనివర్సిటీకీ వెళుదువుగాని. ఎటూ తోచని పరిస్థితి వస్తే మా ఇంటికి వచ్చెయ్. ఆ ఆత్మహత్యల్లాంటి పిచ్చి పనులొద్దు. మీ స్టూడెంట్స్‌కి అసలే ఆవేశం ఎక్కువ."

సుమిత్ర మొహమాటంగా నవ్వుతూ – "మిమ్మల్ని మర్చిపోను మేడమ్! నావల్ల మీరెవ్వరూ ఇబ్బంది పడకుండా ఉండాలనేదే నా ప్రయత్నం." అని చేతులు జోడించి వెళ్ళిపోయింది.

తను నోరు జారలేదు కదా? ఒకవేళ నిజంగానే ఆ అమ్మాయి వచ్చేస్తే తను సహృదయంతో చూడగలదా? 'ఏవిటో ఈ గుంట చిక్కు' అనుకుంటూ నిస్త్రాణగా మంచం మీద వాలిపోయింది.

***

రెండు రోజులు ప్రశాంతంగా గడిచాయి. కొత్తగా వచ్చిన మామ్మ చాలా మంచింది. పిల్లల్ని ఎంతో ముద్దుగా చూస్తుంటుంది. రాజాకి కాలేజీ తెరిచారు. సంధ్యకి ఇంకా తెరవలేదు.

సంధ్య ఫ్రెండ్ వాణి ఇంట్లో చిన్న ఫంక్షన్ ఉంది.

ఆదివారం పొద్దుట్టే వచ్చేయమని చెప్పింది. సంధ్య ఉత్సాహంగా నిద్ర లేస్తుండగా – అటూ ఇటూ తిరుగుతూ నీలంరంగు పూల చీరలో సుమిత్ర కనబడింది.

"ఎప్పుడొచ్చావు సుమిత్రా!" అంది కళ్ళు నులుముకుంటూ.

"ఇప్పుడేనండీ" అంది తల వంచుకుని.

వంటగదిలో మామ్మ "ఆ యమ్మ శానా చలాకీదమ్మగారా! వచ్చీ రాగానే కాఫీ కలిపేసింది, ఇడ్లీ కూడా ఏసింది" అంది. నవ్వుకుంటూ బ్రష్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళి పళ్ళు తోముకుంటూ ఊరికే వచ్చిందా, అసలే వచ్చేసిందా ఎలా అడగడం అనుకుంటూ మొహం కడుక్కుంది. ఇంట్లో కొచ్చేసరికి బాబు నెత్తుకుని పంచదారతో ఇడ్లీ తినిపిస్తోంది సుమిత్ర. సంధ్య కేమీ తోచక వరండాలోకి వెళ్ళింది. రెండు పాత సూట్‌కేసులు ఉన్నాయి. రాజా పేపర్ చదువుకుంటున్నాడు. పక్కింటామె – "చుట్టాలొచ్చారనుకుంటా నమ్మాయి" అంది పలకరింపుగా.

"అవునండీ" అనుకుంటూ వచ్చేసింది. సుమిత్రని ఏ విధంగా పరిచయం చేయాలి? ఇప్పుడు తను లోకాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి. రాజాకేమీ

చీమ కుట్టినట్టుగా లేదే, ఈవిడిలా వచ్చేస్తుందని తెలుసా? రాత్రి తనతో ఏమీ అనలేదే? తనని తాను కంట్రోల్ చేసుకుంటూ ఆ ఇద్దర్నీ టిఫిన్‌కి రమ్మని పిలిచింది. సుమిత్ర వైపు కన్నెత్తి చూడకుండా బుద్ధిమంతుడిలా టిఫిన్ తినేసి, రాజా లేచాడు. తొందర తొందరగా పిల్లల్ని తయారు చేసి, తనూ తయారై 'సుమిత్రా!' అని పిలిచింది.

వినయంగా దగ్గరకొచ్చి నిలబడింది.

"మేం ఓ ఫంక్షన్‌కి వెడుతున్నాం. సాయంత్రానికిగాని రాము. నువ్వూ, రంగమ్మా భోజనం చేసేయండి. ఏమీ వర్రీ అవకుండా హాయిగా రెస్టు తీసుకో. వెళ్ళొస్తాం మరి" అంది.

స్కూటర్‌పై పిల్లల్ని ఎక్కించి, తనూ ఎక్కుతూ సందు మలుపు తిరగ్గానే డ్రాయింగ్ రూం వైపు చూసింది సంధ్య. ఆ రూమ్ తలుపులు రోడ్డు వైపుకి ఉంటాయి. ఆ గుమ్మంలో నిలబడి తీక్షణంగా, ఆక్రోశంగా చూస్తోంది సుమిత్ర. ఆ చూపులు పాత సుమిత్రలా సౌజన్యంగా లేవు. సంధ్యకి ఫంక్షన్‌లో ఉన్నా ఆ చూపులు గుర్తుకొస్తుంటే కలుక్కుమంటోంది. పిల్లల్ని అక్కడే ఉంచేసి, ఇప్పుడే ఓ అరగంటలో వచ్చేస్తాం ఫలానా వాళ్ళని పలకరించేసి అంటూ రాజాని బయటకు తీసుకొచ్చింది.

రోడ్డుమీద జనం పల్చగా ఉన్నారు. సన్నగా తుంపర పడుతోంది. ఓ పెద్ద చెట్టు దగ్గర బస్టాపులో నిలబడ్డారు. "స్కూటరొద్దాన్నావు. వర్షం వస్తుందేమో" అన్నాడు రాజా ఆకాశం వైపుకి చూస్తూ. మోచేతులవరకూ షర్ట్ మడిచాడు. చామనచాయతో అసలు ప్రపంచంలో చెడు అనేది తెలుసా అన్నంత నిష్కల్మషంగా ఎప్పుడూ నవ్వుతూ ఆకర్షణీయంగా కనిపిస్తూంటాడు.

"ఎందుకింత హఠాత్తుగా వచ్చేసిందీ అమ్మాయి?" తీక్షణంగా చూసింది.

"తగిన కారణం లేనిదే రాదు సంధ్యా!" రాజా పక్కచూపులు చూశాడు.

"అయినా నేనూ ప్రిపేర్డ్‌గా ఉండాలి కదా. మనం సొంతింట్లో ఉండడం లేదు. మన సమస్యలు మనవే అయినా లోకంతో నిమిత్తం లేదన్నట్టు బ్రతకలేం కదా?"

"ఇప్పుడేమయింది? నువ్వు రమ్మన్నావని కాని నిన్ను ఇరకాటంలో పెట్టడం తనకిష్టం లేదని చెప్పింది. రానని కూడా చెప్పింది."

"ఎప్పుడూ?"

"మొన్ననుకుంటా?" తడబడ్డాడు.

"ఓహో! నీ పిలుపు లేకుండా ఆ అమ్మాయి వచ్చేసిందని నేననుకోను." మొహం

తిప్పుకుంది. తను ఎంత అండగా నిలబడాలని చూసినా వాళ్ళ హృదయపు లోతులు తనకి తెలియవు కదా!

"పోన్లే సంధ్యా! పొద్దుట్నుంచీ నిన్ను గమనిస్తున్నాను. ఎంత సరిపెట్టుకున్నా బాధ లేకుండా ఉండదు ఆడవాళ్ళకి. నేనంత దూరం ఆలోచించకుండా నీ సహాయాన్ని కోరాను. వెళ్ళిపొమ్మంటాలే." ఎంత దాచుకుందామన్నా అతని కంఠంలో నిష్ఠురత దాగలేదు.

తను స్ట్రిక్ట్‌గా వ్యవహరించకపోతే చాలా కష్టం అనుకుంటూ, "సరే మీ ఫ్రెండ్ వచ్చేవరకూ మనింట్లో ఉంచు. నా ఫ్రెండ్ చెల్లెలు అని చెబుతాను. నువ్వసలు ఎక్కువగా మాట్లాడొద్దు. నాకూ కాలేజీ తెరుస్తున్నారు కదా. నువ్వు లంచ్ టయిమ్‌లో ఇంటికి రావద్దు. ముప్ఫయి దగ్గర పడుతున్నాయి నీకు. ఆ అమ్మాయి కన్నా మెచ్యూర్డ్‌గా ఆలోచించాలి. దెబ్బతిన్న లేడిలా ఉన్న ఆ అమ్మాయికి మంచీ చెడూ గురించి వివేకంగా ఆలోచించే ఓపిక ఉండదు."

తన షరతులన్నింటికీ రాజా కృతజ్ఞతగా చూస్తూ తలూపడంతో అమ్మయ్య అనుకుంటూ కదిలింది.

***

"అమ్మా! ఆ గదిలో కూర్చుని ఆ యమ్మ గారెందుకో ఏడుత్తాంది" రంగమ్మ వచ్చి చెప్పింది.

సంధ్య గబగబా వెళ్ళింది. సుమిత్ర మోకాళ్ళలో తల దాచుకుంది. భుజాలు ఎగిరిపడుతున్నాయి. ఆమె ముందు పేపరు వెడల్పుగా పరిచి ఉంది. 'అధ్యాపకుడి వల్ల మోసపోయిన అభాగ్యురాలి ఆత్మహత్య' అంటూ బాక్స్ కట్టిన వార్త. పక్కనే ఓ అమ్మాయి ఫోటో. అయ్యో ఈ రోజు పేపరు హెడ్‌లైన్స్ మాత్రమే చూసి తను పడేసింది. ఈ పిల్ల ఇది చదువుతూ తనకి అన్వయించుకుంటూ ఏడుస్తోందన్న మాట.

"సుమిత్రా! నువ్వు మామూలుగా, ఉత్సాహంగా ఉంటే బావుంటుంది గాని, ఇలా ఎప్పుడూ దిగులుగా ఏడుస్తూ కూచుంటే ఎలా?" బుజ్జగింపుగా అంది.

సుమిత్ర తలెత్తింది. కళ్ళెర్రగా ఉన్నాయి.

"నీకిక్కడ బాగాలేదా?"

"మీరు దేవత లాంటి వాళ్ళు. నన్నెంతో బాగా చూస్తున్నారు."

"ఇల్లు వదిలిపెట్టానని దిగులా?"

"ఆ ఇంట్లోంచి ఎప్పుడెప్పుడు బయటపడదామా అని ఎదురుచూస్తున్నాను. రోజూ మా తమ్ముడూ, మా నాన్నా అమ్మా అందరూ దెబ్బలాడేవాళ్ళు."

"నీకిక్కడ ఇబ్బందనిపిస్తే ఇంకో రెండు రోజుల్లో రాజా ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళిపోదువు గాని. అక్కడ నీకే భయం ఉండదు. నీ వయసమ్మాయిలే ఉన్నారట. నీకు మంచి కంపెనీ."

"వద్దు వద్దు. ఇప్పటికే సిగ్గుతో చచ్చిపోతున్నాను. పిల్లిలా ఇంటింటికీ తిరగలేను. మీ ఇంట్లో సర్వెంట్‌లా ఉండమన్నా ఉంటాను. నన్నెక్కడికీ పంపకండి." సంధ్య కాళ్ళు చుట్టేసుకుని బావురుమంది.

ఈ ప్రతిపాదనకి నిర్ఘాంతపోతూ చూసింది సంధ్య. చిత్రాతిచిత్రంగా వర్తమానం తన చుట్టూ ఓ వల అల్లుతోంది. తను తెలిసి తెలిసీ చిక్కుకుపోతోంది.

"సుమిత్రా! ఏమీ అనుకోవద్దు. మనం ఆ లోపల గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం రా! ఇక్కడ మన మాటలు ఎవరికైనా వినబడతాయి." ఆమె చెయ్యి పట్టుకుని బెడ్‌రూంలోకి తీసుకెళ్ళింది. సుమిత్ర కళ్ళు తుడుచుకుంటూ రూమంతా చూస్తుంటే తను ఉదారంగా ప్రవర్తించబోయి ఈ అమ్మాయిని మరింత బాధపెట్టే పరిసరాల్లోకి లాక్కొచ్చింది అనుకుంటూ "కూర్చో సుమిత్రా" అంది.

"ఇక్కడ కూర్చుంటా లెండి." అంటూ స్టూలు మీద కూర్చుంది. డబల్ కాట్ చూస్తుంటే ఈ అమ్మాయికి బాధెక్కువవుతోంది. ఈ అమ్మాయికి చాలా బాధలున్నాయి. తను ఎన్నని తీర్చగలదు? సంధ్య దీక్షగా సుమిత్రనే చూస్తూ కూర్చుంది. అలా చూస్తూ ఉంటే అసలు సుమిత్రకి ఈ విషయం గురించి ముఖాముఖిగా మాట్లాడాలనే కోరికగా ఉండదనుకుంటా. రాజా ఉన్నంతసేపూ ఏదో పనుల్లో మునిగిపోయినట్టుగా ఉంటుంది. అతను వెళ్ళగానే సర్వం కోల్పోయినదానిలా కూర్చుంటుంది. తను పెట్టిన కండీషన్లు నచ్చినట్టు లేవు – అనే కొత్త కొత్త సందేహాలు కలిగాయి.

ఒక్కోసారి ఎంత అమాయకంగా ఉంటుందో ఒక్కోసారి ఎంత నిశితంగా మనుషుల ఆలోచనలని చదవగలదు సంధ్య. తన డౌట్స్ క్లారిఫై చేసుకోవడానికి ఆ పద్ధతిలో నాలుగైదు ప్రశ్నలు వేసింది సుమిత్రని. సుమిత్ర రకీమని సమాధానమిచ్చింది. రాజా చెప్పినట్టుగానో, లేక తను ఊహించినట్టుగానో ఈ అమ్మాయి తన కథ తెలిసిపోయినందుకు బెదిరిపోయినట్టుగా ఏమీలేదు. అసలు అలా తెలియడమే ముఖ్యమైన విషయం అనుకున్నట్టుగా కోపంతో, దుఃఖంగా, నిస్సహాయంగా ప్రవర్తిస్తోంది, మాట్లాడుతోంది.

పీలికలయిపోతున్న ఈ తెరని పట్టుకుని వేలాడడం శుద్ధ తెలివితక్కువ. ఎందుకీ ముసుగులాట?

"చూడు సుమిత్రా! రాజా నిన్ను తప్పకుండా నందిగామ పంపిస్తాడు. అసలు మీ ఇంట్లోంచి నువ్వెలా వచ్చేశావో నేను అడగలేదు. అది అప్రస్తుతం. నువ్వు

కో-ఆపరేట్ చేస్తే అన్నీ సక్రమంగా జరిగిపోతాయి.”

“నన్నెక్కడికీ పంపకండి మేడమ్!”

“పంపకుండా ఎలా కుదురుతుంది? నువ్వు నన్ను అర్థం చేసుకోవడం లేదు” కఠినంగా అంది.

“మాస్టారు నన్ను పిలిస్తేనే వచ్చాను.”

సంధ్యకి సహనం పోయింది. “సుమిత్రా! నువ్వు మరీ చిన్నపిల్ల వేమీ కావు, మనకింక ఊగిసలాట అనవసరం. రాజాకు నీకూ ఉన్న సంబంధం నాకు పూర్తిగా తెలిసిపోయిందని కూడా నీకు తెలుసు. నీ అంతట నువ్వు ఎక్స్‌పోజ్ అవడానికి ప్రయత్నిస్తుంటే ఇంక నేనేం చేసేది? అదిగో ఆ ఏడుపే వద్దు. నేనేనో ఆకాశం నుంచి ఊడిపడ్డట్టు, మీరంతా అపరాధులయినట్టు అలా చూడకు. తప్పు ఒప్పుల విశ్లేషణ కాదు. అసలింక ఎలా మనం బ్రతికితే శ్రమ లేకుండా ఉంటుంది? అదీ ఆలోచిందాలి.”

“మీరు కరుణామయులు. మీరు వింటానంటే అంతా వివరంగా చెబుతాను” కళ్ళు ఒత్తుకుంటూ అంది.

“వద్దు. నీ పుస్తకం నాకన్నీ చెప్పింది” నవ్వింది.

సుమిత్ర మొహం తెల్లగా పాలిపోయింది. “అది చదివారా?” అంది విస్తుబోతూ.

“మా ఆయన రచయిత కదా? ఏదో అటువంటిదే అనుకుని చదివాను కాని పాత్రలం మన ముగ్గురమే అయ్యాం. అందులో నువ్వు నన్ను నిందిస్తే నిందించావు గాని, ఎంతో బాగా రాశావు. అసలు అది చదవబట్టే నీ క్షోభని అర్థం చేసుకోగలిగాను. నీ పరిస్థితికి విపరీతంగా చలించాను. నాకెందుకో నీలా తెలిసీ తెలియని వయసులో కాలు జారి చిక్కులు తెచ్చుకునే అమ్మాయిలంటే చాలా జాలి. రాజా భార్యగానే కాకుండా సాటి స్త్రీగా నీ కోసం నేనేమయినా చేయగలనా అని ఆలోచిస్తున్నాను. మరి నువ్వు ఇంత మూడీగా ఉంటే నేనేం చేయగలనమ్మా?” సంధ్యకి ఆ అమ్మాయిని చూస్తున్న కొద్దీ జాలి ఉధృతమవుతోంది.

సుమిత్ర కళ్ళు వర్షిస్తున్నాయి. తనని ఎన్ని మాటలు అనడానికైనా ఈమెకి హక్కుంది. ఏమీ అనకుండా, పైగా ఓదారుస్తోంది.

“క్షమించండి! పాపిష్టిదాన్ని. మీవల్ల మాస్టారికి సుఖం లేదు, సంతృప్తి లేదు అని ఏవేవే నానా చెత్త రాశాను. మీరు కాబట్టి నన్ను అవమానించకుండా ఇంత మంచిగా మాట్లాడుతున్నారు. నేను చాలా చెడ్డదాన్ని, క్షమించండి.” సంధ్య కాళ్ళకి చుట్టుకుపోయి వలవలా ఏడవడం ప్రారంభించింది. ఆ అమ్మాయి గుండె కోత అర్థమవుతున్న కొద్దీ

సంధ్య కళ్ళ వెంబడి నీళ్ళు కారసాగాయి. ఆ అమ్మాయిని లేవదీసి తనూ కళ్ళు తుడుచుకుంది.

"సుమిత్రా! నేను స్వార్థంతో నీకీ సలహా ఇవ్వడంలేదు. సంస్కారాల కన్నా ఆకర్షణలే ఎక్కువ ప్రభావం చూపిస్తాయని మరిచి, నీలాంటి అమ్మాయిలు వస్తూ పోతూ ఉన్నా ఏమీ పట్టించుకోకుండా వదిలేశాను. నేనూ అందరి ఆడవాళ్ళలా జాగ్రత్తగా ఉండి, మా ఇంటికి హద్దులు గీచి ఉంచితే ఇటువంటి వినాశనం జరిగేది కాదు. తప్పు నాదీ ఉంది. చాలా ఉంది." సంధ్య ఆగింది. రెండు సెకండ్ల తరువాత మళ్ళీ అంది – "సంఘ నియమాలనీ, ఈ శుష్కమైన కట్టుబాట్లనీ లెక్కజేయనంత ఉధృతమైన ప్రేమే మీ ఇద్దరి మధ్యా ఉంటే తప్పకుండా మీ ఇద్దర్నీ కలిసి బ్రతకమని నేను మనస్ఫూర్తిగా చెబుతున్నాను. కాని ఏమనుకోకు, రాజా అందరి మగవాళ్ళకన్నా అతీతుడేం కాదు; నీ కోసం ఈ సంసారాన్ని త్యాగం చేయడానికి సిద్ధంగా లేడు."

"నాకు తెలుసు. మాస్టారులో చాలా మార్పొచ్చింది." తలెత్తి సంధ్య వైపు చూస్తూ పేలవంగా నవ్వింది సుమిత్ర. కళ్ళు బాగా తడిసి ఉండడం వల్ల తళతళమని మెరుస్తున్నాయి.

"మార్పంటే వాస్తవాన్ని గుర్తించి బ్రతకాలనుకుంటున్నాడు. కాని చాలామంది మగవాళ్ళ కంటే రాజా ఎంతో నయం కదూ! నువ్వు కోరినంత మేర తను అండగా నిలబడలేకపోవచ్చు గాని నీ విషయంలో చాలావరకు నిజాయితీగానే వ్యవహరించాడు, కాదంటావా?"

"నిజమే." ఒప్పుకుంది సుమిత్ర.

"ఇప్పుడు ఆవేశపు నిర్ణయాలు బంగారు భవిష్యత్తుని తారుమారు చేస్తాయి. నువ్వు బ్రిలియంట్‌వి. ఇంకా యూనివర్సిటీకి వెళ్ళాక నీ సర్కిల్ ఎంతో పెరుగుతుంది. రెండేళ్ళలో ఎన్నో మార్పులు రావచ్చు. ఈ రెండేళ్ళూ తపస్సులా భావించి, రాజాని ప్రియుడిలా కాకుండా, నీ గార్డియన్‌గా మాత్రమే అనుకుని నువ్వు చదువుకో. ఆ తరువాత కూడా నువ్వు రాజాతోనే ఉండిపోతాను అంటే నేనేమీ అభ్యంతరం చెప్పను. నీకన్నా పెద్దదానిగా, అనుభవమున్నదానిలా నీకు మంచి మార్గం చూపించాలని సలహా ఇస్తున్నా గాని, స్వార్థంతో, కుతంత్రపు టాలోచనలతో మాత్రం నీకీ సలహా ఇవ్వడం లేదు."

తను చెప్పదలచుకున్నవన్నీ చెప్పాక, సంధ్య మనసు చాలా తేలికపడింది. తను ఈర్ష్యాద్వేషాలను అవతలికి నెట్టి ఇంతసేపూ మాట్లాడగలిగింది. తను కూడా ఎప్పుడూ రాగద్వేషాలకి అతీతంగా ఉంటూ ఈ అమ్మాయిని ట్రీట్ చేయగలదని నమ్మకం లేదు. అందుకే ఇంత ఓపెన్‌గా మాట్లాడేసింది ఈ రోజు.

విషయాలు తన చేతుల్లో లేకుండా అయిపోతున్నాయి.

ఇంతలో పోస్ట్‌మాన్ ఉత్తరం తెచ్చిచ్చాడు. నిర్మల దగ్గర్నించి వచ్చిన ఆ ఉత్తరం మరింత నిస్పృహని కలిగించింది. తన భర్తకి మరింత మంచి ఆఫర్ రావడం వల్ల గల్ఫ్‌కి వెళ్ళాల్సివస్తోందని, వచ్చి చెప్పే వ్యవధి కూడా లేదనీ... సంధ్య శాంతిగా ఉండాలని పదే పదే కోరుకుంటున్నానని ముగించింది.

ఆడపడుచే కాదు, తనకి మంచి నేస్తం ఇప్పట్లో కనబడదు. తడికళ్ళతో ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుకుంది సంధ్య.

ఎదురుగా ఉన్న సుమిత్ర ఏం ఆలోచిస్తోందో తెలియదు. బుంగమూతి పెట్టుకుని అలాగే కాసేపు కూర్చుని లేచి హాల్లోకి వెళ్ళిపోయింది. సంధ్య బాబు ముద్దు కబుర్లు వింటూ తన బాధని మర్చిపోవడానికి ప్రయత్నించింది.

# 5

**కా**లేజి తెరిచారు. భయంగానే కాలేజి కెళ్ళింది సంధ్య. వేసవి సెలవుల తర్వాత స్తబ్ధుగా ఉన్న కాలేజి స్టూడెంట్స్‌తో మళ్ళీ కళకళలాడిపోతోంది. కొత్త ఎడ్మిషన్స్ కోసం వచ్చి పోయే అమ్మాయిలతో, అబ్బాయిలతో కాలేజీ ఆఫీసు రూం దగ్గర చాలా సందడిగా ఉంది.

'హలో హలో' పలకరింపులతో మధ్యాహ్నం వరకూ గడిచిపోయింది. ఒంటిగంటవుతుండగా పక్కింటి పిన్నిగారికి ఫోన్ చేసింది సిగ్గుపడుతూనే. ఆమె భర్త ఫోన్ తీశారు. "ఏమ్మా?" అన్నారు సౌమ్యంగా.

"రాజా భోజనానికి వచ్చారాండీ? కాస్త అవసరం పడింది."

"ఒక్క నిమిషం" అంటూ, "రాజ్యం.." అని ఆవిడని పిలవడం వింటూ రిసీవర్ పట్టుకుని నిలబడింది. ఈ ఎంక్వయిరీ చాలా హీనంగా అనిపిస్తోంది.

"లేదుటమ్మా. మీ పనమ్మాయి, ఇంకో పాపా ఉన్నారు. వాళ్ళెవర్నయినా పిలవనా?"

"వద్దు లెండి. థాంక్స్. ఒక వేళ రాజా గాని వస్తే నాకు ఫోన్ చేయమని చెప్పండి" ఆయనకి అనుమానం రాకుండా సంభాషణ ముగించింది.

***

"హలో మేడమ్"

ఫోన్ పెట్టేసి ఆఫీసు వరండాలోకి వస్తున్న సంధ్య తలెత్తింది. బోటనీ లెక్చరర్ రవూఫ్ నోటినిండా నవ్వుతూ పలకరించాడు. సంధ్య అయిష్టంగా నవ్వింది.

"అందరూ సెలవల్లో లావెక్కితే, మీరు మాత్రం మరీ సన్నబడిపోయారు" పై నుంచి కిందవరకూ చూస్తూ అన్నాడు రవూఫ్.

ఆ చూపులకి ఒళ్ళు మండింది సంధ్యకి.

"వస్తానండీ" అంది కదుల్తూ.

"ఇదిగో నా టికెట్. నాకో మంచి పుస్తకం సెలెక్ట్ చేసి ఉంచండి మేడం. ఇంకో గంటలో వచ్చి తీసుకుంటాను."

టికెట్ ఇచ్చాడు. రవూఫ్ ధోరణేమిటో గాని కాస్త ఎక్కువ చనువు ప్రదర్శించాలనే ప్రయత్నం ఎక్కువ. వద్దనలేక టికెట్ తీసుకుని లైబ్రరీ వైపు నడిచింది. తన ఉద్యోగం గురించి తనకెంతో సంతృప్తి సంధ్యకి. లైబ్రరీలోకి అడుగుపెట్టి ఆ పనిలో మునిగిపోవడం

ఎంతో ఆనందంగా అనిపిస్తుంది. రిజిస్టర్స్ అన్నీ ముందేసుకుని చెక్ చేసుకుంటుండగా రవూఫ్ వచ్చాడు. ఓ అరగంట రీడింగ్ రూంలోనే కూర్చుని ఏవేవో పత్రికలు చదివాడు. తరువాత సంధ్య దగ్గరకొచ్చి "తీసుంచారా?" అన్నాడు మెల్లగా.

సంధ్య నవ్వు దాచుకుంటూ శరత్ శ్రీకాంత్ ఇచ్చింది. ఇక తననెప్పుడూ సెలెక్ట్ చేయమని అడగడు అనుకుంటూ అతని వైపు చూసింది.

రిజిస్టర్‌లో సంతకం పెడుతూ, "నా సహనాన్ని పరీక్షిస్తున్నారు ఇంత పెద్ద పుస్తకంతో" అన్నాడు.

"మరి నన్నే చూసి పెట్టమంటే ఇటువంటివే ఇస్తాను" నన్నింకెప్పుడూ అడగకు సుమా అనే హెచ్చరికతో ఆ మాటంది.

రవూఫ్ ఆ పుస్తకాన్ని బితుకు బితుకుమని చూసుకుంటూ వెళ్ళిపోయాడు.

సంధ్య నవ్వాపుకుంది. ఏం మనిషో. ఇంకా కుర్రతనం పోలేదు. తనేదో చాలా బావుంటాడు అనుకుంటూ అందరూ తన మీద అటెన్షన్ చూపించాలన్నట్టు ప్రవర్తిస్తాడు. భోళాగానే ప్రవర్తిస్తాడు గానీ, తనకెందుకో ఇతనితో సంభాషణ పెంచడం ఇష్టం ఉండదు.

***

రెండు రోజులు హాయిగా ఏ మనఃక్లేశాలు లేకుండా గడిచిపోయాయి. సుమిత్ర మూడ్స్ కేమీ ప్రాధాన్యం ఇవ్వదలచుకోలేదు. ఇప్పుడు పగలంతా కాలేజీలోనే గడిచిపోతోంది కాబట్టి, సాయంత్రం ఇంటికెళ్ళి పై పై పనులు చూసుకుని పిల్లలతో గడిపేసరికి టైం ఇట్టే గడిచిపోతోంది. రాజా కూడా రాత్రి ఎనిమిది తర్వాత గాని ఇంటికి రావడం లేదు. ఇదీ మంచిదేలే అనుకుంది సంధ్య. ఒకటి రెండు సార్లు సంధ్యతో పొందు కోరబోయాడు రాజా. సంధ్య చాలా సీరియస్‌గా చెప్పింది "ఇదే ఇంట్లో ఆ అమ్మాయి ఉండగా నీతో శరీర సంబంధాల్ని అంగీకరించను. నాకు మనసొప్పదు" అని.

"ఇదేం పిచ్చి? ఆ అమ్మాయి కేవలం గెస్ట్ అని నువ్వే అంటున్నావ్ గదా!" రాజాకి కోపం వచ్చింది.

"కావచ్చు. ఆ అమ్మాయి ఏడుస్తూనే రోజులు గడుపుతోంది. నేను ఒళ్ళు మరిచి నీతో... నన్ను దయచేసి ముట్టుకోకు. ఈ అమ్మాయి ఉన్నంత కాలం.." నిష్కర్షగా చెప్పి పడుకుంది.

అర్ధరాత్రి మంచి నిద్రలో తన కోరిక తీర్చుకున్నాడు రెండు సార్లు. ఆ నిద్ర మత్తులో తిట్టుకుంటూనే ఒళ్ళప్పగించింది గాని మెలకువగా ఉన్నప్పుడు అస్సలు దగ్గరికి చేరనివ్వడం లేదు.

ఒకరోజు రాజా దూరపు బంధువులొచ్చారు. వాళ్ళు వైజాగ్ నుంచి హైదరాబాద్ వెడుతూ విజయవాడలో ఆగారు. అన్ని మర్యాదలతో మంచి ఆతిథ్యం ఇచ్చారు. సుమిత్ర కూడా చలాకీగా చకచకా తిరుగుతూ సాయపడింది. "ఎవరీ అమ్మాయి?" అన్న ప్రశ్నకి తను సిద్ధంగా ఉంచుకున్న జవాబే చెప్పింది సంధ్య. "చాలా నమ్రత గల అమ్మాయి" అని వాళ్ళు సర్టిఫికెట్ ఇచ్చారు. ఆ తరువాత వచ్చినదంతా పడకల దగ్గరే వచ్చింది. ముందుగదిలో ఆ కుటుంబానికి పడకలు ఏర్పాటు చేశారు. ఆ గదిలో సుమిత్ర మంచం పక్కనే రంగమ్మ చాపేసుకుని పడుకునేది. "ఈ రోజు పెరట్లో పడుకుంటానమ్మా" అని తను వెనకాల వైపుకు వెళ్ళిపోయింది. "హాల్లో ఈ పెద్ద కిటికీ అంటే నాకు చాలా భయం" అంది సుమిత్ర చుట్టాలందరి ముందూ.

"వద్దులే నువ్వు మా గదిలో పడుకుందువు గాని లే" అంది, వాళ్ళ ముందు ఇంకేమనాలో తోచని సంధ్య. అవతల మగాయన ఏమనుకుంటాడో అని వాళ్ళకి సెపరేట్‌గా రూమ్ ఇచ్చింది గానీ అసలీ మగాళ్ళిద్దర్నీ అక్కడ పడుకోమని చెబితే బావుండేది అనిపించింది సంధ్యకి.

"నేను దూరంగా ఈ చాపేసుకుని పడుకుంటాను మేడమ్. వాళ్ళేమో కొత్త నాకు. అయినా నేనక్కడ ఉండడం బావుండదు." అంది సంజాయిషీ ఇస్తూ సుమిత్ర.

నిజమే కదా అని సంధ్యకీ అనిపించింది.

"చాప మీదెందుకు? పర్వాలేదు, పాప పక్కకి రామ్మా." అంది పాపని జరుపుతూ.

బావుండదని సింగిల్ కాట్స్ రెండూ దూరం జరిపింది. బాబుని వేసుకుని రాజా నిద్రపోతున్నాడు. గురక సన్నగా వినిపిస్తోంది.

"వద్దండీ" అంటూ చాప మీద బోర్లా పడుకుని కళ్ళు మూసుకుంది సుమిత్ర. తలుపులు మూయకుండా తెరిచే ఉంచింది సంధ్య. ఎంత మామూలుగా ఉందామన్నా ఉండలేకపోతోంది. రాజా ఎప్పుడో నిద్రపోయాడు గాని ఈ సుమిత్ర నిద్రపోతుందని నమ్మకం లేదు. తనకీ ఎక్కడో లోపల నిక్షిప్తమైన ఉన్న భయాందోళనలవల్ల వచ్చే నిద్ర తేలిపోయింది. బెడ్ లైట్‌ను చూస్తూ కళ్ళు మూస్తూ తెరుస్తూ పడుకుంది.

ఉన్నట్టుండి సుమిత్ర చాప మీద నుంచి లేచింది. సంధ్య ఊపిరి బిగపట్టింది. బాత్‌రూమ్ కెళ్ళొచ్చి గోడకి చేరగిలబడి కూర్చుంది. సంధ్య కదలకుండా అలాగే పడుకుని గమనిస్తోంది. సుమిత్ర మళ్ళీ లేచింది.

సంధ్యకి కోపం పెరిగిపోతోంది.

సుమిత్ర చప్పుడవకుండా నడిచి టీపాయ్ మీదున్న అమృతాంజనం సీసా తీసుకుని చాప మీదకెళ్ళి కూర్చుని రుద్దుకోసాగింది.

తన అనుమానానికి తనని తానే తిట్టుకుని – అయ్యో వర్రీ ఎక్కువై ఈ అమ్మాయికి బాగా తలనొప్పి వస్తోందనుకుంటా – అనుకుంది సంధ్య. ఈ అమ్మాయి వయస్సులో తను అందరి మధ్యా పువ్వులా పెరిగింది. ఈ సుమిత్ర ఈ వయస్సుకే ఇల్లు విడిచిపెట్టేసి ఫలితం లేని సాహసాలతో ఒంటరిగా నిలబడింది. తనెంత ఓదార్చిన ఈ అమ్మాయి బాధని తీసెయ్యగలదా? సుమిత్రని గమనిస్తూ ఫీలవుతోంది సంధ్య.

ఉన్నట్టుండి వెక్కిళ్ళు పెట్టడం ప్రారంభించింది సుమిత్ర.

సంధ్య లేచి హడలిపోతూ, తలుపులు మూసి "సుమిత్రా!" అంది మెల్లగా.

సుమిత్ర చేతుల్లో మొహం కప్పుకుంది.

"ఒంట్లో బాగోలేదా?"

అవునన్నట్టు తలాడిస్తూ "కణతలు అదిరిపోతున్నాయి." అంది వెక్కిళ్ళమధ్య.

సంధ్య తటపటాయించి తనకు తాను సర్ది చెప్పుకుని, "నేను రుద్దనా?" అంది తల మీద చేయి వేస్తూ.

సుమిత్ర వెల్లకిలా పడుకుంది.

'నీకు సిగ్గుందా సంధ్యా?ఎందుకీ సేవలు?' అని అంతరాత్మ గద్దించింది.

"ఆ అమ్మాయిని ఇంట్లో పెట్టుకున్నప్పుడు తన మానాన తనని వదిలెయ్యలేను" అని దానిని నోర్మూయించి కణతలు నొక్కుతూ అమృతాంజనం రుద్దసాగింది. ఒళ్ళు వెచ్చగానే ఉంది.

"నువ్వు లేని పోని దిగులుతో జ్వరం తెచ్చుకుంటున్నావు" మందలింపుగా అంది.

"సారీ. మీరెళ్ళి పడుకోండి." సుమిత్ర పక్కకి తిరిగింది. సన్నగా ఏడుస్తూ – "అసలు మాస్టారుకి నేనేమయినా పట్టదు" అంది కసిగా.

అంత రాత్రిలో ఎక్కడో బాంబు శబ్దం విన్నట్టుగా ఉలిక్కిపడింది సంధ్య. ఇప్పుడు రాజా ప్రసక్తి తీసుకొచ్చిందెందుకూ? అడుగడుగునా కత్తి మీద సాములా ఉందే ఈ అమ్మాయితో వ్యవహారం.

పూర్వపు రోజుల్లో తన మొహంలోకి సూటిగా చూడడానికే, తనతో మాట్లాడడానికే బెదిరిపోయే అమ్మాయి ఎంత నిర్భయంగా తన ముందు అసంతృప్తిని వెల్లడిస్తోంది ఇప్పుడు. తనిచ్చిన లోకువే గదా ఇదంతా!

"దయచేసి నువ్వు నిద్రపో. అవతల చుట్టాలున్నారు. ఎవరైనా లేచి మన మాటలు వింటే బావుండదు."

ఆ అమ్మాయి వెంటనే గజగజా వణికిపోతూ, "నేనందరికీ సమస్యని.

నేనందరికీ సమస్యని. అందుకే చచ్చిపోతానని అన్నాను. మాస్టారు అడ్డుపడుతున్నారు.”

“అడ్డుపడక, చావమ్మా అని పర్మిషన్ ఇస్తారా ఎవరైనా?” విసుగ్గా అంది సంధ్య.

“నేను చస్తే ఎవరికీ నష్టం లేదు. అందరూ సుఖంగా ఉంటారు... ముఖ్యంగా మాస్టారు...” హిస్టీరిక్‌గా ఏడుస్తూ మాట్లాడసాగింది సుమిత్ర. ఇక లాభం లేదని రాజా దగ్గరికి వెళ్ళి లేపింది సంధ్య.

“ఆ అమ్మాయికి ఒంట్లో గూడా బావున్నట్టు లేదు, బాగా ఏడుస్తోంది, చూడు” అంది నిద్రలో ఆశ్చర్యంగా చూసున్న రాజాతో.

కాసిని మంచినీళ్ళు తాగి చాప దగ్గరకొచ్చి కూర్చున్నాడు. సుమిత్ర “మాస్టారు పూర్తిగా మారిపోయారు... మాస్టారు పూర్తిగా మారిపోయారు'' అంది పలవరిస్తున్నట్లుగా.

రాజా ఏమీ తోచనట్టుగా “సుమిత్రా!” అన్నాడు. సమాధానంగా ఏడుపు హెచ్చించింది.

“సుమిత్రా” ఈసారి కోపంగా పిలిచాడు.

సంధ్య నిర్వికారంగా చూస్తోంది – వీళ్ళిద్దరివల్లా తాను అల్లరిపడే సమయం ప్రారంభవుతోంది అనుకుంటూ.

“ఒంట్లో బాగోలేకపోతే ఇలా గొడవ చేస్తావా? సంధ్యని ఎదురుగా పెట్టుకుని నువ్విలా ప్రవర్తించడం ఏమన్నా బాగుందా?” రాజా అన్నాడు.

“మీరు అసలు నాతో మాట్లాడుతున్నారా? నేనెలా ఉన్నానో ఏమిటో అసలు కనుక్కుంటున్నారా?” అంది

“సంధ్య అన్నీ చూసుకుంటోంది కదా! తన మీద నమ్మకం వల్లే కదా నేను నీ యోగక్షేమాలు చూడడం లేదు” తన తప్పేం లేదన్నట్టు అన్నాడు. అతని నిద్ర మత్తు పూర్తిగా వదిలిపోయి సుమిత్ర ఏమిటి ఇలా ప్రవర్తిస్తోందనే భయం ప్రారంభమైంది.

“నాకెవరూ లేరు. నాకెవరూ లేరు. మీ అందరితోనూ విరోధం తెచ్చుకున్నాను. మీరు తప్ప నాకు ఈ లోకంలో ఇంకేమీ వద్దనుకున్నాను.” దిక్కు తోచని పసిపాప ఏడుస్తున్నట్లు “ఊఁ, ఊఁ,” అంటూ ఏడవసాగింది. ఇబ్బందిగా, నిశ్శబ్దంగా ఉన్న ఆ పరిసరాలలో ఆ రోదన రాజానీ సంధ్యనీ ఏడిపిస్తున్నట్లుగా, మనస్సుని తోడేస్తున్నట్లుగా ఉంది.

సుమిత్రకి ఆ ఏడుపు ఆపే ఉద్దేశం లేదని సంధ్యకి బాగా అర్థమవుతోంది. తన ఓదార్పు కాదు సుమిత్ర కిప్పుడు కావల్సింది! రాజా ఓదార్పు కావాలి. అందుకే

ఈ పిచ్చి ప్రయత్నమంతా. ఆ ప్రయత్నంలో విజయం సాధించేంతవరకు ఆమె ఊరుకోదు.

రాజా తెల్లమొహం వేసి, సంధ్య చెయ్యి పట్టుకుంటూ, "సంధ్యా!" అన్నాడు.

ఆ పిలుపులో వేల క్షమార్పణలున్నాయి. రోటిలో తల దూర్చి రోకటి పోటుకి వెరవడమా అనే నైరాశ్యం మెల్లగా ప్రవేశిస్తోంది సంధ్యలో. "వెళ్ళి ఆ అమ్మాయి దగ్గర కూర్చుని కాసేపు ఓదార్చు. నేను పడుకుంటాను" అంది ఏ భావమూ ధ్వనించకుండా.

సుగ్రీవాజ్ఞలా రాజా సుమిత్ర దగ్గరకి వెళ్ళి ఆమె తల మీద చెయ్యివేశాడు. సంధ్య ఇవేవీ పట్టనట్టు, చేదు మింగుతున్నట్టు కళ్ళు మూసుకుంది.

"సుమిత్రా!" తల నిమురుతూ పిలిచాడు.

సుమిత్ర బాగవుతున్న యంత్రంలా చప్పుడు చేయకుండా కదిలింది.

"నన్ను క్షమించు సుమిత్రా! నిన్ను చాలా కష్టపెడుతున్నాను." ఈ విపత్కర పరిస్థితికీ, సంధ్య కూడా ఇందులో కూరుకుపోయినందుకూ రాజాకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

రాజా గొంతులో తడి కేవలం తనని చూసే అనుకున్న సుమిత్ర కదిలిపోయింది. "మీ కోసం ఏం చేయడానికైనా సిద్ధమే మాస్టారూ!" అంది అతని చేయి నుదుటి మీద వేసుకుంటూ.

రాజా ఇబ్బంది పడి వెనక్కి లాక్కోబోయాడు. సుమిత్ర గట్టిగా పట్టుకుంది. సంధ్య ముందు ఎందుకిలా విజృంభిస్తోంది సుమిత్ర? అతనికి అర్థం కావడం లేదు.

"నిద్రపో" అన్నాడు బుజ్జగింపుగా

"మీరిక్కడే కూర్చోండి. పడుకుంటాను"

సంధ్య పొంగి వస్తున్న కోపాన్నీ, దుఃఖాన్నీ, ఆవేశాన్నీ అదిమి ఉంచడానికి చాలా కష్టపడుతోంది. సుమిత్ర ఎందుకిలా ప్రవర్తిస్తోందో తనకి బాగా అర్థమవుతోంది. తనకీ, ఆమెకీ ఉన్న తేడానీ ఏదో రకంగా మించాలనే వెర్రి ప్రయత్నం. అందుకోసం ఉచితానుచితాలు మరచి ప్రవర్తిస్తోంది. తన వీక్ పాయింట్ బాగా కనిపెట్టేసింది.

చేసేదేమీ లేక రాజా సుమిత్ర దగ్గరే కూర్చున్నాడు. సిగరెట్ వెలిగించాడు. సంధ్య ఎంత ఏవగించుకుంటుందో? ఎంత ఏవగించుకున్నా తనని అపారమైన కరుణతో క్షమించగలిగేది ఆమె ఒక్కతే. నిద్రపోతోందో లేదో "సంధ్యా" అన్నాడు డగ్గొత్తికతో.

సంధ్య మెలకువగా ఉండే మాట్లాడలేదు. తను నిద్రపోయిందనుకుంటే సుమిత్రకి మనశ్శాంతిగా ఉంటుందేమో!

సుమిత్ర కదిలి తన తలని అతని ఒళ్ళో చేర్చి, ఒక చెయ్యి అతని మెడమీద వేసింది. రాజాకి ఆమె చొరవ చీదరింపుగా అనిపించింది. ఆ అమ్మాయి పట్ల సానుభూతి హఠాత్తుగా చాలా మెట్లు క్రిందకి జారిపోయింది. అలాగే విగ్రహంలా కూర్చుండిపోయాడు.

గుడ్డి వెలుతురులో ఆ దృశ్యాన్ని చూసున్న సంధ్యకి ఇప్పుడు ఏ భావమూ కలగడం లేదు. అన్నిటికీ అతీతంగా అయిపోయి, మానవ సంబంధాలకి దూరంగా, హృదయం నైరాశ్యపు వీధులలో ఏకాంతవాసం చేస్తోంది. ఇటువంటి దృశ్యాన్ని భరించడానికేనా ఆ రోజు అన్నయ్యతో చెంప దెబ్బలు తిన్నది? అని ఇంకా ఏ మూలో మిగిలి ఉన్న రోషపు కణాలు నిలదీస్తున్నాయి.

ఎప్పుడొచ్చాడో రాజా, చప్పుడు కాకుండా మంచం ఎక్కి పడుకున్నాడు.

***

తెల్లవార్లూ నిద్ర లేకుండా గడిపిన సంధ్య అతిథుల కోసం చిరునవ్వు పులుముకుని తలుపులు తీసుకుని బయటకు వచ్చింది. పూరీ పిండి కలిపి ముందు కూర తయారు చేసింది. పాపా, బాబూ కాళ్ళకి అడ్డం పడుతుంటే వాళ్ళకి పాల గ్లాసులిచ్చి ముందు అందరికీ కాఫీలిచ్చింది.

"ఆ అమ్మాయేది?" పరీక్షగా చూస్తూ అంది వచ్చిన చుట్టం అన్నపూర్ణ.

"జ్వరమొచ్చింది వదినా" అంది

"రాత్రేమిటో చాలా గొడవ చేసినట్టుంది. మీ అన్నయ్య మొద్దు నిద్రపోతార్లే. ఏమీ వినబడవు. నాకే ఏమిటో గడబిడగా అనిపించింది. వచ్చి తలుపు కొడదామా అనుకున్నాను గాని బావుండదని ఊరుకున్నాను" అన్నపూర్ణ ఆ బావుండదు అనే మాటని చాలా అర్థవంతంగా వాడింది.

గచ్చుని బొటనవేలితో రాస్తూ అలాగే నిలబడింది సంధ్య. ఆవలిస్తే ప్రేవులు లెక్కపెట్టగలదు అన్నపూర్ణ. సంధ్య కన్నా బాగా పెద్దది కాబట్టి మొహమాటాన్ని అవతలికి నెట్టి సలహా ఇవ్వడానికి నిశ్చయించుకుంది.

"సంధ్యా. సహాయపడొచ్చు. ఇటువంటి వ్యవహారాలు ఇంటి వరకూ రానివ్వకూడదు. ఆ అమ్మాయి మీ ఆయనవైపు కాంక్షగా చూడడం, అతని షేవింగ్ సెట్ రెడీ చేయడం, అతని బూట్లు పాలిష్ చేయడం.. ఇవన్నీ వాళ్ళిద్దరికీ ఏదో ఉందని చెప్పకనే చెబుతున్నాయి. నలుగురూ ఇంట్లో ఎలా పెట్టుకున్నావని నిన్నే ఎత్తి చూపిస్తారు. తక్షణం ఆ అమ్మాయిని పంపించెయ్యి" అంది.

ఆ విషయాన్ని మార్చి ఇంకో చెప్పడం సంధ్యకి చేతకాలేదు. "వదినా, నిన్ను

వేడుకుంటున్నాను. ఎక్కడా అనద్దు. అసలు బ్రతుకెందుకిలా అయ్యిందో తెలియడం లేదు.” ఆమె చేతులు పట్టుకుని బ్రతిమాలింది.

“పిచ్చిదానా! ఇంటింటా ఈ వ్యవహారాలుంటాయి. కాకపోతే బయటకు రావు. మగవాళ్ళు వాళ్ళ ఏడుపేదో బయటే ఏడుస్తారు.” అంది తేలిగ్గా. “ఇక్కడ చూసింది ఇక్కడే మరిచిపోతాను. ఎక్కడా అనను సరేనా?” అంది. వాళ్ళు టిఫిన్ తినేసి ప్రయాణమయ్యారు. రాజా వాళ్ళతో పాటుగా బస్‌స్టాండుకు వెళ్ళాడు.

అతను విడిచిన లుంగీ మంచం మీద పడేశాడు. ఆ హడావిడిలో సుమిత్ర వచ్చి లుంగీ మడతబెట్టి హ్యాంగరుకి తగిలిస్తుంటే సంధ్యకి ఒంటికి కారం పూసుకున్నట్టయింది. అన్నపూర్ణ మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

“నీకెందుకా పనులు? వెళ్ళి టిఫిన్ తిను” గద్దించినట్టుగా అంది.

సుమిత్ర మారు మాట్లాడకుండా వెళ్ళి తినేసి “మీ చీరేమయినా ఇస్త్రీ చేసి పెట్టాలా?” అంది.

సంధ్యకి సిగ్గనిపించింది. పాపం, తనకెక్కడ కోపం వస్తుందో అని ఈ అమ్మాయి తన వెనకాలే తారాట్లాడుతోంది. భార్యలందరిలా తను కూడా ఇక సాధింపు మొదలుపెడుతుందేమో. టైమైపోతోందని బట్టలు తీసుకుని బాత్‌రూం కెళ్ళింది. సుమిత్రని నాలుగు మాటలనడం ద్వారా తాను గతాన్ని చెరిపేయలేదు. పాత సంధ్యలాగా ‘రాజా నా మనిషి’ అని సగర్వంగా అనుకోలేదు. విరాగిణిలా మారిపోడంలో ఎంతో సుఖముంది అనుకుంటూ చీర అస్తవ్యస్తంగా ఒంటికి చుట్టుకుని సరిగ్గా కట్టుకుందామని బెడ్‌రూంలోకి వచ్చింది. అక్కడి దృశ్యం చూసి సంధ్య కళ్ళెర్రబడ్డాయి. మంచం మీద బోర్లా పడుకుని చెక్కిట చెయ్యి చేర్చి ఫోటో ఫ్రేమ్‌ని దీక్షగా చూస్తుంది సుమిత్ర. సంధ్యని చూసి కంగారు పడలేదు. పక్కకి తిరిగి పడుకుంది.

“ముందా మంచం మీద నించి లే. ఈ రూంలోకి రాకు” ఈ మాటలు గొంతులోనే ఉండిపోయాయి. చీర కుచ్చిళ్ళు పెట్టుకుంటూ ఉంటే సుమిత్ర మంచం దిగి వచ్చి కుచ్చిళ్ళు సరిజేసింది. బాగ్ సర్దుకున్నాక సుమిత్ర అక్కడ్నించి కదిల్తే గది తాళం వేద్దామని నిలబడింది. ఆ ప్రయత్నం గమనించనట్టు సుమిత్ర పాత ఫిల్మ్‌ఫేర్ పేజీలు తిప్పుతూంది.

“సుమిత్రా హాల్లోకి వచ్చి చదువుకో. రోజూ ఈ రూం లాక్ చేస్తా గదా” సాధ్యమైనంత మృదువుగా అంది.

ఏమనుకుందో పొడుగాటి జడను వెనక్కి విసిరేస్తూ వెళ్ళిపోయింది సుమిత్ర. తాళం వేసి చెప్పులు వేసుకుని బయటకు వచ్చేసరికి రాజా స్కూటరాగింది. మౌనంగా వెళ్ళి కూర్చుంది.

"సాయంత్రం సినిమా కెడదామా? ఆవారా వచ్చింది" అన్నాడు స్లోగా పోనిస్తూ.

ఆవారా వచ్చిందంటే మరోసారైతే ఎగిరి గంతేసుండేది. రాజ్‌కపూర్ పాత ఫిల్ములన్నీ విడవకుండా చూడాలని నిర్ణయించుకుందెప్పుడో. ఇప్పుడు మాత్రం "నా మొహానికి సినిమా ఒక్కటే తక్కువ!" అంది.

"అదేంటి సంధ్యా?"

"ఇంట్లో గొప్ప సినిమా చూస్తున్నా. ఇంక వేరే సినిమా ఎందుకు?" ఈసడింపుగా అంది.

రాజా ఏం మాట్లాడలేదు. కాలేజి వచ్చింది. అన్యమనస్కంగా గడిపింది. పిల్లలున్నారని గాని లేకపోతే ఇంటి కెళ్ళేదిగాదు. అక్కడికీ ఇద్దరు ముగ్గురు లెక్చరర్లు అడగనే అడిగారు 'అలా ఉన్నారే'మని. "తలనొప్పిగా వుంది. అంతే" అంది. అది ఈ మధ్యనే పెట్టిన కాలేజి కాబట్టి అన్ని డిపార్టుమెంట్స్ వాళ్ళూ సన్నిహితంగా మెలుగుతుంటారు. ఉద్యోగాల తేడాలు, హోదాల భేదాలు ఈ కాలేజి స్టాఫ్ మీద ఇంకా ప్రభావం చూపించలేదు.

లాంగ్ బెల్ అయ్యాక బయటకొచ్చి రిక్షా ఎక్కి "సూర్యపేట పోనీయ్" అంది. నాలుగు పోర్షన్స్ ఉన్న బిల్డింగ్ దగ్గర ఆపాడు రిక్షా. రిక్షా అతనికి డబ్బులిస్తుండగా ఎదురొచ్చింది దుర్గ.

"అమ్మో ఎంత మంచి రోజు. 'నీకెంత తీరిక చిక్కిందే! సంధ్యా రా! రా! నేనే మీ కాలేజికి ఫోన్ చేద్దాం అనుకుంటున్నా' తాళం తీసి కిటికీ తలుపులన్నీ తెరచి "ఆయనతో ఈ మధ్య చాలాసార్లు నీ గురించే అన్నాను. నిన్న కూడా అనుకున్నా చూడాలని. అసలిదేమిటీ, ఇంత చిక్కిపోయావు?" అంది ఆశ్చర్యంగా.

"చిక్కితే మంచిదేగా? బాగా చిక్కానంటావా?"

"విపరీతంగా చిక్కావు. కళ్ళ చుట్టూ నలుపు చారలు. అసలెంత మారిపోయావబ్బా?" మొహంలోకి చూస్తూ అంది.

దుర్గ భర్త గుర్తుకొచ్చి, "ఇప్పుడెలా ఉన్నారే మీరు? మీ ఆయన తరఫున గొడవలన్నీ సద్దుమణిగినట్టేనా?" అంది ఆమె పొట్ట వైపు చూస్తూ.

"ఆఁ, దాదాపుగా. ఈ మధ్యే ప్రమోషనిచ్చి తెనాలి వేశారుగా. శనివారం రాత్రికొస్తారు. సోమవారం ఉదయమే వెళ్ళిపోతారు. ఉండు ఏమన్నా తిందాం." అంటూ జిలేబీలు పట్టుకొచ్చింది.

"బావుంది. నెలలు నిండుతున్నదానివి నీకు స్వీట్స్ ఇవ్వాల్సింది పోయి నేనే తింటున్నా. ఏవిటింకా విశేషాలు? శేఖర్ బాగా చూసుకుంటున్నాడా?"

"శేఖర్ లేకపోతే అసలు నేనేమయిపోయే దాన్నో? నా దగ్గర అన్ని బాధలు మరిచిపోతాడని అంటూంటాడు." దుర్గ బుగ్గలు ఎర్రబడ్డాయి.

"ఆయన కేమిటమ్మా బాధలు?"

"నీకు తెలియనిదేముంది సంధ్యా! ఏ పరిస్థితుల్లో మాకు పరిచయం అయ్యిందో నీకు చెప్పాను గదా. ఒకర్ని విడిచి ఒకరు ఉండలేని పరిస్థితి వచ్చింది. అలాగే మా వల్ల ఎవరూ అన్యాయం అవకూడదని కూడా అనుకున్నాం. అందుకే ప్రతీ నెలా ఎంతోకొంత నా జీతం లోంచి శేఖర్‌కి ఇస్తుంటాను."

"మీ వల్ల ఎవరికీ అన్యాయం జరగకూడదు.. ఓహ్, ఎంత గొప్ప మాటలు మాట్లాడుతున్నావే దుర్గా" ఇంత కాలం భర్త దగ్గరా, సుమిత్ర దగ్గరా అణచి ఉంచిన కోపం అంతా స్నేహితురాలి మీదకు వదిలేయడానికి నిశ్చయించుకుంది. పైగా దుర్గ ఎలిమెంటరీ స్కూలు నించీ ఫ్రెండే. అందుకే వ్యంగ్యంగా అనేసింది జంకూ గొంకూ లేకుండా. "అతను భార్య కళ్ళుగప్పి నీతో ప్రేమ వ్యవహారం మొదలుపెట్టినప్పటి నుంచే ఆవిడ అన్యాయం అయిపోయింది. అవున్లే, మీరిద్దరూ మంచాళ్ళు కాబట్టి ఆవిడకీ పిల్లలకీ తిండీ, బట్టా, కొన్ని వసతులూ మీ జీతాలతో సమకూరుస్తున్నారు. ఆవిడ మాత్రం అంతటితో సరిపెట్టుకోవాలి కదూ!"

"నా గొడవలన్నీ నీకు క్రిందటేడే చెప్పాను కదే. నన్ను నాలుగు తిట్టి కడిగేసే అధికారం నీకెప్పుడూ ఉంది. కానీ ఇప్పుడు ఇదేమిటో నేను అతనితో సెటిలై పిల్లల్ని కనబోతుండగా నువ్వు తిట్టడానికి సిద్ధపడుతున్నావు." నవ్వుతూ స్నేహితురాలు భుజం చుట్టూ చెయ్యివేసింది దుర్గ.

"నా కడుపు రగిలిపోతోంది. ఇంట్లో వంటా వార్పూ, మొగుడి చాకిరీ, పిల్లల చాకిరీ, వచ్చే పోయే మనుషుల చాకిరి వీటన్నిటితో సతమతమయ్యే పెళ్ళాం అంటే తొందరగా మోజు పోతుంది మగవాడికి. నీలా వయస్సు మీరిన కన్యలు, ఆర్థికంగా కాళ్ళ మీద నిలబడ్డ ఆడవాళ్ళు కనిపిస్తే అప్పుడు కొత్త కథలు మొదలుపెడతారు. ఎందుకంటే మిమ్మల్ని పోషించే బాధ్యత ఉండదు కదా! పైగా బోల్డంత ఏకాంతం, కృతజ్ఞతతో పడీ పడీ మీరందించే సేవలు... ఓహ్ ఎంత హాయిగా రిలాక్స్ కావచ్చు! నీలాంటి పిచ్చివాళ్ళకి అవతలి ఆడదాని ఘోష వినిపించదు. వినపడ్డా మీ స్వార్థాల ముందు అవన్నీ తాటాకు చప్పుళ్ళే. పైగా మీ కోసం పెళ్ళాం, పిల్లల్నీ, సంఘాన్నీ గూడా ధిక్కరించి వస్తున్నాడని మురిసిపోవడం... అదేదో మీ ప్రత్యేకత అన్నట్టు గర్వపడిపోవడం..."

"నేను అలా అనుకోలేదు సంధ్యా. నేను చేసింది తప్పే నాకూ నీలాగే సరైన వయస్సులో తగినవాడు దొరికి పెళ్ళయిపోయి ఉంటే, ఇలా నలుగురిలో మాటలు పడుతూ పెళ్ళయిన వాడి అండే కావాలనుకునే దాన్నా?" మొహం మాడ్చుకుంటూ అంది.

"నువ్వు గ్రాడ్యుయేట్ కాబట్టి వచ్చేవాడు పోస్ట్ గ్రాడ్యుయేట్, లేదా ఏమీ బాధ్యతలు లేకుండా వచ్చే పెళ్ళామే లోకం అనుకునే పెళ్ళికొడుకులు. ఈ లెవెల్ నుంచి సంబంధాల వేట ప్రారంభిస్తారు. డిగ్రీ చదివిన అమ్మాయి ఏ కిళ్ళీ కొట్టు నడుపుకునే అబ్బాయినో, మోటార్ మెకానిక్‌నో లేదా స్వతంత్ర్యంగా బ్రతికే చిన్నపాటి జీవనోపాధి వెతుక్కునే కుర్రాళ్ళనో చేసుకోమను. అస్సలు చేసుకోరు. వయస్సు దాటుతుండగా ఇంకో కొంపని కూల్చడానికి మాత్రం రడీ."

"నీకేంటే! జీవితం వడ్డించిన విస్తరి." దుర్గ అంది.

"నోర్మూయ్! మా వాళ్ళు చెప్పినట్టల్లా తలూపితే నిజంగా వడ్డించిన విస్తరి ముందే కూర్చునేదాన్ని. విస్తట్లోకి అన్ని అధరువులూ, నేనే సంపాదించుకుని, వండుకుని మరీ వడ్డించుకుందామని ఎన్నో తిట్లు తింటూ, రాజాని చేసుకున్నాను. కాని విస్తరి నిండుతుండగానే ఇంకెవరో వచ్చి లాగేసుకుని... ఆకలిగా నేను నిలబడి చూస్తుంటే నన్ను పట్టించుకోకుండా..." సంధ్య కుండ భళ్ళున బద్దలైనట్టు రెండు వెక్కిళ్ళు పెట్టి చప్పున పమిట చెంగు నోట్లో కుక్కింది. కళ్ళ నుండి టప్ టప్ మని నీటి బొట్లు పడిపోతున్నాయి.

తనని తిట్టినందుకు చీమ కుట్టినట్టుగా కూడా అనిపించలేదు దుర్గకి. ఎవరి ముందూ చప్పున తేలిపోని స్వభావంతో, ఎప్పుడూ చిరునవ్వుతో మనోజ్ఞంగా కనిపించే సంధ్య ఏడుస్తోంది! ఎంత కష్టమొచ్చిందో విపరీతంగా ఏడుస్తోంది.

దుర్గ చూడలేకపోయింది. సంధ్యని ఒళ్ళోకి తీసుకుంటూ "సంధ్యా ఏమయ్యిందే? మిమ్మల్ని ఐడియల్ కపుల్ అని ఫ్రెండ్సంతా పిలిచేవారు. నీకేం కష్ట మొచ్చిందో చెప్పవా?" అంది కళ్ళు తుడుస్తూ.

"రాజా నా కన్ను గప్పి.... ఓ స్టూడెంటుతో..." సంగ్రహంగా చెప్పింది.

దుర్గ ఉగ్రురాలైంది. "ఎవతే ఆ దొంగముండ? నీ ఉసురు పోసుకుంటోంది? నేనొస్తా పద. సూట్‌కేస్ బయటకి విసిరేసి గెటౌట్ అంటాను" అంది పళ్ళు నూరుతూ.

సంధ్య దుర్గ ఒళ్ళోంచి లేచి కళ్ళు తుడుచుకుంటూ తెరలు తెరలుగా నవ్వింది. 'దీనికేం పిచ్చెక్కలేదు గదా' అనుకుంటూ వింతగా చూసింది దుర్గ.

"అందుకేనే దుర్గా నువ్వంటే నాకు ఇష్టం. తాత్కాలికంగా నీ వ్యక్తిగత జీవితాన్ని మరచి నాకు అన్యాయం తలపెట్టినవాళ్ళ పని పడతానని బయలుదేరావు. స్నేహానికి ఎల్లలూ, హద్దుల్లేవు. కొలబద్దలు లేవు.." రాగయుక్తంగా అని లేచి నిలబడి తల సవరించుకుంది.

"నీ ఇష్టం. నన్ను ఎన్నైనా అనవే. కానీ నీకు ఇటువంటి సమస్యలున్నాయి అంటే నమ్మలేకపోతున్నా" దుర్గ కాఫీ తీసుకొచ్చి అందిస్తూ అంది.

"నేనూ నమ్మలేకపోయా. ఇంకో పదేళ్ళ తర్వాత నన్ను మోసం చేసినా బావుందేది. అప్పటికి పెద్దదాన్ని అయిపోతా గదా. ఇప్పుడీ భ్రాంతి అంతా కరిగి ఇతనూ అందరిలాంటి వాడే అనే వాస్తవంతో రాజీపడడం ఎంత నరకంగా ఉందో! వెళ్ళొస్తాను."

సంధ్య గుమ్మం దాటి రోడ్డు మీద కొచ్చింది. తలుపులు దగ్గరగా వేసి వచ్చి ఆయాసపడుతూ వెనకాలే వచ్చి దుర్గ అంది "అదిగాదు సంధ్యా. వచ్చి పది రోజులైంది అంటున్నావు గదా. అసలీ గొడవంతా ఏమిటి? ఇద్దర్నీ ఎదురుగా కూర్చోబెట్టుకుని అడిగెయ్యి. నేనూ తప్పుడు మార్గంలో నడిచాను, కాదనడం లేదు. నా బ్రతుకు నే బ్రతుకున్నా. దక్కింది చాలనుకుంటున్నాను గానీ, ఆవిడ మొహం చూడడానికి కూడా సాహసించలేదే. ఇలా ఇంటి మీద కెళ్ళి కూర్చోలేదే!"

దుర్గ మాటల్లో స్నేహం, నిష్కల్మషత్వం సంధ్యకి గిలిగింతలు పెట్టాయి. తన మీద ప్రేమతో పదే పదే తాను చెడ్డదాన్నని ప్రకటించుకుంటోంది దుర్గ.

"నువ్వు లోకువగా దొరికావని నోటికొచ్చినట్లు వాగాను, సారీ దుర్గా. నా మనస్సేమీ బాగుండలేదు. పోనీ మార్పు కోసం ఎక్కడికైనా వెడదామాన్నా ఈ పిల్లల్నేసుకుని ఎవరిళ్ళ మీద పడను? ఏమిటో అసలు ఇంటికెళ్ళబుద్ధి కావడం లేదు."

"మా ఇంటి కొచ్చెయ్యి. నా దగ్గర సంకోచం ఎందుకు? నేను ఫైనలియర్ చదువుతున్నప్పుడు రెణ్ణెళ్ళు మీ ఇంట్లో లేనూ అప్పుడు?"

"వద్దులే. రోడ్డెక్కడం, అతన్ని బయటకు లాగడం నాకిష్టం లేదు దుర్గా. ఒక్కసారి ఇంట్లోంచి బయటకు రావడం జరిగితే, ఇక జన్మంతా అతనితో సంబంధాలు ఉంచుకోకూడదు అనేది నా పాలసీ. ఇలా అలగడం, కోపం తగ్గి మళ్ళీ సంసారాన్ని పునరుద్ధరించుకోవడం చాలా అసహ్యంగా అనిపిస్తాయి. వస్తాను మరి. నన్ను క్షమించు. చాలా అసభ్యంగా మాట్లాడాను. నేను మాత్రం స్వార్థపరురాలిని కానా? నేనూ ఈ రకంగా దెబ్బతిన్నాను కాబట్టి అమాంతం నీ సవతి మీద సానుభూతి కురిపించేస్తూ నిన్ను తులనాడాను. తన దాకా వస్తే గాని.... అంతేలే నేనూ అరాచకవాదినే మరి. టాటా." రిక్షా ఎక్కి చెయ్యి ఊపింది.

కాలంతో పాటుగా లౌక్యాన్నీ, కృత్రిమత్వాన్ని బ్రతకనేర్చినతనాన్ని నేర్వకుండా కాలేజీలో ఉన్నప్పటిలా, ఆనాటి సంధ్య లాగానే ఇప్పుడూ ప్రవర్తించే సంధ్యంటే దుర్గకి ప్రాణం.

సంధ్యకి రావల్సిన కష్టం గాదు అనుకుంటూ ఇంటి ముఖం పట్టింది.

# 6

"ఎక్కడికమ్మా?" అన్న రిక్షా అతని కేకతో తెప్పరిల్లింది సంధ్య.

ఇంటికింకా వెళ్ళబుద్ధి కావడం లేదు. కనిపించకుండా అదృశ్యమైతే రాజా కంగారుపడతాడా? సుమిత్ర ఆనందం దాచుకుంటూ ఓదారుస్తుందా? పాప కాసేపు వాళ్ళ నాన్నతో కబుర్లు చెప్పి పడుకున్నా, బాబు మాత్రం తన కోసం వెతుక్కుంటాడేమో! 'అమ్మా అమ్మా' అని ఏడుస్తాడేమో.

సంధ్య కళ్ళల్లో చప్పున నీళ్ళు తిరిగాయి. కళ్ళద్దుకుంటుంటే రిక్షా అబ్బాయి సానుభూతిగా "ఆసుపత్రిలో ఎవరయినా ఉండారామ్మా? ఏ ఆసుపత్రి?" అన్నాడు రిక్షా ఎటు తీసుకువెళ్ళాలో తెలియక బ్రేక్ వేస్తూ.

సంధ్య తెలివి తెచ్చుకుని అడ్రెస్ చెప్పింది. రిక్షా ఇంటి ముందు ఆగుతూ ఉండగానే రంగమ్మ బాబుని చంక నేసుకుని "అదిగో అమ్మ. ఏమ్మా! ఇంత చీకటి పడేవరకూ రావాయె. అయ్యగోరు నిన్ను ఎతుక్కుంటూ ఎల్లారు. ఎదురవలేదా?" అంది.

"తెలిసిన వాళ్ళింటికి వెళ్ళాను రంగమ్మా" అని వరండా ఎక్కుతుంటే పక్క పోర్షన్‌లోని పిన్నిగారూ, బాబయిగారు నిప్పులు కురిపిస్తూ చూస్తున్నట్టుగా అనిపించి కాళ్ళలో వణుకు ప్రారంభమైంది.

ఆశ్చర్యంగా పిన్నిగారు "రేపు చూపించుదువుగానిలే సుమిత్రా! చాలా ఓపిగ్గా చెప్పావు" అనడం, సుమిత్ర వాళ్ళ పోర్షన్‌లోంచి వచ్చి తనకన్నా ముందు ఇంట్లోకి వెళ్ళడం తృటిలో జరిగిపోయాయి. ఈ మధ్య వాళ్ళుండవలసినంత ఆప్యాయంగా వాళ్ళు లేరేమో – అనిపిస్తోంది. కాదు, కాదు అది తన న్యూనతాభావం అనుకుని సరిపెట్టుకుంటోంది. కాని సుమిత్ర వాళ్లతో స్నేహంగానే ఉన్నట్టుగా అనిపిస్తోంది.

"ఎక్కడి కెళ్ళారు మీరు? గిరిజా మేడమ్ వచ్చారు మీ కోసం." సుమిత్ర అంది.

దప్పికతో బాధపడుతున్న మనిషికి ఐస్ వాటర్ ఇచ్చినట్టుగా అయింది. "ఎక్కడుంటానన్నారు?" అంది వాచి చూసుకుంటూ. టైం ఏడయ్యింది.

"మళ్ళీ ఏడున్నరా ఎనిమిది మధ్యలో వస్తానన్నారు. టీ తీసుకోండి. ఫ్లాస్కులో పోసుంచాను." అంటూ కప్పు అందించింది.

సుమిత్ర చేతిలో కప్పు అందుకుంటూ అలవోకగా చూసింది సంధ్య. సుమిత్ర మొహం నిర్మలంగా ఉంది. నుదుట గుండ్రంగా తిలకం దిద్దుకుంది. కాటుక పెట్టుకున్న

కళ్ళు మరింత కాంతివంతంగా చక్రాల్లా కనిపిస్తున్నాయి. తెలుపు మీద ఊదారంగు చుక్కలున్న చీర కట్టుకుంది. తేటగా, స్నిగ్ధంగా ఊదారంగు కలువపువ్వులా ఉంది.

"ఆమె భోజనాని కొస్తారేమో, ఇంకేమయినా కూరలు చెయ్యాలా?"

"వంటయిపోయిందా?" పొడిగా అంది.

"సాంబారు పెట్టాను. బంగాళ దుంపల చిప్స్ వేయించాను. ఎగ్ కర్రీ చేయమంటారా?"

"ఊఁ"

సుమిత్ర ఉత్సాహంగా వెళ్ళిపోయింది. ఎక్కువమంది సంతానం మధ్య, లేమిలో పుట్టిన సుమిత్ర పని బాగా చేస్తుంది. అన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్న వంటగదుల్లో చేయడం ఇంకా ఇష్టం. అసలు ఈ ఇంట్లో అందరు పనుల గురించి తన మీద ఆధారపడితే సుమిత్రకి చాలా ఆనందంగా ఉంటుంది. కాని ఆశించిన ప్రతిఫలమే మరీ దారుణంగా ఉంది. నిర్లిప్తంగా నవ్వుకుంది సంధ్య. ఈ ఇంటినీ, సామాన్లనీ, ఇంటి యజమానినీ ఈ మనిషికి అప్పజెప్పేసి చేతులు దులుపుకుంటే ముందు జీవితం చాలా స్వేచ్ఛగా తేలిగ్గా ఉంటుందేమో అనిపిస్తోంది.

"ఎక్కడి కెళ్ళావు సంధ్యా"

రాజా చప్పుడవకుండా వచ్చి కూర్చుని అడిగాడు. పాపం అతని కేదో భయం. భయం అసలు తనని చూసి కాదేమో? తన భార్యత్వానికి ఇచ్చే విలువేమో? ఛా... అసలీ భార్య హోదా ఎవడికి కావాలి? ప్రియురాలి స్థానం ఉన్నతమైనది కదూ?

"రేపు డాక్టరు దగ్గరికి వెడదాం సంధ్యా. నువ్వు మరీ చిక్కిపోతున్నావు. చక్కనమ్మా చిక్కినా అందమే అన్నట్టు నువ్వు నాకెప్పుడూ ఎంతో అందంగా కనిపిస్తావనుకో." నవ్వుతూ చూశాడు.

కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తూ విచారంగా నవ్వింది. "ఎందుకిలా పొగుడుతున్నావు? సుమిత్ర ఇంకో పది రోజు లుండాలా ఈ ఇంట్లో?" అంది.

"ఛా... మరీ నన్ను బాగా అపార్థం చేసుకుంటున్నావు సంధ్యా, పాపం ఆ అమ్మాయికి చాలా సిగ్గుగా ఉంది మన దగ్గరిలా ఉండిపోవడం."

"నీకు దగ్గరగా ఉంటే చాలు. అది అడవయినా పార్కులాగా, నరకమైనా స్వర్గంలా ఊహించుకుని బ్రతకగలదు సుమిత్ర" విషాదంగా జోక్ చేసింది.

"నాకు స్వర్గం మాత్రం నా సంధ్యతోనే" అతను మెల్లిగా, చిలిపిగా అన్నాడు.

"ఈజిట్?" తమాషాగా కళ్ళెగరేసింది.

ఈ వ్యంగ్యాన్ని అర్థం చేసుకునే పరిస్థితిలో లేడు. అసలు వ్యంగ్యాన్ని వ్యంగ్యంగా

గుర్తించడం కూడా అతని కిష్టం లేదు. "ప్రామిస్" అన్నాడు భక్తిగా.

పగలబడి నవ్వాలనిపించింది సంధ్యకి. అలా నవ్వితే పిచ్చెక్కిందని కంగారు పడొచ్చు. రెండు చేతులు తల వెనుక పెట్టుకుని అతన్నే చూస్తూ లోపల్లోపల అనుకుంది 'పాపం నాతో స్వర్గాన్ని వదులుకోలేవు. అందుకే ఎంతో పకడ్బందీగా ప్రణయగాథని నడిపి చాలా ముందుకెళ్ళావు. నన్నీ జన్మలో వదిలిపెట్టలేని మంచి భర్తవి. అందుకే ఓ పథకం ప్రకారం మెల్లిగా ఆ అమ్మాయిని ఈ ఇంట్లో చేర్చేశావు. నీ ఆసరా ఎక్కడ పోతుందో అని ఆ అమ్మాయి వచ్చేసింది. మీ ఇద్దరు అతి మంచివాళ్ళు, అందుకే నాకు అన్యాయం చేయరుగాక చేయరు.'

"లే. లే సంధ్యా. స్నానం చెయ్యి. సుమిత్రా!" అని కేకేశాడు.

సుమిత్ర 'జీ హుజూర్' అన్నట్టు వచ్చి నిలబడింది.

"సంధ్య స్నానం చేస్తుంది – వేణ్ణీళ్ళు పెడితే."

"పెడతాను. మీకు చీరా జాకెట్టు తీసివ్వనా? ఈ రోజు ఉతికి పెట్టినవి ఉన్నాయి."

'ఎందుకమ్మా ఈ సేవలు? నువ్వు కోల్పోయిన ఆత్మాభిమానాన్ని చూస్తూ నా ఆత్మ సిగ్గుపడుతోంది. ఈ మగధీరుడు తన పట్టమహిషికి రెండో భార్యతో సేవలు చేయించుకుంటున్నాడు. నీ మనసుకీ ఎక్కడో సర్దుబాటు లభించనట్టుగా ఉంది. లేడిపిల్లలా అన్నీ చేసుకుపోతున్నావు.'

"ఏయ్ సంధ్యా! ఏమిటీ పరధ్యానం? స్నానం చెయ్యమ్మా?" చెయ్యి పట్టి లేవదీయబోయాడు.

చేయి తనకి తగలకుండా జాగ్రత్తగా లేచి సంధ్య నడిచింది. ఇంకో మనిషితో రాజా సంబంధం గురించి తను రాత్రంతా ఆలోచించి పిచ్చిదైపోతోంది. ఈ అమ్మాయికి రాజా తనకింత ట్రీట్‌మెంట్ ఆవిడ ముందే ఇస్తుంటే ఎలా ఉంటుందో? మనసు భగభగమని మండదూ? ఆమోదయోగ్యం గాని సంబంధపు ఆలోచనలతో మనసు చిన్నాభిన్నమై అందులోంచి పగ, అసూయ కుక్కగొడుగుల్లా పుట్టుకురావా? అందుకే తను ఇంత తిక్కతిక్కగా ప్రవర్తిస్తోందేమో.

అబ్బో, పెళ్ళయి పిల్లలున్న వాళ్ళని ప్రేమించడం పెద్ద రిస్క్!

చెంబుతో గోరువెచ్చని నీళ్ళు ఒంటిమీద పోసుకుంటూ నవ్వుకుంది సంధ్య. ఆ వేణ్ణీళ్ళ స్నానం వల్ల అలసట చాలా వరకూ పోయింది. ఇంకాసేపట్లో గిరిజని కలుసుకుంటాననే సంతోష తరంగం మనసుని బాగా చల్లబరుస్తోంది.

"గిరిజ వచ్చిందట" తల విప్పదీసి, పాపిడి తీసుకుంటూ అంది.

తుపాకీ గుండు మోతకి చెదిరిన పక్షిలా చూశాడు.

"ఎక్కడుంది ఆవిడ?"

"తెలియదు. మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిందిట. ఎనిమిది కావస్తోంది. మరి రావచ్చేమో?"

"మీ ఇద్దరూ రాత్రంతా హాయిగా మాట్లాడుకోగలరు. నేను సెకండ్ షో సినిమాకి పోతాను." అన్నాడు రాజా. టేబుల్ దగ్గరి కెళ్ళి గబగబా వడ్డించుకుంటూ, "నువ్వూ భోం చేసేయ్.." అన్నాడు.

అతడి ముఖ కవళికలు మారిపోయాయి. గిరిజ అతనికి రెండేళ్ళ క్రితం కొలీగ్.

ఆమె తనని హెచ్చరించడం, తను ఎంతో తేలిగ్గా, గిరిజనే మందలించడం బాగా జ్ఞాపకం. పైగా గొప్పగా, రాజాతో "చూడు నీ గురించి హెచ్చరికలు వినబడుతున్నాయి" అంది ఆ రోజుల్లో అల్లరిగా. "నీకూ నాకు మధ్య నమ్మకాన్ని ఎవరూ చెడగొట్టలేరు సంధ్యా" అంటూ తనని హత్తుకోవడం.... అబ్బా ఏమి నాటకం. అంతలోనే అప్రసన్నంగా మారిపోయింది సంధ్య. 'అసలు వీళ్ళిద్దరూ ఎంత తెలివిగా తనని ఉపయోగించుకుంటున్నారు' పళ్ళు పటపటా కొరికింది.

"సం... ధ్యా..." అంటూ పాడుతూ వచ్చేసింది గిరిజ.

"వచ్చేశావా, రా.. రా.." ఎదురెళ్ళి చెయ్యి పట్టుకుంది.

గిరిజ గబగబా మాట్లాడడం ప్రారంభించింది.

"సుమిత్రా, కాసిని మంచినీళ్ళివ్వమ్మా" అనడంతో సంధ్య బెదురు బాగా తగ్గిపోయింది.

గిరిజ చాలా ప్రాక్టికల్. వింతగా చూడడం, పనికిమాలిన ఆశ్చర్యార్థకాలు ప్రయోగించడం ఏమీ చెయ్యదు. సుమిత్ర అందించిన నీళ్ళు తీసుకుంటూ – "నేను భోజనం ఇక్కడ చేయను. ఇప్పుడే వస్తాను, నిన్ను తీసుకొస్తానని జయా వాళ్ళతో చెప్పి వచ్చాను. పిల్లలు పడుకున్నారుగా? పద మనం వెడదాం. రాజా, మీరు భోం చేస్తున్నారా? అయినా మీరూ రండి. అక్కడ మీకు తెలియని వాళ్ళెవరూ లేరు."

"వద్దు వద్దు. మీ స్నేహితురాళ్ళు హాయిగా మాట్లాడుకోండి. ఈ రాత్రికి మీ ఫ్రెండ్‌ని అక్కడే ఉంచేసుకోండి." మజ్జిగ పోసుకుంటూ అన్నాడు. అతను సూటిగా గిరిజ మొహంలోకి చూసి మాట్లాడడానికి జంకుతున్నాడు.

సంధ్య మొహం పాలిపోయింది. దూరంగా ప్రభ తిరగేస్తున్న సుమిత్ర మొహంలో సంతోష రేఖ. ఒక్క సెకండులో గిరిజకి అంతా అర్థమై – "పిల్లల్ని వదిలి సంధ్య

ఉండదు లెండి. పదకొండు పన్నెండు ఆ టైంలో ఎవరో ఒకరం డ్రాప్ చేస్తాం. లేదా మీరొచ్చినా సరే." అంది.

"వద్దులే గిరిజా, నాకూ చాలా అలసటగా ఉంది. దుర్గ తెలుసుగా నీకు? తన దగ్గరకెళ్ళి ఇందాకే వచ్చాను. రేపు నువ్వే వచ్చేయి." అంది సంధ్య.

కొన్ని గంటల ఏకాంతం ఇంకో తుఫానుని సృష్టిస్తుందీ ఇంట్లో. సుమిత్రకి ఏ అభ్యంతరాలు లేవు. రాజాతో పొందుకు తహతహలాడుతోంది.

"నేనసలు సినిమాకి పోతున్నాను. సినిమా హాల్ నుంచి వచ్చి, సంధ్యని తీసుకొస్తాను, సరేనా?" అన్నాడు వాచి చూసుకుంటూ.

సంధ్యకి కొండంత బరువు దింపినట్లయ్యింది. సంధ్య మనస్సు మరింత తేలికపడాలనే ఉద్దేశంతో సినిమా పేరు కూడా చెప్పి వీళ్ళకన్నా ముందే వెళ్ళిపోయాడు రాజా. పిల్లల్ని కూడా వరండా గదిలోనే పడుకోబెట్టి, రంగమ్మకెన్నో జాగ్రత్తలు చెప్పి, భోజనాలయ్యాక హాలుకి తాళం వేయమని చెప్పి, కేవలం వరండా గదిలోనే సుమిత్ర ఉంటుందని బాగా నమ్మకం కలిగాక, అప్పుడు గిరిజతో కలసి నడుస్తూ రోడ్డు మీద కొచ్చింది సంధ్య. నిప్పులు కురుస్తున్న కళ్ళని వీళ్ళ వేపు తిప్పకుండా ఉండడానికి చాలా అవస్థ పడింది సుమిత్ర.

"నడుద్దాం సంధ్యా. మనిద్దరం నడుస్తూ కబుర్లు చెప్పుకుని ఎంతో కాలమైంది." సంధ్య చెయ్యి పట్టుకుని నొక్కుతూ అంది గిరిజ.

"గుంటూరెలా ఉంది?"

"బావుంది."

"నువ్వెన్ని రోజులు ఉంటావిక్కడ?"

"ఇంకో మూడు రోజులు."

ట్రాఫిక్ దాటుకుని రద్దీ అట్టే లేని రోడ్డుకు తిరిగారు. పైన చందమామ వీళ్ళతో పాటు నడుస్తున్నాడు. విశాలమైన రోడ్డు ప్రశాంతంగా పడుకున్న యోధుడిలా గంభీరంగా వంపు తిరిగింది. ఎక్కడ్నించో పూల పరిమళం మోసుకొచ్చి సుతారంగా తాకి వెళ్ళింది పిల్లగాలి.

"సంధ్యా! నీ అంతట నువ్వు ఏమీ చెప్పలేవు. అయినా అంతా నాకు అర్థమైంది. నేను చేసిన ఆనాటి హెచ్చరికలకే కస్సుమని నన్ను తిట్టిన పిచ్చి సంధ్య ఇప్పుడీ ప్రత్యర్థిని ఎలా భరిస్తూ సర్దుకుపోతోందా అని ఆశ్చర్యంగా ఉంది."

విషాదంగా నవ్వింది సంధ్య. "నన్ను నేను చూసుకుంటుంటే నాకు ఆశ్చర్యంగా ఉంది." అంటూ ఈ నెలలో జరిగిన సంఘటనలను క్లుప్తంగా చెప్పింది.

“నీ ఏర్పాటు చాలా అసహజంగా, అమాయకంగా ఉంది సంధ్యా. పడగ్గది సంబంధాలున్న ఆ ఇద్దరినీ అపరిచితుల్లా ఉండాలని నువ్వు ఆంక్షలు విధించడం, వాళ్ళు కట్టుబడి ఉండడం – ఇదంతా ఎంత వరకూ సంభవం? అసలంత మానసిక దారుఢ్యమే ఇద్దరికీ ఉంటే ఇలా ఎందుకు జరిగేది?”

“రాజా చాలా పశ్చాత్తాపపడుతున్నాడు గిరిజా. ఆ పశ్చాత్తాపమే, ఆ దుఃఖమే తిరిగి అతనితో కలిసుండేలా చేశాయి.”

“మంచిది. విడిపొమ్మని నేనూ చెప్పను. ‘ఎలా భరించావు సంధ్యా?’ అని భోరుమన్నవాడు అదే మనిషిని నిత్యం నీ ఎదురుగా మసిలే అవకాశం ఇంత తొందరగా ఎలా ఇచ్చాడు? నలిగిపోతున్న నీ మనస్సు గురించి అతనికేమయినా రీజనబుల్ థింకింగ్ ఉందా? ఛా. స్వార్థపరుడు!” గిరిజ ఆవేశపడింది.

రాజాని మూడో మనిషి తిడుతుంటే భరించడం పెద్ద బాధ. రాజా బలహీనుడే కాని దుర్మార్గుడు కాదు. తనకి అందని రీజనింగ్ ఏదో గిరిజ మాటల్లో తొంగిచూస్తోంది. యథాశక్తి గిరిజకి రాజా పట్ల సాఫ్ట్ కార్నర్ ఏర్పడేలా సంధ్య వాదించింది.

జయా వాళ్ళ ఇల్లు దగ్గర పడుతోంది. లైట్లు వెలుగుతూ కనిపించాయి. చాలా మంది అటూ ఇటూ తిరుగుతూ కనిపిస్తున్నారు. “మీ ఆయన్ని సులభంగా క్షమించేసి పతివ్రతలాగా ‘నాథా ఇంకేమీ సెలవిస్తావ’ని చిరునవ్వుతో సేవలు చేసుకుంటున్నావా?” సంధ్య చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది గిరిజ.

“నేనెంత రిజర్వ్‌డ్‌గా, కఠినంగా ఉంటున్నానో నమ్మలేవు.” సగర్వంగా అంది సంధ్య.

ఇద్దరూ లోపల కెళ్ళేసరికి ‘హలో’ అంటూ అందరూ పలకరించారు. రవూఫ్‌ని అక్కడ చూసి ఆశ్చర్యపడింది సంధ్య.

జయకి పిల్లల్లేరు. దంపతులిద్దరికీ స్నేహితులన్నా, ప్రోగ్రామ్‌లన్నా చాలా ఇష్టం. స్వంత ఇల్లు, మంచి అభిరుచులు. అందుకే ఎప్పుడూ వచ్చిపోయే వాళ్ళతో సందడిగా ఉంటుందా ఇల్లు.

‘ఇంకెవరో మిత్రుడితో కలసి వచ్చా’ నని రవూఫ్ చెప్పాడు. గిరిజని అతనికి పరిచయం చేసింది సంధ్య. జయ చెమట అద్దుకుంటూ వచ్చి నవ్వింది సంధ్యని చూసి.

“గిరిజ వచ్చేసరికి మళ్ళీ పాత ఫ్రెండ్సందరూ వాలిపోతారు, అచ్చు వలసపోయిన పిట్టల్లాగానే!” చమత్కారంగా అంది జయ.

కాసేపు ఈ మాటలూ ఆ మాటలు చెప్పుకున్నాక గిరిజ సైగతో సంధ్య అక్కడ్నించి మేడమీదకి వెళ్ళింది. కింద అందర్నీ భోజనాలకి లేవమని పిలుస్తోంది జయ. వీళ్ళిద్దరికి మాత్రం పదింటివరకూ మేడ దిగనవసరం లేదని పర్మిషన్ ఇచ్చేసింది.

మేడ మీద కొబ్బరాకుల నీడ పడే చోట కూర్చున్నారిద్దరూ.

"చెప్పు సంధ్యా. ఆ అమ్మాయి యూనివర్సిటీకి వెళ్ళేవరకూ మీ ఇంట్లో షెల్టర్ ఇచ్చానంటావు. పోనీ నా దగ్గరకయినా పంపకపోయావా? నేను గుర్తుకురాలేదా?"

"నిజమే, కానీ సెలవల్లో నువ్వెక్కడుంటావో" అని, "అయినా ఈ బరువంతా నీకెందుకులే అని" జీరగా అంది.

"ఎవరి సహాయం లేకుండా ఈ సమస్యని నువ్వొక్కదానివే పరిష్కరించుకోగల ననుకోవడం మూర్ఖత్వం కాదా?"

కింద ఒక్కసారే గొల్లుమని నవ్వులు వినబడ్డాయి. సంధ్య చాలా సేపు మౌనంగా ఉండిపోయింది. గిరిజే మళ్ళీ అందుకుంది.

"నువ్వేదో నీ భర్తని రక్షిస్తున్నా ననుకుంటున్నావు గానీ, కొంతమందికైనా ఈ విషయం తెలిసిపోయిందని నా నమ్మకం. ముఖ్యంగా మా లెక్చరర్స్ కొంతమందికి. ఆ అమ్మాయి ఫ్రెండ్స్ కొంతమందికి. ఆ అమ్మాయి మీ ఇంట్లో రెండో భార్యగా ప్రవేశించిందనే అనుమానం ఉంది."

"అసంభవం! ఎన్ని షరతుల మీదో నేను ఉండడానికి ఒప్పుకున్నాను." అపనమ్మకంగా తలూపింది సంధ్య.

"షరతు లేవిటి పిచ్చిదానా? కాపలా కాస్తే ఇంకేమీ జరగకుండా చూసుకోగలవేమో గాని వాళ్ళిద్దరి మూగప్రేమనీ, సందేశాలని నువ్వేం అరికడతావ్? పైగా అతడు దక్కడేమో అనే భయం వల్ల ఆ అమ్మాయి ఎంత మోహావేశంతో ఉంటుందో? నాలుగు రోజులని వచ్చి, పది పదిహేను రోజులు గడిపేసింది. నీ ఇంట్లో హక్కుదారిణిగా, భాగస్వామిగా ఉండడానికే ఆ అమ్మాయి ఎక్కువగా ప్రయత్నించవచ్చు. పైగా ఇది గోల్డెన్ ఛాన్స్. తనని రెండవ భార్యగా ప్రకటించుకోడానికి ఆ అమ్మాయి తన ప్రయత్నాలు తాను చేస్తూండవచ్చు. నేను మీ ఇంట్లో అడుగుపెట్టేసరికి గుమ్మంలో కూర్చుని పక్కింటి వాళ్ళతో గలగలా నవ్వుతూ మాట్లాడుతోంది. అంటే చుట్టూ ఉన్న మనుషులకి తన ఉనికిని సరైన అర్థం చేసుకోవాలనే తాపత్రయం ఉండడం సహజమే కదా. నువ్వు కూడా ఆ అమ్మాయి మీద కోపం తెచ్చుకోకు. రక్షణ తక్కువవడం వల్ల – నటన, కుత్సితం, బండ తెగింపు అన్నీ వస్తాయి. పైగా మన దేశంలో ఆడవాళ్ళకి అక్రమ సంబంధాల వల్ల ఎన్నెన్ని చిక్కులు, ఎన్ని అవమానాలు?"

సంధ్య ఆకాశం వైపు చూస్తూండిపోయింది. తన అనుమానాలకి సరైన భాష్యం చెబుతోంది గిరిజ.

గిరిజ వాత్సల్యంగా సంధ్య జడని తన చేతిలోకి తీసుకుని సవరిస్తూ, జడ చివర్లు తిప్పుతూ అంది – "ఇలా జరగడం అనేది మాత్రం ఏమీ ఆశ్చర్యకరం కాదు. కళాకారులకి సాంఘిక నియమాలకి లోబడే తత్వం ఉండదు. మేధావులు, డాక్టర్లు, గొప్ప గొప్ప పదవులలో ఉన్నవాళ్ళు కూడా ఈ క్రాస్ రోడ్స్ వైపు వెళ్ళక తప్పడం లేదు. కాకపోతే మనం నమ్మిన మగవాడు మాత్రం ఇంకో ఆడదాన్ని ముట్టుకోలేడు, మిగిలిన వాళ్ళంతా ఎలా ఉన్నా సరే అనే స్థిరమైన అభిప్రాయాలతో ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకుంటున్నాం. ఉద్యోగాల పేరుతో ఇంకో సమాజంతో నేరుగా సంబంధాలు ఏర్పరుచుకుంటున్నాం. ఈ కొత్త స్వతంత్ర్యపు జీవితంలో ఇటువంటి సమస్య లెదురైతే ఎంతో స్వతంత్ర్యంగా ఫీలవుతాం. చదువులేని మాములు గృహిణి మీద పెత్తందారుగా ఉంటూ 'నా ఇష్టం, ఉంటే ఉండు, లేకపోతే పో' అనే మగాడు, మనలాంటి ఉద్యోగినుల దగ్గర అవే డైలాగ్స్ ఉపయోగించలేడు. క్షమార్పణలతో, పశ్చాత్తాపాలతో మనం నడవబోయే స్వతంత్ర్యపు మార్గాలని మూసివేయడానికి ప్రయత్నిస్తాడు."

సంధ్య ప్రశంసగా చూసింది. "ఎంత బాగా వివరించి చెబుతున్నావ్? నాకన్నా ఏ రెండో మూడో ఏళ్ళు సీనియర్‌వి నువ్వు. కాని ఎంతో అనుభవజ్ఞులు, వయస్సు మళ్ళిన వాళ్ళు చెబుతున్నట్లు చెబుతున్నావు."

"ఇది ఇంకొకరి సమస్యే అయితే ప్రతీ కోణాన్నీ జాగ్రత్తగా పరిశీలించి నువ్వూ చెప్పవచ్చు. స్వంత సమస్యల్లో సెంటిమెంట్లే పనిచేయడం వల్ల సరైన అనాలిసిస్ ఇచ్చుకోవడం కుదర్దు. ఆవేశపడతాం."

"గిరిజా, అసలిదంతా నా తప్పేనేమో! నా ఆపసోపాలతో, చికాకులతో అతన్ని పట్టించుకోవాల్సినంతగా పట్టించుకోలేదు. పైగా ఏ సమస్యకైనా అతను కేర్‌లెస్‌గా అనిపిస్తే వాదం వేసుకునేదాన్ని. ఉద్యోగంతో, పిల్లలతో, చాకిరీతో అలసి ప్రతీ మాటకీ బాగా రియాక్టయ్యేదాన్ని."

గిరిజ తదేకంగా చూసి "భేష్" అంది.

సంధ్య నవ్వబోయి గిరిజ సీరియస్‌నెస్ చూసి ఆగింది.

"ఎందుకలా ప్రవర్తించావో నువ్వే కారణాలు వెదుకుతూ, అందుకే 'పాపం... నా భర్త' అంటూ సమర్థించుకోబోతున్నావు. అతనితో పాటు సమానంగా సంపాదిస్తున్నా కూడా. నువ్వు చెప్పిన సమస్యలన్నీ సంసారంలో నీ ఒక్కదానికే సంబంధించినట్లుగా చూస్తూ, ఆలోచిస్తూ అతని సంతృప్తిని సహృదయంతో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నావు. పిల్లల్ని కనే ఒక్క ప్రకృతి ధర్మం మినహాయించి మిగిలినవన్నీ ఇద్దరూ డీల్ చేయాల్సినవి కాదా! పనిమనిషి రాకపోతే పుట్టెడు బెంగ నీదే గానీ రాజాది

కాదు. పిల్లల చాకిరీ అంతా నీదే గాని రాజాది కాదు. పిల్లలు సరిగ్గా పెరగకపోయినా నీదే బాధ్యత."

"లేదు. పిల్లలంటే బాగా ఇష్టమే... అప్పుడప్పుడు వాళ్ల పనులన్నీ ఏమీ చీదరించుకోకుండా తను కూడా..."

"మిగిలిన మగవాళ్ల కన్నా నయం కాబట్టి అప్పుడప్పుడు చేసేవాడు. కానీ ఎప్పుడూ చేయాల్సింది నువ్వే కదా! కాన్పులతో నీరసించి సాయంత్రమయ్యేసరికల్లా ఎటూ పోకుండా 'పిల్లలు పిల్లలు' అంటూ ఆత్రంగా పరిగెత్తుకొచ్చే ఆడదానికి అసలు చాలా కాలం తన స్వంత అభిరుచులు, స్నేహితులూ, తన కంటూ ఇష్టంగా రిలాక్సయ్యే అవకాశాలు అన్నీ ఎగిరిపోతాయి. ఇన్ని పనుల మధ్య, ఒత్తిడుల మధ్యా కూడా తన మొగుడికి అన్నీ వేళకి అమర్చగలనా – పక్కలో సుఖపెట్టగలనా లేదా – అనే బెంగలు పోవు. భార్య సంపాదనతో ఆర్థికంగా నిశ్చింతగా బ్రతికే మొగుళ్ళకి మిగిలిన చాకిరీలతో, సమస్యలతో అసలు సంబంధం ఉండదు. ఆందరు ఆడవాళ్ళలాగానే, పాపం, మగవాళ్ళు, వాళ్ళకేం వస్తాయి – అని జాలిపడకు. పెళ్ళయ్యేవరకూ నీలాంటి యువతులు మాత్రం వంటల గురించీ, ఇంటి పనుల గురించీ, పిల్లల పెంపకం గురించీ బాగా ట్రైనింగయి వస్తారా? అతనికెంత కొత్తో నీకూ అంతే కదా? మీ ఇద్దరి సంసారంలోంచి పుట్టుకొచ్చిన సమస్యలకి బరువూ, బాధ్యత నీది మాత్రమే అనే అజ్ఞానంలోంచి బయటపడు ఫూల్."

గిరిజ తిడుతుంటే సంధ్యకి ఆనందంగా ఉంది. ఓ మూడు గంటల క్రితం దుర్గని తను బాగా తిట్టింది. ఇప్పుడు తనలో లెథర్జీకి గిరిజ చివాట్లేస్తోంది.

"బావుంది." నవ్వుకుంటూ, "కాని గిరిజా, స్త్రీ పురుష సంబంధాలలో ఇన్నిన్ని తేడాలున్నప్పుడు, అసమానత లున్నప్పుడు వ్యక్తిగతమైన ఆరోపణలతో పరిష్కారాలు ఎలా వెదుకుతాం? పెట్టుబడీదారీ వ్యవస్థలో స్త్రీలు ఉత్పత్తి సాధానాలుగా మాత్రమే ఉంటున్నప్పుడు, స్త్రీల సహనాన్ని, మంచితనాన్నీ, బానిసత్వాన్నీ వ్యాపారస్తుడు వ్యాపార ప్రకటనలు చేసినట్లుగా కీర్తిస్తూ, ఆకాశానికెత్తేస్తూ, స్త్రీల వెనుకబడినతనాన్ని కేష్ చేసుకుంటూంటారు మగవాళ్ళు. సమాజ స్వరూపమే పూర్తిగా మారనంతవరకూ చదువుకుని ఉద్యోగాలు చేసినా ఆడవాళ్ళ స్థితిగతుల్లో మార్పులుండవు. ఇంటి బానిసత్వపు చాకిరీలో విమోచన ఉండదు. కాకపోతే ఉత్పత్తి రంగాలలో పాత మెషీన్లకు బదులు కొత్త మెషీన్స్ వాడినట్టుగా సాంకేతిక రంగంలో వస్తున్న అభివృద్ధిని పెంచే ఆధునిక యంత్రాలను వాడినట్టుగా ఈ చదువుకున్న స్త్రీలు ఉపయోగపడుతున్నారు."

గిరిజ ప్రేమగా చూసింది. "సంధ్యా, ఎంత బాధని దిగమింగినా ఈ కొద్ది

కాలంలోనే నువ్వెంతో ఎదిగావనిపిస్తుంది నాకు. నీ ద్వారా ఈ మాటలు వినాలనే నేనసలు వాదం పెంచాను. కాబట్టి రాజాని నీ స్వంత ఆస్తిగా భావించడం మానెయ్యి. నీ మీద నాకు పూర్తి విశ్వాసం ఉందనుకో. అయినా హెచ్చరిస్తున్నాను. ఆ అమ్మాయిని సినిమాల్లో లాగా అతి మంచితనపు ముసుగేసుకుని ప్రేమించక్కర్లేదు కాని, అసలు ద్వేషించకు. తప్పు పట్టకు, తిట్టకు."

"మూడో మనిషి ప్రవేశాన్ని చీదరిస్తూ అందరూ మాట్లాడుతారు గిరిజా. ఆ అమ్మాయిని ఏమీ అనకు అని నువ్వు హెచ్చరిస్తుంటే నాకెంత ఆనందంగా ఉందో. నీలాంటి సంస్కారవంతురాలు నా ఫ్రెండయినందుకు.."

"సంస్కారం పెంచుకునే కొద్దీ విశ్లేషణ ఎక్కువవ్వాలి. మనవి అనే తీపి స్వార్థాలు తగ్గిపోవాలి. ఓ రకంగా సోషలిస్ట్ ఎప్పుడూ ఫిలాసఫర్ లక్షణాలనే పుణికిపుచ్చుకుంటాడు. దృక్పథాలు వేరు అంతే."

జయ వచ్చి, "మీ ఇద్దరిదే ఆలస్యం. భోజనాలకి రండి" అని కేకవేసింది.

లేచి నిలబడ్డారు. కింద ఉన్న స్నేహితులంతా వెన్నెల బావుందంటూ పైకి వచ్చారు.

మెట్లు దిగుతుండగా అంది గిరిజ – "ఎప్పుడో ప్రాజెక్టు కడతారు. నీటి సౌకర్యాలు ఎక్కువ అవుతాయని ఎవరూ నీటి వనరులు లేకపోయినా అలాగే బ్రతకాలి అనుకోరుగా. ఏదో మార్గంలో నీళ్ళు పుట్టించుకునే ఏర్పాట్లు చేసుకుంటారు. జీవితమూ అంతే. పరస్పర నిందారోపణలు, మోసాలు, ప్రేమలు ఇవి ప్రతి సంసారంలోనూ ఉంటాయి. పెళ్ళయిన పాతికేళ్ళ తరువాత ఇంకో పెళ్ళి చేసుకునే మగవాళ్ళు కూడా ఉంటారు. అసలీ సంసారాల్లో భద్రత గురించి నమ్మకాలు అక్కర్లేదు. నీకు అనుకూలమైన దారిని చూసుకుని నువ్వు ప్రతిఘటించినా తప్పులేదు. సమాజం తీరు ఇంతే అనుకుంటూ, రాజా చేసిన తప్పులన్నీ నెత్తి మీదకి వేసుకోలేవు కదా! ఆ అమ్మాయిని కన్విన్స్ చేసే ముందసలు వాళ్ళింటికి పంపే ఏర్పాట్లు చేసెయ్యి. నువ్వు వెంటనే చేయాల్సిన పని ఇది. పీ.జీ.లో చేరేవరకూ అనుకుని ఇంకా ఉంచకు."

సంధ్య బుద్ధిమంతురాలిలా తల ఊపింది. ఇద్దరూ భోజనం చేస్తుండగా పైనుంచి గజల్ ఒకటి వినిపించింది.

"ఎవరా పాడేది?" ఉత్సాహంగా అడిగింది సంధ్య.

"రవూఫ్ అని మీరు పనిచేస్తున్న కాలేజీలోని లెక్చరరు కదా!" జయ అంది.

"అతనా?"

"ఉహూ కాదు. అతని స్నేహితులెవరో. రవూఫ్ మా హజ్బెండ్‌కి బాగా పరిచయమే. మాటల సందర్భంలో మీ గురించి చాలా మంచి సర్టిఫికెట్ ఇచ్చారు."

జయ స్నేహంగా నవ్వి సాంబారు వడ్డించింది. తొందర తొందరగా భోజనాలు ముగించి పైకి వెళ్ళారు.

"ముఝే తుమ్ నజర్ సే గిరా తో రహేహో ముఝే తుమ్ కభీ భీ భూల్ న సకోగే"

అతనెవరో అతి ప్రశాంతంగా హాయిగా పాడుతున్నాడు. ప్రతి గజల్ సంధ్యని కుదిపేస్తోంది. గజల్ అర్థాలని తెలుసుకోగలిగే వాళ్ళు, సంతోషాతిశయాలతో తెగ చప్పట్లు కొడుతూ ఇంకా పాడించుకుంటున్నారు.

రాజా రావడంతో ప్రోగ్రాం మధ్యలోనే లేచి అందరి దగ్గరా సెలవు తీసుకుంది సంధ్య.

# 7

“రాత్రి మీరు తొందరగా వెళ్ళిపోయారు గాని, ఆ తరువాత మా ఫ్రెండ్ ఎన్ని మంచి పాటలు పాడాడో”

రవూఫ్ ఎప్పుడు వచ్చిందీ చూడలేదు. తెలుపు నలుపు చారలున్న ఫుల్ హాండ్స్ షర్ట్ మీది నుంచి పైకి చూపు ప్రసరించింది. ఇదివరకటి కుర్రతనం, ఆడవాళ్ళతో మాట్లాడాలనే తాపత్రయం ఆ కళ్ళల్లో లేవు. ఆ చిరునవ్వులో గౌరవం, ఆ చూపుల్లో ఇదివరకు లేని నైర్మల్యం ఇప్పుడు కనిపిస్తున్నాయి.

“ఈమధ్య మీరు పుస్తకాలు బాగా చదివేస్తున్నారు” టేబుల్ మీద పెట్టిన పుస్తకాలు చూస్తూ అంది.

“అవునండీ. ఇదివరకు పుస్తకాలు చదవడమంటే ఎంత బద్ధకమో! కష్టపడి ‘శ్రీకాంత్’ చదివాక నాకు ఇంకే పుస్తకం చదవాలన్నా చాలా ఈజీగా అనిపిస్తోంది. కనీసం వారపత్రిక చదవడానికి కూడా బద్ధకించేవాణ్ణి. ఇప్పుడు, ఎంత మంచి సాహిత్యం మిస్ అయ్యానా ఇంతకాలం అని విచారిస్తున్నాను.”

“పర్వాలేదు, ఇప్పుడు మాత్రమేం? ఇంకా పెళ్ళయినా కాలేదు మీకు.” చనువుగా అనేసింది.

“వయస్సు తక్కువ ఉందనుకుంటున్నారా? ఇరవయ్యైనిమిది.” విచారిస్తున్నట్టుగా అన్నాడు.

నవ్వి, “ఏం కావాలో చూసుకోండి” అంది రాక్స్ వైపు చూస్తూ.

“మీ వారు రచయిత అని కూడా విన్నాను. మీరే ఇంకో రెండు మంచి పుస్తకాలు చెప్పండి మేడమ్.”

“అయితే శరత్ సాహిత్యం అంతా మన దగ్గరుంది కదా! అదే పూర్తి చేసెయ్యండి.” ఇంకెవరో రిటర్న్ చేసిన సంపుటాలు రెండు చూపించింది.

“నన్ను బాగా పరీక్షిస్తున్నారు. నాలాంటి మట్టి బుర్రలకు ఈ రచయితల లోతు, వాళ్ళ దృక్పథం తెలియాలంటే ఎంత కష్టమో?”

ఎప్పుడూ ఇకిలిస్తూ అదోరకంగా కనబడే రవూఫ్ ఈ మాత్రం పద్ధతిగా మాట్లాడడం చాలా ఆశ్చర్యంగా ఉంది. అతని మీద ఇంత కాలం తనవి దురభిప్రాయాలా? లేక ఈ సాహిత్య పఠనం అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతోందా? రెండవదే నిజమైతే శరత్ మహానుభావుడని ఒప్పుకోక తప్పదు.

“ఏమిటి మేడమ్? ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు?”

"ఏం లేదు. మీరీ బుక్స్ తీసుకుంటున్నారుగా?" రిజిస్టర్ అతని ముందుకు తోసింది. రవూఫ్ సంతకం చేసి వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

కిటికిలోంచి ప్లేగ్రౌండ్ వైపు చూస్తూ కూర్చుంది. దూరంగా మామిడి చెట్ల దగ్గర గుంపులు గుంపులుగా చేరుతున్న అమ్మాయిలు పచ్చటి గడ్డి మీద సీతాకోకచిలుకల్లా ఉన్నారు. వర్షాలు పడడం వల్ల కాలేజీ అంతా పచ్చగా తయారైంది.

"అమ్మా మీకు ఫోన్" స్వీపర్ పుల్లమ్మ వచ్చి పిలిచింది.

ఫోన్‌లో "నేనండీ" అని సన్నగా వినిపించింది. గొంతుని గుర్తుపట్టలేక "పేరు చెప్పండి" అంది.

"సుమిత్రని"

రిసీవర్ మీద చెయ్యి బిగుసుకుంది. సుమిత్ర తనకి ఫోన్ చెయ్యడమేమిటీ? బాబుకి బాగోలేదా? ఏమన్నా అయిందా? దడదడలాడుతున్న గుండెతో "చెప్పు" అంది.

"ఎవరో ఒకావిడ మాస్టారు కావాలని వచ్చారు. కాలేజీ అడ్రసు చెప్పాను. ఇంతలో మళ్ళీ మాస్టారు పక్కింటికి ఫోన్ చేసి నన్ను పిలిపించారు."

"ఊఁ, పిలిచి?" ఉద్రేకపడకుండా అంది.

"ఫలానా అమ్మాయి వచ్చిందా? నా అడ్రెస్ చెప్పావా? అని అడిగారు. 'చెప్పానండీ' అన్నాను. 'ఒకవేళ సాయంత్రానికి నేనింటికి రాకపోతే, గుంటూరు మా అన్నయ్య వాళ్ళింటికి వెళ్ళానని చెప్పు' అన్నారు."

"గుంటూరు ఇప్పుడెందుకంటా?" కోపంగా గద్దించింది. సుమిత్ర నవ్వు వినబడింది. "ఏమోనండీ. మీకు చెబితే మంచిదని ఫోన్ చేస్తున్నాను. పోనీ ఆ అమ్మాయైనా లోపలికొచ్చి అన్ని వివరాలు మాట్లాడవచ్చు గదా. రిక్షా బయటే ఆపించి మాస్టారి గురించి అడిగింది అంతే. పక్కింటివాళ్ళు కూడా 'ఆ అమ్మాయి ఏమవుతుంది?' అని నన్నడిగారు. ఏం చెప్పాలో తెలియలేదు. సరే, ఉంటానండీ. పెట్టేస్తున్నా" అంది సుమిత్ర.

అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు విన్నా కొయ్యబొమ్మలా అలాగే నిలబడింది. ఎంతోమంది ఇంటికి వస్తూంటారు, పోతుంటారు. చుట్టమే అయితే తనకి ఫోన్ చేసయినా చెప్పచ్చుగా రాజా! అయినా తనెందుకు అపార్థం చేసుకోవాలి? అతనికే ఫోన్ చేస్తే పోలా? వెంటనే రింగ్ చేసింది. ఆఫీసు రూంలో ఎవరో ఎత్తి డిపార్టుమెంటుకు కబురుపెట్టి, చివరికి 'రాజా కాలేజీలో లేడు' అనే ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. ఫోన్ పెట్టేసి చెమట అద్దుకుంటూ లైబ్రరీ వైపుకు వెళ్ళిపోయింది.

సాయంత్రం అయ్యేవరకూ ఎలా కూర్చుందో తెలియదు. రెండు సార్లు కాఫీ తెప్పించుకుని తాగింది. తలనొప్పి తగ్గడం లేదు. ఇంటికి చేరుతుంటే వీధిలోనే ఎదురయ్యారు పక్కింటి బాబాయి రాఘవరావ్‌గారు. చాలా రోజుల్నించి వాళ్ళని తప్పించుకుని తిరుగుతోంది.

"ఎవరో అమ్మాయి వచ్చి అబ్బాయి గురించి అడిగిందమ్మా. సాయంత్రానికి సంధ్య వచ్చేస్తుంది కూర్చోమ్మా అన్నా ఆ అమ్మాయి వినలేదు." ఆయన పట్టి పట్టి చూస్తూ అన్నారు.

"ఆఁ, ఆఁ. రాజాకి ఫోన్ చేశాను బాబయిగారు. ఆ అమ్మాయి మా చుట్టాలే. ఏదో ఇంటర్వ్యూకి వచ్చిందట." అబద్ధమాడింది.

అసలే తమ కుటుంబం పట్ల ప్రస్తుతం వీళ్ళ అభిప్రాయాలు ఎలా ఉన్నాయో? తనేదో ఒకటి అతికినట్టు అబద్ధమాడక తప్పదనుకుంటూ ఏదో చెప్పేసింది.

"మళ్ళీ అబ్బాయి ఫోన్ చేశాడు. సుమిత్ర మాట్లాడింది."

"అవునట. నేను వాళ్ళ కాలేజీకి ఫోన్ చేస్తే రాజా చెప్పాడు."

ఆయన జాలిగా చూసి, తల వంచుకుని వెళ్ళిపోయాడు. మామూలుగానే చూసి ఉండవచ్చు. తనకి జాలిగా చూసినట్టు అనిపిస్తోంది. ఏమిటో ఈ కొత్త కొత్త బాధలు! అసలీ రాజా అనే వాడి గురించి ఏమిటీ తనకీ తలనొప్పి?"

సుమిత్ర బాబుతో ముద్దు మాటలు పలికిస్తోంది. సంధ్యని చూడగానే 'అమ్మ' అంది. బాబు 'అమ్మా' అంటూ వచ్చి కాళ్ళకి చుట్టుకున్నాడు.

"రాజా ఇంటికి రాలేదా సుమిత్రా?"

"ఇంకా రాలేదండీ. బహుశా ఊరెళ్ళి ఉండచ్చు."

ఇంకేం మాట్లాడకుండా, బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోయింది. తలంతా హోరు. తనంటే ఎంతో భయం ఉన్నవాడిలా నటిస్తూ ఎందుకింత కుట్ర చేస్తుంటాడు? ఒక దెబ్బ తినేసరికి తనకి ఎవర్ని చూసినా భయంగానే ఉంటోంది.

సుమిత్ర నిశ్శబ్దంగా నడుస్తూ వచ్చి "సంధ్యగారు, కాఫీ తీసుకోండి." అంది.

సంధ్య లేచి కాఫీ అందుకుంది.

సుమిత్ర గోడకానుకుని సంధ్యని చూస్తూ నిలబడింది. కాఫీ తాగుతూ సుమిత్ర వైపు చూసింది. ఈ మధ్య కాలంలో సుమిత్రని ఎక్కువగా పట్టించుకోవడం లేదు. పాపం, బాగా చిక్కిపోయింది. చక్కటి తలకట్టు, ఎడాపెడా నిర్లక్ష్యంగా దువ్వుకుని వదిలేసింది. హఠాత్తుగా ఏదో కొత్త విషయం కనుక్కొన్నట్లుగా అనిపించింది. రాజా గురించి ఇప్పుడు తనకి ఎంత ఆందోళనగా ఉందో, సుమిత్రకి కూడా అదే విధంగా

ఉండాలి. పైగా ఆ అమ్మాయిని కాలేజీకి పంపమని సుమిత్రకే చెప్పాడాయె. తనకీ, ఈ అమ్మాయికీ తేడా ఏమిటి? తనెలా దహించుకుపోతోందో, ఈ నిమిషాన సుమిత్ర కూడా అలాగే ఉండి ఉండాలి ఈ కొత్త పిల్ల గురించి.

"సుమిత్రా" అంది ఎంతో మమకారంగా.

ఈ పిలుపుకి సుమిత్ర కూడా ఆశ్చర్యపోయింది. సంభ్రమంగా చూసింది.

"ఇలా రా" అంటూ మంచం పక్కన చోటు చూపించింది కూర్చోమన్నట్టు. సుమిత్ర కూర్చుంది.

"నువ్వేమిటి అలా ఉన్నావు?"

సంధ్య ప్రశ్నకి సుమిత్ర కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

తల వంచుకుని, రుద్ధ కంఠంతో – "మాస్టారు చాలా మారిపోయారండీ అన్ని రకాలుగా. మీకు తెలియనివి ఎన్నో నాకు తెలుసు." అంది.

"అంటే?"

"మీరు క్షమించాలి. మాస్టారు తన సంసారంలో గొడవలకి విసుగుపుట్టి, నన్ను గాఢంగా కోరుకున్నారని అనుకున్నాను. కాని..." తలెత్తి సంధ్య వైపు చూసింది.

సంధ్య కళ్ళు జీవం కోల్పోయినట్లున్నాయి.

"చెప్పు పర్వాలేదు. అసలీ రాజా ఎటువంటి మనిషో తెలుసుకోవాలనుంది" అంది బేలగా.

"మీరు ఊరెళ్ళినప్పుడు నేను మీ పాత ఇంటికెళ్ళినప్పుడు శశి అని ఓ అమ్మాయి ఉంది."

"అవును. శశి వాళ్ళ పేరెంట్స్ కూడా నాకు తెలుసు." అంది. 'శశి చాలా ప్లెయిన్‌గా ఉంటుంది కదా' అని లోపల అనుకుంటూ, ఏం చెబుతుందో అన్నట్టు సుమిత్ర వైపు చూసింది.

"నేనంటే అరుణ దగ్గరకు వెడుతూ మీ ఇంటి దగ్గర ఆగాను అప్పుడు. కాని అంత పొద్దున్నే ఫ్రెష్‌గా మీ ఇంట్లో ఆ అమ్మాయి ఎలా ఉందా అని ఆశ్చర్యం వేసింది. పైగా ఆ అమ్మాయి వెళ్ళిపోయాక, శశి అంటే తనకి చాలా ఇష్టమని చెప్పారు."

"సరదాగా అన్నాడేమో! తను కథలు రాస్తాడనే మోజుతో ఆడపిల్లలు స్నేహంగా ఉండాలని సరదా పడుతుంటార్లే" లోపల అగ్నిని చల్లార్చుకునే ప్రయత్నంలో నవ్వుతూ అంది.

"ఆయన ఎప్పుడు ఎవరెవరితో ఎలా ఉన్నారో కూడా చెప్పేవారండి. మాస్టారు, మీరిలా పాడయిపోవద్దు అని కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలేదాన్ని."

"సహజంగా తనది సరదాగా ఉండే తత్వం. పైగా చిన్నతనం నించీ స్నేహమంటే ప్రాణం ఇస్తాడు. కాని ఎవరితో పడితే వాళ్ళతో శారీరక సంబంధాలు పెట్టుకునేంత కాముకుడు కాదే రాజా?" తీవ్రంగా చూస్తూ అంది.

ఈ సుమిత్ర తన వీక్ పాయింట్ని క్యాష్ చేసుకునే ప్రయత్నంలో ఉంది. తను పిచ్చిదానిలా ఈ అమ్మాయి చెప్పినవన్నీ నిజమనుకోకూడదు.

"నేనూ అలాగే అనుకుని స్నేహం చేశాను కదండీ! అసలు మాస్టారు నన్ను అలా అడిగే వరకూ నా మీద అటువంటి వాంఛతో ఉన్నారని కూడా అనుకోలేదు."

"ఎలా అడిగేవరకూ?" అడిగేసింది సంధ్య – వద్దు వద్దనుకుంటూనే. అడిగాక లోలోపల బాగా సిగ్గు పడింది.

"మీరేదో చాలా ఘర్షణ పడి కాలేజీకి వెళ్ళిపోయారట. మాస్టారు రేగిన జుట్టుతో, నలిగిన బట్టలతో కాలేజీకి వచ్చారు. ఒక క్లాసు తీసుకున్నాకా వెళ్ళిపోతూ, నన్ను మధ్యాహ్నం రమ్మన్నారు. వచ్చి కాఫీ పెట్టి ఇస్తుంటే 'సుమిత్రా, నీకు నేనంటే ప్రాణం కదూ' అన్నారు. నేను ఏమీ అనకుండా కాఫీ అందించాను. కాఫీ అందుకుని నా చేయి..."

"అసలు ఎవరూ లేనప్పుడు నీతో ఈ పనులు చేయించుకోడమేమిటి? నువ్వు రావడమేమిటి?" ఇప్పుడే ఆ విషయం విన్నట్టు మండిపడింది సంధ్య.

"వద్దులెండి. అవన్నీ చెప్పి మిమ్మల్ని బాధపెట్టను. తెలిసో తెలియకో నా మనస్సు, శరీరమూ అర్పించేశాను. ఆయన కోసం ఇంట్లో వాళ్ళనీ, సంఘాన్ని ఎదిరించి నిలబడదామని అనుకున్నాను. కాని చిన్నపిల్లాడిలా తన బలహీనతలన్నీ నాతో చెప్పుకుంటూ ఉండేవారు. 'సుమిత్రా, నువ్వు మాత్రమే నన్ను ఔదార్యంగా చూడగలవు. నా చివరిదశ నీ దగ్గరే ప్రశాంతంగా గడిచిపోవాలి' అనేవారు."

పాపం అంత వైరాగ్యంగా కూడా మాట్లాడగలడా ఈ మనిషి? చివరి దశ వరకూ పెళ్ళాం, పిల్లలతో బుద్ధిగా ఉందాం అనుకున్నాడా ఈ పెద్ద మనిషి? చిందులు తొక్కబోయి నియంత్రించుకుంది.

"అసలు బలహీనతలేంటో క్లియర్గా చెప్పు సుమిత్రా. మీ మాస్టారు చాలా మందితో లవ్ ఎఫైర్స్ నడుపుతూ ఉంటాడా?" పదునుగా ధ్వనించింది సంధ్య కంఠం.

"ఊహూఁ, జస్ట్ ఫర్ ఛేంజ్ అనేవారు. నన్ను ప్రేమించినట్టుగా ఎవర్నీ ప్రేమించలేను అనేవారు. కాబట్టే తన విషయాలన్నీ ఏమీ దాచకుండా చెబుతున్నాను అనేవారు." సుమిత్ర గొంతులో ఏదో బలమైన విశ్వాసం. కేవలం తనకు మాత్రమే పరిమితమైన సంభాషణ తాలూకు గోప్యపు సంతృప్తి బాగా బాధ పెడుతున్నాయి సంధ్యని.

"చూడు సుమిత్రా, ఇన్ని చెబుతున్నా రాజా మీద నీకేం ఏవగింపు కలగడం

లేదా? భార్యనీ, పిల్లలనీ ససేమిరా విడిచిపెట్టననే సగటు భారతీయుడు, తనకి నీతి ఉన్నా లేకపోయినా బహిష్కరించని సమాజంలో ఎంతో బాగా సుఖపడుతున్నవాడు కాబట్టి, ఇంకెన్నెన్నో రుచుల కోసం ఆర్రులు చాచేవాడు, రచయితగా అందరినీ మెస్మరైజ్ చేస్తూ కోరికలు తీర్చుకుంటున్న మనిషి. ఇటువంటి మనిషి గురించి నీకేమీ ఛీ అనిపించడం లేదా? ఇంకా అతన్ని ప్రేమిస్తున్నావా?" తన మనస్సులో పాత రాజా బొమ్మ క్రమక్రమంగా చెరిగిపోతుంటే – కేవలం సుమిత్ర మీద జాలితో అడిగింది.

సుమిత్ర రెండు చేతులతో మొహం కప్పుకుంది. "అదే ఆడదాని బలహీనత సంధ్యగారూ. మరి నా సంగతి తెలిసీ మీరు మాస్టారిని వదిలేయగలిగారా?"

"చాలా ధైర్యంగా వదిలేసి ఉండేదాన్ని" మంచం మీద నుంచి లేచి అటూ ఇటూ పచార్లు చేస్తూ అంది. "నేనెంత సాత్వికంగా కనబడతానో, అంత తెగింపు గలదాన్ని. అంత మొండిదాన్ని. నేను వెళ్ళిపోతానేమోనని కాళ్ళావేళ్ళాబడ్డాడు. చచ్చిపోతానని ఏడ్చాడు. అందుకే ఆగాను కాని... సంఘానికో, మా చుట్టూ పెద్దలకో... పరువు ప్రతిష్ఠలకో ఈ శుష్కమైన జడుపులు నాకేం లేవు. అంత జడుపే నాకుంటే సాహసించి నిన్ను ఇంట్లో పెట్టుకునేదాన్ని కాదు."

"మీరొప్పుకున్నారని మాస్టారు చెప్పారు."

పచార్లు ఆపి విసురుగా అంది "ఏమిటి ఒప్పుకోడం? నువ్వూ, మీ మాస్టారు నా ప్రాణాలు తోడేస్తున్నారు కన్ఫ్యూజ్ చేసి!"

"నన్ను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకున్నారని" మెల్లగా అంది. ఇంత సావకాశంగా సంధ్యతో అన్నీ చెప్పుకునే అవకాశం వచ్చినందుకు సుమిత్రకి చాలా సంతోషంగా ఉంది.

ఇంకేం విన్నా కొత్తగా వచ్చే కోపాలంటూ ఏమీ లేవు. సంధ్య పచార్లు ఆపి సుమిత్ర వైపు చూసింది. తనతో అన్నీ ప్లెయిన్‌గా మాట్లాడుతున్నట్లే మాట్లాడుతూ తన ఉద్దేశాలన్నీ బయటపెడుతోంది. అసలీ సుమిత్ర చెప్పేవన్నీ నిజమని నమ్మకం ఏమిటి? రాజాతో ఇన్నేళ్ళు బ్రతికినా అతని గురించి చెడ్డగా ఎవరితోనూ చెప్పుకునే సాహసం తనకు లేదు, మరింత తొందరగా రాజా క్యారెక్టర్ గురించి తనతోనే ఇంత సూటిగా చెబుతోందే? సుమిత్రేమీ తక్కువది కాదు. అసలు రాజా వచ్చేవరకూ తను తొందరపడకూడదు. కాని తను సస్పెన్స్‌ని భరించలేకుండా ఉంది. ఏమిటో పాడు గొడవలు. తను పిల్లల్ని కూడా పట్టించుకోకుండా గడిపేస్తోంది.

"పోనీ మీరు గుంటూరు వెళ్ళకూడదూ? ఇప్పుడు టైం ఆరే కదా అయ్యింది? పిల్లల్ని నేను చూస్తాను. మీరు వెడితే అసలు విషయాలన్నీ తెలిసిపోతాయి" సంధ్య ఆలోచనలని చదివినట్టుగా అంది సుమిత్ర.

సంధ్యకీ సలహా బాగా నచ్చింది. రాజా మీద సి.ఐ.డి. వర్కు చేయబోతోంది. తను ఎంత దిగజారుతోంది?

"రాజా మధ్యాహ్నమే గుంటూరు వెళ్ళిపోయి ఉంటాడా?" తల పైపైన దువ్వుకుంటూ అంది.

"ఆ అమ్మాయి పదకొండింటికి వచ్చింది మేడమ్. ఈయన పన్నెండుకల్లా ఫోన్ చేశారు. అసలు ఆ అమ్మాయి ఈ గంటలోపు మాస్టారి దగ్గరికి ఎందుకు చేరలేదో?" సందేహంగా చూసింది. ఈలోపల సంధ్య హ్యాండ్‌బ్యాగ్ చేతిలోకి తీసుకుంది.

"ఏవిటీ, ఈ చీరతోనే వెడతారా?"

ఇంట్లో ఏదో వెలసిపోయిన చీర కట్టుకుంది. ఏదయితే ఏమిటి? అని తిక్కబుట్టింది.

"ఛా. మరీ అసహ్యంగా ఉందడీ. చీర మార్చుకోండి." అంటూ బీరువా తెరిచి చీర అందించి, ఇవతలి కొచ్చేసింది సుమిత్ర.

పాపం ఈ సుమిత్ర మంచిదే. ఎవరికేం కావాలో కనిపెట్టి చప్పున అందిస్తుంది. ఇప్పుడీ క్షణాన ఈ అమ్మాయే తనకెంతో ఆప్తురాలు అనిపిస్తోంది – అనుకుంటూ గబగబా చీర మార్చుకుని "సుమిత్రా నేను వెడుతున్నాను. పది లోపలే తిరిగి వచ్చేస్తా" అంది బయటికొస్తూ.

"మంచిది మేడమ్. పిల్లల గురించేమీ దిగులు పడకండి. ఒకవేళ అవసరమనుకుంటే ఈ రాత్రికి ఉండిపొండి" సాగనంపుతూ అంది సుమిత్ర.

బస్సులో ఎక్కి కూర్చున్నాక గాని పూర్తిగా మనుషుల్లో పడలేదు తను అనిపించింది సంధ్యకి. ఎవరి గమ్యాలని వాళ్ళు చేరడాని కన్నట్టు జనం అటూ ఇటూ హడావిడి పడుతూ తమ బస్సులు చూసుకోడానికి తిరుగుతున్నారు. వీళ్ళందరికీ బాధ లున్నాయా? ఇటువంటి గొడవలు ఎప్పుడో ఒకప్పుడు పడి ఉంటారా? అసలు మనుషులకి లైంగిక సంబంధాలు తప్ప....

"యాపిల్సో" అనుకుంటూ ఓ కుర్రాడు అరుచుకుంటూ పోతున్నాడు. ఈ కుర్రాడికి భవిష్యత్తు గురించి ఏమీ ఆందోళన లేనట్టుగా ఉంది. ఇంకో ముసలమ్మ "ఏరుశెనక్కాయలూ" అంటూ, సంధ్యని చూస్తూ, "కావాలామ్మా?" అంది ఆగి. ఆ ముసలమ్మని తృప్తి పరచడానికే అన్నట్టు ఓ గిద్దెడు కొని బ్యాగ్‌లో పోసింది. ఎన్నెన్నో పాడు ఆలోచనలు ఈగల్లా ముసురుకుంటున్నాయి.

గుంటూరులో దిగి అరండాల్‌పేటకి వెడుతుంటే పశ్చాత్తాపం కలిగింది సంధ్యకి. రాజా అంత నీచుడే అయితే సుమిత్ర గురించి అంత శ్రమ ఎందుకు పడతాడు? తన

విషయంలో అన్యాయమే చేసుండవచ్చు కానీ మొదటినుంచీ ఆ అమ్మాయి విషయంలో ఎన్నెన్ని అడ్డంకులు దాటి తిప్పలు పడ్డాడో, ఆ డైరీలో స్పష్టంగా ఉంది. కేవలం వాంఛల కోసమే అయితే ఏ రకంగా అయినా తీర్చుకోవచ్చు. ఇంత శ్రమ లెందుకు పడతాడు? తను ఎంక్వైరీకి బయల్దేరడం చాలా హీనంగా ఉంది.

బావగారు పిల్లలకి చదువులు చెబుతున్నారు. "ఏమ్మా?" అన్నారు ఆశ్చర్యంగా.

"ఇక్కడ నాగార్జున యూనివర్సిటీలో పనుండి వచ్చానండీ. రాజా కూడా మధ్యాహ్నమే వచ్చేశాడనుకుంటా. ఇంకా రాలేదా?" అంది. ఇద్దరికీ కాలేజీలో ఉద్యోగాలు కావడం వల్ల ఎవరికీ అనుమానం వచ్చే ఆస్కారం లేదు.

"తమ్ముడొస్తానన్నాడా? ఏడీ ఇంకా రాలేదా? విశాలా?" అంటూ కేకేశాడు.

విశాల లోపల్నించి వస్తూ, "సంధ్యా, పిల్లలేరమ్మా?" అంది.

మళ్ళీ అదే సమాధానం చెప్పి, పిల్లలకి స్వీట్స్ పాకెట్ ఇచ్చింది. పిల్లలకి సంధ్యంటే చాలా ఇష్టం. బాబు, పాపల గురించి అడుగుతూ సంధ్యతో కబుర్లలో పడ్డారు. రాజా అంటే ఇంటిల్లిపాదికి చాలా ఇష్టం. బావగారి ముందు తన వ్యవహారమంతా బయటపెట్టేసి, వాళ్ళ సలహా తీసుకోనా అనిపించింది. కాని అందువల్ల ప్రయోజనం? వాళ్ళూ బాధపడతారు. అనవసరంగా వాళ్ళని డిస్టర్బ్ చేయడం తప్ప ప్రయోజనం ఉండదు. ఇంటికి పెద్దకొడుకుగా ఆయన పాపం చాలా బరువు బాధ్యతలు నెత్తి మీద పెట్టుకున్నారట! ఇప్పుడు తన భార్యా పిల్లలతో నిర్విచారంగా గడుపుతుంటే తన గొడవలు వాళ్ళ కెందుకు వినిపించడం? కాని రాజా వచ్చాడనే ఒక్క మాట తనకి అమృతప్రాయంగా ఉండేది. సుమిత్ర ఆరోపణలన్నీ తప్పని ఋజువు చేయాలనే రాజాని ఇక్కడ చూసి, ప్రేమగా నవ్వాలనే తను పరుగు పరుగున వచ్చింది. కాని రాజా తనని ఇంకా మోసం చేస్తూనే ఉన్నాడు.

పొద్దుపోయేవరకూ పిల్లలూ, విశాలా  కబుర్లు చెబుతూనే ఉన్నారు. అన్యమనస్కంగా అన్నిటికి 'ఊ' కొడుతూ వాళ్ళ కబుర్లలో పాలుపంచుకుంటునే ఉంది.

"నువ్వేమిటో సంధ్యా, చాలా చిక్కావు. మొహంలో కళా, కాంతి లేవు. మళ్ళీ ఏమన్నా విశేషమా?"

"క్రిందటి సంవత్సరం ఆపరేషన్ చేయించుకున్నాడుగా అక్కా" అంది, బహుశా సుమిత్ర అబార్షన్ తరువాతనే ఆ పని చేసి ఉంటాడు. అదొక్కటే కాస్త తెలివైన పని ఈయన చేసింది – అనుకొంటూ.

"మరి – ఉద్యోగంతో, పిల్లలతో వేళకి ఏమీ తినలేకపోతున్నావల్లే ఉంది. అందుకే – నేను చూసుకుంటాను, బాబుని వదిలేయమని అన్నాను గదా!" అందామె ప్రేమా, నిష్ఠురమూ కలిపి.

"ఏమిటో అక్కా. అమ్మా నాన్నని పోగొట్టుకోడం వలనో ఏమో – పిల్లలు ఎప్పుడూ నాకు దగ్గరగా ఉండాలని అనిపిస్తుంది. వాళ్ళ చిన్నతనమూ, ఆ ముద్దు మాటలూ, చిలిపిచేష్టలు – అవన్నీ మిస్ అవుతూ నేను సంపాదించేది ఎవరి కోసం – అని అనిపిస్తూంటుంది. ఇది వరకు మీ మరిదికి షిఫ్ట్ అవడం వల్ల పన్నెండు నించీ ఇంట్లోనే ఉండేవారు. అందుకే ఎలాగొలా పిల్లని పెంచేశాను. ఇప్పుడు బాబుదే సమస్యగా ఉంది. ఈ మామ్మ పర్వాలేదనుకో. అయినా మళ్ళీ వాడ్ని స్కూల్లో వేసేవరకూ నాకు బెంగపోదు." పొరపాటుగా తన నోట్లోంచి ఏ విషయాలయినా బయటకి వస్తాయోమోనని భయపడి ఇటువంటివే ఏవిటేవిటో మాట్లాడేసింది. ఎంత పొద్దుపోయినా రాజా రాలేదు.

సుమిత్ర గెలిచింది. రాజాని ఎంత సమర్థించుకోవాలన్నా రాజా ఆ అవకాశం ఇవ్వడం లేదు. చేతులారా జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేసుకుంటున్నాడు ఫూల్! ఆ రాత్రి సంధ్యకి నిద్ర లేదు, కనీసం తెల్లవారు జాముకైనా వస్తాడేమో, అతనితో కలసి తిరిగి వెళ్ళిపోవచ్చు – అనుకున్న ఆమె ఆశ అడియాసే అయ్యింది.

***

వాడిపోయిన ముఖంతో, ఎర్రబడ్డ కళ్ళతో భుజం చుట్టూ కొంగు కప్పుకుని వస్తున్న సంధ్యని చూడగానే సుమిత్రకి అంతా అర్థమైపోయింది.

"ఏమ్మా! అంత ఆదరాబాదరా పరిగెత్తావు? ఎవరికయినా పేణం బాగుండ్లేదా?" రంగమ్మ అడిగింది.

"అవును మామ్మా!" అనేసి వెళ్ళి మంచం మీద పడుకుంది.

"టీ తీసుకోండి."

"థ్యాంక్యూ" కప్పు అందుకుని సుమిత్ర వైపు చూసి నవ్వింది. "సుమిత్రా, నీ మాటే కరెక్ట్. వచ్చాక వంద క్షమార్పణలో, కథలో చెప్పి నన్ను కన్విన్స్ చేయవచ్చని ఇలా చెక్కేసి ఉంటాడు. రాత్రి పిల్లలు నా గురించేమయినా అడిగారా?"

"లేదండీ, నా పక్కనే ఇద్దర్నీ వేసుకుని పడుకున్నాను."

"పక్కింటివాళ్ళు అడిగారా?"

"ఎక్కడికో బయటకి వెళ్ళారని చెప్పాను. ఎలాగూ పొద్దున్నే వచ్చేశారయే. వాళ్ళూ మిమ్మల్ని చూసి ఉండరు."

పెనం మీద అట్టులా వేగిపోతోంది సంధ్య.

సుమిత్ర ముందు పరాజయం! అసలు జీవితంలోనే పెద్ద పరాజయం. మొన్నటి వరకూ చాలా ఉన్నతమైన ఇల్లాలులా రాజా తరఫున నిలబడి ఈ అమ్మాయికి ఎన్నో హితబోధలు చేసింది. ఇప్పుడు ఈ అమ్మాయి కన్నా హీనమైన పరిస్థితిలో ఉంది

తను. ఈ అమ్మాయే తనని ఓదార్చే పరిస్థితి. అన్నయ్యల దగ్గరికి పారిపోతే? ఎక్కడైనా ఎన్ని రోజులుంటుంది?

"బాధ పడకండి. మీరు ధైర్యంగా ఉండాలి. మీరు మరీ డీలా పడితే మాస్టారు అలుసు కడతారు."

అలుసు కట్టాడు. నిజంగానే దేవతవి, దేవతవి అంటూనే తన జీవితం కింద కట్టెలతో మంట పెట్టాడు. కళ్ళు మూసుకుని పడుకుంటూ...

"సుమిత్రా పిల్లలకి స్నానాలు చేయించమని రంగమ్మతో చెప్పు. నేను నిద్రపోతాను." అంటూ దిండుమీద మోచేతి మీద తల పెట్టుకుంటూ.

"నేను చేయిస్తాను" అంటూ ఫ్యాన్ ఫుల్ స్పీడులో పెట్టి వెళ్ళిపోయింది. రాత్రంతా నిద్ర లేకపోవడంతో సంధ్యకి నిద్రొచ్చేసింది. అది సుఖమైన నిద్ర కాదు. స్నానం చేయించి పిల్లలకి బట్టలు తొడుగుతూ సుమిత్ర మాట్లాడుతున్న మాటలు; రంగమ్మ మాటలు; పిల్లలు సుమిత్రని అమ్మ గురించి అడగడం – ఎక్కడెక్కడి మాటల్లానో వినిపిస్తున్నాయి. ఇంకేమీ తెలియనట్టు గాఢ నిద్రలోకి జారిపోతుండగా ఎవరో తట్టి లేపుతున్నారు.

కళ్ళు బలవంతంగా తెరిచింది. సుమిత్ర తన మొహం మీదకి వంగి – "మీకు ఫోన్".

నిద్ర మత్తు వదిలి, తల సవరించుకుని కదిలింది. ఫోన్ రాజా దగ్గరనుంచే అయి ఉంటుంది. పోనీలే, ఫోన్‌లో అయినా ఉన్నదున్నట్టు చెబుతాడేమో! తన పిచ్చి పిచ్చి ఆలోచనలన్నీ ఎగిరిపోతాయేమో, ఏదో ఆశాభావంతో ఫోన్ తీసుకుంది. వాళ్ళింటికి వచ్చి చాలా రోజులయింది. హాల్లో ఇంటాయన తప్ప ఎవరూ లేరు. ఆయన కూడా, పేపరు తీసుకుని వరండాలోకి వెళ్ళిపోయాడు.

"హల్లో"

"హలో సంధ్యా!"

"అవును. నేనే."

"నేను నీకు చెప్పకుండానే వెళ్ళాల్సి వచ్చింది చాలా అర్జెంటు పనిమీద."

"ఎక్కడ్నించి మాట్లాడుతున్నావ్?"

"గుంటూరు నుంచే."

"బావగారూ, పిల్లలూ, అక్కా అంతా బావున్నారా?"

"ఆఁ, ఆఁ. బావున్నారు. వచ్చాక అన్నీ వివరంగా చెబుతాను. నీకు చెప్పకుండా వెళ్ళాను కదా అందుకే ఫోన్ చేస్తున్నా."

'ఇడియట్!' కసిగా పెదిమలు కొరుక్కుంది. తడిగుడ్డతో గొంతుక కొయ్యడమంటే ఇదే! వేటగాడు!

"ఎప్పుడొస్తావ్?"

"రేపు సాయంత్రానికి వస్తాను. సుమిత్ర ఏమీ ఇబ్బంది పెట్టడంలేదు కదా?"

"లేదు. షి ఈజ్ సో ఎమికబుల్ అండ్ కో-ఆపరేటివ్."

"వెరీ గుడ్, వెరీ గుడ్. ఎనీ మోర్?"

"నువ్వు దయచేసి ఈ రోజే రావాలి." నొక్కి పలుకుతూ అంది.

"ఎలా? నాకస్సలు వీలవదే?" లబలబమన్నట్టు రాజా గొంతు గురగురలాడింది ఫోన్‌లో.

"నాకేమీ బాగోలేదు. ఓవర్ బ్లీడింగ్. ఇంతకన్నా ఇంకేమీ చెప్పలేను. వెంటనే వచ్చెయ్యి."

రాజా విసుక్కున్నాడు. చివరికి 'సరే' అన్నాడు. సంధ్య ఫోన్ పెట్టేసి ఎవరో తరుముతున్నట్టు వచ్చేసి మంచం మీద పడింది.

అయిపోయింది. అయిపోయింది! తన సంసారం వీధిన పడే రోజు వచ్చేసింది. పడితే పడనీయ్! చేతులారా చేసుకుంటున్నాడు. పాపం, తనని విడిచిపెట్టకపోవడమే ఘనకార్యం అనుకుంటున్నాడేమో. తన ప్రేమని పూర్తిగా పోగొట్టుకుంటున్న దౌర్భాగ్యుడు.

"గుంటూరేే అని చెప్పారా మాస్టారూ?" సుమిత్ర పలకరించింది.

మంచం మీద వెల్లకిలా పడుకుని సుమిత్ర కేసి చూసింది. తన కళ్ళల్లోంచి నీళ్ళు కారిపోతున్నాయని సుమిత్ర హెచ్చరించేవరకూ తెలియలేదు. తనిలా ఒడ్డున పడ్డ చేపలా గిలగిలా కొట్టుకుంటోంది. అక్కడ రాజా ఆ గర్ల్ ఫ్రెండ్‌తో.... అబ్బా! తల విదిలించి, ఏడుపు ఆపుకుంటూ "సుమిత్రా" అంది దీనంగా.

"ఏమిటండీ?"

"ఇలా రా. దగ్గరికి రా. తల పగిలిపోతోంది. నువ్వో పిచ్చిదానివి. నిన్నేదో ఉద్ధరిస్తాడని ఈ మనిషి వెనకాల పడ్డావు. నిన్నెంత కన్నింగ్‌గా నా దగ్గర ఇరికించాడో బాగా అర్థమవుతోంది. ఈసారి... ఈసారి అతను రాకముందే ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తోంది. ఇక నేనే సంజాయిషీలు వినలేను. వినలేను! " తల అటూ ఇటూ కుదుపుతూ ఆవేదనగా అంది.

సుమిత్ర అమృతాంజనం సీసా తీసుకొచ్చి కణతలు రుద్దుతూ, "కొంచెం సర్దుకోండి. మీరు నాకెంతో ధైర్యం చెప్పారు. మీరింత అధైర్యపడితే ఎలా? ఒకవేళ

మీరు వచ్చేశాక వాళ్ళన్నయ్య గారింటికి వెళ్ళుండవచ్చు కదా!" అంది.

సుమిత్ర చాలా సన్నిహితురాలనిపిస్తుంది. ఆమె కణతలు రుద్దుతుంటే చెప్పలేనంత హాయిగా ఉంది. పాపం తనెంత కసిరికొట్టినా, బెట్టుగా ఉన్నా అన్నీ దులిపేసుకుని తనకీ సేవ చేస్తోంది.

"సుమిత్రా నాకీ ఊళ్ళోనే ఉండాలని లేదు. ఎక్కడికైనా వెళ్ళిపోవాలనుంది. మాది ప్రైవేటు కాలేజీ అయిపోయింది. అయినా నే వెళ్ళిపోతాను." పలవరిస్తున్నట్లుగా మాట్లాడసాగింది.

"నేనూ మీతో వచ్చేస్తానండీ. నేనూ మీతో వచ్చేస్తా. నాకు మాత్రం ఏం మిగిలింది? మన మిద్దరం కలసి ఈ పిల్లల్ని చక్కగా పెంచుదాం."

సుమిత్ర మాటలలో ఏదో మత్తు ఉంది. ఆ మత్తుకి కొద్ది కొద్దిగా సంధ్యలో బాధ తిమ్మిరెక్కుతోంది. నొప్పి మాయం అవుతోంది. ఆ క్షణంలో తానో ఇల్లాలని, ఉద్యోగిని అనీ, అన్నిటికీ మించి తొందరగా బయటపడని నిబ్బరం గల స్త్రీ అనీ అవన్నీ మరచిపోయింది.

సంధ్యకి సేవచేస్తూ సుమిత్ర తన గోడు అంతా వెళ్ళబోసుకుంది. పూర్వంలా వినడానికి సంధ్యకేమీ వెలపరం అనిపించడం లేదు. సుమిత్ర మాత్రమే తనకి బాగా తెలిసిన వ్యక్తిగా, సుమిత్ర జీవితాన్ని పాడు చేసిన దుర్మార్గుడి గురించి ఆవేశపడినట్టుగా రాజా గురించి తిట్టింది.

"నువ్వు బాగా చదువుకో. నేను చదివిస్తాను." భరోసా ఇచ్చింది.

సంధ్యలో ఈ అనూహ్యమైన మార్పుకి కొండెక్కినంత సంబరంగా ఉంది సుమిత్రకి. ఏ ఆధారం లేకుండా నీళ్ళ మధ్య నిలబడిన మనిషి దగ్గరకి స్టీమరు వచ్చి నిలబడినట్టుగా ఉందిప్పుడు.

"ఎప్పుడూ పడుకునే ఉంటావు" పాప రాగం ఎత్తుకుంది.

లేవకుండా నవ్వింది. "నా తల్లి కదూ! జ్వరం తగ్గాక నిన్ను రోజూ పార్కుకి తీసికెడతాను."

"తమ్ముణ్ణయితే పడుకోబెట్టుకుంటావు!"

"వాడింకా చిన్నవాడు. నీలా జాగ్రత్తగా నడవడం రాదుగా!" దగ్గరకొచ్చిన పాపకి ముద్దిచ్చింది. పాప సంతృప్తిపడి వెళ్ళిపోయింది.

సుమిత్ర చెబుతున్న స్వంత విషయాల్లో అబార్షన్ తరువాత కూడా... అంటే సుమిత్ర ఈ ఇంటికి వచ్చే ముందు కూడా... ఆమెతో అప్పుడప్పుడు ఎక్కడో ఒకచోట గడపడం. అంటే తనతోనూ, ఈ అమ్మాయితోనూ కూడా ఏకకాలంలో సెక్స్ ఎంజాయ్

చేస్తున్నాడన్నమాట! అదేదో పొరపాటుగా జరిగిన వ్యవహారం అనుకుంది. పెళ్ళిలాంటి ముద్ర పడకపోయినా ఈ అమ్మాయికి దాంపత్య సుఖం రుచి చూపించాడు.

"అందుకే సెక్సువల్‌గా మాస్టారికి దూరంగా ఉండాలంటే ఇంత వర్రీ అవుతున్నాను."

తన మనసులోని అసలు విషయాన్ని ఈ బలహీనమైన సందర్భంలో తెలియజేసి తన బరువుని దించుకుంది సుమిత్ర. సంధ్యకి బాధ ఎక్కువై, ఔదార్యం పెరిగిపోతోంది. హిప్నటైజ్ అయిన వ్యక్తిలా ఉంది ఆమె పరిస్థితి.

"అమ్మా, ఆ ఇంటాయన పిలుత్తున్నారు." రంగమ్మ చెప్పింది.

సుమిత్ర వెళ్ళి తాళాల గుత్తితో వచ్చింది. "వాళ్ళంతా బందరు వెడుతున్నారట పెళ్ళికి. ఒకవేళ వాళ్ళబ్బాయి గాని హైదరాబాద్ నుంచి వస్తే తాళాలు ఇమ్మని చెప్పారు."

"వెళ్ళిపోయారా?" అంది సంధ్య నీరసంగా.

"ఆc, ఇప్పుడే వెళ్ళిపోయారు."

"నన్నెంతో గౌరవించేవాళ్ళు. ఇప్పుడు నా గురించి ఎంతో తేలిగ్గా మాట్లాడుకుంటున్నారేమో. నాకసలు వాళ్ళ ముందుకు రావాలంటేనే సిగ్గేస్తోంది."

"వాళ్ళకు మీమీదేమీ కోపం లేదండీ. మాస్టారు గారంటేనే చాలా కోపంగా ఉన్నారు."

'ఎందుకు' అని అడగలేదు సంధ్య. తన పిచ్చిగాని, తన కథ ఎవరికీ అర్థం గాకుండా ఎంతవరకు దాచగలదు? పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ ఎవరూ చూడడం లేదనుకుంటుంది తనలాగానే.

రాజా రాగానే ఏమేమి అడగాలో అన్నీ ఇద్దరూ కలసి చర్చించుకున్నారు. రాజాతో తెగతెంపులు తథ్యం అని పదే పదే తన నిర్ణయాన్ని ప్రకటించింది. యుద్ధానికి సన్నద్ధమవుతున్న శూరుడిలా, కోల్పోతున్న మానసిక బలాన్ని బలవంతంగా కూడదీసుకుంటోంది. ఈ సమయానికి పక్కింటివాళ్ళు కూడా లేకపోవడం అదృష్టమే. తనెంత అరిచినా ఎవరికీ ఏమీ తెలియదు.

# 8

అనుకున్న సమయం రానే వచ్చింది. రాత్రవుతుండగా సంధ్య ఆవేశం క్రమేపీ తగ్గుతూ వచ్చింది. గిరిజ ఇచ్చిన సలహాలన్నీ తను మరిచిపోతోంది.

"ఈ దేశంలో నూటికి తొంభై మంది మగవాళ్ళు బహిరంగంగానో, రహస్యంగానో ఇంకో స్త్రీతో సంబంధం కలిగి ఉంటారు. భర్తలుండీ కుడా ఏవేవో కారణాలవల్ల అక్రమ సంబంధాలతో తృప్తి పడుతున్న స్త్రీలు కూడా ఉంటారు. ఇదేదే లోకాతీత విషయమన్నట్టుగా నువ్వు ఊరికే చలించిపోకు." పదే పదే నచ్చజెప్పింది గిరిజ.

స్కూటర్ చప్పుడుకు గుండె వేగంగా కొట్టుకుంటోంది. టైం పదయ్యింది. రాజా తల తుడుచుకుంటూ "సంధ్యా!" అంటూ సరాసరి బెడ్‌రూంలోకే వచ్చాడు. ఆ నిండైన విగ్రహాన్నీ, ఆ పిలుపునీ, ఆ చిరునవ్వునీ మరచిపోవడం సాధ్యమా?

"ఏమిటా చూపులు? ఎలా ఉంది ఇప్పుడు నీకు?" లుంగీ కట్టుకుని, పాంటు హ్యాంగర్‌కి తగిలిస్తూ అన్నాడు.

"బాగానే ఉంది, నీ భోజనమయ్యిందా?"

"ఆఁ, హోటల్లో చేసి వచ్చేశాను. పది దాటుతోందిగా, పడుకుందామా?" సిగరెట్ వెలిగించి, మంచం ఎక్కుతూ అన్నాడు.

సిగరెట్లు ఎప్పుడో గాని కాల్చడు. ఇప్పుడు కాలుస్తున్నాడు అంటే... పాపం చాలా చిక్కుల్లో ఉన్నాడన్నమాట.

"ఎలా ఉన్నారు బావగారూ, పిల్లలూ?" వ్యంగ్యంగా అడిగింది.

"బాగానే ఉన్నారు. నీరసంగా ఉన్నావు. నిద్రపో. రేపు మోర్నింగ్ షోకి వెడదాం. 'సత్యకాం' వచ్చింది. ధర్మేంద్రంటే నీకెంతో ఇష్టం కదూ?" ఆమె ఇష్టానికి ఎంతో విలువిస్తున్న మార్దవం.

ఆహా, ఏమి నాటకం? ఈ మాయమాటలు వినడానికి తను ఏ మాత్రం సిద్ధంగా లేదు.

తలుపులూ, కిటికీలూ అన్నీ మూసింది. ఆశ్చర్యంగా చూసున్న రాజాతో "నీతో మాట్లాడాలి" అంది సీరియస్‌గా.

"చెప్పు" అన్నాడు – ఆమె ఆవేశపడుతోందని కనిపెట్టి.

"నువ్వు నిజమే చెబుతావా?"

"సాధ్యమైనంతవరకూ."

"సాధ్యమేమిటి? ఇంకా అసాధ్యమైన నిజాలున్నాయా? నిజం చెప్పేంత నిర్భయత్వం ఉంటేనే చెప్పు. పిరికితనం ఉంతే అసలేమీ చెప్పకు."

"అలాగే. నాకు సంబంధించినంత వరకూ నిజమే చెబుతాను సరేనా." అన్నాడు. సిగరెట్ ఆర్పేసి, "చెప్పు" అన్నాడు బుద్ధిమంతుడిలా.

"నువ్వు మీ అన్నగారింటికి వెళ్ళడం అబద్ధం. అసలు గుంటూరే వెళ్ళావా? స్కూటర్ మీద నీ గర్ల్ ఫ్రెండ్‌ని ఎక్కించుకుని ఎక్కడెక్కడ తిరిగావు? ఎలా ఎంజాయ్ చేశావు?" కళ్ళల్లోంచి నీళ్ళనే నిప్పులుగా రాలుస్తూ చూసింది.

ఆ చూపులకి రాజా భస్మం అయిపోతున్నాన్నట్టు వణికాడు. తన మాటలు నమ్మే స్థితిలో సంధ్య లేనే లేదు.

"నేను గుంటూరు వెళ్ళలేదు." అన్నాడు నెమ్మదిగా.

ఏ మూలో ఇంకా మినుకు మినుకు అంటున్న ఆశాదీపం పూర్తిగా ఆరిపోయింది.

"వచ్చినమ్మాయి ఎవరు? నాకు ఫోన్ చేయకుండా సుమిత్రకి ఫోన్ చేసి చెప్పడంలో ఏంటి నీ ఉద్దేశం?"

"నీకు కాలేజీకి ఫోన్ చేసి చెప్పినా నువ్వేం చేయగలవు సంధ్యా? ఆ అమ్మాయి ఇంటికి కదా వచ్చింది? మా కొలీగ్ నెవర్నో నా అడ్రెస్ అడిగి వెతుక్కుంటూ ఇంటికొచ్చింది. అతను కాలేజీలో నాకు చెప్పాడు. అందుకే అంత తొందరగా నేను ఫోన్ చేశాను. నువ్వు కంగారు పడతావని గుంటూరు అని చెప్పాను. నీ గురించి నాకు ఆదుర్దా లేకపోతే, మళ్ళీ నీకు ఒంగోలు నుంచి ఎందుకు ఫోన్ చేస్తాను చెప్పు?" ఎక్కడికి వెళ్ళాడో అతనే అప్రయత్నంగా బయటపడ్డాడు.

"సరే, ఒంగోలు గుంటూరుగా ఎందుకు మారింది? నన్నిలా వంచిస్తే నీకేం కలిసొస్తుంది? నువ్వు రచయితవి. హీరో వర్షిప్ కావాలి నీకు. నిన్ను కావాలని కోరివచ్చే అమ్మాయిలను మాత్రం నిరాశ పుచ్చలేనంతే విశాల హృదయుడివి. దయచేసి నా జీవితం నుంచి తప్పుకో. అంతే. అంతకన్నా ఇంకేమీ కోరను." అంటూ చేతులు జోడించింది.

"సంధ్యా! సంధ్యా! సంధ్యా! చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావ్ సంధ్యా!"

రాజాకి సంధ్యని చూస్తే చాలా భయంగా ఉంది. వచ్చి భుజాల మీద చేయి వేయగానే విదిలించి కొట్టింది సంధ్య.

"సంధ్యా! చాలా ఆవేశంలో ఉన్నావు!"

"ఎందుకుండను? ఒక్క నెలలో నా జీవితమే తారుమారైపోయింది. నాతో మరీ దారుణంగా ఎక్స్‌పెరిమెంట్ చేస్తున్నావ్."

"లేదు సంధ్యా. నేను బలహీనుణ్ణే. కాదనను. కాని నిన్ను పచ్చిగా మోసం చేసి ఏడిపించాలనే అభిప్రాయం నాకెప్పుడూ లేదు. కటిక నిజాలని నువ్వు అందరిలా దిగమింగలేవని నేను అంత రహస్యంగా బ్రతికాను. కాని నిన్ను వంచించి సుఖాలని పొందాలని కాదు."

రాజా గొంతు దుఃఖంతో నిండిపోతోంది.

"సంధ్యా! నువ్వంటే నాకెంతో భయం, గౌరవం. నీ సున్నితత్వం ముందు, నిజాయితీ ముందు నేను అతి దారుణంగా ఓడిపోతుంటాను. అందుకే నాకై నేను చేతులారా చిక్కులు తెచ్చుకుంటున్నాను. నా కోసం... కొంచెం... కొంచెం తమాయించుకుని నా మాట వినమ్మా... సంధ్యా వినవూ?"

రాజా రెండు చేతులతో మొహం కప్పుకున్నాడు. అతనికి శక్తి నశిస్తోంది. తన మీద తనకే ఏవగింపు ఎక్కువవుతోంది.

హు.. ఎప్పుడూ ఈయనగార్నే అర్థం చేసుకోవాలి, జాలి పడాలి. లేకపోతే దీనంగా బ్రతిమాలతాడు. ఇదీ ఒక నాటకమే.

రాజా మీద కోపం చల్లారుతుందనే భయంతో, సుమిత్ర మాటలని మననం చేసుకుంటూ కోపాన్ని పెంచుకుంటోంది.

"సంధ్యా, నువ్వు నమ్ముతావో నమ్మవో నీ ఇష్టం. మనింటికి వచ్చిన పిల్ల నా ఓల్డ్ స్టూడెంట్. వాళ్ళన్నయ్యా, నేను కలసి చదివాము. ఓ క్రిస్టియన్ యువకుడిని పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకుని, వచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొడుతోంది. వాళ్ళన్నయ్య చాలా దూరంగా ఉన్నాడు. తను సపోర్ట్ చేస్తే వీళ్ళ తల్లిదండ్రులు మరీ దుమ్మెత్తి పోస్తారనీ, నన్నే అన్నీ చూడమని అతను వారం క్రితం ఉత్తరం రాశాడు. పెళ్ళి నిశ్చయించడంతో దిక్కుతోచక నా దగ్గరికి వచ్చేసింది. ఆ అమ్మాయిని ఒంగోలు తీసుకువెళ్ళి, ఆ విల్సన్ అనే అతడిని కలిసి అప్పటికప్పుడు అతని మిత్రుల సహాయంతో గుళ్ళో పెళ్ళి ఎరేంజ్ చేయించాను. అతను క్రిస్టియన్ అయినా, పాపం ఈ అమ్మాయి కోసం గుళ్ళో పెళ్ళికి అంగీకరించాడు. పెళ్ళి జరిగినట్టు సర్టిఫికెట్ ఇస్తారని నేను గుళ్ళో పెళ్ళికి అడ్డుపెట్టలేదు. ఇందాక తొమ్మిదింటికి అయిపోయి ఉంటుంది. నువ్వు చాలా కోపంగా – రమ్మని ఫోన్‌లో చెప్పడంతో ఆ ఏర్పాట్లన్నీ వాళ్ళకి అప్పగించి పరిగెత్తుకుకొచ్చాను. ఇప్పుడు చెప్పు నావన్నీ అబద్ధాలేనా? ఆ అమ్మాయి మరీ బెదిరిపోతుండడం వల్ల అంత తొందరగా ఒంగోలు చేర్చాల్సి వచ్చింది. అంతేగానీ, ఎవరితోనో రహస్యంగా కోరికలు తీర్చుకోడానికి నేను వెళ్ళలేదు సంధ్యా! ఇప్పుడు తెలుస్తోంది నేనెంత దురదృష్టవంతుణ్ణో! నేను చేసిన తప్పులకి నాకీ శిక్ష పడాల్సిందే."

బాధగా కణతలు రుద్దుకుంటూ సంధ్య వైపు చూశాడు. అతని కళ్ళు జ్యోతుల్లా

ఉన్నాయి. సంధ్యకి ఆ కళ్ళు తుడుస్తూ, తల నిమురుతూ, లాలించాలనిపించింది. ఇందాకటి ఆవేశం లేదు. కాని కారణాలేమైతేనేం ఈ రాజా తనని చిత్రాతిచిత్రంగా బాధ పెడుతున్నాడు. తనిప్పుడు ఓదార్చినా రేపింకో సమస్య తెచ్చిపెట్టడని నమ్మకమేమిటి? తనకింక ఓపిక లేదు.

"పడుకో సంధ్యా. నీకు వాళ్ళ అడ్రసు ఇస్తాను. నా మీద అనుమానం ఇంకా తీరకపోతే రేపు నిన్ను ఒంగోలు తీసుకువెళతాను" అతను పడుకుంటూ అన్నాడు.

సంధ్య కూడా లైట్ తీసేసి బెడ్‌లైట్ వేసింది. పడుకోడానికి ప్రయత్నించింది. తను మరీ ఆవేశపడి తనని తాను బాధపెట్టుకుని, అతన్ని కూడా బాధ పెట్టింది. తన తప్పు మాత్రం ఏముంది? ఎవరైనా అపార్థం చేసుకునే అవకాశం ఉంది కదా! సారీ చెబుదామనుకుని కామ్‌గా ఊరుకుంది. మరి సుమిత్ర చాలా విరుద్ధంగా చెప్పింది. సుమిత్ర మూడ్స్‌నీ, అబద్ధాలనీ, తత్వాల్నీ అన్ని కోణాల నుంచి పరిశీలించి, ఓ ఖచ్చితమైన దూరాన్ని పాటించిన తను, నిన్నంతా ఆ అమ్మాయికి ఎలా సరెండర్ అయింది?

రాజా ఇంకో సిగరెట్ వెలిగించిన చప్పుడయింది. రాజా బాగా బాధపడుతున్నాడు. తనకి మాత్రం ఎందుకీ పట్టుదల? కేవలం లైంగిక నేరాన్ని చాలా పెద్ద నేరంగా ఊహించుకుని బాధపడి ఇంతగా ఇతన్ని ద్వేషించడంవల్ల ఒరిగేదేముంది? కనీసం మనిషిలా ప్రవర్తించలేకపోతోంది. రాజా తనని మోసం చేసి ఉండవచ్చు. కాని అతన్ని ప్రతి క్షణం అసహ్యించుకున్నంత మాత్రాన, ద్వేషించినంత మాత్రాన కాలాన్ని వెనక్కి తిప్పి గతాన్ని చెరిపివెయ్యలేదు కదా! తనలో చాలా అల్పత్వం పెరుగుతోంది. సంధ్య మంచం మీద లేచి కూర్చుంది.

"రాజా"

"ఏమిటి సంధ్యా? పడుకో."

"నేను సస్పెన్స్ భరించలేక గుంటూరు వెళ్ళాను తెలుసా? పైగా నిన్న రాత్రి కూడా అక్కడ నీ కోసం ఎదురుచూసి, పొద్దున్నే బయలుదేరాను."

"ఓ!"

సంధ్యకి ఎంత పిచ్చెక్కి ఉంటుందో రాజాకి బాగా అర్థమైంది. చెయ్యి చాపి ఆమె తలని నిమిరాడు. అతను తల నిమరగానే సంధ్యకి ఏడుపొచ్చేసింది. ఏడిస్తే గాని మనస్సు తేలికపడదనిపిస్తోంది.

"సంధ్యా!" అన్నాడు వెక్కిళ్ళ చప్పుడికి కంగారుపడి.

"ఏమిటో! నువ్వేనాడు నన్ను దగా చేశావో అప్పటి నుండి నా నీడని చూసి నేనే భయపడుతున్నాను." బోర్లా పడుకున్నదల్లా వెక్కిళ్ళు ఆపి, తలెత్తి అంది.

రాజా చెయ్యి సంధ్య తలని గుండెల దగ్గరకు లాక్కుంది. సంధ్య ప్రతిఘటించలేదు. అతి మెల్లగా నిన్నటి విషయాలన్నీ పొల్లుపోకుండా అన్నీ చెప్పింది.

సుమిత్ర నిద్రపోకుండా అవతలి గదిలోంచి తమ సంభాషణ వినడానికి ప్రయత్నిస్తుందని తెలుసు. సుమిత్ర గురించి చెడ్డగా చెప్పి రాజా మనస్సు విరిచెయ్యడం సంధ్య ఉద్దేశం కాదు. కాని సుమిత్ర కోసం ఇంత రిస్క్ తీసుకుంటున్న రాజాని ఆ సుమిత్రే ఇలా తొందరగా స్త్రీలోలుడనీ, తిరుగుబోతనీ నొక్కివక్కాణించి చెప్పడం, ఎనిమిదేళ్ళు కాపురం చేసిన సంధ్యకే చాలా కష్టమనిపిస్తోంది. తన భయాన్ని రెట్టింపు చేస్తూ సుమిత్ర ఎన్ని చెప్పింది? అసలు సుమిత్ర ప్రేమే నిజమయిన ప్రేమయితే, రాజా ఎంత నీచుడైనా అతని గురించి చెడుగా చెప్పకూడదనే సంస్కారాన్ని పాటించి ఉండేది.

సంధ్య చెప్పేవన్నీ వింటూ ఆమె వెన్ను నిమురుతూ రాజా నిట్టూరుస్తున్నాడు. సంధ్యలాంటి మనిషిని ఒక్కరోజులో అంత హిప్నటైజ్ చేయగల్గిన సుమిత్ర తెలివికి హతాశుడయ్యాడు. అతని హృదయంలో పూర్వపు సుమిత్ర మాయమై ఓ వాంప్ రూపం కళ్ళముందు కదలసాగింది. క్రాఫు సరిజేసుకుంటూ నుదుటిమీద సంధ్య చేయి వేసుకుని అతను కోపం ఆపుకోడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు. ఆ సంగతి సంధ్యకి బాగా అర్థమవుతోంది. సుమిత్ర మీద ఇప్పుడు నేరాలు చెప్పడం ఆమెకేమీ సిగ్గు పడాల్సిన విషయం కాదు. సుమిత్ర సామాన్యురాలు కాదనే విషయం ఆమెకి బాగా అర్థమైంది. ఒకవేళ తను విసిగి ఈ రాజాని సుమిత్రకి అప్పజెప్పినా ముందు జీవితంలో ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించనిదే వదలదు.

"సంధ్యా, ఇప్పుడయినా నమ్ముతావా? నేను సుమిత్రని కవ్వించలేదు. ఒక విధంగా సుమిత్రే నన్ను ప్రోత్సహించింది. అంటే నీలాంటి ఆధునిక యువతులు నమ్మరు. మీలాంటి వాళ్ళ సానుభూతి సుమిత్ర వైపే ఉంటుంది."

"నిజమే" సంధ్య అంగీకరిస్తున్నట్టు అతని ఛాతి మీద తలూపింది.

రాజా సంధ్య తల సవరించి ప్రేమాతిశయంతో ముద్దు పెట్టుకున్నాడు. ఎంత నలిగిపోతోందీ పిచ్చిది! ఆ రాక్షసి తన మీద సంధ్యకి ఏవగింపుని ఎక్కువచేసి సంధ్యని తరిమేసి తనతో శాశ్వతంగా కాపురం పెట్టడం కోసం ఎదురుచూస్తోందని తనకి ఇదివరకే తెలుసు.

చాలాసేపు అరమరికలు లేకుండా మాట్లాడుకుని, ఎప్పటికో నిద్రపోయారు. బాగా పొద్దెక్కాక గాని మెలకువ రాలేదు. తల దిమ్ముగా ఉంది, సెలవు పెడదామా అనిపించింది. పాపని రెడీ చేసి పంపడం కోసం లేచి మొహం కడుకున్ని పాపకి స్నానం చేయించింది. గబగబా ఉప్మా చేసి పిల్లలకి తినిపిస్తూ కూర్చుంది. సుమిత్ర నిద్ర లేచిన ఛాయలేమీ లేవు. రాజా కాఫీ త్రాగుతూ పేపరు చేస్తూన్నాడు.

"రంగమ్మా, సుమిత్రని లేపి కాఫీ తాగమని చెప్పు." సంధ్య పిలిచింది.

"ఏమోనమ్మా, ఆ గది ఊడుద్దాం లెగమ్మా, అంటే కస్సుమంది." అంది రంగమ్మ.

సంధ్య లేచి సుమిత్ర దగ్గరికి వెళ్ళింది. సుమిత్ర మూలుగుతూ మూడంకె వేసుకుని పడుకుని ఉంది. సంధ్య మంచం దగ్గరే నిలబడినా కళ్ళు తెరవలేదు.

"సుమిత్రా, ఒంట్లో బావోలేదా?" తప్పనిసరి పరామర్శలా అడిగింది.

సమాధానంగా పెద్దగా మూలిగి కదిలింది.

"లేచి బ్రష్ చేసుకుంటే కాఫీ తాగొచ్చుగా?"

"మీ అందరికీ నమస్కారం పెడతాను. నాకేమీ వద్దు. నన్నిలా మాడి చావనివ్వండి."

"చావడమేమిటి సుమిత్రా?"

"నేనే కదా చెడ్డదాన్ని?" ఏడుస్తున్నందుకు గుర్తుగా భుజాలు ఎగురవేసింది.

"అందరం చెడ్డవాళ్ళమే. నువ్విలా అలిగితే నాకు మాత్రం ఓపికుండాలిగా? ఎన్నాళ్ళిలా?"

"మాస్టారుని నమ్మి నేను మా ఇంటితో తెగతెంపులు చేసుకొచ్చాను. ఇప్పుడు మీ దగ్గర నాటకాలాడి మీకు దగ్గరై, నన్ను వదిలించుకోవాలని చూస్తున్నారు మాస్టారు."

"లేదు, లేదు. నీ గురించి ఇద్దరం బాధ పడుతున్నాం."

ఎన్నిసార్లు ఈ డైలాగ్ వాడా్రా బాబూ అనుకుంటూ సంధ్య విసుగుని ఆపుకుంది.

"నాకు తెలుసులెండి. రాత్రి నా గురించి ఏమనుకున్నారో అంతా తెలుసు. చివరికి నేను చెడ్డదాన్నయ్యాను. అందర్నీ నమ్మి ఇలా ఏడుస్తున్నాను. నాకేం ఖర్మ?"

"నిజమే, నీకేం ఖర్మ? మగవాళ్ళు హాయిగా బతకడం లేదా? నువ్వయినా రేపు అలాగే బ్రతకొచ్చు. లే. లే. లేచి కాఫీ తాగు."

సుమిత్ర లేచి దిండుకి చారగిలబడి కూర్చుంది. తలంతా రేగిపోయి, నిద్రమత్తు మొహంతో, కోపంగా బిగించిన పెదాలతో అదో రకంగా ఉంది. ఆ అవతారంలో సుమిత్రని చూస్తుంటే సంధ్యకి ఒకటే అనిపించింది. 'ఈ సుమిత్రని తొందరగా ఇంట్లోంచి పంపించేస్తే గాని ఇంట్లో శాంతియుత వాతావరణం ఏర్పడదు.' అశాంతి, క్రోధం అంతా సుమిత్ర రూపంలో ఈ ఇంట్లో తిరుగుతున్నట్టుగా ఈ ఇంటి వాతావరణమే మారిపోయింది. తన ఇంట్లో తనకే భయం, దిగులు, బెరుకు అన్నీ చాలా కాలంగా

ఏర్పడ్డాయి. స్వేచ్ఛాయుతమైన వాతావరణం లేనే లేదు.

"రావా, నాకూ టైం అవుతోంది." ఓపిక కూడదీసుకుంటూ అంది.

"వస్తాను. మీరెళ్ళండి." పెంకెగా అంది.

సంధ్య కదిలింది. వంటంతా పూర్తయ్యి, అన్నీ చక్కబెట్టుకునేసరికి తొమ్మిదిన్నర అయ్యింది. రాజా రెడీ అయి, "ఏరా నువ్వు కాలేజీకి వెళ్ళవా?" అన్నాడు, సంధ్య అలాగే కూర్చుని ఉండడం చూసి.

"ఊహూఁ, ఎందుకో నాకు భయంగా ఉంది." అంది సంధ్య. అశక్తతతో కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఏంట్రా, ఛా, రాత్రి నాకెంతో ధైర్యం చెప్పావు" అంటూ రాజా సంధ్య కన్నీళ్ళు తుడుస్తుండగా – సుమిత్ర విసురుగా వీళ్ళని దాటి వెళ్ళింది.

సంధ్య భయంగా చూసింది. "నాకెందుకో ఈ అమ్మాయి చూపులు, చేష్టలు చాలా భయాన్ని కలిగిస్తున్నాయి. మనిద్దరి మీదా కసితో ఏ సూసైడో చేసుకోదు కదా అనిపిస్తోంది."

"ఆ బెదిరింపులు చాలా అయ్యాయిలే. నేను తనతో గడపలేదని ఒకసారి నాలుగు రోజులు తిండి మానేసి హాస్పిటల్లో అడ్మిట్ అయ్యి... నన్ను రప్పించి... ఎందుకులే అవన్నీ? ఈ గొడవలు నేను చూసుకుంటాను. ఒక్క వారం టైమివ్వు చాలు. లే. లే. నువ్విలా డల్‌గా కూర్చుంటే నాకు ధైర్యం సన్నిగిల్లుతుంది." వీపు తట్టి, చేయి పట్టుకుని లేపాడు.

"నాకు ఓపిక లేదు. లీవ్ లెటర్ ఇచ్చెయ్యి." సంధ్య రాసి ఇచ్చేసింది.

బాబు ఓ మూల బొమ్మలతో ఆడుకుంటున్నాడు. ఎందుకో నవ్వొచ్చి.. పక పకా నవ్వుతూ "నానా! నానా!" అంటున్నాడు.

రాజా వాణ్ణి హృదయానికి హత్తుకుని ముద్దు పెట్టుకుంటూ "ఏంతి నాన్నలూ.." అన్నాడు.

రాజా జుట్టు పీకుతూ ఏదేదో వచ్చీ రాని భాషలో వివరించే ప్రయత్నం చేస్తున్నాడు.

బాబు. మాటలకి నవ్వుతో, "చిన్న చిన్న వాక్యాలు వచ్చేశాయి వీడికి. మనం గమనించుకోలేదు గాని." అన్నాడు నవ్వుతూ రాజా.

వాళ్ళిద్దర్నీ చూస్తూ నవ్వి నిట్టూర్చింది.

"అసలు బయట ప్రపంచం ఎలా ఉందో గమనించుకోవడం లేదు మనం. దినదినగండంగా బ్రతికేస్తున్నాం."

"నిజమే" అంటూ బాబుని దింపి, బూట్లు తొడుక్కున్నాడు.

"మరి నేను వెళ్ళి రానా?"

"ఊఁ."

"సాయంత్రం ప్రెస్ క్లబ్‌లో సాహిత్య సభ ఉంది. నీకిష్టమైన రైటర్స్ అందరూ వస్తున్నారు. వెడదాం. రెడీగా ఉండు. అయినా నువ్వింట్లోనే ఉంటావుగా? మధ్యాహ్నం లంచ్‌కి వస్తాలే."

రాజాతో బయటకొచ్చి, స్కూటర్ కదులుతూంటే బాబుతో టాటా చెప్పించింది.

చాలా రోజులయ్యింది రాజా మీద ఏ కోపం లేకుండా ఇంత మామ్ములుగా సాగనంపి.

స్కూటర్ కదులుతుండగా రిక్షా ఆగింది. పక్కింటివాళ్ళు దిగారు. ఇక తప్పదనుకుని నవ్వింది సంధ్య. వాళ్ళూ మర్యాదకి నవ్వి – "ఈ రోజు సెలవా?" అన్నారు.

"లేదండీ, లీవ్ పెట్టాను. ఫంక్షన్ బాగా జరిగిందా?"

"ఆఁ. వెళ్ళద్దు, వెళ్ళద్దని ఒకటే పట్టు పట్టారు. రేపు మళ్ళీ మా అమ్మాయి, అల్లుడూ దిగుతారని వచ్చేశాం. మా అబ్బాయి రాలేదు కదూ?" అన్నారు వాళ్ళు.

సుమిత్ర ఎప్పుడు వచ్చిందో తాళం చేతులందించి, గిరుక్కున వెనక్కు తిరిగింది. సుమిత్రని చూసేసరికి ఏదో పిరికితనం కలిగి, "వస్తానండీ" అని లోపలికి వెళ్ళిపోయింది.

సుమిత్ర తన సూట్‌కేస్ సర్దుకుంటోంది. బట్టలన్నీ నీట్‌గా మడతలు పెట్టుకుంటోంది. వెళ్ళిపోతుందేమో అనే ఆశాభావం కలిగింది సంధ్యకి.

ఏమీ ప్రశ్నించకుండా బెడ్‌రూంలోకి నడిచింది సంధ్య. ఈ రూం చాలా విశాలంగా సెపరేటెడ్‌గా కొంచెం బిగ్గరగా మాట్లాడుకున్నా ఎవరికీ వినిపించినట్లుగా ఉంటుంది. అందులో కెళ్ళితే ఏదో సెక్యూరిటీగా ఫీలవుతుంది సంధ్య. గదంతా సర్ది బెడ్ షీట్స్ మార్చింది. నీలం, తెలుపు కలిసిన చిన్న చిన్న పూలున్న బెడ్‌షీట్స్‌తో నీట్‌గా ఉన్నాయి మంచాలు. ఓ మూలగా టీపాయ్ మీద ఫ్లవర్‌వాజ్‌లో పెద్ద ప్లాస్టిక్ పూల గుత్తి. ఎంట్రన్స్‌లో జలపాతంతో ఉన్న సీనరీ. అంతే. సింపుల్ అండ్ సూపర్బ్ అంటారు అందరూ.

ఇప్పుడు తనకీ సౌందర్య దృష్టి కూడా ఖరీదుగా, స్వార్థపూరితంగా అనిపిస్తోంది. మిగిలినవాళ్ళ కన్నా మానవతా దృష్టి తమ దంపతులకి కాస్త ఎక్కువ ఉండవచ్చేమో. దాంతో పాటుగా సౌకర్యవంతమైన జీవితం కోసం తాపత్రయం, కాస్తో కూస్తో ఆడంబరమైన వస్తు ప్రదర్శన ఇవన్నీ ఉన్నాయి. తన భర్త, తన పిల్లలూ, తన సంసార

రుగ్మతలూ, బాధలు ఇవి తప్ప అసలు బయట ప్రపంచంతో తనకేం సంబంధాలున్నాయి? తన వల్ల సమాజాని కేమిటి ప్రయోజనం?

పరిశుభ్రంగా ఉన్న ఆ గదిని చూసున్న కొద్దీ సంధ్యకి విరక్తి పెరగడం ప్రారంభమైంది. సంపాదించే స్త్రీలకి ఆత్మాభిమానాల గురించి బాధ. చాలామంది అసలా ఆత్మాభిమానాల గొడవల జోలికి వెళ్ళరు. వాళ్ళు ఓ రకంగా సుఖపడిపోతారు. సమాజంలో అతి సహజంగా ఇమిడిపోతారు. ఇంకా ఇంకా దిగువగా ఉన్న స్త్రీకి పిల్లల్ని పెంచడం కూడా సమస్యే. తల్లికే పోషకాహారం ఉండదు. పిల్లలకి ఏదో తినిపించాలనీ, వాళ్ళ కడుపులు నింపాలని బెంగపడే తల్లులకు ఏ దారీ ఉండదు. ఏ పూట కాపూట జరుగుబాటు గురించి వెతుక్కునే తల్లులకి ఈ ప్రేమ కథల గురించీ, ఈ హృదయాల పోరాటం గురించీ ఏమన్నా పడుతుందా?

కడుపు నిండిన తనలాంటిదానికే ఈ మానసిక వ్యాధులన్నీనూ. జంతువులకి సెక్స్ విషయాల్లో నియామాలున్నాయా? మనిషి నియమాలకి లొంగినా జీవితాంతం నియమబద్ధంగా ఎక్కడ బ్రతుకుతున్నాడు? సంప్రదాయాలని దేశ కాల మాన పరిస్థితులను బట్టి ఆదరించాల్సిన నీతి నియమాలని గౌరవిస్తున్నట్లు నటిస్తున్నాడు. ఓ పక్క దాదాపు అన్ని పట్టణాల్లో ఎక్కడో ఒక చోట సాగే వ్యభిచార వృత్తి ఈ నీతి నియమాలకు సవాలు కాదా? ఇటువంటి నీతి పట్ల తనకూ కూడా ఉన్న పిచ్చి నమ్మకాల వల్లే కదా, రాజా దాంపత్య జీవితంలో అదుపు తప్పాడని ఇంత గగ్గోలు పెడుతోంది? ఏమిటిదంతా? ఇష్టమైన ఆహారాన్ని తీసుకున్నట్టే ఇష్టమైన మనుషులతో గడిపే అవకాశాలుంటే తనలాంటి వాళ్ళు ఏడవడం, ఈ రాజా లాంటి వాళ్ళూ సంజాయిషీ లిచ్చుకుంటూ బ్రతకడం తప్పుతుంది కదా!

అప్పుడే జ్ఞానోదయమైనట్టుగా కుటుంబ వ్యవస్థని విడదీసి చూస్తూ, స్త్రీ పురుషుల సంబంధాల్లో తేడాల గురించి మథన పడుతూ, నీతి నియమాల బరువుని విశ్లేషించడానికి ప్రయత్నించసాగింది సంధ్య. ఏమీ అర్థం కావడం లేదు. తల వేడెక్కుతోంది.

'వద్దు వద్దు. సంఘం పుట్టుపూర్వోత్తరాల గురించి, కట్టుబాట్ల గురించీ ఇప్పుడు ఆలోచించి ఇప్పుడు బుర్ర వేడెక్కించుకోవడం శుద్ధ దండుగ. అసలు ప్రేమ అనే ఓ సున్నిత భావనే ఇన్నిన్ని కష్టాలకు కారణం. మనోహరంగా, అపూర్వంగా కనిపించే ఈ ప్రేమ చాలా నిర్దయగా, కఠినంగా మనుషులతో ఆడుకుంటూ, పొగమంచులా మారిపోయి మనుషుల్నీ గారడీ చేస్తుంది. అంతా మన ఊహల్లోనే ఉంది. తనకేమయినా బుద్ధి ఉంటే ఈ 'ప్రేమ' సంగతి క్రమంగా మరిచిపోయి అసలు తనేమిటో, తన పరిధేమిటో, తన అస్తిత్వానికి గుర్తింపు ఏమిటో – ఇవి వెతుక్కోవాలి. గిరిజలా జలపాతంలా ఉరకలు వేస్తూ గంభీరంగా ప్రవహించే నదిలా మారిపోతూ ఉండాలి.

తను మారాలి, మారాలి. ఈ మొగుడూ, ఈ ఉద్యోగం, ఈ పిల్లలూ ఇవన్నీ ప్రకృతి ధర్మాలు. మనుగడలో భాగాలు. వ్యక్తిత్వపు వికాసం, పరిసరాలనీ, సమాజాన్నీ కాంతివంతం చేస్తుంది. లోపాలని బహిర్గతపరుస్తుంది. తను వ్యక్తిగా, కేవలం సంధ్యగా ఎదగాలి. రాజా భార్యలా కాదు. కానే కాదు!'

ఏదో కృత నిశ్చయంతో, ఉత్సాహంతో లేచి అటూ ఇటూ తిరగసాగింది సంధ్య.

ఇంట్లో బాబూ, రంగమ్మ, సుమిత్రా, మధ్యాహ్నం భోజనానికి వచ్చిన రాజా అందరూ మరీ పసివాళ్ళలా కనిపిస్తున్నారు. సంధ్య ఆదరణకీ, చిరునవ్వులకీ కొత్త అర్థాలు చెప్పుకుంటూ మళ్ళీ కాలేజీకి వెళ్ళిపోయాడు రాజా.

పుస్తకాలు ముందేసుకుని అది పనిగా చదువుతున్న సంధ్యని చూసి తెల్లబోయింది సుమిత్ర. తన ఏడుపులనేమీ ఈవిడ పట్టించుకునే స్థితిలో లేదు. ఆవిడకేం? అసలు ఆవిడే మంచిదైతే... మంచి పెళ్ళామే అయితే తన బ్రతుకిలా ఎందుకు మారేది?

ఆవిడ లేని సమయమే తన ప్రేమ కథకి ఆలంబనైందనీ, ఆవిడ ఉద్యోగపు పరుగులే తన అణుకువతనాన్నీ, నిబిడీకృతమైన దాంపత్యపు తియ్యటి ఊహలని ప్రదర్శించుకునే అవకాశాలిచ్చాయనీ, సుమిత్రకి ఏ మాత్రం తట్టడం లేదు. అన్నీ అర్థం చేసుకునే వయసున్నా, రక్షణ తక్కువైన వర్తమానం ఆమె మనస్తత్వాన్ని చాలా విషపూరితం చేస్తోంది.

తననింక ఎవరూ బ్రతిమాలరని అర్థమయ్యాక, తనే భోజనం వడ్డించుకు తింది సుమిత్ర. సంధ్య సాయంత్రం వరకూ ఏదో ఒక పని చేస్తూ రాజా వచ్చాక పిల్లల్ని ముస్తాబు చేసింది.

"వీళ్ళెందుకమ్మా అక్కడకి? బోర్ కొడుతుంది వీళ్ళకి." అన్నాడు రాజా.

"పర్వాలేదులే. అల్లరి చేయకుండా చూస్తాను. మనం వెళితే బిక్కమొహాలు వేస్తారు." అని తనూ తయారైంది.

ప్రెస్ క్లబ్‌కి చేరారు.

అక్కడ ఆధునిక సాహిత్యం మీద చక్కని గోష్ఠి ఏర్పాటు చేశారు. తన అభిమాన రచయితలని చాలా మందిని చూసింది. ఇంకా తెలిసున్నవాళ్ళు చాలా మంది కనిపించారు. కథా రచయితగా రాజాకి చాలా మంచి పేరుంది. "పదేళ్ళ నుండి కథలే రాస్తున్నారు గాని, ఒక్క నవలైనా రాయలేదు." అన్నాడొక మిత్రుడు.

"రాయదల్చుకున్న నవలనే ముక్కలు ముక్కలు చేసి కథలుగా పంపిస్తాను గాని, నవలలు రాయడం నా వల్ల కాదు." అన్న రాజా మాటలకు అందరూ నవ్వారు.

"నేను తొందర మనిషిని. పైగా ఏకాగ్రత తక్కువ. అందుకే నవలలు రాయడం అసాధ్యంగా ఉంది" అని కథా రచన గురించి, కథల్లో వాడిన, వాడుతున్న భాష గురించీ, కథల్లో ప్రాంతీయత ఎంత బలమైన శిల్పం అవుతుందో సోదాహరణంగా వివరిస్తూ క్లుప్తంగా అందంగా తన టాక్ ముగించాడు.

అతను మాట్లాడుతున్నంత సేపు సంధ్యలో అలిగి పడుకున్న ప్రేమ భావన మెల్లగా అలక తీరిన భామలా లేవసాగింది. రెండు చేతులూ మడిచి కట్టుకుని, ఏమీ భయం లేకుండా స్నేహితులతో మాట్లాడినట్టు చిరునవ్వుతో అందర్నీ చూస్తూ మాట్లాడుతూ, అందర్నీ ఆకట్టుకుంటున్న రాజాని ప్రేమగా చూసుకుంది సంధ్య.

మీటింగ్ అయ్యాక గుంపులు గుంపులుగా చేరి కబుర్లు మొదలుపెట్టారు. పిల్లలు బయటల్ లాన్స్‌లో గంతులేస్తూండడంతో సంధ్య కూడా అందరితో మాట్లాడుతూ కూర్చుంది. ప్రతీవాళ్ళకి 'నా బెటర్ హాఫ్ సంధ్య' అని సగర్వంగా పరిచయం చేశాడు. రాత్రి తొమ్మిందింటి వరకూ గడిపి, ఉల్లాసంగా ఇంటికి చేరారు.

పక్క పోర్షన్ లోంచి సుమిత్ర వీళ్ళని చూసి లోపలికి వెళ్ళిపోయింది.

సంధ్య ఏమీ పట్టించుకునే స్థితిలో లేదు. పిల్లలకి పెరుగన్నం తినిపించి నిద్ర పుచ్చేసింది. సుమిత్రని అడిగితే, రంగమ్మ, తనూ తినేశామని చెప్పింది. 'అమ్మయ్యా' అనుకుని "నువ్వూ రా" అని రాజాని పిలిచింది.

"నాకెందుకో కథ రాయాలనిపిస్తోంది సంధ్యా. ప్రయత్నిస్తాను. పడుకునే ముందు తింటానులే. నువ్వు తినేసెయ్" అన్నాడు – పేపర్లూ, పెన్ పుచ్చుకుని టేబుల్ దగ్గరకి వెడుతూ.

కథ మెదలుపెడుతున్నడంటే సంధ్యకి చాలా సంతోషమనిపించింది. 'పోనీలే మళ్ళీ ఎంత కాలానికి రాస్తున్నాడు' అనుకుని తను తినేసింది.

రాస్తున్న రాజాని చూడడం చాలా ఇష్టం తనకి. కళ్ళు వెలుగుతుంటాయి. అసతలను రచయితగా మాత్రమే పుట్టాడు. మిగిలినవన్నీ ఏవేవో పై పై తొడుగులు అన్నట్టు పెదిమలు బిగించి ప్రశాంతమైన మొహంతో చేతిలో పెన్ను పరుగులు తీస్తుంటే అక్షరాలు కూర్చుకుంటూ, తృప్తిగా తన వ్యాసంగంలో మునిగిపోయే రాజా మొహాన్ని చూడడం అదో అద్భుతమైన అనుభవం. కరువుతీరా చూసి వెళ్ళి ప్రశాంతంగా మంచం ఎక్కింది.

చాలా కాలానికి ఎక్కువ కష్టం లేకుండా కళ్ళు రెండూ మూతలు పడ్డాయి. నిశ్చింతంగా గాఢనిద్రలో మునిగిపోయింది సంధ్య.

# ౨

ఎప్పుడో కిటికీ రెక్క చప్పుడుకి మెలకువ వచ్చింది. పిల్లి దూకి అటూ ఇటూ చూసి మళ్ళీ కిటికీ ఎక్కి అవతలికి పారిపోయింది.

సన్నగా జల్లు ప్రారంభమైన శబ్దం వినిపిస్తోంది.

మంచి నిద్ర పోయినందుకు అంత మత్తు లోనూ అదో రకమైన హాయి ఫీలయింది సంధ్య. బెడ్‌లైట్ వెలుతురులో పిల్లలు అమాయకంగా నిద్రపోతూ కనిపించారు.

రాజా స్థానం ఖాళీగా ఉంది. కదలకుండా అలాగే కాసేపు పడుకుంది. టాయిలెట్‌కి వెళ్ళొచ్చి మళ్ళీ పడుకుందాం అనుకుని లేచింది. బెడ్ రూం తలుపులు రాలేదు. అవతల గొళ్ళెం పెట్టి ఉన్నాయి.

అంటే రాజా ఇంకా కథ రాస్తూనే ఉన్నాడా? టైమ్ ఎంతై ఉంటుందో?

మత్తు ఈసారి పూర్తిగా వదిలింది. ఎవరో నడిచినట్లనిపించి మంచం ఎక్కి గప్‌చిప్‌గా కళ్ళు మూసుకుని పడుకుంది. తలుపవతల అడుగులు పక్కకి వెళ్ళిపోయిన చప్పుడు.

ఏదో జరుగుతోంది. తను ఆదమరచి ఉండగా ఏదో జరుగుతోంది. తను మాటి మాటికీ ఉద్రేకపడడం కన్నా కళ్ళతో ఏం జరుగుతోందో చూసి, ఈ చర్యలని సహజంగా తీసుకోడం మంచిది. అతన్ని దుయ్యబట్టి లాభం లేదు.

పది నిమిషాలు అలాగే పడుకుంది. అసలు ఏం జరుగుతోందో? లోకమంతా గాఢ సుషుప్తిలో ఉన్న ఈ నడిజాములో ఏ అకృత్యం జరుగుతోందో? తనకి అకృత్యంగా అనిపించేది వాళ్ళకి దివ్యానుభూతిగా ఉండొచ్చు.

వాళ్ల అనుబంధం ఏపుగా పెరగాలంటే తన గుండెలు కార్చే కన్నీళ్ళు అవసరమవుతాయి. ఒకరికి దుఃఖకరమైనది వేరొకరికి సంతోషకరమైన అనుభవంగా మారవచ్చు. తన ఏడుపు ఖరీదుకి వాళ్ళకెంతో మధురమైన అనుభవం దొరుకుతుంది.

వీల్లేదు, వీల్లేదు! ఈ ఇంట్లో తనీ గదిలో ఉండగా వాళ్ళలా గడపడానికి వీల్లేదు. దెబ్బ తిన్న పులిలా లేచి పిల్లిలా వంటగదికి కనెక్ట్ చేసిన చిన్న తలుపు దగ్గరికి నడిచింది. అతి జాగ్రత్తగా తలుపులు తెరిచి, వంట గది తలుపులు కూడా తెరిచి, చుట్టూ తిరిగి వరండా గదిలోకి వచ్చింది. కిటికీ పై రెక్క మాత్రం ఒకటి ఓరగా తెరిచి ఉంది. ఏ దృశ్యం చూడాల్సి వస్తుందో అని భయపడుతూ కిటికీ లోంచి చూసింది.

రాజా పడక్కుర్చీలో కూర్చుని వెనక్కు వాలి సిగరెట్ కాల్చుకుంటున్నాడు. అతని పాదాల మీద తల పెట్టుకుని కింద పడుకుని ఉంది సుమిత్ర. రచయిత రాజా... 'స్త్రీలు హుందాగా లేకపోతే భరించలేను' అని చెప్పే రాజా ఇలా ఆ అమ్మాయి తన పాదాల మీద పడుకుంటే ఎలా కూర్చున్నాడు? ఇటువంటి పూజలే ఇతనికి కావాలా? అసలేం జరిగిందో? ఎందుకీ అమ్మాయి దగ్గరకొచ్చాడు?

సందేహించకుండా తలుపు తట్టింది.

"ఎవరు?" అన్నాడు రాజా.

"నేను, తలుపు తియ్యి."

రాజా తలుపు తీసి సంధ్యని చూసి బలవంతంగా నవ్వాడు.

సుమిత్ర కళ్ళు తెరిచి మళ్ళీ నేల మీద మూడంకె వేసుకుని పడుకుంది. సంధ్య అలాగే నిలబడింది. అతన్ని చూస్తూనే ఉంది. ఆ చూపులు అతన్ని చీల్చేస్తున్నాయి.

"పద సంధ్యా!" అన్నాడు తలుపు వేసేస్తూ. సంధ్య కదల్లేదు. ఇంకా అలాగే చూస్తూ నిలబడింది. మధ్యలో ఒకసారి సుమిత్ర వైపు కళ్ళు తిప్పింది.

"పద సంధ్యా!" చెయ్యి భుజం మీద వేయబోయాడు.

వెంటనే విదిలించి కొట్టింది. "సుమిత్రా!" అంది.

సుమిత్ర కదిలింది.

"లే, లేచి కూర్చో."

సుమిత్ర లేచి కూర్చుంది.

సంధ్య చూపుడివేలితో రాజాని చూపిస్తూ, "ఇదిగో నీకూ, అతనికి చాలా పెద్ద వ్యవహారాలున్నాయి. సమస్యలున్నాయి. మీ ఇద్దరూ ఎలా పరిష్కరించుకుంటారో, ఏం తంటాలు పడతారో మీ ఇష్టం. ఇది కేవలం మీ ఇద్దరి సమస్య. నన్ను గాని ఇందులోకి లాగారంటే నేను పోలీస్ కంప్లయింట్ ఇస్తాను. ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను... జాగ్రత్త!" సంధ్య కత్తి దూసుకుపోయినట్టు ఆ గదిలోంచి హాల్లోకి వెడుతూ – రాజాని "ఏయ్ మిస్టర్" అని పిలిచింది.

రాజా అప్పటికే హాల్లోంచి సుమిత్ర పడుకున్న గది తలుపులు మూసేశాడు. అతని నాలుక పిడచకట్టుకుపోతోంది. రౌద్రమూర్తిలా, ఇంకాస్త ఉంటే ఏ కత్తి తోనో పొడిచేయడానికి సిద్ధంగా అపరకాళిలా ఉన్న సంధ్యని చూస్తుంటే అతనికి వణుకు పుడుతోంది.

"నీకు దమ్ముంటే ఈ నిమిషాన నీ మనిషిని తీసుకుని వెళ్ళిపో. పొరపాటున కూడా మళ్ళీ నీ జీవితంలో అడుగుపెట్టను. అంతేగాని నేను నిద్రపోతుంటే నువ్వు

సమయం చూసుకుని ఇలా దొంగల్లా... ఛీ! సిగ్గులేదా! నువ్వో రచయితవా? ఇటువంటి నీచమైన రొమాన్స్‌నే ప్రచారం చేస్తావా? నీ క్కావల్సిన ఆనందాన్ని నిర్భయంగా ఎదుర్కునే చేవ లేదా?"

"సంధ్యా. హద్దులు దాటుతున్నావు."

"అవును. నా సరిహద్దుని దురాక్రమణ చేసే మనుషుల్ని తరిమివేయడానికి దాటి వస్తున్నాను. నువ్వు మాత్రమే తెలివిగలవాణ్ణనుకుని విర్రవీగకు రాజారావ్." వంకరగా నవ్వింది.

రాజా చెవులు మూసుకుంటూ బెడ్ రూంలోకి వెళ్ళి – "సంధ్యా లోపలికి వచ్చెయ్. నువ్వు కంట్రోల్ చేసుకోలేకపోతే అందరూ లేచి వింటారు. అల్లరి పడతాం. ప్లీజ్ రా" అని పిలిచాడు.

"ఓ! మీకు పరువూ మర్యాదలు చాలా ముఖ్యం అనుకుంటా రాజారావ్! అవేవీ పోగూడదు. ప్చ్.. ప్చ్."

"సంధ్యా, దయచేసి పడుకో. నేనింకేమీ చెప్పను. దయచేసి పడుకో."

సంధ్య ట్యూబ్‌లైట్ వేసి, స్లీపింగ్ టాబ్లెట్ ఒకటి వేసుకుని మంచినీళ్ళు తాగింది. టెన్షన్ కోల్పోతుందని తెలుసు. హృదయ విదారకమైన ఏడుపో, పిచ్చిదానిలా కేకలో – ఈ రెండిట్లో ఏదో ఒకటి తను చేయడం తథ్యం అనిపిస్తోంది. నిండా దుప్పటి కప్పుకుని స్పృహ లేని దానిలా మంచం మీద పడుకుంది. భౌతికంగా తనకు లభించని మనశ్శాంతి నిద్రలో లభిస్తుందేమోనని అన్వేషిస్తూ మగతగా రెండు హెచ్చరికలు, రాజారావ్‌కి పడేసి నిద్రలోకి జారిపోయింది.

'ఎంత పిచ్చిపని చేశాను' అని ఆడవాళ్ళ కన్నా హీనాతీహీనంగా, మౌనంగా ఏడుస్తూ దిండు తడిపేస్తున్నాడు రాజా.

మర్నాడు అన్ని కార్యక్రమాలు యథావిధిగా జరిగిపోయాయి. సంధ్య రిక్షా కోసం రోడ్డు మీదకి వస్తుంటే రమ చెల్లెలు శారద ఎదురైంది. ఆ అమ్మాయి అత్తగారిదీ ఈ ఊరే.

"అక్కా, మా అక్కగాని నీ దగ్గర కొచ్చిందా?" అంది శారద. ఆమె కళ్ళు ఏడ్చినట్టుగా ఉబ్బి ఉన్నాయి.

"లేదమ్మా, ఈ మధ్య చాలా రోజులయింది కలిసి. ఏమైంది?" అంది.

"రాత్రి నుంచి కనపడడం లేదట. అలిగి మా ఇంటికి వచ్చిందేమో అని మా బావ ఊరుకున్నాడట. ఇప్పుడు పొద్దున్నే వచ్చాడు. నాకు కంగారు పుట్టి అందర్నీ అడుతుగున్నా. చచ్చినాడు రెండో పెళ్ళి చేసుకున్నప్పటి నుంచి దానికి మతి లేదు." శారద కళ్ళల్లోంచి టప టపమని నీటి బొట్లు రాలి పమిట మీద పడుతున్నాయి.

"ఊరుకోమ్మా. పిల్లని వదిలి ఎక్కడికి పారిపోదు. వస్తుంది. ఊరుకో." అంది సంధ్య శారద చెయ్యి పట్టుకుని.

"లేదక్కా. మా అమ్మ చచ్చిపోయినప్పటి నుంచి నాకదీ, దానికి నేనూ తప్ప ఎవరూ లేనట్టుగా బ్రతుకుతున్నాం. మా నాన్న ఎవరినో చేరదీశాడని మా అన్నా వదినా వెళ్ళిపోయారు. అసలు పుట్టింటి అండ లేకుండా పోయింది. దాని సంసారం పాడయింది. ఏ కాలవలోనో దూకడానికి పోయుంటుందక్కా!'' శారద నిగ్రహించుకోలేక సన్నగా ఏడవడం ప్రారంభించింది.

"ఏడవకు. పద నేను కూడా వస్తాను. ఎక్కడుందో ఎంక్వైరీ చేద్దాం." అంది

"వద్దులే అక్కా. కాలేజీకి బయలుదేరావేమో! క్షేమంగా ఉంటే నేనే వచ్చి చెబుతాలే. నువ్వెళ్ళిపో అక్కా." అంటూ ఆ అమ్మాయి కదిలింది.

శారదకి ధైర్యం చెప్పిందే గాని, ఏ వార్త వినాల్సి వస్తుందో అని సంధ్యకి భయంగానే ఉంది. అసలీ శారద ఇల్లు ఎక్కడో కూడా తెలియదు. మళ్ళీ వెళ్ళి కనుక్కుందామంటే అడ్రెస్ అడగలేదే – అనుకుంటూ కాలేజికి వెళ్ళింది.

కాలేజి ప్రాంగణంలో అంతా గుంపులు గుంపులుగా నిలబడ్డారు. తల వంచుకుని బుద్ధిగా నడిచి వస్తున్న అమ్మాయిలను అడ్డుకుని ఏవిటో చెబుతున్నారు యూనియన్ లీడర్స్. ఆ వాతావరణం చూస్తే స్ట్రయిక్ అనే సంగతి అర్థమవుతోంది.

బాటనీ డిపార్టుమెంట్ దగ్గర నలుగురు లేడీ లెక్చరర్లు ఉన్నారు. సంధ్యని చూసి "హలో" అన్నారు అందరూ.

"ఏమిటీ? సెలవెందుకు ఇస్తున్నారు?" అంది హాస్యంగా.

"సెలవెక్కడ? మనం మధ్యాహ్నం లేదా సాయంత్రం వరకూ ఉండాల్సిందే అని ప్రిన్సిపల్ ఉత్తర్వు. పిల్లలు స్ట్రయిక్ చేద్దామని మహా ముచ్చట పడుతున్నారు." తెలుగు లెక్చరర్ పద్మజ అంది.

"సంధ్య పని హాయి. ఏ గొడవల్లేని ఉద్యోగం." అంది ఉష. ఆమె కెమిస్ట్రీ లెక్చరర్.

"అబ్బో. అప్పుడప్పుడు నన్నూ దబాయిస్తూనే ఉంటారు వీళ్ళు. గవర్నమెంట్ కాలేజీ అయితే ఇంకా చెలరేగుతారట."

"అయినా ఆ రవూఫ్‌కైనా బుద్ధుండాలి." అంది పద్మజ విసుగ్గా.

"ఏమైంది?" ఆదుర్దాగా అడిగింది సంధ్య.

"ఏముంది మామూలే. క్లాసులో ఓ కుర్రాడు గుండుసూదు లేసి కొడుతున్నాడట అమ్మాయిల మీద. వాళ్ళు ఇది వరకే కంప్లయింట్ ఇచ్చినా 'ఫలానా అని పేర్లు చెబితే

గాని నేనేనీ యాక్షన్ తీసుకోలేను' అన్నారట ప్రిన్సిపాల్. నిన్న అలా విసిరే కుర్రాణ్ణి రవూఫ్ చూసి లేవమన్నాడట. వాడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి ఊరుకున్నాడట. క్లాసులోంచి వెళ్ళమంటే – నేను క్లాసు వినాలి అని మొండిగా వాదిస్తూ కూచున్నాట్ట. సరే అని మళ్ళీ ఇతను లెక్చర్ ఇస్తుంటే ఓ అమ్మాయి ధైర్యంగా లేచి నిలబడి ఫలానా గిరి ఇలా చేస్తున్నాడు అని చెప్పిందట. రవూఫ్ మళ్ళీ ఆ కుర్రాణ్ణి క్లాసులోంచి పొమ్మన్నాట్ట లేదా ఆ బెంచి ఖాళీ చేసి ముందుకు రమ్మన్నాట్ట! వాడు రాను, సీటు మారమని చెప్పే హక్కు లేదని వితండవాదం చేస్తూ కూర్చున్నాడట. మాటామాటా పెరిగి నీ బాబుతో చెప్పుకో పో అన్నాడట ఆ కుర్రాడే. రవూఫ్ ఆ కుర్రాడి రెక్క పట్టుకుని లేపి బయటకి పంపించేశాడట. అప్పటికి గొడవ చేయకుండానే వెళ్ళాడు గాని, ఇదిగో వాళ్ళ గ్రూపు లీడర్నుని కలిసి ఆ లెక్చరర్ – 'నన్ను తన్నబోయారు, నానా తిట్లు తిట్టాడ'ని చెప్పి, తన ఫ్రెండ్స్‌తో సాక్ష్యం కూడా ఇప్పించి ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేసి, రవూఫ్‌తో అపాలజీ ఇప్పించమని కోరుతున్నాడు." ఇంగ్లీషు లెక్చరర్ రాధిక బాధగా అంది.

రాధిక మాత్రమే అంత బాధపడడం, మిగిలినవాళ్ళు ఉదాసీనంగా ఉండడం సంధ్యకి నచ్చలేదు.

"మరి రవూఫ్ తప్పేముంది? ఎందుకు సహిస్తాడు అతను మాత్రం?" అంది వాళ్ళని ఉద్దేశించి.

"కాస్త ముందూ వెనుకా చూసుకోవాలి. కుర్రాళ్ళకి ఉడుకురక్తం. కోపం ఎక్కువ. తను కాస్త తమాయించుకోవద్దా?" పద్మజ బాటనీ లెక్చరర్ నళినిని, ఉషని చూస్తూ అంది. ఆ ఇద్దరూ మిన్ను విరిగి ఎవరి మీద పడ్డా చలించనంత ధైర్యం గల వాళ్ళు. 'నిజమే' అన్నట్టు వత్తాసుగా తలలూపారు.

సంధ్యకి ఒళ్ళు మండింది. "క్లాసులోని మిగతా అమ్మాయిలదీ, కుర్రాళ్ళదీ ఉడుకురక్తం కాదా? ఆ అబ్బాయిది ఉడుకురక్తం కాబట్టి మిగిలినవాళ్ళు శాంతంగా ఊరుకోవాలా?"

"నా పాయింట్ మీ కర్థం గాలేదు సంధ్యా. లెక్చరర్‌కీ, స్టూడెంట్‌కీ మధ్య ఉన్న ఎడ్జస్ట్‌మెంటు గురించే నేను మాట్లాడేది. వాడికి ఎంత అండదండలుండబట్టే అంత చెలరేగుతాడు? ఆ పాయింట్ గ్రహించాలి మనం." సాగదీస్తూ, వెటకారంగా అంది. మిగిలినవాళ్ళు లోకానుభవం ఎక్కువైన స్వార్థపరుల్లా పద్మజనే బలపరిచారు.

"ఓ సంఘటనలో మంచీ చెడూ తేల్చి వేసే ముందు, వాళ్ళ వ్యక్తిగత హోదా, పలుకుబడినీ బట్టి మనం ప్రవర్తించాలా? ఆ కుర్రాడి అండదండల గురించి భయపడాలా? మనం ఇంతమందిమి ఉండి రవూఫ్‌కి సపోర్ట్ ఇవ్వలేకపోవడం అన్యాయం కాదా? ఇక మనమెందుకు మన్ కొలీగ్‌కి అండగా ఉండకపోతే?" సంధ్య

రెట్టించి ప్రశ్నిస్తుంటే ఎవరూ మాట్లాడలేదు. ఈ వాదోపవాదాలకు అక్కడ మరికొంతమంది చేరారు.

"అయినా ఈ రవూఫ్‌కి వెకిలితనం పోలేదు. రిజర్వ్‌డ్‌గా ఉండడం నిన్న మొన్నటివరకూ తెలిసేది కాదు. కుర్రాళ్ళలో కుర్రాడిగా బాగా సిల్లీగా ప్రవర్తించేవాడు." మాథ్స్ లెక్చరర్ అన్నాడు ఏ మాత్రం సానుభూతి చూపకుండా.

సంధ్య విస్తుబోతూ చూసింది. మనుషులెంత కప్పదాటుగా ప్రవర్తించడం నేర్చుకుంటున్నారో! ఎంత పిచ్చి ఆరోపణలు!

"రాజు గారూ, రవూఫ్ పూర్వపు ప్రవర్తనకీ, ఇప్పటి ఇన్సిడెంట్‌కీ అసలేమయినా సంబంధం ఉందా? ఈ సందర్భంలో మానవత్వం ఉన్న మనిషిగా ఆవేశపడి అలా ప్రవర్తించాడు. చాలా సహజంగా ప్రవర్తించాడు." అంది.

"మన మీదుండే ఇంప్రెషన్స్ బట్టే కుర్రాళ్ళ అల్లరి కూడా ఉంటుందండీ" రాజు తన అభిప్రాయం వెల్లడించాడు. అతనికి మంచి ట్యూషన్స్ ఉన్నాయి. చాలా మంది కుర్రాళ్ళు వస్తుంటారు.

"డబ్బు మదంతో, వెనక తల్లిదండ్రులు విస్తారంగా కల్పించే మితిమీరిన కంఫర్ట్స్‌తో కాలేజీలకి బయలుదేరే ఇటువంటి కుర్రాళ్ళ అహంకారాల ముందు ఏ ఇంప్రెషన్సూ ప్రభావాన్ని చూపించలేవండీ." క్లాసులకి వెళ్ళకుండా వచ్చేస్తున్న అమ్మాయిల వైపు చూస్తూ మాట్లాడింది సంధ్య.

దాదాపు స్టాఫంతా సంధ్య చుట్టూ చేరారు. రాధిక, సుజాత, కాంతం – వీళ్ళంతా సంధ్య వాదనని బలపరిచారు. పెళ్ళిళ్ళయి పిల్లల్ని కన్న ప్రతి వాళ్ళూ తామరాకు మీద నీటి బొట్లలా మనకెందుకీ గొడవలన్నీ అనే జడత్వంతో అవకాశవాదులుగా మారుతారు. తాము తెలివిగా వ్యవహరిస్తాం కాబట్టి ఏ గొడవల్లోనూ ఇరుక్కోము అని గద్దిస్తున్న తమ అంతరాత్మలని సముదాయిస్తారు గాని, ప్రతి మనిషికి ఏదో ఒక సమయంలో గాయాలవుతాయి. మనం కప్పుకున్న ఈ లౌక్యపు తెరలు ఆ గాయాల నేమాత్రం తప్పించలేవు – అనే నిజాన్ని మాత్రం అంగీకరించలేరు. గుమిగూడుతున్న లెక్చరర్లనీ, స్టూడెంట్స్‌నీ వ్యాకులంగా చూస్తూ, 'ఇప్పుడెలా, ఇప్పుడెలా' అనుకోసాగింది సంధ్య.

"రిజైనైనా చేస్తాను గాను, అపాలజీ చెప్పనని రవూఫ్ అంటున్నాడట" ఎవరో అన్న మాటలు కర్ణపేయంగా వినపడ్డాయి.

'రవూఫ్, నీ ఆత్మాభిమానాన్ని ఎంత జాగ్రత్తగా కాపాడుకుంటున్నావ్' అనుకుంది.

రాధిక దగ్గరకొచ్చి, "మేడమ్ మనం తప్పించుకోడానికి కాదు, ఆయన తరఫున నిలబడడానికి ఏమైనా చేయగలమా?" అంది విజ్ఞతతో.

సంధ్య రాధిక భుజం మీద చేయి వేసి – "పద రాధికా" అంది.

వెనుక ఇంకొంతమంది కుతూహలంతో, కొంత మంది నిజాయితీతో అనుసరించారు. ముందుగా లేడీస్ సెక్రటరీని పిలిచి చర్చించారు. ఆ అమ్మాయి నీళ్ళు నములుతూ "ఆ యూనియన్ వాళ్ళు నన్ను బలపరిచారు. అందుకే నేనేం చెయ్యలేకపోతున్నాను మేడమ్" అంది.

"యూనియన్ల గొడవద్దు వసుంధరా! జరిగిన అవమానం మీ అమ్మాయిలకే కదా! అయినా మీతో క్లాసులు బాయ్‌కాట్ చేయిస్తున్నారు. అదృష్టవశాత్తు మన కాలేజీలో మీ స్ట్రెంత్ వాళ్ళకి ఈక్వల్‌గా ఉంది. మీ అమ్మాయిలంతా క్లాసులకు వెళ్ళిపోతే, మా లెక్చరర్స్ అంతా రవూఫ్ గారికి అండగా నిలబడితే, న్యాయం రవూఫ్ వైపునే ఉంటుంది. గెలుస్తుంది. ఎలాగూ స్టీరింగ్ కమిటీ మీటింగ్ అడుగుతుంది. రవూఫ్ తరపున స్ట్రాంగ్ సపోర్ట్ ఉంటే, గిరి ఎంత పలుకుబడి ఉన్నవాడయినా ఏమీ చేయలేడు. మీరంతా ధైర్యంగా ముందుకు రావాలి. ఇది స్టూడెంట్స్ ప్రాబ్లమ్ కాదు, లెక్చరర్స్ ప్రాబ్లం అంతకన్నా కాదు. మీలాంటి అమ్మాయిలు... ఈవ్‌టీజింగ్‌ని ఎదుర్కోవడం అంతే. కేవలం మీ సమస్య తల్లీ ఇది."

రాధిక నేర్పుగా, సహనంగా అందర్నీ కన్విన్స్ చేయడం మొదలుపెట్టింది. రాధిక కళ్ళలో ఆ ధైర్యం చూసి సంధ్యకి కళ్ళు చెమర్చాయి.

ఇంకా పెళ్ళికాని రాధిక ఎంత శక్తిమంతంగా ముందుకొస్తోంది. నివురుగప్పిన నిప్పులా ఉండే రాధికలో చైతన్యం ఎంత అద్భుతంగా ప్రకాశిస్తోంది! సంధ్య కూడా ఇనుమడించిన ఉత్సాహంతో, అమ్మాయిలతో, అబ్బాయిలతో కూడా మాట్లాడడం మొదలుపెట్టింది.

ఇంతలో పోలీస్ వాన్ వచ్చింది. వాన్ చూడగానే కుర్రాళ్ళకి ఉత్సాహం పొంగింది.

"దౌర్జన్యకాండలు" అన్నాడు ఓ గ్రూప్ లీడర్.

గట్టిగా కేకపెడుతూ, "నశించాలి" అన్నారు కోరస్‌గా అతని చుట్టూ ఉన్న సహోదరులు.

"లెక్చరర్స్ జులుం"

"నశించాలి!"

"అబ్దుల్ రవూఫ్"

"డౌన్ డౌన్!"

యాంత్రికంగా లాఠీలు ఊపుకుంటూ లోపలి కొచ్చారు పోలీసులు. వాళ్ళ అదిలింపులకు కొంతమంది జడిసి తప్పుకున్నారు. ఈలోపల మేడమ్స్ సహాయంతో

చాలామంది క్లాసుల కెళ్ళిపోయారు. మొత్తానికి స్ట్రయిక్ ఫెయిలయింది.

సంధ్య, రాధిక తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

రవూఫ్ ఇంకా ప్రిన్సిపాల్ రూంలోనే ఉన్నాడు.

తన పనేమిటో తనది అన్నట్టు నిశ్శబ్దంగా, అసలు కాలేజీకి వస్తుందా రాదా అన్నంత చడీచప్పుడూ లేకుండా ఒంటరిగా లైబ్రరీ రూంలో గడిపే సంధ్య వాదనలో న్యాయానికి ప్రిన్సిపాల్‌తో పాటు కమిటీ మెంబర్స్ కూడా ఆశ్చర్యపోయారు. అప్పటికి అందుబాటులో ఉన్న కమిటీ మెంబర్స్ ఇద్దర్ని పిలిపించి చర్చలు జరుపుతూ కూర్చున్నారు ప్రిన్సిపాల్. స్ట్రయిక్ తాత్కాలికంగా ఫెయిలయినా ఇంకేం గొడవలు వస్తాయో అని అందరికీ భయం.

సంధ్యతో సమానంగా రాధిక, కాంతం, సుజాతలు వాదించడం అందరికీ ఆశ్చర్యమనిపించింది. ఉద్యోగరీత్యా కఱ్ఱ విరక్కుండా, పాము చావకుండా మాట్లాడాల్సి వచ్చినందుకు సిగ్గుపడుతున్న ప్రిన్సిపాల్ ఇంతమంది రవూఫ్ తరఫున నిలబడి వాదించడం చూసి చాలా ఆనందించారు. మిగిలిన మగ లెక్చరర్స్ చాలామంది కూడా భేషజపు తొడుగుల్ని తీసేసి, ధైర్య సాహసాలని తగిలించుకుని రవూఫ్ తరఫున నిలబడ్డారు. అనుకూలమైన తీర్మానాలు జరిగిన తరువాత అందరూ వికసించిన మొహాలతో బయటకొచ్చారు.

"నువ్వు సుదర్శనం చెల్లెలివి కదమ్మాయ్?" అడిగాడు కమిటీ మెంబర్ కోటేశ్వరరావ్ కళ్ళద్దాల్లోంచి సంధ్యని చూస్తూ.

"అవునండీ" అంది సంధ్య వెనక్కి తిరిగి.

"మీ అన్నయ్యా నేనూ క్లాసుమేట్స్. మీ ఇంటిక్కూడా వచ్చేవాణ్ణి. అప్పటికి నువ్వు గౌన్లేసుకుంటూ ఉండేదాని. ఇంత పిల్లవి" అన్నాడాయన ఇరవయ్యేళ్ళు వెనక్కి పోతూ. పాత జ్ఞాపకాలతో ఆయన మొహం ప్రసన్నమయింది.

"మీ అందరూ ఒక్క మాట మీద నిలబడగలిగితే ఏ కుఱ్ఱ సన్నాసులూ ఏమీ చేయలేరు. అయినా ఐ విల్ టాక్ టు హిజ్ ఫాదర్. వెళ్ళిరామ్మా, చాలా రీజనబుల్‌గా మాట్లాడావు." అన్నాడు మెచ్చుకోలుగా. ఆయనకి నమస్కరించి వచ్చేసింది.

రవూఫ్ చుట్టూ చాలామంది మూగారు. అయినా ఇప్పుడు పలకరించడం కూడా ఎందుకు? అతని మొహంలో బాధో, కృతజ్ఞతో, నిరాశో ఇటువంటివి చూడాల్సి వస్తుందని అసలు తను అతనివైపు చూళ్ళేదు ఇందాక. ఇంతమంది తనకి తోడవడం వల్ల మబ్బులా విడిపోయింది ఈ సమస్య.

అందరూ బయటికొచ్చారు.

పోలీసులు కొంతమంది వరుసగా, ఎదురుగా ఉన్న షాపుల అరుగుల మీద కూర్చున్నారు.

చాలామంది లేడీ స్టూడెంట్స్ ఉత్సాహంగా మాట్లాడుతూ సంధ్య, రాధిక తదితరులతో నడిచి వస్తున్నారు. మాటల్లో ఎంత దూరం నడిచారో తెలియదు. అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయాక సంధ్య ఒక్కతే మిగిలిపోయింది. రాధిక వెళ్ళిపోతూ అన్న మాటలు మననం చేసుకుంది.

"ఈ రోజు మనకి అనుకూలమైన తీర్పు వచ్చినా, రేపటి రోజున దీని పరిణామాలు చాలా వికృతంగా ఉండవచ్చు. మనకి పెళ్ళి కాలేదన్న ప్రత్యేకమైన భయంతో ఏమీ చెదరకూడదు." సుజాతని చూస్తూ అంది రాధిక.

ఈ రాధికని ఇంతకాలం గుర్తించనందుకు బాధపడింది తను.

"ఎంతటి ఘోరమైన అనుభవానికైనా మానసికంగా మనం తయారవ్వాలి." ఈ మాటలంటున్న రాధిక మీద తనకి ప్రేమ అంచెలంచెలుగా పెరిగిపోయింది. తన శూన్యత్వాన్ని ఈ రాధిక సాంగత్యం భర్తీ చేస్తుందేమో? ఎంత నిర్దిష్టమైన అభిప్రాయాలు! ఈ చక్కటి రత్నాన్ని ఎవరు అందుకుంటారో అదృష్టవంతులు.

నడుస్తూ రోడ్ క్రాసు చేస్తుంటే శారద గుర్తుకొచ్చింది. అయ్యో, శారదా నిన్నింతసేపూ మర్చిపోయాను. రమ దొరికిందో లేదో! ఈ రమదీ, తనదీ ఒకటే సమస్య. అనుభవించంలో చాలా తేడా ఉంది. ఎప్పుడో రమ చెప్పిన గుర్తులు మననం చేసుకుంటూ రెండు మూడు సందులు తిరిగింది. మూడవ సందులో రామకృష్ణ, బి.ఎ. ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ అన్న బోర్డు చూడగానే ఆగిపోయింది. ఇంటికి రంగులూ, సున్నాలు వేయని కొత్త ఇల్లు. మెట్లు పక్కగా ఉన్నాయి. ఓ పాప బయట ఆడుకుంటుంటే పిలిచి అడిగింది – "రమా అనే ఆవిడ ఉందమ్మా?"

"మా అమ్మేగా? మా తాతయ్య దగ్గరకెళ్ళింది" అంది గౌను దులుపుకుంటూ.

"ఎప్పుడెళ్ళింది?" అంది గుండె నిండా గాలి పీల్చుకుని.

"పొద్దున్నే. ఇందాక మా నాన్న చూసొచ్చాడు."

ఆ పాపనే వాళ్ళ తాతయ్య అడ్రసు అడిగి రిక్షా ఎక్కింది.

"ఎవరొచ్చారమ్మా?" అని లోపల్నించి ఎవరో పాపని అడగడం వినిపించింది.

దిగనా వద్దా అనుకుంటూ, "పోనియ్యి" అంది రిక్షా అతన్ని.

***

"అమ్మో అక్కా... సంధ్యక్క వచ్చింది." సంతోషంగా కేకేసింది శారద. మంచం మీద దిండుకు చేరగిలబడి కాఫీ తాగుతున్న రమ సంభ్రమంగా చూసింది. శారద గోడవారగా ఉన్న కుర్చీ తెచ్చి వేసింది.

"పొద్దుటినుంచీ నువ్వేమయ్యావో – అని భయపడుతూ చచ్చాను. పోన్లే, క్షేమంగా ఉన్నావు. ఎందుకిలా అందర్నీ కంగారు పెట్టావు?" చిరుకోపంతో అంది సంధ్య.

"నాలాంటి దాన్ని మృత్యువు కూడా కరుణించదు." ఏడవలేక నవ్వినట్టు నవ్వింది రమ.

"అక్కా, బాగా ఊరి చివర కెళ్ళి కాలవలో దూకిందీ అమ్మగారు. ఎవరో పెద్ద మనిషి వెంటనే దూకి రిక్షాలో వేసుకొచ్చి, నాన్నకి అప్పజెప్పాడు. ఇది రెండవసారి ఇలా చావడానికి ప్రయత్నించడం. మా అందరి ఉసురు పోసుకోడానికి ఇది మాయదారి ప్రయత్నాలు చేస్తోంది." మెటికలు విరుస్తూ అక్కని తిట్టింది శారద.

సంధ్య టైం చూసుకుంది. అయిదు.

"రమా, నువ్వు రెస్టు తీసుకో. నేను ఇంకోసారి మళ్ళీ వస్తాను. మీ పాపని చూశాను. బొమ్మలా ఉంది. పిల్లలని మరిచిపోయి చద్దామనుకుంటున్నావా? ఎంత పిచ్చి పని చేశావు? అతని కెంత లోకువ?"

"అసలా పిల్లల గురించే ఈ కష్టాలన్నీ అనుభవిస్తున్నా. ఇంకెక్కడైనా ఆవిణ్ణి పెట్టుకుంటాడా అంటే కొత్తగా ఇల్లు కట్టాము, ఆవిడ డబ్బు వేసి కట్టాం. అద్దింట్లో ఎందుకు పెడతాను? అంటూ ఇక్కడే పెట్టాడు గదా! ఎంత తమాయించుకుందామన్నా పక్కనే ఉంటుందాయే ఎప్పుడూ చూస్తూ." దుఃఖం దిగమింగడానికి ప్రయత్నిస్తూ అంది రమ.

'అర్థం చేసుకోగలను' అన్నట్టు తల మీద చేయి వేసి నిమిరింది. తన నెంతో అదృష్టవంతురాలిగా గౌరవిస్తున్న ఈ రమ సమస్యని ఇంకో పద్ధతిలో తను ఎదుర్కుంటోంది అంటే నమ్మగలదా? అలా వాళ్ళని చూస్తుంటే నిజంగా తను అదృష్టవంతురాలనిపిస్తోంది. తన హంగు, ఉద్యోగం, ధైర్యం వల్ల రాజా సుమిత్రలే పైకి తనంటే హడలిపోయినట్టుగా ప్రవర్తిస్తున్నారు. చివరి కిలా పోల్చుకుని అదృష్టవంతురాలిగా భావించుకోవాల్సి వస్తుంది. నవ్వుకుంటూ లేచి నిలబడింది.

నలభయ్యేళ్ళ స్త్రీ చీపురుతో వచ్చి గది తుడవడం ప్రారంభించింది. చాలా ఎదురుదెబ్బలు తిన్న అలుపు మొహంలో కనిపిస్తోంది. అర్భకంగా ఉంది. మంచం కింద తుడుస్తూ, "పెదపాపా, నువ్వు నిదరపోయినప్పుడు మీ ఆయన వచ్చాడు. నాకొడుకుని బాగా చివాట్లేసి, తరిమికొట్టాను. 'ఓ వారం రోజులు రెస్టు తీసుకోమను, తొందర్లేదు' అనుకుంటూ నంగనాచిలా మాట్లాడి ఎళ్ళిపోయాడు. అమ్మో మాటల్లో తేనె పూసిన కత్తే" అంటూ అవతల గదిలోకి వెళ్ళిపోయింది.

"ఈవిడే మా నాన్న చేరదీసి నావిడ, పాపం చాలా మంచిదే. తల్లి కన్నా ఎక్కువ సేవ చేస్తుంది. మేమే అందరూ ఏమంటారో అన్నట్టు సరిగ్గా కలవం గానీ,

చాలా మంచి మనిషి" రమ అంది.

శారద అందించిన కాఫీ తాగి, "మళ్ళీ వచ్చి తీరికగా మాట్లాడతా" అని చెప్పి బయటపడింది.

ఇప్పుడు మరీ ఉల్లాసంగా అనిపిస్తోంది. పెద్ద గీత, చిన్న గీతల్లా రమని క్షేమంగా చూసింది అంతే చాలు అనిపిస్తోంది. ఈ రిలీఫ్ ముందు వెనకటి బాధలు ఎటో ఎగిరిపోయాయి. మళ్ళీ కాసేపటికల్లా ముసురుకుంటాయి. ఇంతే మానవ జీవితం!

***

ఇంట్లో రాజా దీర్ఘాలోచనలో ఉన్నట్టు కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్నాడు. ఒళ్ళో బాబు ఏదో బొమ్మని జాగ్రత్తగా, పరీక్షిస్తూ కూర్చున్నాడు. సంధ్యని చూసి కేరింతలు కొడుతూ కిందకి దిగాడు.

రాజా కళ్ళు విప్పాడు. 'అమ్మయ్యా వచ్చావా' అన్నట్టుగా ఉన్నాయి చూపులు.

పాపం నేనూ చస్తానని భయపడుతున్నాడేమో ఇతను. అసలివేమి లింకులో, ఈ భయాలేమిటో.

అతనివైపు కన్నెత్తి చూడకుండా, సరాసరి వంటింట్లోకి వెళ్ళిపోయింది. స్టౌ మీద కుక్కర్ పెడుతుంటే బాత్ రూంలోంచి సుమిత్ర స్నానం చేసి వస్తున్నట్లుంది, సబ్బు వాసనతో వెళ్ళిపోయింది. బయట స్కూటర్ స్టార్ట్ అయిన చప్పుడు వినిపించింది. బహుశా రాజా వెళ్ళిపోయుంటాడు. అతను బాగా పొద్దుపోయి వస్తే బాగుండును.

"అమ్మా, నేను ఈ నెల గడిచాక మా ఇంటి కెళతా." రంగమ్మ బాంబులా మాట వదిలింది.

"ఊళ్ళోనే గదా, ఆదివారం వెళ్ళి చూసిరా రంగమ్మా." వంకాయలు ముందేసుకుని తరుగుతూ అంది.

ఆ మాటలకి తాత్పర్యం తెలుసు. బహుశా మానేస్తానని సూచించడం అంతే. మళ్ళీ ఇంకో సమస్య. సంధ్యకి బి.పి. తగ్గినట్టుగా అయింది.

"లేదులేమ్మా, నా ఆరోగ్గెం బాగుండట్లే. వయస్సు మళ్ళుతున్న దాన్ని. నాకెందుకని ఊరుకోకుండా సేసుకుపోవడమూ రాదాయే. వచ్చే నెల్నించీ మానేత్తా. ముందుగా సెబితే నీకూ కట్టం ఉండదు. ఎవుర్నయినా జూసుకోవచ్చు."

"నీకేం కష్ట మొచ్చిందో చెప్పు రంగమ్మా. ఏ కారణం లేకుండా మానేస్తానంటే నాకెంత ఇబ్బందవుతుందో ఆలోచించు."

"నీ మొగం జూసే ఇంతకాలం కిమ్మనకుండా సేసుకొచ్చాను. మీ ఇంట్లో ఉన్న ఈ సుమిత్తరమ్మ, పక్కింటామె గలిసి నన్ను ఒకటే ఎండేత్తన్నరు. పని సుబ్బరం

తెలియదని, గబగబా చేయలేనని ఒకటే ఇదిగా నవ్వుకోడం. శక్తి ఉడిగిందాన్ని. ఏదో శాతయినట్టు... అయినా నాకూ మీ యవ్వారాలన్నీ నచ్చలేదమ్మగారూ! నువ్వే మయినా అనుకో." తన మనసులో మాట బయటపెట్టేసింది.

తల దించుకుని గబగబా వంకాయలు తరిగేసింది. పనమ్మాయి లేకపోతే బాధపడేది తనే. అప్పుడు తనలాంటి వాళ్ళ అవసరం చాలా ఉంటుంది అనే ఎత్తులతో సుమిత్ర ఇలా ప్రవర్తించడంలేదు కదా? అబ్బబ్బ! ఎంత కాదనుకున్నా వీళ్ళందరి ప్రమేయం తన ఉద్యోగ జీవితంలో ఉంటోంది. తను దులుపుకుంటున్నా వీళ్ళు వదలడం లేదు.

"రంగమ్మా పెద్దదానివి. నా బాధ అర్థం చేసుకో. నువ్వు కూడా నా మీద కోపగించకు. కొంచెం ఓపిక పట్టు."

"అయ్యో తల్లా మీరు పెద్దవారు. మీ మీద కోపాలెందుకమ్మా? బాధపడతావని ఎన్నోసార్లు సెబుదామనుకుని నోరు కట్టేసుకున్నా. నా మీద ఎన్నో చాడీలు అయ్యగారికి సెప్పిందీ తల్లి. పని మడుసులకి లోకువియ్యగూడదని మాటిమాటికి అంటవేనాయె. నేనూ బాగా బతికిందాన్నే. నా కర్మమిలా కాలిపోయి...." రంగమ్మ పాత పాట అందుకుంది.

రంగమ్మ తూచి తూచి మాట్లాడడం కన్నా అలా గొణుక్కుంటేనే సంధ్యకి నిశ్చింతంగా ఉంటుంది. రంగమ్మకి అంతా అర్థమైపోయింది. తమ ఇద్దరి మధ్యా ఉన్న సంబంధాలలో తేడా ఈ విషయాన్ని ముందుకు తీసుకురానివ్వడం లేదు.

రంగమ్మ మాటలు వింటూ నచ్చజెపుతూ వంట ముగించేసింది. స్నానం చేసి, వాయిల్ చీర కట్టుకుని వదులుగా జడేసుకుని కూర్చుంది. హాలు రెండో ద్వారం తెరిస్తే సన్నజాజి పందిరి, మందార చెట్టు, నందివర్థనం చెట్టు కనిపిస్తాయి. ఓ కుర్చీ తీసుకుని సన్నజాజి పందిరి దగ్గర వేసుకుని పెరల్ ఎస్ బక్ 'గుడ్ ఎర్త్' తీసింది. రాత్రి పొందిన బిట్టర్ ఎక్స్‌పీరియన్స్ ఇప్పుడు తనని కుంగదీయడం లేదు. ప్రతి కన్నీటి బిందువూ మనస్సుని కడిగేస్తూ భవిష్యత్తును స్పష్టంగా చూపించగలుగుతోంది.

"అమ్మా! ఇక్కడున్నావా? నేనూ చదువుకుంటా" అంటూ పాప బాగ్ తీసుకుని వచ్చి, చాపేసుకుని కూచుంది.

రంగమ్మ బాబుని చంకనేసుకుని షికారు కన్నట్టు నడుస్తూ వెళ్ళిపోయింది.

స్త్రీని బలహీనపరిచి అణగదొక్కిన వ్యవస్థ ఒక్క మనదేశంలోనే లేదు. చాలా చోట్ల పురుషాధిక్యం గల సమాజాలే ఎక్కువ. మాతృత్వపు విలువలు, కుటుంబ సంక్షేమానికి స్త్రీ పడే కష్టమూ, ఆ చాకిరీ ప్రపంచమంతా దాదాపు ఒకే తీరుగా ఉందా అనిపిస్తోంది సంధ్యకు పుస్తకం చదువుతుంటే.

# 10

"ఎవరో వచ్చారు మీ కోసం" సుమిత్ర తలుపు పక్కనుంచి సన్నగా అంది.

లేవకుండా కుర్చీలోంచి వెనక్కి తిరిగి చూసింది. సుమిత్ర సగం తలుపుచాటుగా నిలబడడం వల్ల మొహం ఎలా ఉన్నదీ తెలియడం లేదు. ఏదో చెబుదామనుకుని విరమించుకుని లేచింది. పుస్తకం అలా పట్టుకునే ముందు గదిలోకి వచ్చి "ఎవరూ?" అంటూ, కనుచీకటిగా ఉందని స్విచ్ నొక్కింది. ట్యూబ్‌లైట్ కాంతిలో ఆ వ్యక్తిని చూసి ఆశ్చర్యంగా నవ్వింది.

"మీరా?"

"నేనే. చక్కటి విశ్రాంతిని పాడు చేశానా?"

"లేదు. లేదు. అయ్యో నిలబడే ఉన్నారు. కూచోండి. ఊహూ. అక్కడ కూచుందాం రండి. చల్లగా ఉంది." ఓ కుర్చీ మడతబెట్టి పట్టుకోబోతుంటే చేతిలో పుస్తకం జారింది.

అతను వంగి ఆ పుస్తకం తీసి పేరు చూసి ఇచ్చేస్తూ,

"మీరు పదండి. నేను తెస్తాను" అన్నాడు కుర్చీ ఓ పక్క చెయ్యి వేసి. వద్దనబోయి ఊరుకుని ముందు నడిచింది.

హాల్లో కూర్చున్న సుమిత్ర ఎప్పుడూ మగవాళ్ళని చూడనిదానిలా గబాల్న అవతలికి తప్పుకుంది. సంధ్య పిలిచేలోపల కనుమరుగైంది. 'సర్లే పరిచయం చేసే బాధ తప్పింది' అనుకుంటూ "మా ఇల్లెలా కనుక్కున్నారు?" అంది నవ్వుతూ.

"మీరీ వీధిలోంచి రావడం చాలాసార్లు చూశాను. ఇక్కడ పుట్టి పెరిగినవాణ్ణి కదా, ప్రతీ రోడ్డూ, ప్రతీ పేటా బాగా తెలుసు."

"థాంక్స్. నేను పిలవకపోయినా వచ్చినందుకు."

"పోన్లెండి. తిడతారేమోనని అనుకున్నాను." రవూఫ్ తేలిగ్గా నవ్వాడు.

తనూ నవ్వేసి, "ఉండండి. ఇప్పుడే వస్తాను" అంటూ వంట గదిలోకి వెళ్ళి డబ్బాలు వెతికింది. నాలుగు బిస్కట్లు, కారబ్బూందీ దొరికాయి. టీ నీళ్ళు పడేసి, అవి ప్లేట్లో పెట్టుకొచ్చి "తీసుకోండి" అంది.

ఆ ప్లేట్ అందుకుంటూ రవూఫ్ "ఎంతో కృతజ్ఞుడిని" అన్నాడు. గొంతులో మార్దవం, గౌరవం పోటీలు పడినట్టు మాటలని మృదువుగా మారుస్తున్నాయి.

"ఈ బిస్కట్లకా?"

"భలేవారే, మీకు హాస్యంగా మాట్లాడడం కూడా వచ్చా?"

"ఇంకా నయం. మాటలొచ్చా అన్నారు గాదు."

"నేను జాయినై రెండేళ్ళే కదా అయింది. నిజంగానే మాటలు రావా అనుకున్నాను."

"తప్పు తప్పు. ఎక్కువ మాట్లాడడం రాదా అనాలి." సవరించింది సంధ్య.

"ఎంతైనా రచయితగారి భార్య మీరు. ఏరీ రాజారావ్ గారు బయటకెళ్ళారా?" బిస్కట్ కొరుకుతూ అన్నాడు.

"అవునండీ."

"మీకు ఇద్దరు పిల్లలా? ఇందాక పాపని చూశాను. బాబేడి?"

"మా రంగమ్మ బయటకి తీసుకెళ్ళింది."

సుమిత్ర ఎవరు అంటాడేమో అని సమాధానం సిద్ధం చేసుకుంటున్న సంధ్య అతనా ప్రశ్న వేయకపోవడంతో తేలిగ్గా నిట్టూర్చింది.

"ఆయన చక్కగా కథలు రాస్తారట. మీరు కూడా మంచి సాహిత్యం చదువుతారని ఎవరైనా కనిపెట్టగలరు."

"అంటే మంచి చదువరులనే ముద్ర ఏమైనా మొహం మీద ఉంటుందా?'' హాస్యంగా అంది.

"ఉండవచ్చునిపిస్తోంది." సాలోచనగా చూస్తూ అన్నాడు.

"ఈ రోజు నా అనుభవమే మీది ఎంత బలమయిన వ్యక్తిత్వమో చెప్పింది. అంతమందిని కూడగట్టుకునే శక్తి మీకుందని ఎప్పుడూ అనుకోలేకపోయాను. ఎంత ఓపిగ్గా వాదించారు? మంచి సాహిత్య పఠనం వల్లనే మిమ్మల్ని మీరు తతిమ్మా ఆడవాళ్ళకన్నా భిన్నంగా తీర్చిదిద్దుకోగలిగారేమో – అని నాకెందుకో అనిపిస్తోంది. నా గురించి మీరంత రిస్క్ తీసుకోవడం మరిచిపోలేను మేడమ్. జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను." కృతజ్ఞతా భారంతో బరువుగా, ఆర్ద్రంగా పలికింది రవూఫ్ కంఠం. చూపుల్లో ఎంతో గొప్ప విశ్వాసం.

రవూఫ్‌లో తను చూస్తున్న సరికొత్త సంస్కారపు ధోరణి ఆ మితభాషిణినీ కరిగిస్తోంది. మాములు సంధ్యలా మారిపోతూ, "మీరు కాకపోయినా, ఎవరైనా సరే, మన స్టాఫ్ అన్యాయానికి గురవుతుంటే ఎదురు తిరిగేదాన్ని. నేను ఆరంభించాను. అందంగా మన సమస్య అంతమైంది అందరి సహకారం వల్ల. అంతే. నేను ప్రత్యేకంగా ఏం కష్టపడలేదు."

"నేను బాగా అర్థం చేసుకున్నాను. మన స్వీపర్ కాంతమ్మ గురించి అయినా

మీరు ఇంతే ఔదార్యంతో వ్యవహరించగలరు. ఎందుకంటే నా తరఫున నిలబడి మాట్లాడాల్సినంత స్నేహమేమీ మన మధ్య లేదు. నాకు తెలుసు ఆ నిష్పక్షపాతమే నన్ను...” ఏదో గుర్తుకొచ్చినట్టు లేచి నిలబడి, “వస్తాను మేడమ్. బాగా చీకటి పడింది. మీ వారిని కలవడం కుదరలేదు.” అన్నాడు నడుస్తూ.

“ఈసారి తీరిగ్గా రండి. రాజా కూడా చాలా స్నేహంగా ఉండే మనిషి.”

“తప్పకుండా వస్తాను. బై” చెయ్యి ఊపి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

తనూ నవ్వుతూ చెయ్యి ఊపి లోపలికి వచ్చేసింది. పిల్లలకి అన్నాలు పెట్టి నిద్రబుచ్చేసింది.

“ఆ అమ్మాయిని పిలిచి భోజనం చేయమను రంగమ్మా” అంది.

రంగమ్మ వెళ్ళి వచ్చి, “ఆ యమ్మకి ఆకలి లేదంటమ్మా.” అంది.

“అయితే నువ్వు తినెయ్యి.” అని వడ్డించేసి, మళ్ళీ పుస్తకం తీసుకుని పిల్లల పక్కనే వాలింది.

బాగా సాధిస్తోంది. ఆ అమ్మాయితో అసలు మాట్లాడబుద్ధి కావడం లేదు. బ్రతిమాలే ప్రశ్నే లేదు. ఆ అమ్మాయి అభోజనంగా ఉంటే తను తినడానికి కూర్చోవాలనిపించడం లేదు. సుమిత్ర వచ్చి నెలన్నర అయింది. విచిత్రంగా తన జీవితమే మారిపోయింది!

గిరిజకి ఉత్తరం రాయాలనిపించింది. ఎందుకో లేచి, మంచం పక్కనే ఉన్న ప్లాస్టిక్ పూలకుండీ ఉంచిన చిన్న టీపాయ్ కేసి యథాలాపంగా చూసింది. పేపర్ వెయిట్ కింద గుండ్రటి అక్షరాలతో ఉన్న కాగితం విముక్తి ప్రసాదించమంటూ ఫాను గాలికి రెపరెపలాడుతోంది. ‘అది రాజా దస్తూరీ’ అనుకుంటూ తీసింది.

*“సంధ్యా!*

*కూల్‌గా మాట్లాడే పరిస్థితిలో నువ్వు లేవని తెలిసి ఇలా కాగితం మీద నా బాధ నివేదించుకుంటున్నాను. చదువుతూ కూడా నన్ను తిట్టకు. రాత్రి దృశ్యాన్ని చూసి నువ్వు చాలా రకాలుగా ఊహించుకుని నా మీద కసిని, అసహ్యాన్నీ పెంచుకుని ఉంటావు. నేనెంత వెధవనైనా మరీ భార్యని పక్కమీద వదిలి ఇంకో గదిలో ఆడదానితో కోరిక తీర్చుకునేటంత సిగ్గుమాలినవాడిని కాదు. నేను బలహీనుణ్ణే. నీ ముందు ఆ నిజాన్ని ఒప్పుకోడానికి నేనేమీ సిగ్గుపడను. కాని రాత్రి ఏం జరిగిందో చెబుతున్నాను విను. ఓ రచయితగా, సుమిత్ర స్వార్థపు పోకడలని చప్పున క్యాచ్ చేయగలుగుతున్నాను. ఒకప్పుడు నా మీద ఆరాధన, భక్తి, ప్రేమ – ఇవన్నీ ఇగిరిపోతూ ఎలాగైనా నన్ను గెలుచుకోవాలనే పట్టుదలా, అవసరమైతే నన్ను బ్లాక్‌మెయిల్ చేయడానికైనా వెనుదీయని కక్షా సుమిత్రలో పెరుగుతున్నాయి. సుమిత్రని సరిగ్గా అంచనా వేయడంలో నాలోని*

రచయిత పూర్తిగా ఫెయిలయ్యాడు. ఏది ఏమైనా నాకంటూ ఆమె గురించి నైతిక బాధ్యత ఉందనే న్యాయం, నన్ను అంకుశంలా ఎప్పుడూ పొడుస్తూ ఉండడం వల్ల నేను ఓపికపడుతున్నాను.

రాత్రి నేను చేసిన పిచ్చి పని బెడ్‌రూం బయట గొళ్ళెం వేయడం. నా అతితెలివే నన్ను నీకు పట్టించింది. ఈ అమ్మాయితో సామరస్యంగా మాట్లాడి ఎలాగో ఒకలా ఇక్కడ్నించీ పంపేద్దామనే ఉద్దేశంతో ఆమె దగ్గర కెళ్ళి కూర్చున్నాను. నీకు తెలియని గూడుపుఠాణీ మన వెనుకాల చాలా జరుగుతోంది. తరువాత చెప్తాను నీకు. మంచి మాటలతో కన్విన్స్ చేయడానికి ప్రయత్నించాను. అసలింత దగ్గరగా ఉన్నా కూడా నాతో ఉన్న పూర్వపు జీవితం మాయమయిందే – ఎలాగో ఒకలా వదిలించుకోవాలని చూస్తున్నాడే అన్న భయమే ఆమెని ఇంతగా దిగజారుస్తున్నాయి. నా మాటలకి చలిస్తూ వెంటనే నా కాళ్ళమీద పడిపోయింది. ఆ అమ్మాయి పేదరికం, పెరిగిన వాతావరణం, పరిపక్వత లేని మనస్తత్వం, సినిమాల ప్రభావం ఇవన్నీ అమాంతం కాళ్ళమీద పడిపోయే అలవాటు నేర్పాయి. ఇప్పుడే కాదు పూర్వపు రోజుల్లో కూడా ప్రతీ చిన్న విషయానికి కాళ్ళ మీద పడి ఆశీర్వదించమనడం, పాదాలు అద్దుకోవడం అలవాటు. అందుకే నేనా భంగిమని పట్టించుకోకుండా కూచున్నాను. ఆ సమయంలో నువ్వు రావడం నా దౌర్భాగ్యం! నీతో ఏమైనా చెప్పుకుని క్షమాపణ అయినా అడగలేనంత అగాధం మన మధ్య ఏర్పడిపోయింది. ఈ అగాధాన్ని పూడ్చుకోవడానికి జీవితమంతా వెచ్చించడానికయినా నేను సిద్ధమే.

నేను బలహీనుణ్ణీ, స్వార్థపరుణ్ణీ, అవకాశవాదినీ కావచ్చు గాని, మరీ ఇంత కుటిలుడిని కాదు సంధ్యా!

నీ నమ్మకాన్ని పోగుట్టుకున్న నిర్భాగ్యుడు.

నీ రాజా."

ఉత్తరం రెండుసార్లు చదివి చించేసింది. భర్త అనే అనుబంధాన్ని అవతలికి నెట్టి అతని జీవితాన్ని పరిశీలిస్తే తనకే చాలా సానుభూతి కలుగుతోంది. కానీ ఏం చేయగలదు? ఇప్పటికే తను కష్టపడింది. ఇక తనవల్ల కాదు.

కాని ఈ ఉత్తరం ఇచ్చిన వివరణ ఆమెలో ఘనీభవించిన ఏవగింపును తగ్గించి, ఒక విధమైన మనశ్శాంతిని కలిగించింది.

ఈ రోజు సామూహికంగా సాధించిన విజయం, రవూఫ్ ఆగమనం మనస్సు నింకో విశాలమైన బాట మీదకి మళ్ళించాయి. ఆ బాటలో ట్రాఫిక్ ఇబ్బందులేమీ లేవు.

నవల మీద మనస్సు లగ్నం కావడం లేదు. ఆకలి దంచేస్తోంది.

స్కూటర్ ఆగిన చప్పుడుకు లేచి టేబుల్ దగ్గర కొచ్చి అన్నీ వడ్డించింది.

రాజా లోపలి కొచ్చి – "సంధ్యా!" అనబోయి ఊరుకుని, బాత్‌రూమ్‌లో కెళ్ళి కాళ్ళూ, చేతులు కడుక్కుని వచ్చాడు.

ఎంత మనస్సు బాగోకపోతే సుమిత్ర భోజనం మీద అలుగుతుంది? అందుకే తనకి జాలి. ఛీ! తనకి సిగ్గు లేదు! జాలి... జాలి... ఎన్ని విషయాల గురించి తనకి జాలి? ఈ జాలి అనే బలహీనతే తననింత దోపిడీకి గురిచేస్తోంది. తనని తాను తిట్టుకుంటూ, "రమ్మను" అంది ముభావంగా.

"సుమిత్రా" అన్నాడు కంచంలో అన్నీ గబగబా వడ్డించుకుంటూ. "తొందరగా భోజనం చేసేస్తాను."

"వద్దులే. నేను పిల్లల దగ్గర కూర్చుని భోజనం చేస్తాను." అంటూ ప్లేటు తీసుకుని కదిలింది.

రాజా మళ్ళీ ఇంకోసారి పిలిచేసరికి సుమిత్ర పిల్లిలా అడుగులేసుకుంటూ వచ్చింది.

"భోజనం చెయ్యి" అన్నాడు సౌమ్యంగా.

ఆమె కూర్చుంది. ఎవరి మట్టుకు వాళ్ళు మౌనంగా తిని లేచారు.

రాజా అన్నిటిమీదా మూతలు పెడుతూ, "సంధ్యా! ఏమన్నా కావాలా?" అని అన్నాడు.

"అక్కర్లేదు." అని సమాధానం ఇచ్చి, గబగబా తినేసి, వచ్చి మజ్జిగ తాగింది. అతనేమయినా పలకరిస్తాడేమో అన్నట్టు రాజా వైపు చూడకుండా నవలలో మునిగిపోయింది.

రాజాకి ఓపిక లేదు. సంధ్య కన్నా ముందే నిద్రపోయాడు.

నవల పూర్తి చేసి, మంచినీళ్ళు తాగేసి వచ్చి ఓసారి పిల్లల్నీ, రాజాని చూసి లైటు తీసేసింది. మంచం ఎక్కుతూ గోడవారగా ఉన్న స్విచ్ నొక్కింది.

నీలం రంగు జీరో వాట్స్ బల్బు కాంతి లేతగా ఆ గదంతా ఆవరించింది.

***

రవూఫ్ పేరు పేరుగా అందరికీ కృతజ్ఞతలు చెప్పాడని రాధిక, సుజాత, కాంతం చెప్పారు. ఓ కొత్త సంఘటన వల్ల కొత్త కొత్త స్నేహాలు వృద్ధి చెందుతాయి.

లంచ్ అవర్‌లో – దూరంగా ఉన్న లైబ్రరీ దగ్గరకి వెళ్ళి మాట్లాడి వస్తే గాని వాళ్ళకు బావుండడం లేదు. తనకన్నా కాస్తో కూస్తో వయస్సులో చిన్నవాళ్ళయిన ఆ ముగ్గురితో సంధ్య చాలా బాగా కలిసిపోయింది. నాలుగు రోజులు గడిచాక ఒక

రోజు టైమైపోతుందే అని ఎటూ చూడకుండా స్పీడ్‌గా ఆఫీసు రూం దాటి వెడుతున్న సంధ్యకి “సంధ్య గారూ!” అన్న పిలుపు వినిపించి తలెత్తింది.

సంపెంగ చెట్టు దగ్గర తెలుపురంగు పమిట చెంగు కనిపించింది. సంధ్య అటువైపు అడుగులు వేయగానే “ఇలా రండీ” అంటూ ఖాళీగా ఉన్న ఓ క్లాసురూంలోకి తీసుకెళ్ళింది రాధిక.

అక్కడ బెంచీ మీద తలవాల్చుకుని సుజాత కూర్చుంది. పక్కనే కాంతం విచారంగా చూస్తోంది.

“మీరు గేటు దగ్గర గోడ మీద ఏం చూడలేదా?” రాధిక అడిగింది.

“ఏం లేదే? ఏం జరిగింది? సుజాత ఎందుకలా ఉంది? ఒక్క నిమిషం రాధికా. నేను అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి వస్తాను. మనం కొంచెం స్థిమితంగా మాట్లాడుకుందాం.” అంది.

సంధ్య వెళ్ళి సంతకం చేసేసి వస్తుండగా – అక్కడక్కడా కుర్రాళ్ళు కొంతమంది ఏమిటో మాట్లాడుకుంటున్నట్టు ఒకళ్ళిద్దరు చిన్నగా నవ్వినట్టుగా అనిపించింది. మధ్యలో స్పష్టంగా కనిపిస్తున్నట్టుగా లాబ్ గోడ మీద బొమ్మలు చూసి నిలబడి పోయింది.

“గోపికాలోలుడు రవూఫ్” అని ఓ మగవాడి బొమ్మ కింద ఎర్రటి అక్షరాలు రాసున్నాయి. మగవాడి మీద పడిపోతున్న అమ్మాయి బొమ్మ మీద “సుజాత” అని రాసి, “ముద్దుల భామ సత్యభామ” అని ఉంది. ఇంకో మూడు స్త్రీ బొమ్మలున్నాయి. వాటి కింద తన పేరు, రాధిక పేరు, కాంతం పేరు ఉన్నాయి. “బృందావనంలో గోపికలు – కృష్ణుడితో రాసక్రీడల కోసం పరితపించిపోతున్న భామినులు.” అని రాశారు.

కనుబొమలు ముడేసి, ఏవగించుకున్నట్టు నడుచుకుంటూ సుజాత దగ్గర కెళ్ళింది.

“ఏయ్ సుజాతా. ఈ పిచ్చి గీతలకా ఇంతగా ఏడుస్తున్నావ్? ఆ రోజు మనమేం అనుకున్నాం?” నిర్లక్ష్యంగా అంది.

“నేను చెబుతున్నాను సంధ్య గారూ, కాలేజీ మెయిన్‌గేటు పక్కనే బొమ్మలు వేశారు. మీరు గమనించి ఉండరు. అలా అందరికీ బాగా కనిపించే ప్రదేశాలు ఎన్నుకుని బొమ్మ వేశారు.”

సుజాతకి పెద్దగా వాయిస్ లేదు. తనూ మాట్లాడింది గాని రాధిక లాగా, తనలాగా వాదించలేదు. కాకపోతే, అరవిరిసిన గులాబీలా, ఇంకా వదలని స్టూడెంట్ లక్షణాలతో ముద్దుగా, అమాయకంగా, అందంగా ఉంటుంది. పెద్ద పెద్ద రింగులతో, పొట్టిగా ఉన్న జుట్టుని క్లిప్ పెట్టుకుని వదిలేసే సుజాత నడుస్తుంటే ఏ ఫైనలియర్

అమ్మాయో అనుకుంటారు గాని, లెక్చరర్ అని ఎవరూ అనుకోరు.

కేవలం అందంగా ఉండడమే కారణమా – రవూఫ్‌కి అంత సన్నిహితంగా చూపిస్తూ బొమ్మలు వేయడానికి? సంధ్యకి అర్థం కాలేదు.

“ఇద్దరూ ఒకే డిపార్ట్‌మెంట్‌కి చెందినవాళ్ళు కాబట్టి, ఏదో ఒక బొమ్మ ఇలా అసభ్యంగా వేయాలి కాబట్టి వేసేసి ఉంటారు.” అంది రాధిక.

సుజాత తలెత్తి చూసింది. కళ్ళు జ్యోతుల్లా ఉన్నాయి. “ఎమ్మెస్సీ వరకూ కూడా నేను ఒక్క మాట అనిపించుకోకుండా బతికానండీ.” కళ్ళు మళ్ళీ నీళ్ళతో నిండిపోయాయి.

సంధ్య ఆ కన్నీళ్ళు తుడుస్తూ, “నిజమే సుజాతా, మన సౌశీల్యం, మానగుణం మాత్రమే మనల్ని రక్షించవు. ఎప్పుడూ ఏమీ పట్టించుకోనట్టుగా తమ పని తాము చేసుకుపోయే స్వార్థపరులూ ఉంటారు. వాళ్ళు సురక్షితమైన బ్రతుకు కోసమే చూస్తారు తప్ప, ఎవరేమైపోయినా వాళ్ళకేమీ పట్టదు. వాళ్ళు మంచివాళ్ళలాగా, తల వంచుకుని పోయే సుగుణవంతులుగా కీర్తి పొందుతారు. అటువంటి బిరుదులు మనకి కావాలా? చెప్పు? ఊఁ, చెప్పు!” బుజ్జగిస్తూ అంది.

చిన్నపిల్లలా పళ్ళతో పెదిమల్ని నొక్కిపెట్టి, దుఃఖాన్ని అదిమిపెడుతూ ‘వద్దు’ అన్నట్టుగా తలాడించింది సుజాత.

“నీ భయాలు నాకు తెలుసు. పెళ్ళిగాని ఉద్యోగినులకి అటువంటివి భవిష్యత్తులో గొడ్డలిపెట్టు అవుతాయి. కాని ఎప్పుడో రాబోయే సుఖాల కోసం మన కళ్ళముందు జరిగే అన్యాయాన్ని ఖండించకుండా ఉంటామా? ప్రతివాళ్ళూ ఇలాగే సంకుచితంగా తయారయితే రేపు మనం మాత్రం ఒంటరిగా మిగిలిపోమా?”

“నేను ఆయన తరఫున నిలబడినందుకు కాదండీ నా బాధ. కనీసం ఆయనా, నేను కూడా ఎక్కువగా మాట్లాడుకోం. అసలా ఉషా, పద్మజలే ఎప్పుడూ జోకులేస్తూ చాలా సోషల్‌గా మూవ్ అయ్యేవారు.”

“నాకు తెలుసు. మనిషిలో ఎన్నెన్ని లోపాలు ఉన్నా పదిమంది పాడే పాటనే వీళ్ళూ ఆలపిస్తే అందులో ఇబ్బంది ఉండదు. కాబట్టి చాలామంది కన్నింగ్‌గా జారిపోగలరు. అసలు వాళ్ళతో పోలికలే అనవసరం.”

“మా పేరెంట్స్‌కి తెలిస్తే.... అసలు ఉద్యోగమే వద్దన్నారు వాళ్ళు.. నేనే...” తప్పు చేసినట్టుగా అంది.

“ఉద్యోగం వద్దంటే ఆ మాట నచ్చక ఎలా జాబ్‌లో చేరారో అటువంటి స్వంత నిర్మాణాత్మక శక్తి ఇప్పుడూ ఉండాలి. జాబ్‌లో చేరినప్పటి నుంచీ మీరు ఎదుర్కొనేవి కేవలం మీ స్వంత సమస్యలు. వాటిని ఎక్కడో దూరంగా ఉన్న వాళ్ళ

పరువు ప్రతిష్ఠలకి జత చేస్తూ కుమిలిపోవడం బొత్తిగా అనవసరం. లేవండి. ముందు క్లాసులకెళ్ళండి." చనువుగా చేయి పట్టుకుని లేపి ధైర్యంగా ఇంకో నాలుగు మాటలు చెప్పి సుజాతని పంపించింది. రాధిక, కాంతం వైపు తిరిగి – "మనం లంచ్‌టైంలో కలుద్దాం. మీరే లైబ్రరీ దగ్గరి కొచ్చేయండి." అంది.

వాళ్ళు బుద్ధిమంతురాళ్ళలా తలలూపి వెళ్ళిపోయారు. లైబ్రరీ కొచ్చి కూర్చుని ఆలోచనలో పడింది సంధ్య.

రాధిక డేరింగ్ అండ్ డేషింగ్. ఇటువంటి వాటికి ఏమీ భయపడదు. సంప్రదాయ నీడలలో ఒద్దికగా ఆకుచాటున పిందెలా బ్రతికిన సుజాత, కాంతం లాంటి యువతులు భయపడడంలో నిజంగా అర్థం ఉంది. ఇటువంటి నీలాపనిందలే వైవాహిక జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయి ఒక్కోసారి.

నిజానికి ఈ అసభ్యతని పట్టించుకోవాల్సిన అవసరం ఏ మాత్రం లేదు. దులుపుకోవచ్చు. కాని సుజాత క్రుంగిపోకుండా ఉండాలంటే కుక్కకాటుకి చెప్పుదెబ్బలా ఏదో ఒక రిటార్డ్ ఇవ్వక తప్పదు. అందుకు తను సిద్ధం కావాలి. సుజాతకీ ధైర్యం వస్తుంది.

"ఎక్స్‌క్యూజ్ మీ!"

కుడి చేతి మణికట్టు మీద గడ్డం ఆనించి దీర్ఘాలోచన చేస్తున్న సంధ్య కళ్ళు తిప్పింది.

రవూఫ్ కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ – "మీరేం బిజీగా లేరుగా?" అన్నాడు చుట్టూ చూస్తూ.

"లేను. కూర్చోండి." తన పక్కన ఉన్న కుర్చీ ముందుకు జరిపింది.

అతను కూచుని ఏదో చెప్పబోయి మళ్ళీ ఆగాడు.

సంధ్య ఏదో అనబోయి అతనే చెబుతాడేమోలే అని తనూ ఆగింది. ఆమె నిస్సంకోచంగా అతని వైపు చూస్తూ కూచుంది గాని రవూఫ్ ఏమీ మాట్లాడలేని వాడిలా తల వంచుకుని కూచుండిపోయాడు.

క్షణాలు దొర్లిపోతున్నాయి. ఎవరూ సంభాషణని ప్రారంభించలేకపోతున్నారు.

బాగా దూరంగా కుర్రాళ్ళ సరదా కేకలు వినిపిస్తున్నాయి.

"క్లాసుల్లేవా?" లాభం లేదన్నట్టు నిశ్శబ్దాన్ని తోలేసింది సంధ్య.

"ఈ అవర్ లేదు. మీ టైం వేస్ట్ చెయను. ఒక్క మాట చెప్పడానికి వచ్చాను. సుజాతగార్ని క్షమించమని చెప్పండి. ఆమె మొహం చూడలేను."

"చూడకండి" ఎగతాళిగా అంది.

"మీ అందరూ కూడా ఈ వెధవని క్షమించండి."

అతనా మాటలు అనడానికి చాలా కష్టపడ్డాడు. అతని గొంతు పూడుకుపోతోంది.

సంధ్య విస్మయంగా చూసింది. ఇంత అధైర్యం అతనికి ఆ రోజు కూడా లేదు. అతను చాలా ఎక్కువగా ఫీలవుతున్నాడని గ్రహించింది. ఎక్కడ దెబ్బ కొట్టాలో అక్కడ కొట్టినట్టు, అతను చాలా సిగ్గుపడిపోయేంత అమానుషమైన చర్యలు చేశారు శత్రువర్గం వాళ్ళు.

"మీరు చాలా సెన్సిటివ్‌గా తీసుకుంటున్నారీ విషయాన్ని. మేం ముగ్గురం కేర్‌లెస్‌గా ఉన్నాం."

"మీ సంగతి కాదు. సుజాత..." అతను తల వంచుకున్నాడు.

రెండు కన్నీటి బొట్లు టప్‌మని టేబుల్ మీదకి రాలాయి.

సంధ్య భరించలేకపోయింది. "రవూఫ్" అంది వాత్సల్యంగా.

రవూఫ్ లేచి నిలబడ్డాడు. తల రేగిపోయి ఉంది. కర్చీఫ్‌తో కళ్ళద్దుకుని – "వస్తాను మేడమ్. నేను రిజైన్ చేస్తాను. ఇటువంటి రూమర్స్ ఎంత ప్రాణాంతకంగా ఉంటాయో నాకు తెలుసు." అంటూ కదలబోయాడు.

"ఆగండి!" అభ్యర్థిస్తున్నట్టుగా అంది.

అతనాగాడు. "ప్లీజ్, కూచోండి" వేడుకోలుగా చూసింది.

కాదనే శక్తి లేకుండా కూలబడ్డాడు.

"రిజైన్ చేయగానే ఇంకో పోస్ట్ దొరుకుతుందనే గ్యారంటీ మీకుందేమో! మా నలుగురికీ లేదు. ఈ సీనియారిటీని పోగొట్టుకునే ధైర్యం లేదు. మీరు రిజైన్ చేసి మీ మీద వచ్చే నిందలని తప్పించుకోగలరు. కొత్త ఉద్యోగంలో పడి పాత ఉద్యోగపు చెడుని మర్చిపోగలరు. మరి మాకంత అవకాశం లేదే! మీరు మనశ్శాంతి కోసం పారిపోతారు! మేం మాత్రం ఫలానా వ్యక్తి ఫలానా కారణంగా పారిపోయాడ్రోయ్ – అని చిలువలు పలువలుగా స్టూడెంట్స్ చెప్పుకుంటూ ఉంటే, అవమానం దిగమింగి రోజులు భారంగా దొర్లిస్తూ... ఎంత స్వార్థం మీకు?" మాట్లాడడం ఆపి నిట్టూరుస్తూ అంది.

రవూఫ్ కొత్త విషయం వింటున్నట్టుగా చూశాడు. "నా ఉద్దేశం అది కాదు, నేనిక్కడే ఉంటే ఇటువంటి చిలిపి చేష్టలే చేయబుద్ధవుతుంది ఆ గిరి బృందానికి."

"వాళ్ళకి జడిసి మీరు రిజైన్ చేస్తారా?" వ్యంగ్యంగా అంది రాసుకుంటూ.

"జడిసి కాదు సంధ్య గారూ!" అతను ఒక చేత్తో కణతలు రాసుకుంటూ –

"ఆ గిరికి గాని నాకు గాని భవిష్యత్తు గురించి ఢోకా ఉండదు. ఎంత పోరంబోకులైనా మగవాళ్ళు చెల్లే నాణాలే. కాని ఆడవాళ్ళు పెళ్ళికి ముందు తల్లిదండ్రులకీ, సమాజానికీ, పెళ్ళయ్యాక మొగుడికీ, అత్తమామలకీ నానా సంజాయిషీలు ఇచ్చుకుంటూ బ్రతకాలి. ఎన్నో దిగమింగాలి. చిన్న పొరపాటుని కూడా భూతద్దంలోంచి చూస్తారు."

అతని ఆలోచనా సరళికీ, వాదనలోని వాస్తవికతకీ సంధ్య లోలోపల గర్వపడింది. అదేమిటో రవూఫ్‌ని చూస్తున్నకొద్దీ ఈ మధ్య కళ్ళు తెరిచిన పసిపాపని చూసి లాలించే తల్లిగా తయారవుతోంది మనస్సు. తన ప్రభావం అతని మీద చాలా ఉందేమో అనే స్నేహపూరితమైన గర్వం కూడా హృదయంలో ఏమూలో కలుగుతూ ఉంటుంది.

రవూఫ్ మానసికంగా బాగా ఎదుగుతున్నాడా? లేక అతన్ని సరిగ్గా అర్థం చేసుకునే సందర్భాలే వెంటవెంటనే తనకి వస్తున్నాయా?

రెండూ నిజమే కావచ్చు. ఈమాత్రం సానుభూతి, ఆడవాళ్ళ సమస్యల పట్ల సదవగాహన ఉన్న మగవాళ్ళెవరైనా తనకి తారసపడితే కడుపు నిండినట్లుగా ఉంటుంది. హృదయం వినయంగా తయారవుతుంది.

"నా ఉద్దేశం ఆడవాళ్ళు బేలగా తయారవ్వాలని కాదు, లేక ఆడతనాన్ని బలహీనంగా చిత్రీకరిస్తూ పనికిమాలిన సానుభూతి కుమ్మరించాలనీ కాదు." సంధ్య మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్న రవూఫ్ నచ్చ చెబుతున్న ధోరణిలో అన్నాడు.

"మరి?" వినోదంగా చూస్తూ అంది.

"నా మూలంగా ఎవరికీ, ఏ సమస్యలు రాకూడదనీ, ఎవరి మనస్తాపాలకు నేను దోహదం చేయకూడదనీ" ఇందాకటి కన్నా తేలికైన స్వరంలో అనేశాడు. అనేశాక, జడ్జిమెంట్ వినడానికి ఆత్రంగా కాచుకుని ఉన్న ముద్దాయిలా సంధ్య వైపు చూశాడు.

"అసలు సమస్య లనేవే ఏవో కారణాల వల్ల, ఎవరివల్లనో వస్తుంటాయి. సమస్యని చాకచక్యంగా విడదిస్తే 'సత్యం' తళతళా మెరుస్తూ మన భవిష్యత్తు మార్గాలని వెలుగుతో నింపుతుంది. జీవితం ఎక్కడైతే ఆగుతుందో, జీవించడం ఎప్పుడైతే ముగుస్తుందో అప్పుడు సమస్యలు పుట్టవు. లేదా సన్యాసం పుచ్చుకుని ఎటైనా పారిపోవాలి. నా వల్ల ఎవరికీ సమస్యలుండకూడదు అనే మాటలు ఆచరణలో అసాధ్యాలు!" సీరియస్‌నెస్ నటిస్తూ అంది.

"అబ్బ, మిమ్మల్ని మాటల్లో గెలవడం చాలా కష్టం. ఇంకా ఇలాగే నేను వాగితే మరీ తాటాకులు కట్టేస్తారు. నేను పోతున్నా." ఇప్పుడు పూర్తిగా తేలికపడిపోయి నవ్వుతూ లేచాడు.

“అదిగో వీళ్ళు రానే వచ్చారు. సుజాతా, పాపం ఈయన చాలా మెరిటోరియస్ కాబట్టి, ఎక్కడైనా ఉద్యోగం సంపాదించుకోగలరు కాబట్టి రిజైన్ చేస్తారట. పైగా మన కోసం త్యాగం చేస్తున్నట్టు పోజు!” వెక్కిరింతగా అతన్ని చూస్తూ. “మాకెవ్వరికీ ఇంత దివ్యమైన ఆలోచన రాలేదు గనుక మనం ఈ ఉద్యోగాన్ని ఇంత తెగింపుగా వదలలేం కదా!” అంది.

“రిజైన్ చేయడం ఏవిటీ? ఎప్పుడూ అలా ఆలోచించకండి.” అంది సుజాత.

సుజాత మొహం ఇప్పుడు తేటగా ఉంది. రాధిక, కాంతం కూడా రవూఫ్‌ను ఎప్పుడూ బాధపడొద్దన్నట్టు మాట్లాడారు. అసలీ విషయం తామేం పట్టించుకోవడం లేదని నొక్కి చెప్పడంతో అతని దిగులంతా ఆవిరైంది. అందరికీ విష్ చేసి వెళ్ళిపోయాడు.

“మనమెంత దులుపులున్నా, గిరి లాంటి వాళ్ళు చీడపురుగులే. మళ్ళీ మళ్ళీ ఇలాంటికి జరగకుండా చూడాలంటే మనం కదలక తప్పదు. ఏ అండదండలు తమకున్నాయని మిడిసిపడి ఇలా విజృంభిస్తున్నారో అటువంటి బలమైన ఫోర్స్ ఉపయోగించి అణచాలి. మనం ఆ కు(రాణ్ణి కలిసి ‘బాబూ, నాన్నా’ అంటూ సినిమా డైలాగులు మాట్లాడినంత మాత్రాన వాళ్ళేమీ పశ్చాత్తాపం చెంది, మార్పును పొందరు. వాళ్ళను నేను అణచగలననే నమ్మకం ఉంది” అంటూ తన ప్లానంతా వివరించింది. వాళ్ళు కూడా సుముఖత తెలియజేస్తూ, బెల్ వినిపించడంతో లేచారు.

ఉదయం కన్నా ఇప్పుడు అందరి మొహాలు నవ్వులతో నిర్మలంగా ఉన్నాయి.

# 11

సాయంత్రం కాలేజీ అయ్యాక బయటి నుంచి కోటేశ్వర్రావ్ గారికి ఫోన్ చేసింది. అపాయింట్‌మెంట్ కావాలనేసరికి – "తప్పకుండా రామ్మా. ఎనిమిదింటి నుంచీ నేను ఇంట్లోనే ఉంటాను." అన్నాడు. తన పక్కనే ఉన్న ముగ్గురికీ, "ఏడు తర్వాత వస్తే అందరం కలిసి ఆయన దగ్గర కెడదాం." అని చెప్పింది. అందరూ సంధ్య ఇంటి దగ్గర కలుసుకోవాలని నిశ్చయించుకుని ఇళ్ళకు వెళ్ళిపోయారు.

ఇంటికి వెళ్ళగానే రాజా పలకరించాడు.

"ఏమిటో, మీ కాలేజీలో చెత్త గొడవలు జరుగుతున్నయాట. కనీసం నాతో ఏమీ చెప్పడం లేదు నువ్వు." నిష్ఠురంగా అన్నాడు.

"నా సమస్యలు నావి. నీతో చెబితే ఏం లాభం? నాకేం పర్వాలేదు మా ఆయన ఉన్నాడు అనుకుంటూ పొగరుగా ఉండడం నాకిష్టం ఉండదు. అసలు ముప్పయేళ్ళు దగ్గర బడుతుండగా ఇంకా భర్తల మీదే, నాన్నల మీదే ఆధారపడి వాళ్ళకి కంప్లయింట్స్ ఇవ్వడం ఏం బావుటుంది?"

"బాగుండకపోవచ్చు. కాని అవతల వాళ్ళని బట్టి మనం నడవాలి కదా! ఆడవాళ్ళే కదా అనే లోకువతో అడవి జంతువుల కన్నా హీనంగా ప్రవర్తిస్తారు. వాళ్ళని తగినంత బలంతో ఎదుర్కోవాలంటే మనకీ హంగుండాలి."

"హంగు లేని వాళ్ళ పరిస్థితి?"

"అబ్బా సంధ్యా! మన సంగతి మనం మాట్లాడుదాం." కోపం దాచుకుంటూ అన్నాడు.

"ఏం జరిగిందో ఆ నోటా, ఈ నోటా వినే ఉంటావు కదా? నేనంటే పెళ్ళయినదాన్ని. నీ అండ చూసుకుని బెదరకుండా నిలదొక్కుకోగలను. కాని పెళ్ళి కాని వాళ్ళుంటారు లేదా భర్తలతో విడిపోయిన వాళ్ళుంటారు. వాళ్ళ సంగతేమిటి? వాళ్ళు ఎవరిని ఆశ్రయిస్తారు? ఎక్కడెక్కడి నుంచో పొట్ట చేత పట్టుకుని ఈ కాలేజీకి వచ్చారు. వాళ్ళకు లేని దన్ను నాకుందని ప్రకటించుకోడం ఇష్టం ఉండదు." తిక్కగా, కసిగా అంది.

"పోనీలే, ప్రకటించుకోవద్దులే. కాని జరుగుతున్న గొడవలన్నీ నా చెవిన బడ్డాయి. నువ్వేమయినా బాధపడుతున్నావేమోనని కదిపాను. అంతే." నవ్వాడు.

"ఏమోలే. నిప్పు లేందే పొగరాదుగా? నేనూ ఉద్యోగం చేస్తున్నాను. పదిమందితో కలసి మెలుగుతున్నాను. ఎప్పుడూ ఇలాగే ఉంటానని నమ్మక మేమిటి? అందుకే మా

స్టూడెంట్స్ పాపం నాకు హెచ్చరికలు చేస్తున్నారు. నీకు అనుమానాలుంటే ఎంక్వయిరీ చేసుకో." దెబ్బలాట సిద్ధమైనదానిలా చూస్తూ అంది.

"నీ గురించా? ఎంక్వయిరీయా? సూర్యోదయం గాకపోవచ్చు. సముద్రాలు ఎండిపోవచ్చు. కాని సంధ్య మాత్రం మారదు. దొంగ బ్రతుకు అనేది బ్రతకదు." అపారమైన విశ్వాసం మాటలలో తొణికిసలాడుతుండగా, ప్రేమగా చూస్తూ అన్నాడు.

'వద్దు వద్దు' అనుకుంటూనే ఆ మాటలకి సంధ్య మనస్సు స్పందించింది. అతని నమ్మకాలతో తనని కట్టేస్తున్నాడు కాని, తన ప్రేమాభిమానాలు అతన్ని కట్టిపడేయలేకపోయాయి. ఎక్కడుంది లోపం?

అతను అనునయంగా ప్రశ్నలు వేయడం, సంధ్య పెడసరంగా సమాధానం చెప్పడంతో ఓ అరగంట గడిచిపోయింది. ఏడింటికల్లా ఆ ముగ్గురూ వచ్చారు.

వాళ్ళు వస్తూండగానే సుమిత్ర ఎవరో ఆగంతకులు తరుముకొస్తుంటే దిక్కుతోచక పరిగెత్తిన భీతహరిణిలా రయ్యిమని లోపలికి దూసుకొచ్చి వంటగదిలోకి తప్పుకుంది సుమిత్ర. చాలాసార్లు ఏ కొత్త మనుషులు ఇంటికొచ్చినా వెంటనే తప్పుకోడం చూసి, కొత్తలో అతి జాగ్రత్తవల్ల, తానంటే ఉన్న భయంవల్ల అనుకుంది. కాని ఇప్పుడా పరుగులో ఏవో రహస్యాలుండచ్చు అనిపిస్తోంది.

సంధ్య పెట్టినవి తిని, టీ తాగి అందరూ బయలుదేరారు.

వీళ్ళకన్నా ముందుగా స్కూటర్ స్టార్ట్ చేసుకుంటూ – "విష్ యు ఆల్ సక్సెస్" అని చెయ్యూపి వెళ్ళిపోయాడు రాజా.

"మీ దంపతులని చూస్తుంటే మహా ముచ్చటగా అనిపిస్తుంటుంది." రాధిక అంది.

"ఒక్క రోజుకే?" ఆశ్చర్యం నటిస్తూ అంది సంధ్య.

"ఊహూఁ, మీరిద్దరూ ఫ్రెండ్స్‌లా ఉంటారు. మీ ఇద్దరి అభిరుచులు ఒక్కటే అని కొత్త వాళ్ళయినా సరే చెప్పగలరు. మాములు మగవాళ్ళలో కనబడే దర్పం, అధికారం, అహంకారం, రాజాగారిలో నేనెప్పుడూ చూడలేదు. ఎంతయినా రచయిత. ఆ పద్ధతే వేరు." కాంతం అందుకుంది.

"నిజమే. ఇదే విషయాన్ని ఇంకొకరైతే ఎంత రాద్ధాంతం చేసి మాట్లాడేవారో? స్వంత మనుషులు కూడా బ్రాడ్‌గా అర్థం చేసుకోలేదు. సంధ్య గారూ, మీరు అదృష్టవంతులు." సుజాత అంది.

"నిజమేనా?" తనని తాను ప్రశ్నించుకుంది.

"ఇంటి దగ్గర మీకు అంచి కో–ఆపరేషన్ ఉండబట్టే మీరింత ధైర్యంగా మాలాంటి వాళ్ళకి సపోర్ట్‌గా నిలబడుతున్నారు." సుజాత అంది.

“కుటుంబ సంబంధాలను అనుసరించే మన బయటి ప్రవర్తన ఉండకూడదు సుజాతా. కాని నిజానికి ఆ ప్రభావాల్లోనే మనం చాలా కాలం ఉండిపోతున్నామనుకోండి. స్వంత ఊహలు, స్వంత నిర్ణయాలు చేసుకునే శక్తి వచ్చేసరికి మన దేశంలో చాలా జీవితం హరించుకుపోతుంది. రోజూ అడ్డుచెప్పినా నేను నడుస్తున్న దారి న్యాయమైనది అనిపిస్తే నేను ధిక్కరించగలగాలి. కష్టపడకుండా ఏ ఫలితమూ చేజిక్కదు.”

తన మాటలు వింటూ నిజం అని తల ఊపుతున్న వాళ్ళ ముగ్గురి మీదా చెడ్డ జాలేసింది.

ఏవో తన మాటలు వినేవాళ్ళు దొరికారని ఏవిటేవిటో ప్రవచనాలు చెప్పేస్తోంది గాని తనకి ఆ అర్హత ఉందా? స్వాభిమానం, నమ్మిన సిద్ధాంతం కోసం సర్వస్వం త్యజించాలనే పట్టుదలా తనకు ఉన్నాయా? అసలీ ఆదర్శాలన్నీ వల్లించే అర్హత తనకుందా?

“సంధ్య గారూ, ఏదో ఆలోచిస్తున్నారు?”

సంధ్య చేతిని పట్టుకుని గబాల్న అవతలికి లాగుతూ అంది రాధిక.

కారు వేగంగా ప్రక్కనుంచి దూసుకెళ్ళింది.

చావుకి, బ్రతుక్కీ మధ్య సరిహద్దు రేఖ ఎంత చిన్నది? జీవం ఉన్నంత సేపు ఎన్నెన్ని సమస్యలు? పంతాలు? దుఃఖాలు? ఆరాటాలు? ఎన్ని పోరాటాలు?

“ఇదేనండీ ఇల్లు” నేమ్‌ప్లేట్ చదువుతూ రాధిక బ్లాక్ పెయింటింగ్‌తో బరువుగా ఉన్న పెద్ద గేటును తెరిచింది.

ఆయన వరండాలోనే ఎవరెవరితోనో మాట్లాడుతున్నారు. కనీసం పదిమందికి తక్కువ ఉండరు. వీళ్ళని చూసి లేచి నిలబడి – “రండమ్మా” అని ఎంతో మర్యాదగా ఆహ్వానించారు. వాళ్ళంతా లేచి, “తరువాత కలుస్తాం” అని చెప్పి నిష్క్రమించారు.

“కూర్చోండమ్మా” అని చెప్పి, “వాణీ” అని భార్యని పిలిచి అందరికీ పరిచయం చేశాడు. “వీళ్ళన్న నాకు మంచి ఫ్రెండ్. వాడు చాలా డిగ్రీలు తీసుకున్నాడు.” అంటూ సంధ్యని ప్రత్యేకంగా పరిచయం చేశాడు.

ఆమె కాసేపు మాట్లాడి లోపలి కెళ్ళి కూల్ డ్రింక్స్ పంపించింది అందరికీ.

వీళ్ళు చెబుతున్న విషయం వింటూనే ఆయన దవడలు బిగుసుకున్నాయి. మండిపడుతూ, వెంటనే గిరి తండ్రికి ఫోన్ చేసి, కొడుకుని తీసుకుని హుటాహుటిన రమ్మనమని చెప్పాడు.

ఓ అరగంటలో గిరి వాళ్ళ కారాగింది. గిరితో పాటు దిగిన ఇద్దరు కుర్రాళ్ళు ఏమనుకున్నారో, “మేం వద్దులేరా” అని గేటు బయట నుంచే వెనక్కుపోయారు.

గిరి తండ్రి రామస్వామి అందర్నీ మనసులో అడ్డమైన తిట్లూ తిట్టుకుంటూ, కొడుకుతో పాటుగా వచ్చి కోటేశ్వరరావ్ దగ్గర నిలబడి సకిలించాడు. ముందు కూర్చోమన్నట్టు ఇద్దరికీ కుర్చీలు చూపించి, వాళ్ళు కూర్చున్నాక రౌద్రమూర్తి అయ్యాడు.

"ఏరా ఆ కొడుకులు లగెత్తారే? మా ఇంటి గోడల మీద కూడా బొమ్మలెయ్యక పోయారంట్రా?" గిరిని చూస్తూ హుంకరించాడు.

పులి ముందు లేడి పిల్లలా తండ్రి వైపు రక్షించమన్నట్టు చూశాడు గిరి.

తండ్రి హృదయం కరిగి నీరయింది గాని, మాటలు రావడం లేదు.

కోటేశ్వరరావుతో బంధుత్వముంది, ఒకటే ఊరు అవడం వల్ల బాగా చనువు ఉంది, ఆయన ప్రోత్సాహంతోనే పల్లెటూళ్ళో పొలాలన్నీ అమ్మేసి ఇక్కడ లారీలు తిప్పుతూ మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపార రంగాన్ని విస్తరింపజేసుకుంటున్నాడు. తన చదువు ఆరో క్లాసు దాటలేదు. కోటేశ్వరరావు గ్రాడ్యుయేట్. ఆ తేడా వల్ల, న్యూనతాభావంతో కోటేశ్వరరావు ముందు తగ్గి ఉంటాడు. కోటేశ్వరరావుకి ఇద్దరూ కూతుళ్ళే, కొడుకుల్లేరు. అందుకని కొడుకుల్ని అదుపు చేయలేని తండ్రులని చూసే ముందే విరుచుకుపడతాడు.

"ఏరా, పల్లెటూళ్ళ నుంచి టౌన్లకి చేరిన నాకొడుకులందరికీ నాలుగు డబ్బులు చూడంగానే కన్నూమిన్నూ తెలియదు. మరీ ఇంత అచ్చోసిన ఆంబోతుల్లాగా తయారుచేశావేంట్రా నీ కొడుకుని?" ఎగాదిగా చూస్తూ అన్నడు.

రామస్వామి సకిలించాడు. సాధారణంగా సకిలింపులతోనే సమాధానం చెప్పడం ఆయనకి అలవాటు. కోటోశ్వరరావుకి తననీ, తన కొడుకునీ నాలుగు దులిపి, అవసరమైతే రెండు తగిలించే చనువుని ఏనాడో ఇచ్చాడు. ఆయనతో వ్యాపారపరంగా చాలా లావాదేవీలున్నాయి. కాని ఈ నలుగురాడవాళ్ళ ముందు పిచ్చి వెధవల్లా కూచోవాల్సి వచ్చినందుకు చాలా బాధపడుతున్నాడతను.

"ఇదే లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్. అసలా లెక్చరర్ మీద తిరగబడినప్పుడే ఈ అంతు జూసేవాణ్ణి. పోనీలే అని వదిలేశా. మనం కాలేజి పెట్టింది లాభాల కోసం కాదు, అడ్డమైన గాడిదలనీ మేపడానికీ కాదు. కాలేజీకో డిగ్నిటీ, పద్ధతి, మంచి పేరూ రావాలి. రేపో మాపో ఎయిడ్స్ కూడా రాబోతున్నాయి. చదువంటకపోతే లారీలు తోలుకో లేదా వడ్డీలకు తిప్పుకో. ఎందుకు కాలేజీలకి ఎగబాకి చదువుకునే వాళ్ళని జెడగొడతావ్? కట్నం చదువులు చదివే నీకేం తెలుస్తుందిరా విద్య విలువ? సరస్వతి అందర్నీ అనుగ్రహించదు."

"నేనీ మధ్య ఇంటికాడ ఉండట్లేదురా తమ్ముడా. ఇంక నేనీడ్ని వదల్ను. మీ వదిన కూడా తెగ మొత్తుకుంటోంది." రామస్వామి పశ్చాత్తాపంతో అన్నాడు.

"మొక్కై వంగనిది మానై వంగునా అన్నారు. ఇంతకన్నా కోట్లు సంపాదించి నోళ్ళు కూడా చదువుల గురించి ఆరాటపడుతున్నారు. డాక్టర్లవుతున్నారు, ఇంజనీర్లు అవుతున్నారు. ఎనకమాల ఎంతెంతో ఆస్తులున్న సాలామందున్నార్రా. నీలా అందరూ విర్రవీగరు." గిరిని చూస్తూ గర్జించారు.

సంధ్యా వాళ్ళందరికి ఆయన భాష చూస్తుంటే నవ్వొస్తోంది. ఆయన హుంకరింపులు, ఆ తండ్రీ కొడుకుల తత్తరపాటు సరదాగా ఉన్నాయి. చాలామంది బయట ప్రపంచంలో సభ్యతా, సంస్కారాలుట్టిపడేలా మంచి భాషని వాడేవాళ్ళు కూడా బంధుకోటితో, దగ్గరి మనుషులతో ముతగ్గా మాట్లాడుతూ ఓ రకమైన ఆత్మీయతని ఫీలవుతారు.

ఇంతలో ప్రిన్సిపల్ గారు వచ్చారు. ఎందుకైనా మంచిదని ఆయన ఆలస్యంగా వచ్చారు.

"ప్రిన్సిపల్ గారూ! మన కాలేజీలో ఆడకూతుళ్ళ జోలికి ఏ సన్నాసొచ్చినా పోలీస్ కంప్లయింట్ ఇచ్చేయండి. మీరెవరి గురించి జడవక్కర్లేదు. నేను చెబుతున్నాను. ఎవర్నీ స్పేర్ చేయక్కర్లేదు. అరేయ్ గిరిగా, ఈసారి నీ మీద కంప్లయింట్ ఇన్నానంటే నిన్ను డిస్మిస్ చెయ్యడమే కాదు, దేశంలో ఎక్కడా చెల్లకుండా నీ మీద కరపత్రాలు ఏయిస్తాను. ఖబడ్దార్! ఎవడూ నీకు సీటివ్వకుండా చేస్తాను."

కోటేశ్వరరావు అరుపులకి రామస్వామి ఈసారి నిజంగానే జడిసాడు. "క్షమాపణ చెప్పరా అందరికీ" అన్నాడు కొడుకుని ఉరిమి చూస్తూ.

"ఈడు అపాలజీ చెప్పమన్నాడు కదా ఇంకో మాస్టర్నీ? ఈసారి రిటన్‌గా ఈడే ఇవ్వాలీ ఆ అమ్మాయిలకి. రాయరా. అదుగో ఆ పాడ్ అందుకుని రాయి నాయాలా."

కోటేశ్వరరావు కేక పెట్టేసరికి హడలిపోతూ పాడ్ అందుకోడానికి గిరి ముందుకు వంగాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

సంధ్య అంది "మాకేం హామీపత్రాలు వద్దు సార్. కుర్రాళ్ళెంతగా చెయ్యి దాటిపోతున్నారో చెప్పడానికే మీ వరకూ ఈ విషయాన్ని తీసుకొచ్చాం. మీలాంటి వాళ్ళ అండదండల్ని ఇటువంటి కుర్రాళ్ళు క్యాష్ చేసుకోడానికి ప్రయత్నిస్తారని చెప్పడమే మా ఉద్దేశం. మేం వెడతాం."

సంధ్యతో పాటు అందరూ లేచి నిలబడ్డారు.

రామస్వామి వైపు తిరిగి సంధ్య అంది "మా మీద మీరేం కోపం పెట్టుకోవద్దు. మీరోసారి ఆ బొమ్మలని చూసుంటే ఆ అందరికన్నా ముందే శివమెత్తి పోయుండేవారు. ఒక మనిషి నైతిక జీవితాన్ని ఎత్తి చూపే వయస్సుందా ఈ కుర్రాడికి? రేపు కాబోయే

భార్య శీలాన్ని ఇప్పట్నించే కాపాడుకోమనండి. మాలాంటి వాళ్ళ గురించి పాపం ఎందుకొచ్చిన బాధలు?"

"నేను చాలా సిగ్గు పడుతున్నానమ్మా. కన్న నేరానికి ఇదిగో, ఇన్నిన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. మళ్ళీ ఇంకెవరి జోలికీ రాడు. ప్రిన్సిపాల్ గారూ, వస్తానయ్యా." అంటూ అందరికీ పేరు పేరునా వెళ్ళొస్తానని చెప్పి, దణ్ణాలు పెట్టి బ్రతుకుజీవుడా అని బయల్దేరాడు రామస్వామి.

చల్లగాలికి నడుచుకుంటూ బయల్దేరారు. ఒకరి కుటుంబ వివరాలు ఒకరు సందేహించకుండా చెప్పుకున్నారు.

కాంతం అంది – "ఇందాక మీ ఇంట్లో ఓ అమ్మాయి నన్ను చూడగానే మొహం తప్పించింది. ఎక్కడో చూశాను, ఎక్కడో చూశాను – అని ఇందాకట్నించీ గింజుకుంటున్నాను. ఇప్పుడు గుర్తుకొచ్చింది. నేను రెండేళ్ళ క్రితం వాళ్ళ ఇళ్ళ దగ్గరే ఇల్లు తీసుకుని ఉన్నాను. నాతో బాగానే మాట్లాడేది అప్పుడు. ఎందుకలా పారిపోయిందో?"

"ఆ అమ్మాయి అదో తరహా" అంతకన్నా ఎక్కువగా సంధ్యేమీ చెప్పలేదు.

కాంతం కూడా ఆ ప్రస్తావనని పొడిగించలేదు. సంధ్య సంభాషణని తెలివిగా ఇంకో విషయం వైపు మళ్ళించింది. అందరూ గుడ్‌నైట్‌లు చెప్పుకుని విడిపోయారు.

సంధ్య ఇంట్లో అడుగు పెట్టేసరికి సరిగ్గా పదయ్యింది. లోపల దృశ్యం వింతగా ఉంది. రాజా కళ్ళు అగ్నిగోళాల్లా ఉన్నాయి. ఎదురుగా ముద్దాయిలా గోడ కానుకుని నిలబడి ఉంది సుమిత్ర. వాళ్ళిద్దర్నీ చూస్తుంటే నిస్సత్తువా, కాళ్ళూ చేతులూ గుంజేస్తున్నట్టనిపించింది సంధ్యకి.

"చెప్పు, నీ డబ్బు కోసం వలపన్నానా? ఇంకేమేం కథలు చెప్పావు?" రెట్టించాడు రాజా.

సంధ్య సుమిత్ర వైపు చూసింది. అదే సమయానికి సుమిత్ర కూడా చూసింది.

"నన్నీ ఇంట్లో మనశ్శాంతిగా బ్రతకనివ్వరా? ఏమిటీ గొడవ?" ఎవరైనా వింటారేమోనని గొంతు తగ్గించి అంది.

విరక్తిగా నవ్వాడు. "ఇక మనదంతా బహిరంగ రహస్యమే సంధ్యా! ఈ మనిషి ఆవగింజంతైనా విశ్వాసం లేకుండా ఎన్నెన్నో కథ లల్లి చెబుతోంది. పాపం అని అందరూ సానుభూతి చూపిస్తున్నారు."

సుమిత్రని దోషిలా నిలబెట్టి నిలదీయడం సంధ్యకే నచ్చలేదు.

"ఇప్పుడెందుకిదంతా? ఎందుకలా నిలదీస్తున్నావు. వెళ్ళి పడుకోరాదా?" విసుక్కుంది.

"నీ గురించి నా కుటుంబ సౌఖ్యాన్ని కాలదన్నాను. ఎన్నో భరించి నిన్ను తీసుకొచ్చి ఈ ఇంట్లో పెట్టాను."

"నన్ను పెళ్ళి చేసుకుంటానని చెబితేనే మా ఇంట్లో అందరితో హోరాహోరీగా దెబ్బలాడి వచ్చేశాను. నేనేమీ మీ ఇంట్లో తల దాచుకుందామని రాలేదు." కళ్ళు నేలమీదకి వాల్చి గబగబా అంది సుమిత్ర.

"సుమిత్రా! పెళ్ళి చేసుకుంటే ఇక్కడే, ఈ ఇంట్లోనే నాతో పాటు కాపురం చేద్దామని వచ్చావా?" అసహ్యాన్ని దిగమింగుతూ అడిగింది సంధ్య.

సుమిత్ర అసలా డైలాగ్‌ని ఏ రకమైన పద్ధతిలో వైవాహిక జీవితం గడపాలో నిర్ణయించుకునే ప్రయోగించిందో సంధ్య కెప్పుడూ అర్థం కాలేదు.

"మాస్టారు చెప్పారు – సంధ్య ఇంటా బయటా చాకిరీ చేసుకోలేదు. ఆమె ఉద్యోగానికి వెడితే నువ్వింట్లో అన్నీ చక్కదిద్దుకోవచ్చూ..."

"ఆయన ఏ సందర్భాల్లో ఎటువంటి డైలాగులు వల్లించి ఉంటాడో నాకవసరం లేదు. నీ సంగతి చెప్పు. ఇంట్లో దినదిన గండంగా ఉందని నువ్వు ఏడిస్తేనే గదా, నేను అంత అవసరం అనుకుంటే నా దగ్గర కొచ్చేయ్, ఏ అఘాయిత్యమూ చేయకు అని రోడ్డు వరకూ సాగనంపుతూ అన్నాను.."

"అసలీ మనిషితో మాట్లాడాకే మీ దగ్గర కొచ్చాను."

"బాబోయ్, నాకీ నరకం ఎంతకాలం?" సంధ్య చప్పున కుర్చీలో కూలబడి తల పట్టుకుంది.

రాజా దగ్గరకు రాబోతే, "వెళ్ళవతలికి" అంటూ కసిరింది.

"ఛీ! ఇద్దరు సవతుల పోరాటం జరుగుతున్నట్టుగా ఉంది."

"సుమిత్రా, నీ ప్రోత్సాహం లేకుండా ఏమీ జరగలేదు అని నీకూ తెలుసు. సంధ్యకీ విషయం తెల్సినా నన్నెలా క్షమించిందో చెప్పేసరికల్లా నువ్వు పగపట్టావు. కాని ఇంత తొందరగా కాటేస్తావని అనుకోలేదు. నిన్ను... నీకు సంధ్యేం చేసింది?" రాజా దీనంగా, క్రోధంగా అడిగాడు.

"అసలేం జరిగిందో చెప్పవేం? ఏవిటీ గోల?" సంధ్య అరిచింది.

"చెప్తాను. పక్కింటి వాళ్ళకి మొత్తం కథంతా ఇంకో స్టయిల్‌లో చెప్పేసింది. ఆయన ఇందాక సెంటర్లో ఓ షాపు నుంచి కేకేశారు. ఇంట్లో కన్నా బయటే మనం మాట్లాడుకునే అవకాశముందని నన్ను పార్క్‌కి తీసుకెళ్ళి మెత్తగా చీవాట్లేశారు."

"అవును. అందులో విడ్డూరం ఏముంది? మనం చేతులారా చేసుకున్నాం. ఇక వాళ్ళు మంచి వాళ్ళు కాబట్టే ఏమీ అనకుండా ఊరుకున్నారు."

"కథనెంత ఘోరంగా మార్చి చెప్పిందో తెలుసా? ఇప్పుడు నేనేం చెప్పినా నమ్మే పరిస్థితిలో లేరు."

"ఎందుకు నమ్మాలి? లోక విరుద్ధమైన పనులు చేస్తూ, లోకమంతా సానుభూతి చూపించాలనే ఆశ ఎందుకో మీకు?" చికాగ్గా అంది.

"నీకు తెలియదు. నువ్వూరుకో సంధ్యా! ప్రతి మధ్యాహ్నం తనకి పరిచయమైన వాళ్ళందర్నీ పిల్చి రాజారావ్ గారూ నేనూ గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం. ఇంకో పెద్ద ఇంట్లోకి వెళ్ళిపోతున్నాం. మేం కలిసుంటాం. ఆయన భార్య అందుకు అంగీకరించింది అని చెప్పేదిట."

"పెళ్ళి అనే మాటకి నువ్వెందుకంత ఉలిక్కి పడుతున్నావ్ రాజా? ఏనాడైతే ఆ అమ్మాయికి అబార్షన్ చేయించావో, అప్పుడే ఆమె మంచి చెడ్డలు నీవైపోయాయి. నీ మీద హక్కుందని భావించే, ఆమె ఈ కథలన్నీ చెప్పుకుని ఉండొచ్చు. నువ్వు వదిలించుకోవాలని చూస్తున్నావ్. ఎక్కడ ఈ బంధం తెగిపోతుందో అని ఆమె భయపడుతోంది. ఈ కథలతో ముడి వేసుకుంటోంది."

సుమిత్ర ఓరగా సంధ్య వైపు చూసింది. ఆ చూపులు చాలా పదునుగా, క్రూరంగా ఉన్నాయి. సంధ్య ఉలిక్కిపడి తల తిప్పుకుంది.

"శశితో నాకు సంబంధముందని సంధ్యతో నువ్వు చెప్పావా లేదా? ఎంతో మంది ఆడవాళ్ళతో నాకు సంబంధాలున్నాయని చెప్పలేదా?" దగ్గరకొస్తూ కళ్ళు చిట్లిస్తూ అన్నాడు.

"నేనేం అనలేదు" గడ్డం పైకెత్తి, ఏటో చూస్తూ సమాధానమిచ్చింది.

"అనలేదా? ఏం సంధ్యా, అనలేదా? అందనే నువ్వూ చెప్పావుగా?" సంధ్య వైపు తిరిగి ఉరిమాడు.

"ఆమె ఏదైనా కల్పించి చెప్పగలదు. భార్య కాబట్టి ఆమె మాటలే మీరూ నమ్ముతారు." సంధ్యని తినేసేలా చూస్తూ అంది సుమిత్ర.

సంధ్య ఇక ఆగలేకపోయింది.

"భార్యా భార్యా అని నన్ను చూసి పదిసార్లు ఏడవకు. నేను రేపే పిల్లల్ని తీసుకుని బొంబాయి వెళ్ళిపోతాను. ఈయనకి సిసలైన భార్య లాగానే హాయిగా కాపురం చేసుకో."

"సంధ్యా, నువ్వాగు. శశితో గడిపానని నువ్వు సంధ్యతో అన్నావా లేదా?" అన్నాడు మొహంలో మొహం పెట్టి.

"నేననలేదు!"

"అనలేదూ?"

"అనలేదు. నేనేమీ అనలేదు." మొండికెత్తినట్టు తడబాటు లేకుండా అంది.

అంతే! చెంప ఛెళ్ళుమనిపించాడు రాజా. "రాస్కెల్!" అంటూ మళ్ళీ చెయ్యి ఎత్తబోతుంటే సంధ్య వచ్చి పట్టుకుంది.

అతను కోపంగా ఊగిపోతున్నాడు. బలవంతంగా ఈడ్చుకెళ్ళి కుర్చీలో కూలేసింది.

సుమిత్ర కుప్పలా కూలిపోయింది.

"ఛీ! ఛీ! ఇంత బరితెగించిందనుకోలేదు. ప్రతి చిన్న మాటా, ప్రతి సంఘటనా ఏదీ పొల్లుపోకుండా రాఘవరావ్‌గారితో చెప్పింది. శశితో వ్యవహారం ఉందా అని ఆయనే నన్నడిగారు. అందుకే అంత రెట్టించాను. పోనీ నువ్వే కల్పించి చెప్పావనుకుందాం. ఆయనకి ఇవన్నీ ఎలా తెలిసాయి? ఈ అమ్మాయే చెప్పిందని చెబుతున్నాడు కదా? నా బ్రతుకు నడిరోడ్డు మీదకి ఈడిస్తే గాని సుమిత్రకి తృప్తి కలగలేదు. నేనేం అన్యాయం చేశాను? నేను పెళ్ళయినవాణ్ణనీ, పిల్లలు గలవాడినని తెలియదా? నా మీద ఎందుకంత కసి? నాకు మంచి శాస్తి జరిగింది. సుమిత్రా, చాలా బాగా బుద్ధి చెప్పావు. బాగా బుద్ధి చెప్పావు."

ఆ నిశ్శబ్దంలో సుమిత్ర ఏడుపు, ఒక వైపున రాజా ఆక్రోశపు మాటలు – సంధ్య మతి పూర్తిగా పోగొడుతున్నాయి. పక్కింటివాళ్ళూ ఇవన్నీ వింటూ ఉండొచ్చనే ఊహ సిగ్గుతో వణికిపోయేలా చేసింది.

అసలు తప్పంతా తనది. తనని చూస్తూ ఈ అమ్మాయి రాజా చేయి జారిపోతున్నాడనుకొని భయపడుతూ పెర్వర్టెడ్‌గా ప్రవర్తిస్తోంది. అసలు తను ముందే తప్పుకుంటే ఏ గొడవా ఉండేది కాదు. ఇప్పుడైనా మించిపోయిందేం లేదు. తను ముందు ఇక్కడ్నించి తప్పుకుంటే వాళ్ళిద్దరూ ఏ తంటాలైనా పడతారు, వాళ్ళిష్టం.

రాజా వైపు చూసింది. అతనింకా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. సుమిత్ర ఏడుస్తూనే ఉంది. సుమిత్రది చాలా దుర్భరమైన పరిస్థితి. చేతులారా చేసుకుంటోంది.

"నీకెంత కోపం ఉంటే మాత్రం కొడతావా? మనిషిలా ప్రవర్తించడం లేదు నువ్వు" బాధగా అంది.

"నేను మనిషిని కాను. జంతువుని. అందుకే ఇన్ని చిక్కుముళ్ళు వేసుకున్నాను. పక్కింటి వాళ్ళ చుట్టం మా కొలీగ్ ఒకామె ఉంది. ఆమె నిన్న ఎందుకో అనుకోకుండా వీళ్ళింటికి వచ్చి, ఈయన చెప్పిన కథ విని, ఈ అమ్మాయితో మాట్లాడతానని మనింట్లోకి వస్తే పరుగుతీసిందట. ఈ పరుగులకి వేరే అర్థాలు చెప్పుకుంటున్నారు. నేనో శాడిస్టునీ, వేటాగాడినీ, ఈ అమ్మాయిని కన్నింగ్‌గా ఇంట్లో చేర్చి ఊడిగం చేయిస్తున్నాను. ఎవరితో మాట్లాడనీయని కర్కోటకుణ్ణి. అబ్బో, ఒక్కటి కాదు, ఎన్నెన్నో రకాలు! మా

కాలేజీలో నన్ను అందరూ వెలేయరా? అందరికీ నేను మొహమెలా చూపించను?"

సంధ్య నిర్వికారంగా చూస్తూండిపోయింది. ఆ ఇద్దరిలో ఎవర్ని ఓదార్చాలో తెలియడం లేదు. ఇవన్నీ జరుగుతాయని తనకి ఏనాడో అనిపించింది. రోట్లో తలదూర్చి రోకటిపోటుకు వెరచినట్టు రాజా ఇప్పుడు మొత్తుకున్నా లాభమేమిటి?

"నన్ను చంపేయండి! మా ఇంటి కెడితే ఎలాగూ నన్ను బ్రతకనివ్వరు. నన్ను చంపేయండి" సుమిత్ర రొప్పుతూ, ఏడుస్తూ అంది.

"మీ... ఇల్లు?" వ్యంగ్యంగా నవ్వాడు. "నువ్వేదో అంతఃపురం నుంచి బయటకు వచ్చినట్టు మరీ అంత కల్పనలు చెయకు. కట్టుకథలు చెప్పకు. అసలు వాళ్ళకి నీ మీద కంట్రోల్ ఉంటే, ఆ రోజుల్లోనే నిన్ను అలా ఎందుకు వదిలేస్తారు? ఇంత కాలం అయింది, అసలు నీకోసం ఎవరన్నా వెతికారా?"

"నా పెళ్ళయిందని అనుకుంటున్నారు. ఎలా వస్తారు?" విసురుగా తలెత్తింది.

"నువ్వు చెప్పినంత సాంప్రదాయమైన ఇల్లే అయితే నిన్నిలా బయటకి అడుగు పెట్టనిచ్చేవాళ్ళు కాదు. వాళ్ళని నేను తప్పుబట్టను. అంత పెద్ద సంసారంలో కేవలం నీగురించి వాళ్ళు పూర్తిగా పట్టించుకోడం సాధ్యం కాదు. పైగా మీ అమ్మ పేషెంటు. కాని నువ్వు నీ బ్యాక్‌గ్రౌండ్‌కి రంగులు పూసి నన్నో కిరాతకుడిగా సృష్టించి అందరి సానుభూతీ పొందుతున్నావ్! ఓ దగాపడిన ఆడదానిలా అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నావ్! అందరూ నన్ను దుమ్మెత్తిపోసేలా చేస్తున్నావ్! చాలా అన్యాయం."

ఇవన్నీ వింటుంటే ఇంకా కొత్త కొత్త విషయాలు అర్థం కాసాగాయి సంధ్యకి. ఈ 'పెళ్ళి' అనే పదం చాలా గ్లామరస్‌గా వెలిగిపోతోంది. 'ప్రేమ తప్ప ఇంకేమీ వద్దు' అనుకుంటూ, లోకం ఒప్పని అనుబంధాల్లో దిగే స్త్రీ పురుషులు ఆ ఉధృతం తగ్గాకా, తగ్గిపోతున్న పరువు ప్రతిష్ఠల పునరుద్ధరణలో పడిపోతారు. మగవారు రెండో భార్యని ఓ ఎస్సెట్‌గా భావిస్తే ఆడవాళ్ళూ ఈ పెళ్ళితంతు ద్వారా ఏదో ఒక లైసెన్స్ సంపాదించుకుని ఈ సంఘంలో మొదటి భార్య దుఃఖంతో దహించుకుపోతున్నా పట్టించుకోకుండా, ఈ కోవకి చెందిన స్త్రీలు మళ్ళీ ఆ పసుపుతాడు గురించే పాకులాడుతారు, వేధిస్తారు, మగవాణ్ణి తెగ బ్రతిమాలతారు. ఇదంతా సెక్యూరిటీ కరువు కావడం వల్లే కదా? రకరకాల సంబంధాలతో ఢక్కామొక్కీలు తిన్న కళాకారులు, సినిమా యాక్టర్స్, గొప్ప గొప్ప ఉద్యోగస్తులు కూడా ఎవర్నో ఒకర్ని 'పెళ్ళి చేసుకున్నాం' అని సగర్వంగా ప్రకటించుకుంటుంటారు. 'నా మిసెస్ నా మిసెస్' అని పదిసార్లు ఈ పురుష పుంగవులు వాళ్ళ ముందు స్టయిల్‌గా మాట్లాడుతూ ఉండడం వల్ల, పాపం వీళ్ళందరికీ ఈ పెళ్ళి అనేది ఆకాశంలో చందమామలా అనిపించి, ఎలాగైనా దాన్ని అందుకోవాలనే తపన ఎక్కువవుతోంది.

ఎంత విచిత్రమైంది మానవ మనస్తత్వం! అసలీ సబ్జెక్టు గురించి ఓ వ్యాసం రాస్తే ఎలా ఉంటుందో?

అలాగే కూచుండిపోయిన సంధ్య రాజా బయటికెప్పుడు వెళ్ళాడో గమనించలేదు. స్కూటర్ స్టార్ట్ అయిన శబ్దం వినిపడింది. పాపం ఈ అమ్మాయి ఏడుస్తోంది. ఈ అమ్మాయి అతి తెలివితేటలు, స్వార్థపు టాలోచనలు తనని చాలా కఠినంగా మార్చేశాయి. తన ఓదార్పుల కన్నా సుమిత్ర ఆమె పథకాలే ప్రయోజనకరమని తెగించింది. ఆమెకి దక్కని పరువు మర్యాదలు తనకీ దక్కరాదని తన పక్షాలని బలపరుచుకుంటోంది.

అందువల్ల ప్రయోజనం? ఏమీ లేదు. అదో రకమైన కక్ష సాధింపు అంతే.

సంధ్య లేచి నిలబడి "ప్చ్" అని నిట్టూర్చింది.

"సుమిత్రా, పడుకోరాదా?"

"నేనేనాడో నిద్రకి దూరమయ్యాను"

"నీకెన్నో సార్లు చెప్పాను, మాలాంటి వాళ్ళ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన ఖర్మ నీకేమీ లేదు. భవిష్యత్తు పాడు చేసుకోకు – అని ఎప్పుడో చెప్పాను."

"నన్నందరూ ఉపయోగించుకున్నారు. బాగా ఉపయోగించుకున్నారు." కుళ్ళి కుళ్ళి ఏడవడం ప్రారంభించింది.

సంధ్య విచిత్రంగా చూసింది. "అందరి సంగతి ఏమో గాని, నిన్ను నేనేమీ ఉపయోగించుకోలేదు సుమిత్రా! అసలు నాకు విడాకులిచ్చేసి లీగల్‌గా అన్నీ సెట్‌రైట్ అయ్యాక నువ్వు ఇతని దగ్గరకి వచ్చుంటే హుందాగా ఉండేది".

'వద్దు వద్దు' అనుకుంటూనే మళ్ళీ, ఓదార్పు మాటలు మొదలుపెట్టింది.

"మా వాళ్ళందరూ నాకు పెళ్ళి చేసెయ్యాలని పట్టుబట్టారు. పైగా మా బావ కబుర్ల మీద కబుర్లు..." సుమిత్ర పాత ధోరణి మొదలేసింది.

సంధ్యకి నవ్వొచ్చింది. ఈ సుమిత్ర కాలేజీల్లో మిగిలిన అమ్మాయిల్లా కనీసం అప్పర్ మిడిల్ క్లాస్ ఫామిలీస్‌లో అమ్మాయిల్లా తన ఉనికిని చూపించాలని తాపత్రయ పడుతోంది. చిన్నతనం నుంచి తనకి అసాధ్యాలుగా ఉన్నాయి – అనుకునేవన్నీ సాధ్యాలుగా ఊహించుకుని, తనని తాను ప్రత్యేకంగా అనుకుని ఎంతో మంది తన గురించి తపిస్తున్నారనే భ్రమలు ఎదుటివాళ్ళకి కల్పించాలని బాగా ప్రయత్నిస్తోంది. సైకాలజీలో, మరి ఈ తత్వాన్ని ఏమంటారో? స్వార్థాన్ని పక్కకి నెడితే ఈ తెగువా, ఈ పట్టుదలా సుమిత్రకి చాలా ఉపయోగకరంగా ఉండేవి.

"నిద్రపోరాదా?" తన గదిలోకి వెడుతూ అంది.

సుమిత్రేమీ మాట్లాడలేదు. సంధ్య వెళ్ళి పక్క మీద వాలి ఏదో పాత మేగజైన్ అందుకుంది. ఇతనెక్కడికి వెళ్ళాడో? ఈ అమ్మాయి అలా ఎంతసేపు కూచుంటుందో? తనకి భయమేస్తోంది. ఏ బెదిరింపు ఆత్మహత్యా ప్రయత్నాలో ఈ అమ్మాయి చేసుకోకుండా తను కాపలా కాయాలి. అయినా ఇంకెక్కడి నిద్ర? కళ్ళు పొడారిపోయాయి.

రాజా ఆ రాత్రి అసలు రానేలేదు. సంధ్య రాత్రంతా మేలుకునే ఉంది. అయిదవుతుండగా పాల ప్యాకెట్ వాళ్ళ కేకలు వినిపించి లేచి ఇవతలికొచ్చింది. సుమిత్ర ఆ నేల మీదే ముడుచుకుని నిద్రపోతోంది. ద్రవిస్తున్న హృదయాన్ని ఆపుతూ బాత్‌రూంలోకి వెళ్ళింది.

# 12

"మీరు చిన్నవాళ్ళు. అనుభవం తక్కువయిన వాళ్ళు. ఏదో ఒక పొరపాటు జరిగినా, 'బాబాయిగారూ, ఇదండీ విషయం, ఇలా చేయాలనుకుంటున్నాం' అని నన్నో సలహా అడిగుంటే ఇన్ని తిప్పలుండేవా? కనీసం ఆ అమ్మాయిని ఇంట్లోకి తీసుకొచ్చే ముందు – అమ్మాయ్, నువ్వయినా నాతో ఒక్కమాట చెప్పావా?" సంధ్యని ఉద్దేశించి అన్నారు రాఘవరావ్.

చాలా కాలం తర్వాత మళ్ళీ అందరూ అరమరికలు లేకుండా మాట్లాడుకోడం మొదలయింది. కాని పూర్వపు ఆత్మీయత ఇప్పుడు లేదు.

పెరట్లో అందరూ కుర్చీల్లో కూర్చున్నారు. రాఘవరావ్ గారి భార్య వీళ్ళకి దగ్గరగా అరుగుమీదే కూర్చుంది. ఆవిడ ఎక్కువగా ఈ సంభాషణలో కల్పించుకోవడం లేదు.

"తల్లీదండ్రీ లేనిదానివి. అందుబాటులో అన్నదమ్ములు కూడా లేరాయె. సలహా అడిగితే ఏం పోయింది?"

"నన్ను క్షమించండి. అసలు నేను అనుకున్నది వేరు." సంధ్య సూటిగా ఆయన వైపు చూడలేకపోతోంది.

"మీ ఇద్దరిదీ ముచ్చటైన జంట అని మురిసేవాళ్ళం. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నా ఎంత అణకువ అని ఎంతో మెచ్చుకునేవాళ్ళం. అందరితో చెప్పుకునేవాళ్ళం. కాని మీరు మాకు వీసమెత్తు గౌరవమన్నా ఇవ్వలేదు. వీళ్ళతో ఏంట్లే అనుకుని మమ్మల్ని పనికిరానివాళ్ళుగా జమకట్టారు కదమ్మా!"

పైన చంద్రుడు ఆగి వింటున్నాడా అన్నట్టు నిండుగా ఉన్నాడు. చల్లగా చూస్తున్నాడు. ఎక్కడినుంచో నైట్ క్వీన్ పరిమళాలు తేలి వస్తున్నాయి.

హృదయం సేద తీరేంతంటి ప్రశాంతత. కాని సంధ్య మనస్సులో సెగలు పొగలతో ఏకమై వెన్నెలంతా వేడిగా మారుతున్నట్టుంది.

ఏనాడు ఎవరి ముందూ తలవంచని తను ఈ రెండు నెలల్లో తల దించేసుకుని బ్రతుకుతోంది. పిరికిదానిలా ఇంట్లోనే గడిపేస్తూ పక్కింట్లో కాలు పెట్టడానికి జడిసింది. తనకన్నా వెనుక వచ్చిన సుమిత్ర అందరితోనూ చెలిమి చేసింది. తన కన్నీటి కథ వినిపించింది. ఆధునికంగా ఆలోచించగలిగే రాఘవరావ్‌గారి కుటుంబాన్ని తన మాటల చాతుర్యంతో పూర్తిగా తన వైపే తిప్పుకుంది. ఆ అమ్మాయి ఓడిపోతూ గెలిచింది.

తనకి సంబంధించిన ప్రేమాభిమానాల్ని పరువు మర్యాదలని సగర్వంగా లాక్కుని మూటగట్టేసుకుంది.

“పాపం! ఆ అమ్మాయికి యూనివర్సిటీ ర్యాంక్ కూడా వచ్చింది కదా! ఇంత తెలివిగల అమ్మాయి ఈ గొడవల్లో పడిపోయింది. పగలూ, రాత్రి కంటిమి మింటికి ఏకధాటిగా ఏడుస్తూ గడిపేస్తోంది. ‘సంధ్యా, నీ బాధ నీకున్నా, ఈ అమ్మాయి గురించి బ్రాడ్‌గా ఆలోచించాలి నువ్వు’ ఆయన సహృదయంతో హితోపదేశం చేశాడు.

‘నా బాధకన్నా ఆ అమ్మాయికే ఎక్కువగా నేను ప్రిఫరెన్స్ ఇచ్చాను. మీ అందరితో గల మంచి సంబంధపు దారులు మూసేసి ఆ అమ్మాయి కోసం మనస్సు విశాలం చేసి ఉంచాను. పూర్తిగా ఎక్స్‌ప్లాయిట్ చేసింది.’ – సంధ్య అంతరాత్మ గొణుగుతోంది.

సంధ్యకి మాట్లాడడమే అవస్థగా అనిపిస్తోంది. సమయం మించిపోయింది. ‘అయ్యో పాపం!’ అనగలరే తప్ప తనతో పూర్వపు స్నేహాన్ని మెయిన్‌టెయిన్ చేయలేరు. రాజా గురించి తను అతిగా శ్రమించడానికి రడీ అయిన నేరానికి తన వీళ్ళ చల్లటి ఆదరణను పోగొట్టుకోవాల్సిందే. ఎంతమందితో, ఎన్నెన్ని చక్కటి బాంధవ్యాలు తెగిపోతున్నాయి.

ఆయన చాలా మాట్లాడుతున్నాడు. సగం వినిపిస్తున్నాయ్. సగం వినిపించడం లేదు. రాజా కూడా ఏదేదో చెబుతున్నాడు. ఎదురుగా కూర్చున్న పిన్నిగారి మొహం మీద సగం గన్నేరు పూల చెట్ల నీడ పడుతోంది. ఆ విధంగా ఆమె చూపుల్లో అర్థాలు వెతుక్కునే బాధ తనకి తప్పింది.

“మీరు మీ మీ ఉద్యోగాలకి వెళ్ళిపోయేవారు. అసలీ అమ్మాయి ఎవరో అనే లోకుల ప్రశ్నలకు జవాబు చెప్పడానికి మేమెంత ఇబ్బంది పడ్డామో మీకు తెలుసా? ఏనాడైనా మనస్సు విప్పి మాట్లాడదామంటే సంధ్య అవకాశం ఇచ్చింది కాదు. పోనీ, మీ పిన్ని దగ్గరైనా నీ బాధని చెప్పుకోవచ్చు గదమ్మా.” నిష్ఠూరంగా అన్నాడాయన.

సంధ్య కళ్ళలో నీళ్ళు రాలకుండా ఆపుకుంటూ నవ్వింది.

“నా రెండు చేతులూ చాచి రాజా మర్యాదను రక్షించాలని ప్రయత్నించాను. ఎక్కువసేపు నిలబడలేక బోర్లాపడిపోయాను.” ఒక్కమాటయినా తన గొంతులోంచి ఎందుకు పెగలదో అర్థం కావడం లేదు. దగ్గుతూ గొంతు సరిజేసుకుంది.

“మగాళ్ళకి ఇటువంటి గొడవలెన్నెన్నో ఉంటాయి. నేనూ వయస్సులో ఉన్నప్పుడు ఏం ఫర్‌ఫెక్ట్‌గా లేను. కాని ఇళ్ళ వరకూ తెస్తారటయ్యా ఎవరైనా? మనమేం అడవుల్లో బ్రతకడం లేదు కదా? పొరపాట్లు జరుగుతూంటాయి. తెలివిగా సరిజేసుకోవాలి. సంసారం సరిగ్గా నడుపుకోవాలి.”

అప్పటికి సంధ్య మాట్లాడే శక్తిని తెచ్చుకుంది.

"మాకెందుకులే అనుకుంటే, ఇంత చేదు అనుభవాలు ఉండేవి కావండీ. ఆ పిల్ల మానాన ఆ పిల్లని వదిలించేసుకుని చేతులు దులుపుకుందామనుకోలేదు. మా సంసారంలో ఎత్తుపల్లాల మీద పడి దెబ్బ తగిలించుకుంది. బాగు చేసి పంపాలనుకున్నాను."

"తప్పు. తప్పు. నువ్వింట్లో పెట్టుకున్నావంటే నీది విశాల హృదయం అని ఎవరూ పొగడరు. ఏ లొసుగులు ఆమెలో లేకపోతే ఇలా ఊరుకుంటుందీ అనుకుంటారు."

అవును అన్నట్టు తలాడించింది.

"మీరు ఆవేశపు నిర్ణయాలు తీసుకుంటారు. మీకన్నా ముందు తరం వాళ్ళు అనుభవాలతో సలహాలిస్తారు. సలహాలు వింటే ఎన్నో ప్రమాదాలు ఆపవచ్చు. కాని ఎవరూ వినరు. 'అయ్యా, రాజారావ్ గారూ, జరిగిందేదో జరిగిపోయింది. ముందా అమ్మాయిని మాత్రం వాళ్ళింటికి పంపించేయండి. కాదూ కూడదంటే ఇంకెవరైనా స్నేహితుల ఇళ్ళల్లో ఉంచి ఎంఏ – ఇంటర్వ్యూ టైముకల్లా వైజాగో, నంబూరో పంపించెయ్యండి.' ఆc, తరువాత... అమ్మా, నువ్వూ విను. మీ దంపతులిద్దరూ ఏ మాత్రం నన్ను అపార్థం చేసుకోవద్దు. మీరు నాలుగు రోజుల్లో ఏదైనా ఇల్లు చూసుకుని ఖాళీ చేసెయ్యండి. ఈ ఇల్లు నా స్వంతమన్నా కాదు. నా కజిన్‌ది. వాడు కూడా, ఎవరో అంటించారనుకుంటా... ఫోన్ చేసి మరీ చెప్పాడు. ఈ విషయంలో మాత్రం నేనేమీ సహాయం చేయలేను. మన్నించండి."

"మీరు చెప్పకముందే ఖాళీ చేసెయ్యాలని నిర్ణయించుకున్నాం బాబాయి గారు! చెప్పాల్సి వచ్చిందే అని మీరేం బాధపడద్దు. చేతులారా మేమే ఈ పరిస్థితిని ఆహ్వానించాం." సంధ్య సిగ్గుగా చూస్తూ అంది.

అప్పుడు మాట్లాడింది పిన్నిగారు "ఏం చేద్దామమ్మా. లోకం నోరు మూయించలేం కదా? అప్పటికీ దగ్గర ఎవరూ లేనిదానివీ, తల్లీదండ్రీ లేనిదానివనీ మేమే శాయశక్తులా ఆ అమ్మాయిని దారిలో పెడదామని ప్రతీ మధ్యాహ్నం ఆలోచిస్తూ ఉండేవాళ్ళం. ఎంతోమంది స్నేహితుల అడ్రెసులు చెప్పింది గాని వాళ్ళింటికి కబురు చేస్తే చస్తానని కూర్చుంది. ఎవరొస్తారు? ఏంటమ్మాయి నీకీ తిప్పలు? అని మందలిస్తే 'అన్యాయం అయిపోయా, అన్యాయం అయిపోయా' అని ఒకటే ఏడ్చేది. ఏం అనగలం? మనమూ ఆడపిల్లలు గలవాళ్ళమేనాయె."

తనని చాలా చక్కగా ఫూల్‌ని చేసేసింది. చీటికి మాటికి ఏడుస్తూ అందరి జాలీ సంపాదించుకుంటోంది. వెంటనే హాయిగా సెటిలవ్వకపోతే సంసార సుఖం

దొరక్కపోతే అన్యాయం అయిపోయినట్టన్న మాట. తాళి కట్టి భార్యగా చెప్పుకుంటే – ఒకే ఇంట్లో పెద్ద భార్యలా, చిన్న భార్యలా కాపురాలు చేసుకుంటూ ఉంటే, తను ఆమోదిస్తే న్యాయం జరిగినట్టే లెక్క! 'సుమిత్రా! నువ్వెటువంటి వెనుకబడిన కుటుంబం నుంచైనా, దుర్భర పరిస్థితుల నుంచైనా రావచ్చు. కాని నీది మరీ కరుడు కట్టిన స్వార్థం. నీ స్వార్థపు జ్వాలలో ఎవరైనా దహించుకుపోవాల్సిందే!' – పళ్ళు పటపటా నూరుతూ నోరెక్కడ జారుతుందో అన్నట్టు తమాయించుకోడానికి బాగా అవస్థపడింది.

"పిల్ల మంచిదే. శుచీ, శుభ్రం, దైవభక్తీ అన్నీ బాగా ఉన్నాయి." పిన్నిగారు సానుభూతిగా సుమిత్రని మెచ్చుకుంది.

దైవభక్తి లేని తను – సుమిత్ర దీనచరిత్ర ముందు వీళ్ళ దృష్టిలో రాక్షసిలా నిలబడి ఉండవచ్చు. తనకన్నీ ఉన్నాయనీ అందరూ అంటారు, అమ్మని తొందరగా పోగొట్టుకోడం వల్ల పిన్నిగారి వయస్సు వాళ్ళనెవరిని చూసినా తను ప్రేమించేసేది. అంత ప్రేమనీ తిరిగి పొందగలిగేది. అమ్మ లేదు. 'అమ్మా!' అని ఎలుగెత్తి పిలవాలనిపిస్తోంది. అసలు తను పిలిస్తే పలికేవాళ్ళెవరూ లేరనేగా రాజా ఇంతకు తెగించాడు!

తల పగిలిపోతోంది. "అబ్బా... బొంబాయి... అ...న్న...య్య...కి...."

"సంధ్యా! ఏయ్ సంధ్యా! " – పడిపోతున్న సంధ్యని పట్టుకుంటూ గట్టిగా పిలిచాడు రాజా.

"కళ్ళు తిరుగుతున్నాయి. నే... ను... వె... డ... తా... ను... బా...బా...యి...గా...రూ... క్షమించండి పిన్నిగారూ." వేలాడిపోతున్న చేతులు కష్టంగా ఒకచోటికి జోడించింది.

"ఊరంతా ఫ్లూ జ్వరాలున్నాయి. తీసుకెళ్ళి పడుకోబెట్టబ్బాయ్. మా ఇంట్లో టాబ్లెట్లున్నాయి. ఇస్తా."

పిన్నిగారు లేచి సంధ్య మెడమీద చెయ్యి వేసి చూసింది.

కలలో నడుస్తున్న దానిలా తూలుకుంటూ నడుస్తూ వెళ్ళి మంచంమీద పడిపోయింది. కళ్ళముందు ఎన్నో వలయాలు. రెండు రోజులు పీడించి జ్వరం దిగిపోయింది. మూడవరోజు నార్మల్ కొచ్చింది. మాములుగా లేచి తన పనులు తాను చేసుకుంటూ ఉండగా రాజా తండ్రికి బాగోలేదని టెలిగ్రాం వచ్చింది.

"నేనెళ్ళి అవసరమైతే నీకు ఫోన్ చేయడామో, టెలిగ్రాం ఇవ్వడమో చేస్తాను. నువ్విప్పుడే కదలద్దు." అని ఆదరాబాదరగా సూట్‌కేస్ సర్దుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయే ముందు "ఈ రెండు మూడు రోజుల్లో నువ్వు బాగా ఆలోచించుకో సుమిత్రా! కోపం తగ్గించుకుని, మనందరి శ్రేయస్సునీ దృష్టిలో పెట్టుకుని బాగా

ఆలోచించు. నేను తిరిగొచ్చే సరికి నువ్వు ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే బావుంటుంది." అని హెచ్చరించి వెళ్ళాడు.

***

"అరె! ఏమిటింత చిక్కిపోయారు? మేం ఒకసారొచ్చాం. మీరు హాస్పటల్‌కి వెళ్ళారట, మీ గెస్ట్ ఎవరో చెప్పారు" అన్నారు రాధిక, సుజాత – కాలేజికి వెళ్ళాక లైబ్రరీ దగ్గర.

ఓవర్ డ్యూ రిజిస్టర్ చూస్తున్న సంధ్య "మీరొచ్చారా?" అంది ఆశ్చర్యంగా.

"మొన్నొచ్చాం. ఆమెకి పేర్లు కూడా చెప్పివెళ్ళాం. వస్తాం. క్లాసెస్ ఉన్నాయి" సమాధానం ఇచ్చే బాధ సంధ్యకి తప్పించి వాళ్ళిద్దరూ పరిగెత్తారు.

మరీ ఒంటరితనం ఫీలయి కాలేజీవాళ్ళు ఎవరైనా వస్తే బావుండు, అని ఎంతగానో కోరుకుంది. భలే పని చేసింది సుమిత్ర. "ఛీ! మరీ ఇంత కుళ్ళుమోతుదేం?" అనుకుంటూ మెంబర్‌షిప్ విత్‌డ్రా రిజిస్టర్ చూసి మళ్ళీ పేర్లన్నీ జాగ్రత్తగా పరిశీలించడం మొదలుపెట్టింది.

"అమ్మా ఫోనమ్మా..." అంది స్వీపర్ వచ్చి.

రిజిస్టర్ మూసి బయలుదేరింది. ఏకొంచెం నడుస్తున్నా, కాళ్ళు పీకేస్తున్నాయి.

"సంధ్యా. నేనూ.." రాజా గట్టిగా అరిచాడు ఫోన్‌లో.

"చెప్పు."

"నాన్నకి బాగానే ఉంది. నేను ఎల్లుండి వస్తాను. నీ ఒంట్లో ఎలా ఉంది?"

"బాగానే ఉంది."

"వచ్చే నెల అమ్మానాన్నలిద్దరినీ మన దగ్గరకి రమ్మంటున్నాను. నీకు కొంచెం తోడుగా ఉంటారు."

"అవును."

"రైట్. మరి పెట్టేస్తాను. ఏమంటోంది సుమిత్ర?"

"ఏమో నేనసలు పట్టించుకోవడం లేదు. బాగా ఆలోచిస్తోందనుకుంటా."

"వచ్చాకా, నేనే స్వయంగా వెళ్ళి వాళ్ళింట్లో దిగబెడతా."

సంధ్యకి ఆ సంభాషణ ఇష్టం లేదు. "ఇక పెట్టేయనా?" అంది పొడిగా.

"ఓ.కే." అంటూ అవతల రాజా ఫోన్ పెట్టేసిన చప్పుడు వినిపించడంతో తనూ పెట్టేసి వచ్చింది. నడుస్తూండగా "నమస్తే" అనే మాటలు వినిపించి తలెత్తింది.

"బావున్నారా?"

ఎందుకో కళ్ళ నీళ్ళు తిరిగాయి. కాళ్ళు బాగా గుంజుతుండడంవల్ల బాగా నీరసంగా అనిపిస్తోంది. నిజానికీ తనకేమీ బావోలేదు. రెండు నెలల నుంచి తనసలు బావుంటోందా?

"వస్తానండీ" సంధ్య సమాధానం ఆశించకుండా రవూఫ్ వెళ్ళిపోయాడు. సంధ్యకి తను ఒంటరిది అనే బాధ బాగా పెరిగిపోయింది. ఏవో ఫార్మల్ క్వశ్చన్స్. ఎవరి వెనుక ఎటువంటి దారుణమైన చరిత్ర లున్నాయో? ఏయే సమస్యల చక్రాల్లో పడి నలిగిపోతున్నారో ఇక్కడి వాళ్ళకి ఏం తెలుస్తుంది? ఈ రవూఫ్ – ఆయన మనస్సు కకావికలం అయినప్పుడయితే చిన్నపిల్లాడిలా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు గాని 'సంధ్యగారూ, ఏమిటసలు, మీకేమయింది' అని అడగనైనా అడగలేదు. ఎవరికెవరు? అలవాటుకి విరుద్ధమైన ఆలోచనలు చేస్తూ రోజంతా బలవంతంగా కాలాన్ని నెడుతూ గడిపింది. సాయంత్రం అయ్యేసరికి జైల్లోంచి బయటపడ్డ ఖైదీలా అమ్మయ్య... అనుకుంటూ ఎవరో తరుముకొస్తున్నట్టు కాలేజీలోంచి బయటపడి వెంటనే రిక్షా ఎక్కేసింది.

ఎందుకో తెలియదు అందరిమీదా కోపం ముంచుకొస్తోంది. హాయిగా ఎవరి భార్యలని వాళ్ళు తీసుకుని వెళ్ళి ఫారిన్‌లో గడిపేస్తున్నారు. రెండు నెలలకి పైగా అయ్యింది. ఒక్క ఉత్తరమైనా రాయలేదు అనుకుని ఇద్దరన్నలనూ తిట్టుకుంది. తిట్టుకున్నాక, 'తనేమిటి, పిచ్చిదానిలా నిష్ఠూరాలేస్తోంది? ఎవరి భార్యలతో వాళ్ళు గడపక, ఇంకేం చేస్తారు? తనో క్రాక్' అని తనని తాను తిట్టుకుంది. నీరసంగా నవ్వుకుంది.

ఇంటికెళ్ళాక ఓ గంట సేపు అలా మంచం మీద నడుం వాలిస్తే గాని ఆ కాళ్ళ తీపులు తగ్గలేదు. ఎదురుగా క్యాలెండర్ ఇరవైఆరో తారీఖు చూపిస్తోంది. ఇంకా అయిదు రోజుల్లో తాము ఇల్లు ఖాళీ చేసేయ్యాలి. అసలెందుకీ సంసారం? 'పిల్లలిద్దర్నీ తీసుకుని నేనూ ఫారిన్ వచ్చేస్తానన్నయ్యా' వాళ్ళు కాదంటారా? ఏమో చిన్నప్పటి ప్రేమల కన్నా, ఇప్పటి పరువు మర్యాదల బరువే కుటుంబాలని ఆక్రమిస్తోంది. తనేమీ వాళ్ళకి భారం కాదుకదా? అసలు తనకెందుకీ బాధ? తన ఆస్తి తనకి సరిగ్గా పంచి ఇవ్వమని తెచ్చేసుకుని అదంతా బ్యాంక్‌లో వేసుకుంటే హాయిగా బ్రతకలేదా?

ఆస్తుల జోలికి వెళ్ళకూడదు. ఆర్థిక స్వాతంత్ర్యం న్యాయమైన పద్ధతుల్లో సాధించుకోవాలి. చదువుకునే రోజుల్లో కొంతమంది మంచి కమ్యూనిస్టు మిత్రుల ప్రభావం తన జీవితాన్ని చాలా మార్చేసింది. వాళ్ళల్లో కొంతమంది జీవితాలలో స్థిరపడ్డాక, సిద్ధాంతాలని గాలికి వదిలేసి, రెండు చేతులా ఆర్జించడంలోనే తమ మేధాశక్తిని బాగా ఉపయోగిస్తున్నారు. మరి కొంతమంది నిరాడంబరంగానే బ్రతుకుతూ

ఇంకేనాడో రాబోయే సమానత్వం గురించి కలలు కంటూ, నిరాశపడకుండా ఇతోధికంగా తమ సేవలు అందిస్తున్నారు. అటువంటి వాళ్ళు డాక్టర్స్‌లోనే ఎక్కువ ఉన్నారు. మిగిలిన చాలామంది తమ వ్యక్తిగత జీవితాలనీ, పిల్లలకి ఏమీ నష్టం రాకుండా భద్రత కలిపించుకుని కమ్యూనిజం గురించి ఉద్రేకంగా, అనర్గళంగా ఉపన్యాసాలిస్తూ ఉంటారు. ఎవరో ఎందుకు? తన చిన్నన్నయ్య ఎంత చురుగ్గా, చలాకీగా ఇవన్నీ చర్చిస్తూ తిరిగేవాడు! ఇప్పుడు వాడు ఫారిన్‌లో చేస్తున్న ఉద్యోగానికి తిలోదకాలిచ్చి ఏం వ్యాపారం చేద్దామా – అనే మీమాంసలో పడ్డాడుట. వయస్సు పెరుగుతున్న కొద్దీ సమాజపు హెచ్చు తగ్గుల పోటీలో పడిపోయి, పైకి వెళ్ళే పద్ధతుల గురించి ఆలోచిస్తూ సర్కస్ ఫీట్స్ చేస్తూ మొత్తానికి చాలా కష్టపడి ఆర్థిక సోపానాలు ఎక్కేస్తారు తెలివిగలవాళ్ళు. అలా ఎక్కేడప్పుడు అడ్డుపడిన ప్రతీవాళ్ళనీ నిర్దాక్షిణ్యంగా తోసేస్తూ, పైగా ఇదంతా తమ శక్తి సామర్థ్యాల వల్లే అని నొక్కి వక్కాణిస్తారు. వాళ్ళు కష్టపడి ఉండవచ్చు, అహర్నిశలు శ్రమపడి ఉండవచ్చు. ఆ శ్రమలో అవినీతి, ఆ కష్టంలో దోపిడీ లేకుండా సునాయాసంగా వ్యాపారస్తులుగానో, పారిశ్రామికవేత్తలుగానో మారిపోతున్నారా?

శ్రామిక శక్తిని డబ్బు పెట్టి కొంటే ఓ మనిషికి వ్యక్తిగత లాభం చాలా ఎక్కువ. చాలా... ఎక్కువ.

రాత్రి పదయ్యేవరకూ నిద్రపోతూనే ఉంది. రంగమ్మే పళ్ళెంలో అన్నం, కారప్పొడి వేసి తీసుకొచ్చి ఇచ్చింది. తిని మళ్ళీ సొమ్మసిల్లిపోయినట్టుగా పడిపోయింది సంధ్య.

తెల్లవారు జామునే మెలకువ వచ్చింది. ప్రాణం తేలిగ్గానే ఉంది. కాని విపరీతమైన నీరసంగా ఉంది. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా బంద్ అని వినేసరికల్లా ప్రాణం లేచొచ్చింది. ఎందుకు బంద్ అని పట్టించుకునే స్థితిలో కూడా లేదు. బంద్ కారణంగా సెలవు. అంతే! అనుకుంటూ తీరిగ్గా పనులు చేసుకోవడం ప్రారంభించింది. ఈ రోజు అప్పుడే ఇరవయ్యేడు. ఫస్టు కల్లా ఇల్లు ఖాళీ చేసెయ్యాలి. ఈ ఇల్లు పిల్లల స్కూలుకి దగ్గరవుతుందని బాబుని కూడా పాప చదివే స్కూల్లో జాయిన్ చేద్దామని రాజా కాలేజికి దగ్గరున్న ఇల్లు ఖాళీ చేసి ఇటొచ్చారు. తనకి కూడా కాలేజికి ఫరవాలేదనిపించే దూరమే. ఇప్పుడు మళ్ళీ మంచి ఇంటి కోసం వెతుకులాట! కొత్త ఇంట్లో పాత అవమానాలు, అనుభవాలు మరిచిపోయి బుద్ధిమంతుల్లా సంచరించాలి కాబోలు! ఈ రాజా గారు బుద్ధిమంతుడిలా సామాను ప్యాకింగ్ గురించీ, లారీ గురించీ పట్టించుకుంటారు. ఈ చుట్టుపక్కల ఇళ్ళల్లో ఎక్కడా తానుండలేదు. బాగా దూరంగా, తన కాలేజికి దగ్గరగా వెళ్ళిపోతే మంచిది. సాయంత్రం ఓపిక చేసుకుని ఆ రాధిక దగ్గరకన్నా వెడితే నయం. ఇద్దరూ కలిసి ఎంక్వయిరీ ప్రారంభించవచ్చు.

పరిపరివిధాల ఆలోచిస్తూ పిల్లల బట్టలకి ఊడిపోయిన బొత్తాలు కుడుతూ, మధ్యాహ్నం అంతా కాలక్షేపం చేసేసింది.

సాయంత్రం జడ అల్లుకుంటూ ఉండగా సుమిత్ర దగ్గరకొచ్చి నిలబడింది. అద్దంలోంచి సుమిత్ర మొహం కనిపిస్తూ ఉంది.

"అరుణ నొకసారి పిలవండి" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అంది.

"అరుణెందుకు?"

"అరుణ సలహాతోనే మీ ఇంటికి వచ్చాను. దానితో డిస్కస్ చేసి నా దారి నేను వెతుక్కోవాలి కదా! అదేం చెబుతుందో మరి?" సుమిత్ర మాటలలో స్నేహితురాలి మీద మంచి నమ్మకం ధ్వనిస్తోంది.

"వాళ్ళిల్లు చాలా దూరం కదా! ఈరోజు రిక్షాలు, బస్సులు ఏమీ తిరగడం లేదు. రేపు పిలిపిస్తాన్లే."

"ఏమో, ఈ రాత్రికే నేను చావొచ్చు. ఇప్పుడే పిలిపించండి."

"బెదిరింపా?" సూటిగా చూస్తూ అడిగింది సంధ్య.

"కాదు. ఏ దిక్కూ మొక్కూ లేనివాళ్ళు ఏం చేస్తారు?" సుమిత్ర మొహం తిప్పుకుంది.

ఇటువంటి మాటలింకో పది వదిలి తన హృదయాన్ని మెత్తబరిచి తన పబ్బం గడుపుకోగలదు సుమిత్ర. వాదన పెంచడం అనవసరం. సంధ్య చెప్పులేసుకుంది. "అయితే వెంటనే వెళ్ళాలంటావ్." ప్రశాంతంగా అంది.

"వెళ్ళండి. దాన్ని ఏడిపించడం ఎందుకని ఇంతకాలం ఈ రెండు నెలలూ నేను పడిన బాధలు దానికేం చెప్పలేదు?"

"నిన్ను చూడడానికి రెండు మూడుసార్లు వచ్చినట్టుందీ నేను లేని టైమ్‌లో" తను కాలేజీ నుంచి వచ్చే సమయానికి అరుణ తన ఇంటిముందు రోడ్డు మీద వెళ్ళడం గుర్తు చేసుకుని ప్రశ్నించింది.

"అవును. వచ్చింది." కర్కశంగా బదులిచ్చింది. "నన్ను చాలా బాగా చూసుకుంటున్నారు. స్వంత చెల్లెలి కంటే బాగా చూసుకుంటున్నారు సంధ్యగారు అని చెప్పాను. ఇక ఫర్వాలేదనుకుని అది రావడం మానేసింది."

"సరే వెళ్ళి తీసుకొస్తాను." సంధ్య లేని ఓపికని తెచ్చుకుని నడిచి వెళ్ళి అరుణా వాళ్ళింటికి వెళ్ళింది. అరుణతో కూడా ఏమీ మాట్లాడలని లేదు సంధ్యకి.

నిజంగా తన గురించి ఆ అమ్మాయికి కొంచెమయినా అలోచన ఉంటే స్నేహితురాలి గురించి ఆ రోజుల్లోనే హింట్ ఇచ్చేది. ఆ పిల్ల జాగ్రత్తగానే సెటిలవగలదు. గారాబాల కూతురు. డబ్బుగల అమ్మాయి. అరుణ గురించి ఆలోచిస్తూ వాళ్ళమ్మ గారితో మాట్లాడుతూ కూర్చుంది. అరుణంటే అందరికీ ప్రాణం అన్నట్టు మాటల్లో, చేతల్లో బాగా చూపిస్తూ ఉంటారు వాళ్ళంతా.

ఇంతలో స్నేహితురాలింటికి వెళ్ళిన అరుణ "నమస్తే మేడమ్" అంటూ వచ్చింది. సంధ్యని చూడగానే ఆ అమ్మాయికి భయం, బాధ, ఆదుర్దా అన్నీ వచ్చేశాయి. "మేడమ్‌కి టిఫిన్, కాఫీ ఏమైనా ఇచ్చారా?" అని అడిగి, "పదండి మేడమ్" అని తన గదిలోకి తీసుకెళ్ళింది.

టైం వేస్టు చేయడం ఎందుకు – అనుకుని "అరుణా మీ అందరూ రెండేళ్ళ నుండీ మీ స్నేహితురాలి రహస్యాన్ని కాపాడారు. నువ్వంటే నాకు ప్రత్యేకమైన ఇష్టం ఉండేది. అసలు నీ మీద నమ్మకం వల్లే సుమిత్ర రాకపోకలని అస్సలు పట్టించుకునేదాన్ని కాదు." అంటూ ఆగి అరుణ మొహంలోకి చూసింది.

"క్షమించండి మేడమ్" అంది ఆవేదనగా అరుణ.

"నా బంగారం మంచిది కాదు. అందుకే నిన్నుగానీ, చంద్రంగార్ని గాని కలిసి ఇలా ఎందుకు జరిగింది, నాతో మీరెవ్వరూ ఎందుకు చెప్పలేదు, అని అడగాలనిపించలేదు. కాని ఇప్పుడు నీ ఫ్రెండ్ నన్ను తరిమింది. నీ సలహాతోనే మా ఇంటికి వచ్చిందట. ఇప్పుడు తనకి సరైన గైడెన్స్ ఇస్తావనే నమ్మకంతో నిన్ను పిలుచుకు రమ్మంది." చెప్పడం పూర్తి చేసి నిర్లిప్తంగా అరుణ వైపు చూసింది.

తోక తొక్కిన తాచులా లేచింది అరుణ. "చెంప పగలగొడతాను ఆ రాక్షసిని. నా సలహామీద వచ్చానని చెప్పిందా? మేడమ్, మధ్యాహ్నాలు మీ పక్కింటాయనతో ఫోన్ చేయించి నన్ను రప్పించింది అది నన్ను... మా వాళ్ళు చాలా పాతకాలం వాళ్ళు. నా మీద ప్రేమతో ఈ డిగ్రీ చదివించారు గాని అస్సలు బయటకి పంపడానికి కూడా ఇష్టపడరు. ఫస్ట్ ఇయర్‌లో ఉండగా నాకు తెలిసిన అబ్బాయి ప్రేమలేఖ రాశాడు. నాకు కొంచెం చిన్నతనం అవడం వల్ల పొంగిపోయి అది చించకుండా ఈ సుమిత్ర దగ్గర దాచాను. ఆ అబ్బాయిని కలిసి నాకా ఉద్దేశమే లేదని నచ్చజెప్పాను. అసలా చాప్టర్ అంతటితో క్లోజయిపోయింది. మరి ఆ ఉత్తరం దీని దగ్గరే అలా ఉంచేసిందనుకుంటా, మొన్న మీ పక్కింటాయన కూడా ప్రస్తావించాడు. నాకు ఏడుపు వచ్చేసింది. అంటే నా ఈ చిన్న లొసుగుని అది బ్లాక్‌మెయిల్ చేద్దామనుకుంటోంది." అరుణ తన బాధంతా అవేశంగా వెళ్ళగక్కింది.

తెల్లబోయి వినడం సంధ్యవంతయింది. అరుణని కూడా ఇందులో ఇరికించి, ఏడిపించగలదీ సుమిత్ర – అని ఏనాడూ ఊహించలేదు. తన వెనుక ఎన్నెన్ని జరిగిపోతున్నాయి!

తనేమీ మనసు విప్పి పక్కింటివాళ్ళకు చెప్పలేదనే కక్షతో పక్కింటివాళ్ళు వాళ్ళ మంచితనాన్ని పూర్తిగా సుమిత్రకే ఉపయోగించేశారు.

"మీ కాలేజీకొచ్చి మీతో మాట్లాడుదామా అనుకునేదాన్ని కాని గిల్టీ కాన్షస్

నాకు. నిజమే నాకు ఆలోచించే శక్తి లేక, జ్ఞానం లేక, ఫ్రెండో ఫ్రెండో అనుకుంటూ దానికే విలువిచ్చాను గాని మీకు మేలు చేయలేకపోయాను. పైగా అది ఏడవటం, అందరూ దాని మీద మాత్రమే జాలిపడేంత నేర్పుగా కథలల్లి చెప్పుకోగలదు. మూడేళ్ళ నుంచి నేనెంత సహాయపడ్డానో మేడమ్. గొప్పలు చెప్పుకోవడం కాదు. అది బాగా నడవగలదనే గౌరవంతో నేనెంతో దగ్గరికి తీసాను. నా ఇంట్లో మనిషిగానే ట్రీట్ చేసి దానికి అన్ని సదుపాయాలూ చేశాను కాని..."

అరుణ చిన్నది. అమ్మానాన్న నీడలో పెరుగుతున్న నవనవలాడుతున్న పూల మొక్క లాంటిది. తన బాధనంతా ఎవరితో చెప్పుకునే వీలు లేక సంధ్య రాగానే ఇన్నాళ్ళు తను పడిన కష్టానంతా వివరించి గుండెలు తేలికపరుచుకుంది.

"ఏది ఏమైనా మీ కాపురంలో చిచ్చురేపాము. అసలు మాస్టారు బాగా టీచ్ చేయడమే గాకుండా అందరితో మంచి ఫ్రెండ్‌లా, చాలా క్లోజ్‌గా ఉండేవారు. పైగా కథలు రాస్తారనే గ్లామరు ఒకటి. అందుకే తెలియనివి చెప్పించుకోడానికి ఫ్రీగా మీ ఇంటికి వచ్చేవాళ్ళం. నాకు బుద్ధి ఉంటే ఇవన్నీ గ్రహించి ఉండేదాన్ని. అది నన్ను ఉపయోగించుకునేది కాని తన విషయాలు చెయ్యి దాటేవరకు రహస్యంగానే ఉంచేది. నన్ను క్షమించండి మేడమ్! మిమ్మల్ని తలుచుకు బాధపడుతూ ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళు గడిపానో!" సంధ్య చేతులు రెండూ పట్టుకుంది.

"జరిగినదాని గురించి విచారించడం అనవసరం అరుణా! ఇప్పుడు తనని ఇంట్లోంచి పంపేయాలి. అసలు నేనే ఆశతో వచ్చానంటే, తనకి మీ ఇంట్లో బాగా చనువు కదా! ఎలాగో ఒకలా నువ్వు మేనేజ్ చేసి ఇంకో పదిహేను రోజుల్లో ఇంటర్వ్యూలు ఉన్నాయి గదా, అక్కడికి నీతోపాటు తీసుకువెళ్ళగలవేమో అడుగుదామని వచ్చాను. ఇప్పుడంతా విన్నాక నా అభిప్రాయం మార్చుకున్నాను."

"అసలు నేను పి.జి.కీ వెళ్ళేవరకూ డౌటే మేడమ్. అసలిప్పుడు దీని పొడే గిట్టడం లేదు నాకు. ఏనాడైతే మీ ఇంట్లో తిష్ఠ వేసిందో అప్పుడే నేను ఈ మనిషి గురించి చాలా భయపడ్డాను. దీని రాకపోకలకీ నాకూ ఏమీ సంబంధం లేదు. నా జోలికి రావద్దని చెప్పండి. నా భయాన్ని అది చాలా ఎక్స్‌ప్లాయిట్ చేస్తోంది. నాకూ తెగింపు వస్తోంది. అది ఉండగా మీ ఇంటికి అసలు రాను." అరుణ తెగేసి చెప్పేసింది. చీకటి పడుతోంది. వెళ్ళొస్తానని వాళ్ళింట్లో అందరికీ చెప్పేసి బయలుదేరింది. అరుణ సాగనంపడానికి రోడ్డు చివరి వరకూ వచ్చింది. చాలా మాట్లాడుకున్నారు. ఇల్లు ఖాళీ చేయాల్సిన ఆవశ్యకత గురించి చెప్పింది.

"ఈ విషయంలో మాత్రం మీకు తప్పకుండా హెల్ప్ చేస్తా మేడమ్. మీ కాలేజీకి కొంచెం దగ్గరగా మా చుట్టాలు ఇద్దరు ముగ్గురున్నారు. తప్పకుండా మీకు ఇల్లు చూస్తాను. మీ కాలేజి దగ్గరకొచ్చి చెబుతాను. దాని బెదిరింపులకి లొంగకండి.

మీరు ఫస్టు లోపలే వెళ్ళగొట్టేయండి." మరీ మరీ హెచ్చరించి వెనక్కి తిరిగింది అరుణ.

కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళింది. ఎక్కడా వాహనాలు తిరగడం లేదు. రోడ్డు మీద జనం పల్చగా ఉన్నారు.

"జిందగీ ఖ్వాబ్ హై" అంటూ రేడియోలో ముఖేష్ ఆర్ద్రంగా, విషాదంగా ఆలపిస్తున్నాడు.

మరీ కాళ్ళు నొప్పులనిపించి, ఒకచోట వగర్పు ఆపుకుంటూ నిలబడింది. పాట ఇంకా దగ్గరగా వినిపిస్తోంది. ఇద్దరు బిచ్చగాళ్ళు నవ్వుకుంటూ చింతచెట్టు దగ్గరికి చేరారు. వాళ్ళ కబుర్లు వేరుగా ఉన్నాయి.

ఏదో ఒక పిట్ట అరుచుకుంటూ రెక్కలు టపటపలాడించుకుంటూ చెట్టు మీద నుంచి వెళ్ళిపోయింది.

జీవితమెంత చిత్రమైనదీ! ఎంత క్లిష్టమైనదీ! అందమైనదీ! అల్పమైనదీ! రెండేళ్ళ క్రితం సుమిత్ర ఎవరో? అసలు రెండు నెలల క్రితం వరకూ సుమిత్ర ఎవరో? ఇప్పుడా సుమిత్ర "అరుణని తీసుకురండీ" అని తనని శాసిస్తే ఈ బంద్ రోజున ఇంతదూరం శ్రమపడి వచ్చింది. ప్రస్తుతం తన సమస్య రాజా ఇంకో అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడని కాదు. సుమిత్రని ఎలా పంపించేయాలి అని.

గచ్చకాయ రంగు స్కూటర్ సంధ్య ముందు నుంచి వెళ్ళిపోయి మళ్ళీ వెనక్కి గుండ్రంగా తిరిగి, దగ్గరకొచ్చి ఆగింది. తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చేతులు హ్యాండిల్స్ పట్టుకుని ఉన్నాయి.

"బంద్ రోజున మీరెక్కడికి బయల్దేరారు?"

"పనుండి వచ్చాను" ముక్తసరిగా అంది.

"అదేమిటి, మీకు బాగా చెమట పడుతోంది? రాజాగారి స్కూటర్ లేదూ? మీరొక్కరే నడిచివచ్చారా?" స్కూటర్ స్టాండ్ వేసి దగ్గరకొచ్చి నిలబడి అడిగాడు రవూఫ్.

'నేనొక్కదాన్నే. మీలాంటి వాళ్ళే పదిసార్లు ఆ రాజా పేరు గుర్తు తెచ్చి నన్ను నిర్వీర్యంగా చేస్తున్నారు' – సంధ్యకి ఉడుకుమోత్తనంగా అనిపిస్తోంది. ఏమీ మాట్లాడాలనిపించలేదు.

"అసలే మన ఊరు గొడవలకి పెట్టింది పేరు. ఎందుకొచ్చారు బయటకి?"

ఆ మందలింపు తన నీరసపు స్వేదానికి మలయమారుతంలా అనిపిస్తోంది. రవూఫ్‌తో ఎక్కడికైనా వెళ్ళి తన కుటుంబ వివరాలన్నీ చెప్పేసి అతని సహాయం తీసుకోవాలనిపిస్తోంది.

అప్పుడతని చూపుల్లో తన పట్ల ఈ విలువా, గౌరవం, అభిమానం పూర్వంలా ఉంటాయా?

"సంధ్య గారూ, వినిపిస్తోందా?" నవ్వుతూ అన్నాడు.

"ఆఁ, ఏవిటీ అన్నారు?" అతని వైపు చూసింది.

"లాభం లేదు." అన్నాడు తమాషాగా.

"నేను వెడతానండీ" కదలబోయింది.

"అరె, ఆగండి. నేను డ్రాప్ చేస్తాను. అదే ఇందాక కూడా చెప్పాను."

స్టార్ట్ చేస్తుంటే, "నేను నడిచి వెళ్ళిపోతాను" అంటూ వేగం పెంచింది.

అతను వెనకాలే వస్తూ "సంధ్య గారూ" అన్నాడు కోప్పడుతూ.

"వద్దండీ. ఏ కుర్రాళ్ళయినా చూసినా బావుండదు. ఇదేమీ సిటీ కాదుగదా!" సంధ్య నడుస్తూనే అంది.

"రిక్షాలు లేవు. బస్సులు లేవు. సమయాన్ని బట్టి మనం ప్రవర్తించాలి. రండి. డ్రాప్ చేస్తాను. ప్లీజ్." రవూఫ్ బ్రతిమాలుతూ పిలిచాడు.

ఇంక తను తనని ఒక్కదాన్నే పోనివ్వడు. అయిష్టంగానే ఎక్కింది.

రవూఫ్ చాలా మెల్లగా పోనిస్తూ, "మూడు రోజులు మీకు జ్వరమటగా? నాకు తెలియదు." అన్నాడు.

"అవును" అంది బింకంగా.

"నిన్న హడావిడిగా మీ లైబ్రరీకొచ్చాను. ఏదో మాటల్లో రాధిక గారు చెప్పారు – జ్వరం పడి లేచి వచ్చారు అని. కాని నేనొచ్చేసరికి మీరు లేరు."

"సరేగాని రవూఫ్ గారు, మీరో ఇల్లు వెతికి పెట్టగలరా?"

"మీకా?"

"అవునండీ"

"మా ఇంటికొచ్చేయండి. మా ఇల్లు పెద్దదే" సరదాగా అంటూ ఎదురుగా వస్తున్న లారీకి సైడిస్తూ పక్కకి టర్న్ చేశాడు. తూలబోయి ఆపుకుంది.

"సరదాకి కాదు, నిజంగానే ఇల్లు చూసి పెట్టండి."

"ఏం మీ ఇంటి వాళ్ళు నోటీసిచ్చారా?"

"దాదాపు అటువంటిదే." ఏదో సినిమా పోస్టరు చూస్తూ అంది.

"ఆశ్చర్యంగా ఉంది. మీతో పడకపోవడమంటూ ఉంటుందా? మీకు శత్రువులుంటారా?"

"ఇంకా నయం. మీకు ఆకలేస్తుందా? అన్నం తింటారా అనలేదు."

సంధ్య మాటలకి హాయిగా నవ్వాడు. ఆ నవ్వు గాలిలో తేలుతూ చాలా శ్రావ్యంగా అనిపించింది. ఇంత హాయిగా తను నవ్వి ఎంతకాలమైందో అనుకుంది. ఎలాగైనా రవూఫ్‌లో నిష్కల్మషత్వం ఎక్కువ. అందుకే అంత హాయిగా నవ్వేయగలడు అనుకుంది.

తన ఇల్లు దగ్గర పడుతోంది. ఇప్పుడితన్ని ఇంటికి ఆహ్వానించాలనిపించడం లేదు. వంతెన దాటుతుండగా "ఆపండి" అంది.

"ఇక్కడ చిన్న పనుంది. దిగిపోతాను. చాలా థ్యాంక్స్." అంది చిరునవ్వుతో.

"పోనీ, నేను వెయిట్ చెయ్యానా? మీకు తెలియడం లేదు గాని మీరు చాలా నీరసంగా ఉన్నారండీ"

ఆదుర్దా ధ్వనిస్తున్న ఆ కంఠం సంధ్యకి చెప్పలేనంతగా కులాసాని కలిగిస్తోంది. "నో థ్యాంక్స్. ఇక్కడికి చాలా దగ్గర. వెళ్ళిపోగలను. నేను చెప్పిన విషయం మరచిపోవద్దు." అంటూ నవ్వుతూ చెయ్యి ఊపింది. అతనూ తలూపి బై చెప్పేసి స్కూటర్ స్పీడ్‌గా పోనిచ్చాడు.

బోనులో తిరుగుతున్న పులిలా సుమిత్ర ధనాధనా పచార్లు చేస్తోంది హాల్లో. సంధ్యని చూసి ఆగింది. అరుణ అన్న మాటలు సంగ్రహంగా చెప్పింది.

"అసలు రానందా?"

"రాదుట"

"ఛీ! పనికిమాలిన ముండ!" సుమిత్ర గట్టిగా తిట్టింది. సంధ్య ఏమీ మాట్లాడలేదు.

"అందరూ బాగా వాడుకున్నారు. అందరూ మోసగత్తెలే."

బెడ్‌రూంలోకి వెళ్ళబోతున్న సంధ్య తల వెనక్కి తిప్పింది.

"సుమిత్రా, నువ్వా డైలాగ్ విత్‌డ్రా చేసుకో. నేను నిన్నేమీ వాడుకోలేదు."

"నేను మిమ్మల్ననడం లేదు" ఖంగుమంది సుమిత్ర కంఠం.

"సరే అయితే"

"మాస్టారెప్పుడు వస్తారు?"

"రేపొద్దుటికల్లా దిగుతారు" ఇక అక్కడుంటే సుమిత్రతో సంభాషణ పెంచాల్సి వస్తుందని వెళ్ళిపోయింది.

పిల్లలు ఆటబొమ్మలతో ఆడుకుంటున్నారు. సంధ్యని చూసి చందమామల్లా పకపకా నవ్వారు. వాళ్ల ఆటలు చూస్తూ, సూచనలిస్తూ చాలా సమయం గడిపేసింది.

చచ్చిపోతానని బెదిరించింది. మళ్ళీ రాత్రికి తను కాపలా కాయాలేమో? ఈ సుమిత్ర వెళ్ళిపోయాక ఓ నెల రోజులు కరువుదీరా నిద్రపోవాలి తను!

"యామ్మ, యాంటికీ ఇల్లు ఖాళీ సేత్తరన్నారంట?" రంగమ్మ వచ్చి కూలబడింది.

"అవును రంగమ్మా, కాలేజి దగ్గర చూసుకుందామని."

"ఇక్కడి నించయితే నా కూతురిల్లు దగ్గర. మీరు మల్లీ ఏ పొలిమేరల్లోకో బోతే శానా కష్టం తల్లా నాకు." రంగమ్మ అయిష్టత వ్యక్తపరిచింది. "అసలీ యమ్మ నీ ఇంటో అడుగెట్టడమే వచ్చింది ముప్పు. అయినా అయ్యగారు సానా ఏపుకు తిన్నాడంట ఈ పిల్ల సేతికందేవరకూ" అంది.

సంధ్య వినలేనట్టుగా కళ్ళు మూసుకుంది. "రంగమ్మా కాస్త బాబుని నిద్రపుచ్చుతావా? నాకు నీరసంగా ఉంది."

"పడుకో. సీతమ్మోరి కొచ్చినంత కష్టం వచ్చింది నీకు. ఆడదానికి బాదలు ఎపుడూ ఉండేవే... దా బాబూ..." అంటూ అందుకుని సంధ్యని కరుణించినట్టు వెళ్ళిపోయింది.

రాత్రి పన్నెంటింటి వరకూ ఏదో పుస్తకం చదువుతూ ఉండిపోయింది. పన్నెండు దాటాకా, "సంధ్యా!" అనే పిలుపు వినిపించి ప్రాణం లేచొచ్చినట్టయి తలుపు తీసింది.

''ఏమిటీ ఇంకా నిద్రపోలేదా? లైట్లన్నీ వేసే ఉన్నాయి. నేను రేపొద్దామనుకొన్నాను. కాని నీకు బాగోలేదని చెబితే, మావాళ్ళంతా 'పర్వాలేదు నువ్వెళ్ళిపో' అని బలవంతపెట్టారు. నేను హోటల్‌లో భోజనం చేసొచ్చాలే" అని గబగబా బట్టలు మార్చుకున్నాడు.

ఈ రాత్రి ఎలా గడపాలి? సుమిత్ర తననేమయినా బెదరగొడుతుందేమో, మెలకువగానే ఉండాలి అనుకుంటూ కూచుంది. ఇప్పుడు బాగా ధైర్యమొచ్చింది. టూకీగా మెల్లగా విషయం చెప్పి, "నాకు మేలుకునే ఓపిక లేదు. పళ్ళ బిగువున ఇంతసేపున్నాను. నీ ఇష్టం" అని పడుకుంది.

"ఈ బెదిరింపులు చాలాసార్లు అయ్యాయిలే. అయినా తను నిద్ర పోతున్నట్టుంది. నువ్వు ఫ్రీగా పడుకో" అని లేచి ఒకసారి సుమిత్ర గదిలోకి వెళ్ళి చూసొచ్చి తలుపులన్నీ సరిగ్గా వేశాడు. వంట గదిలోంచి తిరిగెళ్ళి ముందు గదికి తాళం వేసేశాడు. సుమిత్ర గదికీ, హాల్లోకి ఉన్న తలుపు రోజూలాగానే గడియ వేశాడు. అప్పుడు కాస్త నిశ్చింతగా అనిపించి తనూ నిద్రపోయాడు.

# 13

"సంధ్యా, నువ్వు రెడీ అయిపోయావా?" రాజా బ్రష్ చేసుకుంటూ పిలిచాడు.

"నేను రిక్షాలో వెళ్ళిపోతాన్లే." బ్యాగ్ సర్దుకుంటూ సంధ్య అంది.

"రిక్షాలో ఎందుకూ? నేను డ్రాప్ చేసే మా కాలేజీకి వెడతాను. ఒక్క నిమిషం నువ్వు కూడా ఇలా వచ్చి కూర్చో." పక్కన కుర్చీ చూపించాడు.

తలుపు దగ్గరగా సుమిత్ర చిందులు తొక్కడానికి సిద్ధంగా ఉన్నానన్నట్టు కక్షగా చూస్తూంది. నన్ను వెళ్ళగొడతారా మీరు అనే ద్వేషపు ప్రశ్నలే ఆ చూపుల్లో కనిపిస్తాయని, సంధ్య అసలు సుమిత్ర వైపే చూడకుండా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది.

"సుమిత్రా! ఊరెళ్ళినా నీ గురించే ఆలోచించాను. ఈ రోజున నిన్ను బలవంతంగా పంపించివేయాల్సిన పరిస్థితి వచ్చినందుకు సిగ్గు పడుతున్నాను. నీకే కాదు మాక్కూడా ఈ ఇంట్లో ఉండే అర్హత లేదు. మా మీద కోపంతో మొత్తం మన కథని ఈ వీథంతా చెప్పుకునేలా చేశావ్. నిన్నెంతో అమాయకురాలిగా భావించి, ఈ లోకంతో, నా భార్యతో కూడా పోరాటానికి ఎలా సిద్ధపడ్డానో నువ్వు ఊహించలేవు. సర్లే, నిన్నింతగా మార్చివేసిన పరిస్థితులని తిడగాను గాని నేను నిన్నేమీ తప్పుబట్టను. ఏ ఆడపిల్లా అనుభవించనంత క్షోభ, ఒత్తిడి నువ్వు అనుభవించావు. నీ ఎం.ఏ. అయ్యేవరకూ మీ ఇంటితో పూర్తి సంబంధాలు తెంపేసుకుని బ్రతకడం సాధ్యమయ్యే విషయం కాదు. చూశావుగా, ఈ రెండు నెలల్లో ఎన్నెన్ని అబద్ధాలు ఆడాల్సివచ్చిందో, ఎంత మందిని నువ్వు తప్పించుకుని పారిపోవాల్సి వచ్చిందో!"

సుమిత్ర ఏమీ మాట్లాడలేదు. జడ విసురుగా వెనక్కి విసిరేసి ఇద్దరి వైపు తినేసేడట్టు చూసింది. కళ్ళు చికిలిస్తూ, పంటితో కింది పెదవి కొరుకుతూ మళ్ళీ అలాగే చూస్తూండిపోయింది. ఆ చూపుకి బెదిరి సంధ్య వెంటనే తల తిప్పేసుకుంది. ఆ చూపులు తనని మానసికంగా నిర్వీర్యంగా చేస్తున్నాయి.

రాజా లేచి నిలబడ్డాడు. తన పర్స్ చూసుకుని, సంధ్య వేపు తిరిగి, "సంధ్యా, నీ దగ్గర ఇంకో వంద ఉందా?" అన్నాడు.

సంధ్య తీసిచ్చింది. రాజా తన పర్స్ లోంచి కూడా వంద నోటు తీసి, రెండూ కలిపి అందిస్తూ – "తీసుకో సుమిత్రా" అన్నాడు. సుమిత్ర కదల్లేదు. అలా చూస్తునే ఉంది.

కారణాలు ఎలాగయినా ఉండనీయి. తామిద్దరి మధ్యా చోటు చేసుకోవాలని ప్రయత్నించిన ఈ అమ్మాయిని వదిలించేసుకున్నట్టుగానే ఉందిగా. తనూ

స్వార్థపరురాలిగా, హిందూ నారి లాగానే ఆ అమ్మాయి నిష్క్రమణని కోరుకుంటోంది. సంధ్య మనస్సుతో యుద్ధం చెయ్యలేక లేచి నిలబడింది.

రాజా బలవంతంగా సుమిత్ర చేతిలో డబ్బు ఉంచాడు. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. సుమిత్ర చెయ్యి అలాగే పట్టుకుని మొహంలోకి చూస్తూ –

“నాకు దుఃఖంగా ఉంది. ఈ కలహాలు, ఈ మనస్తాపాలు అన్నీ తలచుకుంటూ ఉంటే చాలా దుఃఖమనిపిస్తోంది. నీ పరిస్థితికి ఇంకా దుఃఖమొస్తోంది. నాకే గాని ఓ చెల్లి ఉండి, ఇటువంటి పరిస్థితి వస్తే ఇంటి పెద్దలాగా, ఓ అన్నగారిలాగా ఆ చెల్లెలి పట్టుదలకి, తెలివితక్కువతనానికి ఎంత కుమిలిపోతానో అటువంటి దుఃఖం ఇప్పుడు వెంటాడుతోంది. పూర్వపు రాజా చచ్చిపోయాడు. నువ్వు నన్ను శపించినా, తిట్టినా ఇంక నువ్వు కోరుకునే మాస్టారిలా బ్రతకలేను. మేం బయటకి వెళ్ళాక నువ్వు మాములుగా మీ ఇంటికి వెళ్ళినా సరే. నీ ఒక్కదానికే వెళ్ళడానికి భయమైతే, నేను మధ్యాహ్నం వచ్చి దింపుతాను. నా మీద ఎక్కువగా అనుమానం ఉండి మీ వాళ్ళంతా ఎంత తిట్టినా పడతాను. లేదా సంధ్యని వెంటబెట్టుకెళ్ళు సాయంత్రం తను వచ్చాక. నీ ఇష్టం. ఏదో ఒక విధంగా ఈ ఇంట్లోంచి వెళ్ళడం తప్పనిసరి కాబట్టి ఆ పని ఇప్పుడే నిర్ణయిస్తున్నాను. వస్తాను సుమిత్రా. బెస్టాఫ్ లక్.” కళ్ళు తుడుచుకుని, “పద సంధ్యా! అంటూ సంధ్యతో పాటు గుమ్మం దాటాడు.

“వాళ్ళింటికి వెళ్ళడానికి బాగా భయపడుతుందేమో మరి!” సన్నగా అంది సంధ్య.

“అయితే ఉండు” అని వెనక్కి వచ్చి – “సుమిత్రా, మీ ఇంటికి వెళ్ళడం మరీ అయిష్టమైతే నువ్వు యూనివర్సిటీకీ వెళ్ళేవరకూ షెల్టర్ ఏర్పాటు చేస్తాను. నువ్వేమీ లేనితనాన్ని ఫీలవ్వద్దు. నువ్వు ప్రశాంతంగా అన్ని యాంగిల్స్ నుంచీ ఆలోచిస్తావనే ఇంతగా చెబుతున్నాను. నేను మూడింటికొస్తాను.”

కాలేజీకి వెళ్ళినా మనస్సు లగ్నం చేయలేకపోయింది. మాటిమాటికీ సుమిత్ర మాటలే గుర్తుకొస్తున్నాయి. అసలు స్త్రీ సమస్యల గురించి మాట్లాడే అర్హత తనకి లేదేమో. తన ఇంటిలో సుమిత్ర లాంటి అమ్మాయికే ఆశ్రయం ఇవ్వాల్సివస్తే ఇన్నిన్ని ఘోరాతిఘోరమైన అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సంఘంలో తనకున్న స్థానబలిమి వల్ల తను మనస్సు విశాలంగానూ, ఆ సుమిత్ర మనస్సు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు వల్ల ఇరుకుగానూ తయారవుతోందేమో. అసలీ విశ్లేషణలే ఈ సమస్యలకి కారణం.

తన సహనం, తన జాలి, దూరదృష్టి, సాత్వికత సుమిత్ర కుప్పిగంతుల ముందు నిలవలేకపోయాయి. ఇంతకన్నా అవకాశం, మరో మార్గం లేని ఈ పరిస్థితులలో

సుమిత్ర దూరంగా ఉన్నా, తామిద్దరినీ శపిస్తూ కారాలు మిరియాలు నూరుతూ ఎన్నెన్నో కథలు ప్రచారం చేసి ఆ రకంగా దెబ్బతీయగలిగానని తృప్తి పడుతుందేమో. పోన్లే, పడనీయి.

మూడు తర్వాత ఫోనొచ్చింది. ఫోన్ అనేడప్పటికి కాళ్ళూ చేతులూ ఆడలేదు. సుమిత్ర ఏదయినా మింగలేదు కదా? హడలిపోతూ అందుకుంది.

"సంధ్యా! సుమిత్ర వెళ్ళిపోయింది" రాజా అన్నాడు.

సంధ్య నిటారుగా నిలబడింది. "ఎప్పుడూ..."

"రెండింటికి వెళ్ళిపోయిందట. వెదుతూ వెదుతూ బాగా అరిచి, గొడవచేసి వెళ్ళిందట. ఇల్లంతా చిందరవందరగా ఉంది. నేనిందాకనే ఇంటికొచ్చాను."

"నువ్వు బస్టాండుకు గాని, స్టేషన్‌కి గాని వెళ్ళాల్సింది." సంధ్య భయంగా, విచారంగా, నిశ్చింతగా అంది.

"వెళ్ళాను. ఎక్కడా కనిపించలేదు. 'కృష్ణలో పడి చస్తానని మీ అమ్మగారికీ, అయ్యగారికీ చెప్పు' అని రంగమ్మతో చెప్పి తన సూట్‌కేసులు రిక్షాలో వేసుకుని వెళ్ళిపోయిందట. వీధి వీధంతా గుమ్మాల్లో నిలబడి వింతగా చూశారట." రాజా గొంతు కంపిస్తోంది. అతను మామూలుగా లేదు. అందుకే ఫోన్‌లో అన్నీ ఇలా మాట్లాడేస్తున్నాడు అని గ్రహించింది.

"సరే, నువ్వు సాయంత్రం ఇక్కడికొచ్చి నన్ను పిక్ చేయి" అంది. అతను సరేననడంతో ఫోన్ పెట్టేసింది. ఎక్కడి కెళ్ళిందో సుమిత్ర. తన గమ్యం వెదుక్కుంటూ ఒంటరి ప్రయాణానికి సిద్ధపడి ఈ విశాల ప్రపంచంలోకి వెళ్ళిపోయింది. అసలు ఈ ఊళ్ళో వాళ్ళిల్లు ఎక్కడో? ఏమయిపోయిందో పట్టించుకోకుండా వాళ్ళెలా ఉన్నారో? మళ్ళీ ఇంటికి రానే రానని దెబ్బలాడి బయటకు వచ్చుంటుంది. అందుకే వాళ్ళ ఈతిబాధల్లో ఈ కూతురి గురించి పట్టించుకునే ఓపిక లేక వాళ్ళూ ఊరుకున్నారు.

***

"ఏమిటీ మీరు వెళ్ళిపోతున్నారా? చాలా చక్కటి ప్రోగ్రాం ఉంది. మీరు మాట్లాడతారని అనుకుంటున్నాం." సుజాత లైబ్రరీ హాల్ నుంచి తిన్నగా గేటు వైపు వెళ్ళిపోతున్న సంధ్య వెనకాల పరిగెత్తుకొస్తూ అంది.

"సారీ సుజాతా, నాకస్సలు ఒంట్లో బాగోలేదు. మీరందరూ పార్టిసిపేట్ చెయ్యండి. టాపిక్ కూడా ఎంతో చక్కటిది కదా" అంది. టాపిక్ ఆర్థిక స్వాతంత్ర్యం వల్ల స్త్రీ పురుషుల వైవాహిక బంధాల్లో మార్పులు. ఇద్దరు ప్రముఖ రచయితల సమక్షంలో ఈ చర్చ జరుగుతోంది. సంధ్య లేకుండా వెళ్ళడం సుజాతకి బాగా అనిపించలేదు. ఒంట్లో బాగోలేదనడంతో చేసేదిలేక వెనక్కి నడిచింది.

రాజా సరిగ్గా టైమ్‌కొచ్చి తీసుకెళ్ళిపోయాడు. స్కూటర్ ఇంటి వైపు సందులో తిరిగి విశాలమైన వీధిలోకి రాగానే ఇళ్ళ బయట ఆడవాళ్ళంతా మాటలాపేసి వింతగా చూడడం మొదలుపెట్టారు. ఒక్కసారి కళ్ళెత్తి చూసిన సంధ్య అంతమంది చూపులను ఎదుర్కోలేక కళ్ళు వాల్చేసింది. స్కూటర్ గేటు ముందు ఆగేసరికల్లా వీధిలో అందరూ సినిమా చూడడానికి వచ్చినవాళ్ళలా నిలబడ్డారు. మామూలుగా నడుస్తూ, ఇంట్లోకి వెళ్ళడానికి చాలా కష్టపడింది.

పాత పుస్తకాలు, ముఖ్యమైన కాగితాలు ఓ చెక్కపెట్టెలో పెట్టి తాళం వేస్తుంది తను.

“వద్దు వద్దన్నా ఆ పెట్టె తాళం పగలగొట్టిందమ్మా” అంది రంగమ్మ.

అందులో వీళ్ళ చరిత్ర రాసుకున్న డైరీ ఉంది. ముందుచూపుతో ఆ డైరీ పట్టుకెళ్ళిపోయిందన్న మాట. పోన్లే. ఆ విధంగా ఈ కథని కాల్చేస్తే మంచిదే.

ఇల్లంత భీభత్సంగా ఉంది. బట్టల స్టాండు మీద బట్టలన్నీ కింద పడేసున్నాయి. బీరువా తలుపులు దగ్గరకేసి ఉన్నాయి.

తలుపులు తెరిచిన సంధ్యకు బాగా కెలికినట్టున్న ఆ బీరువాని చూస్తే చాలా కష్టమేసింది.

“ఒక గొడవా ఒక గోలా! అబ్బబ్బా ఇదిగో ఈ హాల్లో కూలబడి నన్ను నమ్మించి మోసం చేశాడో, నేనెళ్ళి కృష్ణలో పడతానో అని ఒకటే శోకాలు...” అసలు ఇల్లు ఎంత చీదర చేసిపెట్టిందో చూపించాలనే రంగమ్మ ఏమీ సర్దకుండా ఉంచింది.

“ఏమిటి వెతుకుతున్నావు? బీరువా తాళాలు హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకోలేదా?” రాజా వచ్చి పక్కనే నిలబడ్డాడు.

“పొద్దున ఆ అల్మరాలో పడేశాను. నేనెక్కడ పెడుతూ ఉంటానో తను బాగా గమనించేదిలే.” అంటూ గబగబా లాకర్ తెరిచి ప్లాస్టిక్ బాక్స్ బయటకి తీసింది. అందులో తెగిపోయిన బంగారు గొలుసు ఒకటి ఎప్పట్నించో అలా పెట్టి ఉంచేసింది. అది మాయమైంది. రాజా మొహం నల్లబడింది. చీరల స్టాండు దగ్గర కెళ్ళి చీరలన్నీ తీసి యథాస్థానంలో సర్దింది. మూడు చీరలు మాయమయ్యాయి.

“ఇంకా ఏమేమి పోయాయో చూడు. అది మనిషి కాదు, డర్టీ క్రీచర్.” అసహ్యంతో ఊగిపోతూ అన్నాడు రాజా.

రణరంగం తరువాత ప్రశాంతత ఆవరించింది ఆ ఇంటిని. రేపే ఇల్లు దొరికి, రేపు రాత్రికి మారిపోతే ఈ వీధిలో వాళ్ళ చూపులు తనని తూట్లు పొడవ్వు. ఇంక అదొక్కటే మిగిలింది. ఆ తరువాత మళ్ళీ యథాప్రకారంగా రాజాతో సంసారం వెలగబెట్టాలి. గతానికి సమాధి కట్టి ఉత్సాహం కొనిదెచ్చుకుని నూతన అధ్యాయం ప్రారంభించాలి. తనకి సాధ్యమవుతుందా?

భోజనం దగ్గర కూర్చున్న రాజా ముద్ద నోట్లో పెట్టుకోబోయి తినలేక వదిలేశాడు.

"అదేం, తినూ!" జాలిగా చూస్తూ అంది సంధ్య.

"నాకేం వద్దు. నాకేం వద్దు" టేబుల్ మీద తల వాల్చాడు. డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. బాగా ఏడుస్తున్నాడు. సంధ్య కేమీ తోచలేదు. తనూ తినడం మానేసి పిచ్చిదానిలా చూస్తూ కూచుంది. కాసేపటికి అతనే తేరుకుని "నువ్వు తినెయ్యి సంధ్యా" అన్నాడు బొంగురుగా.

"నువ్వేందుకు ఏడుస్తున్నావ్? చచ్చిపోతుందని భయపడుతున్నావా?"

"లేదు సంధ్యా! ఇంత చీప్‌గా బిహేవ్ చేయగలదని ఎప్పుడూ అనుకోలేదు. నన్నో దేవుణ్ణి చూసినట్టు చూసేది. షెల్టర్ దొరికేవరకూ నా ప్రాణాలు తోడేసింది. ఇప్పుడేమో హద్దులు దాటేసి... చివరికింత అల్లరి చేసి... ఆఖరికి దొంగతనానికి కూడా.... ఛా... ఛా... ఛా.... నేను నిన్ను మోసం చేశాను. అందుకే మోసపోయాను." మళ్ళీ వెక్కిళ్ళు ప్రారంభించాడు. ఇంతలో రాఘవరావ్ గారొచ్చి "మాస్టారూ" అంటూ మందలింపుగా పిలిచారు. "మీ వెక్కిళ్ళు వినిపించే వచ్చాను. ముందు మీరా షర్ట్ తగిలించుకోండి. కాస్సేపలా బయటకి పోయొద్దాం." సంధ్య ఆయన్ని కృతజ్ఞతగా చూసింది.

ఇద్దరూ బయటకెళ్ళిపోయారు. ఓ గంట తరువాత వచ్చాకా కూడా రాజా ఇంట్లోకి రాలేదు. వాళ్ళింటి వెనకాల ఆయనతో మాట్లాడుతూ కూచున్నాడు.

బహుశా బార్‌కి వెళ్ళుంటారు. పక్కింటాయన మిలిటరీలో ఉన్నాడట ఎప్పుడో. అడపాదడపా పుచ్చుకుంటూనే ఉంటూంటారు. రాజా చాలా అరుదుగా తీసుకుంటాడు. ఇప్పుడు తాగి వచ్చాడు. పోన్లే తను కూడా వెళ్ళి ఆ పిన్నిగారితో మాట్లాడి, కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే ఆమెకీ కొంత సబబుగా అనిపిస్తుందేమో. ఖర్మ, అసలు ఎవరి ముందూ ఈ గొడవ చెప్పుకోవాలని లేదు. చాలా సిగ్గుగా ఉంది.

రాజా గొంతు వింటూ లోపలికి పిలవాలా వద్దా అనుకుంటూ అటూ ఇటూ తిరుగుతూ ఆలోచిస్తోంది. పన్నెడవుతుండగా భోజనం దగ్గరకొచ్చాడు. అన్నం గబగబా కలుపుకుంటూ – "అన్నీ నీ ముందు చెప్పుకుని పాపాలు కడుక్కున్నాను గాని, ఒక్కటంటే ఒక్కటి చెప్పలేదమ్మా సంధ్యా!" మాటలు ముద్ద ముద్దగా వస్తున్నాయి. విస్కీ వాసన గుప్పుమని కొడుతోంది.

"తొందరగా తినేసి పడుకో. నువ్వు మరీ ఇంత డీలా పడకు." పాపం అనుకుంటూ జాలిగా అంది.

"పడుకుంటా, పడుకుంటా. ఆ శని వదిలిపోయిందిగా, ఇంక కంటి నిండా పడుకుంటా. మళ్ళీ నన్ను చెప్పలేదంటావేమో, చెప్పేస్తున్నా." అన్నం గబగబా నమిలేస్తూ అన్నాడు.

"సరే చెప్పు"

"పాపం నువ్వెంతో ఇదిగా బతిమాలావు. ఎన్నో షరతులు పెట్టావు. ఈ ఇంట్లో నా ఆమోదం మీద వచ్చిన ఈ సుమిత్రతో ఎటువంటి సంబంధం పెట్టుకోబాకు అని ఖచ్చితంగా చెప్పావు. నేనూ చాలాకాలం పాటించాను..."

ఫిట్ వచ్చినదాన్లా చూస్తూండిపోయింది. ఏం చెబుతాడో.

"అది మాన్ ఈటర్. సిగ్గు పడుతున్నట్టు నటిస్తానే సెక్స్ కోసం తహతహలాడిపోయేది. ఈ సెక్స్ సుఖం కోసం తన ఒళ్ళు వేగిపోతున్నదనీ, దూరంగా ఉండలేనని అని నానా బాధలూ... అవన్నీ సెన్సార్ చేయాలి... వర్ణిస్తూ ఉత్తరం రాసి నా జేబులో పెట్టింది. నేను చదివి.... చదివి...." సంధ్య కళ్ళలోకి చూసి బొళాబొళా నవ్వుతూ "అలా చూస్తున్నావా... కొడతావా.... కొట్టు" అంటూ చెంప అందించాడు.

"ఊఁ, చదివీ..." తన గొంతునెవరో నొక్కేస్తున్నట్టు ఉక్కిరిబిక్కిరి అవుతూ జీరగా అంది.

"ఏముందీ కోరిక తీర్చేశాను. ఆ రోజు రంగమ్మ కూడా కొడుకు ఇంటికి పోయిందిలే. శారీరకంగా దూరంగా ఉండలేకపోతున్నాను. పెళ్ళి కావాలో అని ఒకటే ఏడుపు. అందుకే ముందా వేడి చల్లార్చి తరువాత బుజ్జగించి చెప్పాను. ఎన్నోసార్లు కాదులే. రెండుసార్లో, మూడుసార్లో.... క్షమించమ్మా.... ఓ దేవతా.... క్షమించమ్మా..."

"జంతువులకి ఏం చేయాలనిపిస్తే అది చేస్తాయి. అంతే." సంధ్య ఇంక అక్కడే ఉంటే అతని గొంతు పిసికి చంపేస్తానేమో అని తన ఉద్రేకానికి తను భయపడుతూ వెళ్ళి పడుకుంది. నిద్రపోయే ముందు చాలాసార్లు – పశువుల్లారా... పశువుల్లారా... మనస్సాక్షి లేని రాక్షసుల్లారా... అనుకుని గొణుక్కుంటూ పడుకుంది.

***

అరుణ సహాయం వల్ల ఇల్లు వెంటనే దొరికింది. కాలేజీకి మరీ దగ్గర కాదు గాని మొత్తానికి దగ్గరే. సామాను కూడా చక్కగా సర్దిపెట్టింది అరుణ. కాని పెద్ద నష్టం రంగమ్మ మానేయడం.

"మేడమ్! నేనూ ఎమ్.ఏ.కి అప్లయి చేశా గదా. నా పెళ్ళి కూడా సెప్టెంబరులో పెట్టుకున్నారు. తను కూడా చదవడానికి ఒపుకున్నారు. తను కూడా ఏవో ప్రమోషన్ టెస్టులు అవీ రాయాలట. నాకెందుకో ఇది డైరక్టుగా యూనివర్సిటీకి ఇంటార్వ్యూకి వస్తుందని గట్టి నమ్మకంగా ఉంది. దీని మీద ఒక కన్నేసి ఉంచి ఎప్పటికప్పుడు మీకు అన్నీ చెబుతాను."

“ఏం చెప్పినా ఏం లాభం అరుణా? అంతా అయిపోయింది?” అరుణకి కాఫీ ఇచ్చి, తనూ కాఫీ సిప్ చేస్తూ విరక్తిగా అంది.

“అలా అనకండి మేడమ్. పాపం మాస్టారు మంచాయనే. అసలా మంచితనంవల్లే దాన్ని మెడకు తగిలించుకున్నారు. ఇంకో మగాడైతే అసలిన్ని బాధలు పడతారా? అంతా పీడకల అనుకుని హాయిగా ఉండండి మేడమ్” అరుణ నచ్చజెప్పింది. సంధ్య వద్దని వారించినా ఆ పూటకి తనే వంట చేసిపెట్టి, “వీలైతే ఓ పనిపిల్లను మాట్లాడతాను. బాగా ఎంక్వయిరీ చేస్తాను. ఉండండి మేడమ్” అంటూ బయల్దేరింది.

అరుణకు అసలు గర్వం లేదు. ఆ గర్వం లేకపోవడమే సుమిత్రతో అంత లోతుగా స్నేహం చేయడానికి కారణమయ్యింది. తనలాంటి వాళ్ళని ఓదారుస్తూ, వంట కూడా చేసి మరీ వెళ్ళడానికి కారణమయ్యింది.

“మనసులో ఏమీ పెట్టుకోకండి. హాయిగా ఉండండి మేడమ్!” అరుణ తనతో పాటు నడుస్తున్న సంధ్యని ప్రేమగా మరోసారి హెచ్చరించింది.

హాయంటే... అమ్మయ్య నా మొగుడు ఇంకో మనిషితో సంపర్కం పెట్టుకున్నా, నా అర్థింపులనీ, నా నమ్మకాలనీ చెదరగొట్టినా, వివాహబంధాన్ని మాత్రం పాపం చాలా గట్టిగానే ఉంచాడు అనే తృప్తితో హాయిగా ఉండగలదా? ఈ మాటలన్నీ అరుణతో అనలేదు. చిన్నపిల్ల. ఆ అమ్మాయి మనసెందుకు పాడు చెయ్యడం అనుకుని అరుణ చెప్పిన వాటినన్నిటినీ ఆచరిస్తానన్నట్టుగా తలూపి, రోడ్డు చివరవరకూ నడిచింది.

పక్కనే స్కూటర్ ఆగింది. “మీరీ సందులో ఉన్నారేమిటి?” అడిగాడు రవూఫ్.

“అదిగో, ఆ చివరి పచ్చురంగు మేడలో దిగాం” అని చెప్పి, అరుణని పరిచయం చేసింది.

“అరే, ఆ ఇంటినే మీ కోసం అడిగాను. ఎవరికో మాటిచ్చేశాం అన్నారు. పోన్లెండి, దక్కవల్సిన వాళ్ళకే దక్కింది. మంచిల్లు ఇప్పించారండి” అన్నాడు అరుణతో నవ్వుతూ. అరుణ నవ్వి, రిక్షా ఎక్కేసి, ఇద్దరికీ నమస్కరించింది.

“మీకు చాలామంది స్నేహితులు ఉన్నారే, అన్ని వయసుల వాళ్ళూ.” సరదాగా అన్నాడు.

“ఆ అమ్మాయి ఇది వరకూ మా వారి స్టూడెంట్. నాకూ ఫ్రెండే అనుకోండి. మీ ఇల్లు కూడా ఇక్కడేనా?” నడుస్తూ అంది.

“కొంచెం దగ్గరే. అయినా రెండు వీధుల అవతల మా అంకుల్ వాళ్ళున్నారు. నాకీ ఏరియాతో బాగా టచ్ ఉంది. ఇంతకీ ఏమిటీ, మీ ఇంట్లోకి రమ్మంటారా? పోనా?”

“భలేవారే రండి రండి. నాకన్నా ముందు మీరే వెళ్ళండి.” బాబును ముందు నిలబెట్టి “వెళ్ళండి.” అంది.

"ఓ తమరెక్కరు కదా, ఏమిటో?" అనుకుంటూ దూసుకుపోయాడు.

"ఓ పనిపిల్లని చూసిపెట్టండి చాలు. ఈ బాబుని చూసుకోడానికి కావాలి." ఆ కబుర్లూ, ఈ కబుర్లు అయ్యాకా అంది. ఆమె అడిగిన తీరుకు చాలా బాధపడ్డాడు రవూఫ్.

"మీరేమీ అనుకోకపోతే – మీరు కాలేజీకి వెళ్ళే ముందు నేను బాబుని తీసుకువెళ్ళి మా అంకుల్ వాళ్ళింట్లో వదిలేస్తా. మళ్ళీ సాయంత్రం మీరు కాలేజీ నుంచి వచ్చాక అప్పజెబుతా. మీరేం బెంగపడద్దు. సర్వెంట్ దొరికేవరకూ మీరు సెలవు పెట్టుకుని కూర్చోలేరు కదా!" సమస్యని పరిష్కరిస్తూ అన్నాడు.

"మీవాళ్ళేమీ అనుకోరా?"

"ఏమీ అనుకోరు. మా కజిన్ చదువు మానేసి ఖాళీగా ఇంట్లో ఉంది. పిల్లలంటే చాలా ముద్దు. అంతకీ మీకు మరీ మొహమాటమైతే మా ఇంటికే తీసుకెళ్ళిపోతా. కాకపోతే ఈ ఇల్లయితే మీకు దగ్గరని.."

"థాంక్స్ రవూఫ్, చాలా థాంక్స్." కృతజ్ఞతని ఇంకెలా వెల్లడించుకోవాలో తెలియక ఆనందంతో మౌనంగా ఉండిపోయింది.

"మీరేం మాట్లాడడం లేదు. నేను పోతున్నా" రవూఫ్ లేచి నిలబడ్డాడు. లోపలికొస్తున్న రాజాని చూసి "హలో సార్" అని చెయ్యి చాచాడు. ఇద్దరికీ పెద్దగా పరిచయం లేకపోయినా, ముఖ పరిచయం ఉంది. రవూఫ్ మళ్ళీ కూర్చున్నాడు.

"నాకు కాకినాడ ట్రాన్స్‌ఫర్ అయ్యింది సార్. నేనిక్కడ లాంగ్ స్టాండింగ్‌నని నన్ను వేసేశారు." జీవం లేని నవ్వు నవ్వుతూ అక్కడే నిలబడ్డ కొడుకుని హత్తుకున్నాడు.

"మైగాడ్, మీరు లేకుండా... ఒంటరిగా ఇక్కడీమె... కష్టమే." రవూఫ్ అన్నాడు.

"ప్చ్, ఏమిటోనండీ సంధ్యది కూడా గవర్నమెంట్ జాబ్ అయితే బాగుండేది. లైబ్రేరియన్ అనేటప్పటికి తొందరగా పోస్టింగ్స్ దొరకవు. అసలు రిజైన్ చేసి ఏ లిటరేచర్‌లోనో ఎమ్.ఏ. చేయమంటున్నా, కాని వినడం లేదు తను. మీ కాలేజీకి అంకితమైపోయింది. ఇప్పుడు చూడండి, ఎంత కష్టమో! ఈసారి ట్రాన్స్‌ఫర్ ఆపుకునే ప్రసక్తి లేదు. ఎలా వెళ్ళాలో ఏమిటో?" తన బాధంతా రవూఫ్‌తో చెప్పుకున్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తూ ఆలోచిస్తోంది.

చిత్రంగా ఉంది. తనకి ఏమీ బాధగా అనిపించడం లేదు. ఎక్కడో అంతరాంతరాల్లో సంతోషంగానే అనిపిస్తోంది.

"ఎందుకొచ్చిన బాధ సంధ్య గారూ, రిజైన్ చేయండి. మన కాలేజీలోనే ఉంటే మీకెప్పటికయినా ప్రాబ్లమే!"

"చెయ్యలేను. నా ఉద్యోగమంటే నాకు చాలా ప్రేమ. పైగా ఈ ఊళ్ళో ఉంటే వాళ్ళ వాళ్ళకి కూడా దగ్గరగా ఉండగలం అని ఉండిపోయాం. కాకినాడ నుంచి ఈ చుట్టుపక్క లెక్కడయినా వేయించుకోగలిగితే రోజూ వెళ్ళి రావచ్చు" సావధానంగా అంది.

రాజా పైకలా అంటున్నా సంధ్యని రిజైన్ చేయమని చెప్పే ధైర్యం లేదు. పైగా ఇంతకాలం ఇద్దరి సంపాదనతో హాయిగా గడిచిపోయింది సంసారం. ఖర్చులన్నీ తగ్గించుకుని సామాన్యంగా బ్రతికేటంత ఓర్పు లేదు.

"ఇద్దరూ ఉద్యోగాలు చేస్తే ఇదేనండీ ప్రోబ్లమ్. అందరికీ అనుకూలమైన పద్ధతుల్లోనే ఉండవు ఈ ఉద్యోగాలు." రాజా అన్నాడు.

సంభాషణ కాసేపు ఉద్యోగాల మీదా, ట్రాన్స్‌ఫర్స్ మీదా నడిచింది. ఏడవుతుండగా రవూఫ్ వెళ్ళిపోయాడు.

తను మళ్ళీ తిరిగి మనిషయ్యే వరకూ ఇలా దూరంగా ఉండడం చాలా మంచిది. అసలు కోరికలన్నీ చచ్చిపోయాయి. ఉద్యోగం, పిల్లలూ, స్నేహితులు చాలు. రోజులు బాగానే నెట్టేయవచ్చు అనుకుంటూ ఆనందపడింది.

సంధ్య మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్న రాజా ఓదార్పు మాటలు మొదలుపెట్టాడు. "కాకినాడయినా సరే వారం వారం వచ్చేస్తాను సంధ్యా. అమ్మో, పిల్లల్నీ నిన్నూ వదిలి నేనుండగలానా? నువ్వేం దిగులుపడద్దు."

ఆ రాత్రికి అతను దగ్గరగా రాబోతే దూరంగా జరిగింది.

"ఇష్టం లేదా?"

"ఒంట్లో బాగోలేదు. పీరియడ్."

"ఓ... సారీ..." అతను బలవంతపెట్టలేదు. వెంటనే నిద్రపోయాడు.

పెళ్ళయిన కొత్తల్లో స్పాట్ వ్యాల్యూయేషన్‌కి వెడుతుంటే వెక్కి వెక్కి ఏడ్చింది. తిరిగొచ్చేవరకూ రోజులు దుర్భరంగా నెట్టింది. అసలు పెళ్ళయ్యాక – అన్నలనీ, వదినలనీ వాళ్ళ పిల్లల్నీ పూర్తిగా మర్చిపోయింది. దాదాపుగా అయిదేళ్ళ నుంచి అయితే వాళ్ళూ దగ్గరగా లేరు. తనూ ఆ కొరత లేకుండా నా భర్త, నా పిల్లలూ, నా సంసారం అనే శ్రద్ధతో పూర్తిగా ఈ సంసారంలో మునిగిపోయింది. రాజాని ఎక్కువగా వదిలి ఉండలేదు.

ఎంత వ్యత్యాసం? ఆ తెలియనితనంలో ఎన్ని మధురిమలు? జీవితం విస్తారమవుతున్న కొద్దీ అనుభూతులు తగ్గుతూ వస్తాయేమో. ఏదో తెలియని మనశ్శాంతి పుట్టుకొచ్చి తొందరగానే నిద్రపట్టింది. హాయిగా నిద్రపోయింది ఆ రోజు.

# 14

రవూఫ్ అన్న మాట ప్రకారం బాబుని తీసుకెళ్ళి, మళ్ళీ సాయంత్రం అప్పజెప్పడం చేస్తున్నాడు.

రాజా కాకినాడ వెళ్ళి జాయినై మళ్ళీ వచ్చాడు.

అరుణ అన్నమాట ప్రకారం పనిపిల్లని తీసుకొచ్చి అప్పజెప్పింది.

"యూనివర్శిటీ ఇంటర్వ్యూ వచ్చింది సుమిత్రకి పాత ఇంటి అడ్రెస్‌కి" అంటూ రాఘవరావ్‌గారు తీసుకొచ్చి అందజేశారు.

ఇల్లూ అదీ బావుందని మెచ్చుకుని కాసేపు మాట్లాడి వెళ్ళిపోయారు. వెళ్ళిపోతూ – "ఆ సుమిత్ర తమ్ముడూ, మేనమామా నటమ్మా! మీరు వెళ్ళాక వచ్చి మీ ఆయన్ని నానా తిట్లూ తిట్టి, మీ కొత్త ఇంటి అడ్రెస్ ఇమ్మన్నారు. 'ఆయనకి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. మీ పిల్లని ఊరు మీద వదిలేసి ఇప్పుడేందుకు బయల్దేరారు' అని ఎదురు నేనే కేకలేసి తరిమేశాను. అంటే ఆ పిల్ల వాళ్ళింటికి గాని, చుట్టాల ఇంటికి గాని వెళ్ళలేదని తెలుస్తోంది. పాపం, ఎక్కడెక్కడ తిరుగుతోందో, ఏం బాధలు పడుతోందో?" అంటూ ఆయన సుమిత్రకి చాలా నిజాయితీగా సానుభూతి చూపించి వెళ్ళిపోయాడు.

పదిహేను రోజుల తరువాత, "సరాసరి యూనివర్సిటీకి వచ్చేసింది ఇంటర్వ్యూకి. వైజాగ్‌లో రాఘవరావ్‌గారి మిత్రుడి సహాయంతో ఇంటిమేషన్ కవర్ లేకపోయినా మానేజ్ చేసుకుని చేరిపోయింది" అని అరుణ రాసిన ఉత్తరం చదివి సుమిత్ర డాషింగ్ నేచర్‌కి ఆశ్చర్యపడింది.

పోనీలే ఎప్పుడు ఏ రకం వార్త వినాల్సి వస్తుందోనని ప్రతీ రోజూ నరకంగా గడుపుతోంది తను. ఆ అమ్మాయి చదువులో పడితే అంతా సవ్యంగానే జరిగిపోతుంది అని ఇన్నాళ్ళనుంచీ కరుడుగట్టుకున్న ఉదాసీనతని తగ్గించుకుని, తేలిగ్గా తిరగసాగింది.

బొంబాయి నుంచి పెద్దన్న వచ్చాడు. తనని చూసి కన్నీళ్ళు పెట్టుకున్న చెల్లెల్ని చూసి తనూ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ తల నిమిరాడు. అనుకోకుండా అదే రోజు రాజా కూడా రావడంతో అంతా సరదాగా ఉంటే, సంధ్యకేమో వాళ్ళన్నగారితో తన అనుభవాలు చెప్పాలనిపించలేదు. ఆయన రెండు రోజులు మాత్రమే ఉండి, దసరా సెలవల్లో రమ్మని మరీ మరీ చెప్పి వెళ్ళిపోయాడు.

"సుమిత్ర యూనివర్సిటీలో చేరిపోయిందట తెలుసా? అరుణ ఉత్తరం రాసింది" అంది అతను కాకినాడ బయల్దేరే ముందు.

“పోన్లే, నీకో బెంగ తీరింది గదా, యూ విల్ బీ హ్యాపీ” అన్నాడు సరదాగా చూస్తూ.

“ఈ ఇంటికీ, పిల్లల ఖర్చులకీ చాలా అవుతోంది. తెలుసుగా! నువ్వు మరి జీతమొచ్చినా నాకేమీ ఇవ్వలేదు” అంది అడగడానికి సంకోచిస్తూ.

“ఈ నెలలో కుదరదు. వచ్చే నెల ఇస్తాలే. ఎక్కడా, నా ఖర్చులు నీకు తెలుసుగా? అసలు నేనే చాలా ఇబ్బంది పడుతున్నా, నా బాధ లెవరికి చెప్పుకోను?” అతను బ్రీఫ్‌కేసు తీసుకుని, గేటు తీసుకుని వెళ్ళిపోతున్న ఖాళీ రిక్షాని కేకేశాడు.

ఇలా మాట్లాడతాడేవిటి? అసలు తను లెక్కలు కట్టుకోవడం లేదు గాని, తనకు సంబంధించిన ఖర్చులు బాగానే చేసేవాడు ఇక్కడున్నప్పుడు. మాటి మాటికి చీరలు కొనడమో లేక సామానుల పిచ్చో ఇటువంటి ఖర్చులు తనకి ఉండవు కాబట్టే, తనూ ఎంత ఆదాయమో, ఎంత ఖర్చవుతోందో – ఇవేవీ పట్టించుకునేది కాదు. తన పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద కూడా అయిదు వందలు ప్రతీ నెలా వడ్డీ వస్తుంటుంది. ఇప్పుడు ఒక్క జీతంతో అన్నీ సంభాలించుకోవటం కష్టమవుతోంది.

దాదాపు రెండు నెలలు అలాగే గడిచిపోయాయి. రాజా పదిహేను రోజులకొకసారి వస్తున్నాడు. అతనిస్తే తప్ప డబ్బు గురించి అడగకూడదని నిశ్చయించుకుంది. అసలు మిట్టపల్లాలు లేకుండా జీవితం సాఫీగా గడచిపోయినంత కాలం రాజా స్వభావంలో వైరుధ్యాలనీ, స్వార్థాన్నీ తను పట్టించుకోలేదు, ఇప్పుడు అర్థమవుతోంది. తన పిచ్చిగాని ఈ ప్రేమ అనేది అందరూ వర్ణించినట్టు చాలా ఉన్నతంగా, సెపరేట్‌గా ఏమీ ఉండదు. ఆర్థిక, సాంఘిక, సామాజిక సంబంధాలను బట్టి పల్టీలు కొడుతూ, ఎప్పటికప్పుడూ చేయి జారిపోయేలా ఉంటుంది. పిల్లలన్నా, సంధ్యన్నా ప్రాణం అని చెప్పుకునే ఈ మనిషి వాళ్ళ కెంతెంత ఖర్చవుతోందో, అసలు ఒక్కతే ఈ పట్టణంలో ఎలా నిభాయించుకోగలదో ఆలోచించకుండా, కేవలం తన బాధలే ముఖ్యంగా చెప్పుకొస్తూ ఉంటాడు. చేతులెత్తేస్తూ ఉంటాడు.

గుంటూరు నుంచి రాజా అన్నగారి ఫామిలీ వచ్చి నాలుగు రోజులున్నారు. పిల్లలకీ, తోడికోడలకీ బట్టలు కొంది. అసలు రాజాని శ్రద్ధగా చదివించిందే ఆయన. ఆ విషయం సంధ్య ఎప్పుడూ మరిచిపోదు. అలాగే ఎప్పుడూ ఎవరో ఒకరు చుట్టాలు వస్తూనే ఉంటారు. చుట్టాలలో పేదవాళ్ళు ఉంటారు. వాళ్ళని తగిన విధంగా తృప్తిపరచి పంపడం సంధ్యకి మొదటినుంచీ అలవాటు. ఇన్నిన్ని కథలు ఇంత వేదనగా రాసే తన భర్తకి ఈ ఖరీదైన జీవితం పట్ల మోజు, బాధల్లో పడి కొట్టుకునే సామాన్యుల పట్ల ఇంత ఉదాసీనత ఎందుకో అర్థం కాదు. ఎప్పుడైనా వాదిస్తే, ‘ఆఁ, మన మెంతమంది జీవితాలను చక్కదిద్దగలం’ అంటాడు. ఇటువంటి మాటలు చాలామంది అంటూంటారు. అలా తేల్చేయడంలో వారి స్వార్థమే బయటపడుతూ ఉంటుంది.

అసలు సమీపంలో కనపడే ఏ కూలీ జనాలనీ, పేదవాళ్ళనీ రవ్వంతయినా పట్టించుకోని పెద్దమనుషులంతా దేశంలోని దారిద్ర్యాన్ని గురించి, పెట్టుబడీదారి వ్యవస్థ గురించి గంభీరోపన్యాసాలు చేయడం చాలా ఫన్నీగా అనిపిస్తుంటుంది.

సంధ్య ఎప్పుడూ ఇలా ఆలోచిస్తూ ఉంటుంది. మరీ ఎక్కువ అవగాహనా, ఆలోచనా పెరిగిపోవడం వల్లనో ఏమో, హృదయానికి స్పందించే శక్తి తక్కువ అవుతూ వస్తోంది. ఈ కన్‌ఫ్యూజన్ మధ్య రోజులు యాంత్రికంగా నెట్టేస్తూ ఉన్న సమయంలో ఒక రోజు సుజాత “ఈ రోజు నా బర్త్‌డే సంధ్యగారూ! ఎవరికీ చెప్పడం లేదు. మీరూ, కాంతం, రాధిక..” అంటూ ఆగింది.

“అంతేనా?” అంది నవ్వుతూ.

“రవూఫ్ గార్ని పిలుద్దామా? ఏమో ఈ మధ్యన అందరం బిజీ అయిపోయి ఒకరితో ఒకరం సరిగ్గా మాట్లాడుకోవడం లేదు.” అంది.

“నిజమే, ఇదివరకు ఎప్పుడైనా మా ఇంటికి వస్తూండేవారు. ఈ మధ్య అసలు రాలేదు. ఆఖరికి లైబ్రరీకీ కూడా రావడం లేదు.” అంది సంధ్య.

“నా తరఫున మీరు చెప్పండి ప్లీజ్” అంది తడబడుతూ.

“తప్పకుండా చెబుతాను” అంటూ రవూఫ్ వాళ్ళ డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళింది.

అసలెప్పుడూ వాళ్ళ డిపార్ట్‌మెంటుకు వెళ్ళలేదు. అక్కడా లేడు, బయట కొచ్చేస్తుంటే ఎదురొచ్చాడు.

విషయం చెబితే, “మీ అందరి మధ్యా నేనెందుకూ?” అన్నాడు.

“ఊరికే సరదాగా, కాస్త ఛేంజ్‌గా ఉంటుంది.” అంది నచ్చజెబుతూ.

“మీరంతా వస్తున్నారుగా, కాదనలేను.” అన్నాడు బుద్ధిమంతుడిలా.

***

“మీ అందరితో పరిచయం అయ్యాక, ఈ పుట్టిన రోజులవీ చేసుకోవడానికి చాలా చిన్నతనంగా అనిపిస్తోంది. అయినా కాసేపు సరదాగా గడపాలని పిలిచాను” అందరికీ ప్లేట్స్ అందిస్తూ అంది సుజాత.

“కేక్ కోయడం అటువంటివేం చెయ్యరా? నేను బోల్డన్ని సినిమా పాటలు, దృశ్యాలూ గుర్తు చేసుకుంటూ వచ్చాను” రవూఫ్ అన్నాడు.

అందరూ నవ్వేశారు.

కాంతం రాధిక బలవంతంమీద చక్కటి పాటలు పాడింది. అంత బాగా కాంతం పాడగలదని అనుకోలేదు ఎవరూ.

“ఏమీ రానివాణ్ణి నేనే” అన్నాడు రవూఫ్ విచారంగా.

"నాకేం వచ్చు?" సంధ్య కాఫీ ట్రేతో అందరి దగ్గరికీ వస్తూ అంది.

"రాజా గారు రచయిత. మీరు మంచి పఠిత. సద్విమర్శకురాలు. అసలింకా చాలా చెప్పొచ్చు. రాధిక గారు గొప్ప ఆర్గనైజర్, మంచి సోషల్ వర్కర్. సుజాత గారేమో..." అని ఆగిపోయాడు. సుజాత మొహం ఎర్రబడింది.

సంధ్యకి ఆ సన్నివేశం చాలా బాగుందనిపించింది.

"ఆఁ, సుజాత గారేమో ముగ్ధ. ఆమె ఎక్కడుంటే అక్కడ అందాలు చిమ్మగలరు. కాంతం గారి గురించి వేరే వర్ణన అనవసరం. అందుకే నేనే ఏమీ తెలియని వాణ్ణి అంటున్నాను. అసలు సంధ్యగారితో సరిగ్గా పరిచయం కాకముందు మరీ జడపదార్థంలా పిచ్చాడిలా ఉండేవాణ్ణి. మంచి స్నేహితుల ప్రభావం మననెంత చక్కగా తీర్చిదిద్దగలదో ఆమెని చూసి చెప్పవచ్చు. స్వానుభవం నాది." ఆరాధనగా, అభిమానంగా అంటున్న అతని మాటలని అందరూ "నిజమే, నిజమే" అంటూ అంగీకరించారు.

"బావుంది. నాకన్నా మీరంతా వయస్సులో చిన్నవాళ్ళు కాబట్టి, ఇంకా పెళ్ళీ, పిల్లలూ వంటి గొడవల్లోకి దిగలేదు కాబట్టి, నేనేదో జీవితం పట్ల గొప్ప ఆకళింపు గలదానిలా అనిపిస్తాను. మీకూ, నాకూ జీవించే పద్ధతిలో ఉన్న తేడా ఇలా అనుకునేలా చేస్తోంది. అంతే." అంది సంధ్య.

"కాదు కాదు. పెళ్ళయి పిల్లలున్న వాళ్ళని చూడలేదా? వాళ్ళందరిని చూస్తుంటేనే పెళ్ళంటే విరక్తి పుడుతుంది. ఎంతసేపూ వాళ్ళ గొడవలూ, వాళ్ళ గొప్పలే తప్ప ఇంకేమీ తిన్నగా మాట్లాడరు. మీరు గృహిణి అయినా అటువంటి లక్షణాలు వంటబట్టించుకున్నట్టుగా అనిపించదు." రాధిక అంది. "మీతో హాయిగా మాట్లాడేయగలం."

'మీకేం తెలుసునమ్మా పిల్లలూ, మొగుడూ తప్ప నాకసలు ఇంకో ప్రపంచం వద్దనుకుని ఇన్నేళ్ళూ బ్రతికాను. పైకి నా స్వంత జీవితపు ప్రదర్శన ఎబ్బెట్టుగా చేయకపోయినా ఈ దేశంలో అందరి ఆడవాళ్ళ లాగానే నాకూ ఎంత సేపూ ఈ రంధే ఉండేది. ఒక్కసారిగా ఎక్కడికో ఎవరో విసిరేశాక కళ్ళు తెరిచాను.' సంధ్య తనలో తాను అనుకుంటోంది.

కాసేపు కబుర్లతో సరదాగా టైం గడిపేశాక రవూఫ్ బయలుదేరాడు. "సంధ్యగారూ! మీరుంటే కాస్సేపుండండి. మీ పాపకి – అదే పని పాపకి చెబుతాను ఆలస్యంగా వస్తారని. పక్కింట్లో మామ్మగారు కూడా ఉన్నారుగా? పిల్లలకేం భయం లేదు" అంటూ వెళ్ళిపోయాడు.

"పని పాప! పాపం రవూఫ్ ఎవర్నీ చులకనగా మాట్లాడరు. అదే మనమైతే

ఎవరికి చెప్పాలన్నా 'పనిపిల్ల' అని చెబుతూ ఉంటాం. ఎన్ని కబుర్లు చెప్పినా కొన్ని ఇటువంటి అధికారపు పిలుపులు మానం." అంది రాధిక మెచ్చుకుంటూ.

రాధిక ఇల్లు, కాంతం ఇల్లూ ఇప్పుడు పక్కపక్కనే. వాళ్ళు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

సంధ్య కూడా కదలబోతుండగా సుజాత, "ఒక్క అరగంట నా కోసం స్పేర్ చేయండి" అంది అర్థిస్తూ.

సుజాత మొహంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. సుజాత మొహం ఏదో సమస్యలో కొట్టుమిట్టాడుతున్నట్టుగా అదో రకంగా ఉంది. ఎలా మొదలుపెట్టాలా అని చాలా తికమకపడి గొంతు సవరించుకుని ప్రారంభించింది.

"సంధ్యగారూ, ఇదివరకు నేను చాలా పిరికిగా ఉండేదాన్ని. ఒక్కదాన్నే ఇంట్లో ఆడపిల్లను. తెగ ముద్దు చేసి నడిస్తే ఎక్కడ కందిపోతానో అన్నట్టు అపురూపంగా పెంచారు. నేనూ పైకి బిడియంగా ఉన్నా, నేనేదో అందగత్తెను, ముద్దుల పట్టీని కాస్తో కూస్తో వెనకా ముందూ ఉన్నదాన్ని అనుకుంటూ లోపల్లోపల గర్వపడేదాన్ని. ఇప్పుడు నవ్వొస్తుంటూంది. రాధికనీ, మిమ్మల్నీ చూశాక, నేను చాలా మారాను. ఎన్నెన్నో తెలుసుకుంటున్నాను. ఆ గీర, ఆ చెత్త అభిప్రాయాలు అన్నీ మారాయి." సుజాత నవ్వింది.

సంధ్య కూడా నవ్వుతూ "జీవితాంతం ఎప్పటికప్పుడు మనం విద్యార్థుల్లాగానే ఎన్నో నేర్చుకుంటూ ఉంటాం సుజాతా. వెనక్కి తిరిగి చూసుకుని మనమింత అజ్ఞానంగా ఎందుకున్నాం అని సిగ్గుపడక్కర్లేదు." అంది.

"నిజమేనేమో. నా పెళ్ళి గురించి మూడేళ్ళ నుంచీ సంబంధాల వేట జరుగుతూనే ఉంది. నన్ను చాలా మంచి ఫ్యామిలీలో – అంటే నన్ను బాధించే బాధ్యతలూ, వ్యక్తులు లేని కుటుంబాన్ని ఏరి ఏరి మరీ చేయాలని మా వాళ్ళ కోరిక. అప్పుడు నాకూ ఏం తెలియదు – నన్ను నేను ప్రేమించుకోడం తప్ప, ఎదుటివాళ్ళని ప్రేమించడం తెలియని దాన్ని. కాని ఇప్పుడు... అప్పటి సుజాతని కాను." సుజాత కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

సంధ్యకి ఆ కన్నీళ్ళు ఏదో సంకేతాన్ని అందించాయి. "ఛా, ఏమిటమ్మా? నువ్వేం సిగ్గుపడకు. నాతో చెప్పు. నేను చేయగలిగిన సహాయమైతే చేస్తాను" అంది కళ్ళు తుడుస్తూ.

"రవూఫ్ గారంటే చాలా ఇష్టం ఏర్పడింది. అసలు ఆయన అందరితో ఊరికే కబుర్లేసుకునే రోజుల్లో అసలు పట్టించుకునేదాన్ని కాదు. కాని ఈ మధ్య జరిగిన సంఘటనల తరువాత అతని ప్రవర్తననీ, మనతోనే కాకుండా మిగిలిన మనుషుల

పట్ల ఆయన వైఖరినీ బాగా గమనించాక, నాకు గౌరవం ఎక్కువవుతూ వచ్చింది. ఎవరో ముక్కూ మొహం తెలియని మనిషితో తాళి కట్టించుకుని లాటరీ వేసుకోడం కన్నా ఏ కులమైతేనేం, మతమేదయితేనేం, ఇటువంటి వాళ్ళని ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు – అనిపిస్తుంది. కాని నేనెలా అడగలను? ఆ గొడవల తరువాత ఆయన అసలు నాతో సరిగా మాట్లాడనే లేదు. నాకెక్కడ చెడ్డ పేరొస్తుందో అన్నట్టు తప్పించుకు తిరుగుతున్నారు. ఆ మంచితనమే, ఆ బాధ్యతగల ప్రవర్తనే నన్నింకా ఆకర్షించాయి."

ఈ మధ్య రవూఫ్ టాపిక్ వస్తే సుజాత కళ్ళలో కనిపించీ కనబడని మెరుపులు, బుగ్గల్లో ఎరుపూ సంధ్య గమనిస్తూనే ఉంది. వయసు ప్రభావం అనుకుంది గానీ, ఇంత గాఢమైన అభిప్రాయం ఏర్పరుచుకుందనే సందేహమే రాలేదు.

"సుజాతా, నువ్వు నీడ పట్టున పెరిగావు. అఫ్‌కోర్స్, నేనూ అలాగే పెరిగాననుకో. నాదీ వర్ణాంతర వివాహమే. అసలే రకమైన వివాహాల్లోనైనా ఆ తరువాత వచ్చే సమస్యలే విచిత్రంగా ఒకే రకంగా ఉంటాయి. మరి మీది మతాంతరం కూడా అవుతుంది కదా"

"అసలే మతం గురించి పట్టించుకోనప్పుడు వాదనలే రావు కదా? నేనసలు పూజలే మానేశాను." ఉత్సాహంగా అంది.

ఆ చిన్నతనపు ఉబలాటానికి వాత్సల్యంగా నవ్వింది సంధ్య. "పూజలు మాత్రమే అడ్డు రావు. ఇంకా చాలా చాలా ఉంటాయి. ముఖ్యంగా మన ఆడవాళ్ళకే అభిజాత్యమూ, మా అలవాట్లే గొప్పవన్న దురహంకారాలు బాగా ఉంటాయి. సరే, నువ్వూ మాంసాహారివే కాబట్టి ఆహరపు అలవాట్లు ఏమీ ఇబ్బంది కలిగించవనుకో. కాని నువ్వు సాహసం చేస్తున్నావేమో? మీ వాళ్ళంతా షాక్ తినరా?"

"తినరు. నా వయస్సు ఇరవయ్యారు. అన్నీ ఉండి కూడా నా గురించి మరీ ఆందోళన ఎక్కువై పెళ్ళి ఇంత ఆలస్యం చేశారు. ఏ రిజిస్టర్ మ్యారేజో చేసుకుంటే ఇక వాళ్ళేమీ చేయలేరుగా. ఒప్పించడం లాంటి పిచ్చి పద్ధతులు మనం ఎలాగూ ప్రయోగించం."

విశ్వాసంగా చెబుతున్న సుజాత మాటలు వింటుంటే సంధ్యకి ఇక సుజాత వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని బాగా అర్థమైంది. తరువాత జీవితం అంటూ సమస్యలని పెద్దవిగా చేసి భయపెట్టడం తప్పేమో. సంప్రదాయ వివాహాల్లో కూడా పెళ్ళిళ్ళయిన పదేళ్లకీ, ఇరవయ్యేళ్ళకీ ఊహించని పరిణామాలు వస్తున్న దాఖలాలు ఎన్నో ఉన్నాయి. భవిష్యత్తు గురించి మరీ ప్రాక్టికల్‌గా ఉంటూ వర్తమానపు తియ్యదనాన్ని ఎవరూ వదులుకోడానికి సిద్ధపడరు. ఇదంతే!

'రవూఫ్‌తో ఈ విషయం సుజాత గౌరవానికే మాత్రం భంగం రాకుండా కేవలం తనకి మాత్రమే ఇటువంటి అభిప్రాయం కలిగి చనువుగా అడుగుతున్నాను – అనే పద్ధతిలో కదుపుతాను' అని సుజాతకి వాగ్దానం చేసి బయటకొచ్చింది. వెళ్ళిపోతూ, "సుజాతా, ఇలా గాని అయితే అందరం ఎంతో సంతోషిస్తాం. మీ ఇద్దరూ మా అందరికీ ఎంతో ఇష్టమైన వాళ్ళూ, ముఖ్యమైన వాళ్ళూ. ఒకవేళ నెగటివ్‌గా రిప్లయి వస్తే నువ్వేమీ క్రుంగిపోవద్దు, మనసు పాడు చేసుకోవద్దు."

"అసలు చేసుకోను. మా వాళ్ళొక మ్యాచ్ గురించి రాశారు. సరే, ముందీ విషయం తేల్చేసుకుంటే తరువాత మా వాళ్ళేం చేసినా నేను పట్టించుకోనక్కరలేదని... ఎవరినిబడితే వాళ్ళని చూస్తూ మనం లైఫ్ పార్ట్‌నర్‌గా ఊహలు అల్లుకోలేం కదా? ఒక్కోసారి జీవితమంతా వెతికినా మనకి అనుకూలమైన వ్యక్తి దొరక్కపోవచ్చు. ఇదో చిన్న ట్రయల్. అంతే."

ఈ సుజాత మరీ తను భయపడుతున్నంత బేల కాదు. చక్కగా మాట్లాడుతోంది అనుకుంటూ ఇంటికి బయలుదేరింది. నిజంగా వీళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోగలిగితే ఎంత బావుంటుంది?

వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు ఇంటు ముందు స్కూటర్ చూసి బాగా సంతోషపడింది. బాబు నెత్తుకుని అటూ ఇటూ తిప్పుతున్న రవూఫ్ "ఇప్పుడా రావడం?" అన్నాడు దొంగ కోపంతో.

"సారీ, సారీ! పాపం, మీరెందుకూ టైం వేస్ట్ చేసుకున్నారు?" రెండు కుర్చీలు తీసుకొచ్చి క్షమాపణగా చూసింది.

"ముందొచ్చి ఈ మాట చెప్పాను ఆ పాపతో. మీరు రాగానే అక్కడెక్కడో దుర్గాదేవికి ప్రభ కడుతున్నారు చూడండి, వాళ్ళ డాన్సులు చూడడానికి వెడదామని పిల్లలు ఉబలాటపడుతున్నారు. నేను ఇంటికి పోయి నా పని ముగించుకుని ఎందుకైనా మంచిదని మళ్ళీ మీ ఇంటివైపొచ్చాను. మీ స్నేహితురాలు వదల్లేదా పాపం?"

"సరే, చాలా మంచి పని చేశారు. వాణ్ణిలా ఎత్తుకు ఎంతసేపని మోస్తారు? దించండి. మీకు వేరే పని లేకపోతే నేను చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి."

బాబు సంధ్య ఒళ్ళో బుద్ధిగా కూర్చున్నాడు.

"మాట్లాడండి" అంటూ కూర్చున్నాడు రవూఫ్. సంధ్య మాట్లాడినదంతా విన్నాక అతనేమీ ఆశ్చర్యం ప్రకటించలేదు.

"బావుంది" అన్నాడు నిట్టూరుస్తూ. "అసలు నా వివరాలేవీ తెలియవు మీకు. నాకిప్పుడు ఇరవై తొమ్మిది. బోల్డన్ని బాధ్యతలున్నాయి. మా అమ్మ నాకు స్టెప్ మదర్. మా నాన్న బ్రతికుండగా నవాబు దర్జాలన్నీ వెలగబెడుతూ, ఇద్దరూ చూసేవాళ్ళకి

వీళ్ళెంత గొప్పవాళ్ళో అని భ్రమ కలిగించారు. ఆయన వాచ్ షాప్ నడిపేవారు. సడెన్‌గా హార్ట్ ఎటాక్‌తో పోయేసరికి చెరువులో కప్పల్లా అందరం బయటపడ్డాం. మా స్టెప్ మదర్ కూడా డీలా పడిపోయి నన్ను పట్టుకుని బెంబేలుపడి ఏడవడంతో, ఆమెనింకా ఏడిపించకూడదనుకుని ఫ్యామిలీ బాధ్యతంతా స్వీకరించాను.” ఆగాడు రవూఫ్.

సంధ్య కొత్త విషయం వింటున్నట్టు ఆశ్చర్యంగా వింటోంది. చీకూ చింతా లేనట్టుగా తిరిగే రవూఫ్‌కు ఇన్ని బాధ్యతలున్నాయి అని ఎవరూ అనుకోరు.

“ఉన్నవి తెగనమ్మి ఎలాగో ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశాము. ఇప్పుడింకో చెల్లెలూ, చదువుకుంటున్న తమ్ముళ్ళూ ఉన్నారు. కాని ఒక్క తమ్ముడైనా చేతికి అందొస్తే అప్పుడు నేను పెళ్ళి గురించి ఆలోచిద్దామని అనుకుంటున్నా. కరిగిపోతున్న వయసును చూస్తుంటే దిగులేస్తోంది. మా ఇంట్లో అందరికీ నేనంటే ఎంతో ఆప్యాయతా ప్రేమాభిమానాలు ఉన్నాయి. కాని వాళ్ళెలా తయారయ్యారంటే నేనెక్కడ పెళ్ళి చేసుకుంటానో అని అనుక్షణం భయపడిపోతున్నట్టుగా ప్రవర్తిస్తారు. ఎవరైనా బంధువులు నాకు సంబంధాల గురించి మాటలు మొదలు పెడితే మా అమ్మ, ‘అయ్యో, వాడికింకా వయస్సేదీ పాతిక నిండలేదింకా, తొందరేముందీ’ అని నేను వినేటట్టు అంటుంది. ఈ లెక్కన ఆమెకి నా పెళ్ళి ముప్పయ్యయిదేళ్ళ వయసొచ్చినా చేయాలనిపించకపోవచ్చు. అందుకే నా జీవితాన్ని నా చేతుల్లోకి తీసుకుందామనే నిశ్చయానికొచ్చాను.”

“మరింకేం? హాయిగా సుజాతని చేసుకోండి. ఏమైనా బాధ్యతలున్నా ఇద్దరూ కలిసి కష్టపడి తీర్చేసుకోవచ్చు!” ఆశగా అంది. రవూఫ్ కథ చాలా బాధాకరంగా ఉంది. అందుకే ప్రోత్సాహకరంగా చెప్పడం ప్రారంభించింది.

రవూఫ్ తల అడ్డంగా ఊపాడు. “భార్యంటూ వచ్చాక ఎంత చేసినా మగవాడి తరపు తోబుట్టువులు గాని, తల్లిదండ్రులు గాని తృప్తిపడరు. డిపెండెన్సీ ఉన్న చోట మన గురించి ఏ కొంచెం పదిలం చేసుకున్న వాళ్ళనేమీ పట్టించుకోవడం లేదని దెప్పిపొడుస్తారు. అందుకే నేనూ ఒకటి ఆలోచించాను. నేను గల్ఫ్ కంట్రీస్‌కి వెళ్ళిపోదామనుకుంటున్నాను. అందుకోసం బాగా ప్రయత్నిస్తున్నాను.”

చాగా చీకట్లు ముసురుకున్నాయి. సంధ్య మనసు కూడా మబ్బు పట్టినట్టుగా అయింది. ఇదేవిటీ, ఇలా పిడుగుపాటులా ఈ వార్త వినిపించాడు – అనుకుంది దిగులుగా.

“అయితే వెళ్ళాలని నిశ్చయించుకున్నారా?”

“ఆఁ” నిర్లిప్తంగా అన్నాడు.

"ఎప్పుడు?"

"బహుశా రెండు మూడు నెలల్లో తేలిపోతుంది. రెండేళ్ళు అక్కడుంటే నేను వీళ్ళకి కొంత డబ్బు పంపగలను. లేదా ఏదైనా బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేస్తాను. నేను తిరిగి వచ్చేసి మా తమ్ముడిని వీలైతే గల్ఫ్‌కి పంపిస్తాను. ఇంతకన్నా తొందరగా పరిష్కారమయ్యే పద్ధతి నాకింకేమీ తోచడం లేదు. అందుకే రాత్రింబవళ్ళూ ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను."

"మంచిది. పోనీ వచ్చాక సుజాతని చేసుకోండి. అంత చక్కటి పిల్ల అంటే అన్ని రకాలుగా అంత తొందరగా దొరకదు" దిగజారిపోతున్న ఆశను కూడదీసుకుంటూ అంది.

"వద్దు. నాకో బాధ్యతా, ధ్యేయమూ ఉన్నాయి. అందులో ఎవర్నీ ఇరికించడానికి ఇష్టపడను. మీకు చెప్పాల్సిన సందర్భం వచ్చింది కాబట్టి చెప్పాను గాని, అసలు నా గొడవలెవరికీ చెప్పను సంధ్యగారూ. సుజాత పట్ల నాకెంతో అనురక్తీ, ప్రేమా ఉంటే అది వేరే విషయం."

"ఏమీ లేవా?" కోపంగా అంది. ఒట్టి ఫూల్‌లా ఉన్నాడు, ఆ పిల్లని మిస్ అవుతున్నాడనుకుంటూ కోపంగా మళ్ళీ అదే మాట రెట్టించింది.

ఆమె కోపానికి అతను చాలా హాయిగా నవ్వాడు. ఆ చీకట్లో అలలు అలలుగా ఆ నవ్వు ఆహ్లాదకరంగా వినిపించింది.

"వస్తా మరి" లేచి నిలబడ్డాడు. ఇంతలో పిల్లలు వచ్చారు. పాప నెత్తుకుని దింపేస్తూ, "కోపం తగ్గించుకోండి" అన్నాడు.

"నాకేం కోపం?" అతని వెనకాలే గేటు వరకూ నడుస్తూ నిష్ఠూరంగా అంది.

అతను స్కూటర్ కానుకుని నిలబడి అటూ ఇటూ చూసి, "సుజాతని మాత్రమే ఇష్టపడాలని రూలుందా? నాకిష్టమైన వాళ్ళు ఇంకెవరైనా ఉండొచ్చుగా?" అన్నాడు తమాషాగా చూస్తూ.

"ఎవరా అదృష్టవంతులు? మేం తెలుసుకోవచ్చా?" అల్లరిగా అంది.

"తెలుసుకున్నా ఏం లాభం? వాళ్ళు ఖాళీగా లేరు. నాక్కనిపించేసరికే వాళ్ళకి పెళ్ళయిపోయింది, ఇద్దరు పిల్లలు కూడా."

"అయ్యో పాపం... ప్చ్!" నవ్వు దాచుకుంటూ వెక్కిరింపుగా అంది. అతని మాటలు ఎక్కడో శ్రుతులని సరిచేస్తున్నాయి.

అతనింకా అలాగే నిలబడ్డాడు. ఆమె ఆ సంభాషణని పొడిగించకూడదన్నట్టు అలాగే మౌనంగా నిలబడింది. ఇక లాభం లేదన్నట్టుగా స్కూటర్ స్టార్ట్ చేశాడు.

"పేరు చెప్పమంటారా?" కొంటెగా అడిగాడు.

"వద్దు. అవసరం లేదు."

"తెలుసుకోవాలనిపించినప్పుడు అడగండేం? మీకు తప్పకుండా చెప్తాను."

రవూఫ్ స్కూటర్ అదృశ్యమయ్యేవరకూ అలాగే నిలబడిపోయింది. వెడుతూ తన మీద ఈ ప్రయోగపు మాటలు విసిరేసి మరీ వెళ్ళాడు. ఓ మంచి సంస్కారవంతుడి హృదయంలో ఇంత ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నందుకు ఆనందంగానే ఉంది కాని, పొంగిపోవడానికి తనేమీ చిన్నపిల్ల కాదు, తెలివి హీనురాలు కాదు.

"పేరు చెప్పమంటారా?" నవ్వూ, అల్లరీ కలసిన ప్రశ్నతో రవూఫ్ మొహం ఆ రాత్రంతా నిలబడి తనని ప్రశ్నిస్తున్నట్టే ఉంది. విచిత్రమైన కలవరం. ఆ కలవరంలో ఎంతో సంతృప్తి. నిద్ర పట్టక గిరిజకి సుమిత్ర గురించి ఉత్తరం రాస్తూ కూచుంది. పెన్ కదలడం లేదు. రవూఫ్ ఉంగరాల జుట్టూ, అల్లరి నవ్వూ గుర్తుకొస్తూ గిలిగింతలు పెడుతున్నాయి.

# 15

తెల్లవారుతుండగా జ్ఞానోదయం అయినట్టుగా తనని తాను తిట్టుకుంది. కొంత వయసొచ్చాక పెళ్ళికాని ఆడవాళ్ళకి గాని, మగవాళ్ళకి గాని అదో మానియా. ఎవర్నో ఒకరిని ఆరాధిస్తున్నట్టు, ప్రేమిస్తున్నట్టు మాట్లాడుతూ, తమ ఒంటరితనాన్ని తగ్గించుకుంటుంటారు. ఓ రకమైన గుర్తింపుకు ఆర్రులు చాస్తుంటారు. ఆ మాటలకు పడిపోయిన వివాహిత స్త్రీలు గాని, పురుషులు గాని చప్పున ఆ కొత్త స్నేహానికి ఆకర్షితులై తాత్కాలికంగా తమ చికాకులనీ, బాధలనీ మరిచిపోవడానికి ఈ మార్గాన్ని ఎన్నుకుంటారు. ఎంతోమంది మధ్య ఆ గుర్తింపు తమకే లభ్యమయిందని ఇగోని తృప్తిపరుచుకుంటారు.

ఫలితాలు ఎలా ఉంటాయో? చాలామంది జీవితాలను చూసింది, పరిశీలించింది. తనూ విక్టిమ్ అయింది.

రవూఫ్ మంచివాడు కావచ్చు. కాని అంతక్నా ముందు మగవాడనే విషయం మరిచిపోకూడదు. కావాలనుకున్నది దొరికేవరకూ ఆడవాళ్ళని పూజిస్తూ, జపిస్తూ ఉంటారు మగవాళ్ళు. తనకు తెలియదా? మనసు ఎండిపోయినంత మాత్రన ఈ చిరుజల్లుల వల్ల తనకేం ప్రయోజనం? ఏనాడో తన మనస్సు ఎడారిలా మారిపోయింది. ఈ జల్లుల వల్ల లాభం లేదు.

చాలాసేపు అలా తనని తాను విమర్శించుకున్నాక సంధ్య మనస్సు తేలికపడింది. 'రవూఫ్‌తో చాలా ముక్తసరిగా మాట్లాడాలి' అని నిర్ణయించుకున్నాక చాలా శాంతిగా అనిపించి నిద్ర పట్టింది.

***

రవూఫ్ కుటుంబ విషయాలు విన్నాక సుజాత ఏమీ అనలేదు.

"నేనెందుకో పెద్దగా ఆశ పెట్టుకోలేదు సంధ్య గారూ! నాకా అదృష్టం లేదు." అంది నిరాశగా నవ్వుతూ.

సుజాతని చూస్తూ 'రవూఫ్‌కి కళ్ళు మూసుకుపోయాయి' అనుకుని తిట్టుకుంది. సుజాతకి చెప్పవలసిన మాటలు చెప్పేసి, ఆ రోజు పోస్ట్ తెరిచింది. అరుణ ఉత్తరం ముందుగా చదివింది.

*"ప్రియమైన మేడమ్ సంధ్య గారూ.*

*నేను వచ్చే వారం వస్తాను. మీకు చాలా విషయాలు చెప్పాలి. మీ శ్రీవారు మా యూనివర్సిటీకి వచ్చారు. నా కాబోయే శ్రీవారికి అన్నీ వివరంగా – అంటే ఈ*

*రాక్షసి గురించి మీ పేర్లు బయటకు రాకుండా ముందే చెప్పేశాను. పై నెలలో మా పెళ్ళి కదా! ఆ తరువాత అపార్థాలు రాకూడదని. అతను సహృదయుడు. 'నీ గురించి ఎవరేం కథలు చెప్పినా, ఆకాశరామన్న ఉత్తరాలు రాసినా నేను నమ్మను' అన్నారు. మిగిలిన విషయాలు ముఖాముఖీ.*

*మీ అరుణ."*

యూనివర్సిటీకీ రాజా ఏం పని మీద వచ్చాడో అరుణ రాయలేదు. సుమిత్ర కోసం వెళ్ళి ఉండకపోవచ్చు. అంతగా అసహ్యించుకున్న మనిషి మళ్ళీ ఆమె ఛాయలకేసి వెడతాడని తాను అనుకోవడం లేదు. అయినా తనకెందుకు? తనకి రోజులు నిర్విచారంగానే గడచిపోతున్నాయి. తన జీవితం మీద తనకి పూర్తి గ్రిప్ ఉంది, చాలు. ఎవరెలా పోతే తనకెందుకు – అనుకుని తనను తాను ఊరడించుకుంటూ, మిగిలిన ఉత్తరాలు చదివింది. రాజా శనివారం వస్తున్నట్టుగా ఒక కార్డు. ఇంకో ఉత్తరం బొంబాయి నుంచి. మామూలు విశేషాలే.

అరుణ వచ్చింది. "నా పెళ్ళి వాయిదా పడింది గదా! ఈసారి ముహూర్తాలు పెట్టేశారు మేడమ్. తిరుపతిలో పెళ్ళి. మీరు తప్పకుండా రావాలి అంది. సంధ్య ప్రశ్నలు వేయకుండానే అరుణే మొదలుపెట్టింది – "మీరు మీ వారి గురించి జాగ్రత్తగా ఉండాలి" అంటూ.

"కాకినాడలో ఉన్న మనిషిని గురించి నేనేనిక్కడేం జాగ్రత్త తీసుకోను అరుణా?" అంది విసుగ్గా.

"మీవారు కాకినాడలో జాయిన్ కాగానే సుమిత్ర వెళ్ళి కలిసింది. మీకు చెప్పారా?"

"చెప్పలేదు" సంధ్య మొహం పాలిపోయింది.

"సరే, ఈవిడగారు ఏ మాత్రం సిగ్గు లేకుండా తన కథని మా బ్లాక్‌లో అందరికీ వర్ణించి వర్ణించి చెబుతోంది. మీరు స్వంత పెదనాన్న కూతురైనట్టు, అక్కకి సహాయం చేద్దామని వస్తే బావ లోబరుచుకున్నట్టు చెప్పుకుంటోంది. సరే, మీవారు తను చదివిన రోజుల్లో ఉన్న ఒక ప్రొఫెసర్‌కి ఈమె గురించి ఎంతో మంచిగా రికమండేషన్ లెటర్ రాసి ఇచ్చారు. దాంతో బాటు ఈమెకి కూడా జాగ్రత్తలు చెబుతూ లెటర్ రాశారు. ఆ లెటర్ అందరికీ చూపించింది. నాకు తెలియాలనీ, నా ద్వారా మీకూ తెలియాలనీ దాని కోరిక. శాడిస్ట్ అండీ."

"సరే యునివర్సిటీకి ఎందుకొచ్చా డితను?" పెనం మీద వేగుతున్న అట్టులా చురచురమంటూ అడిగింది.

"తనూ లెక్చరర్ కాబట్టి ఏ వంకయినా పెట్టవచ్చు. ఎప్పటికప్పుడు మీకు

అన్నీ చెబుదామనే నేను అనుకుంటున్నాను. మీరు కేర్‌ఫుల్‌గా ఉండాలి. అరుణ చెప్పిందని మీరు మాస్టారితో అన్నా నాకు భయం లేదు. పైగా సుమిత్ర తప్పుడు కథలన్నీ చెబుతోంది. నాకు వీలున్నంత వరకూ మిగిలిన అమ్మాయిలకు నిజానిజాలు చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను. అసలు దీనివల్ల మా హాస్టల్ ఎలా తయారైందంటే... పైగా మగవాళ్ళని పరిచయం చేసుకుంది. చీటికి మాటికి ఏడుస్తూ, వాళ్ళకి జాలి పుట్టించే కథలు చెబుతూ, అందరి దగ్గరా భలే సహాయాలు తీసుకుంటోంది. దీనివల్ల చదువు మానేసి వెనక్కి వచ్చేద్దాం అనిపిస్తోంది నాకు. మీరు మాత్రం మాస్టారి మాటలు నమ్మవద్దు." అరుణ పదే పదే హెచ్చరించి వెళ్ళింది.

శనివారం రాత్రి రాజా వచ్చాడు. వస్తూనే "నా కథకి బహుమతి వచ్చింది, చూశావా?" అన్నాడు.

భోజనమయ్యాక అంది – "సుమిత్ర గురించి ఎన్నిసార్లు ఏమడిగినా నాకేం తెలియదంటూ బుకాయిస్తూ వచ్చావు. నేనూ నమ్మాను."

"అబ్బా సంధ్యా! నేనెంతో కష్టపడి కాకినాడ నుంచి ఇక్కడికి వస్తే బిగదీసుకున్న మొహంతో దర్శనమిస్తావు. లేదా ఏనాడో జరిగిన కథలన్నీ తవ్వి ఆనందాన్ని పాడు చేస్తావు. ఛీ ఛీ! నాకు సుఖపడే యోగం లేదు." విసుక్కుంటూ చూశాడు.

అసహ్యమంతా కళ్ళలోకి నింపి, బరువుగా ఊపిరి పీలుస్తూ అంది – "నా సుఖాన్ని సమూలంగా నాశనం చేసిన నువ్వు సుఖం గురించి వాపోవడం వింతగా ఉంది."

"ఏం, నేను మనిషిని కాదా? ఎంతో ప్రయాసపడి వస్తే, పెళ్ళాం ఇలాగేనా దర్శన మిచ్చేది?"

"మరెలా ఇవ్వాలి? నువ్వేం మోసాలు చేసినా భరించి, నీ పక్కన చేరాలా?" వెటకారంగా అంది.

"సంధ్యా, ఏమిటీ నీ ఉద్దేశం?" రాజా లేచి నిలబడ్డాడు.

"నువ్వు.. నువ్వు.. నిజంగా నా మీద జాలి, అభిమానం ఉన్నవాడివేనా? నన్నంత అల్లరి చేసి, ఎంతో పచ్చిగా ప్రవర్తించిన ఆ మనిషికి ఉత్తరం రాస్తావా? ఇడియట్!" సంధ్య ఒళ్ళు మరిచిపోయింది.

రాజా చేతి వేళ్ళు విసురుగా సంధ్య బుగ్గ మీద ముద్ర వేశాయి. చెంప పట్టుకుని స్థాణువులా ఉండిపోయింది.

"ఎంత రెచ్చగొడుతున్నావో! మొగుడినన్న గౌరవం లేకుండా ఇడియట్ అని తిడతావా? నీకింత అహంకారమా? నీ అహంకారమే నిన్నింతగా... ఛీ... ఛీ! ఇంకా జ్ఞానం రాలేదు." షర్ట్ తగిలించుకుని బయటకు కదలబోయాడు.

సంధ్య చేతులు అతని షర్ట్‌ని పట్టుకున్నాయి.

"వదులు" రాజా విదిలించుకోబోయాడు.

"నువ్వు... నువ్వు... నన్ను కొట్టావ్" వింతగా నవ్వింది. "ఏమన్నావ్ నువ్వు? నా అహంకారం నన్ను... ఓ.కే. ఓ.కే... రాజారావ్ గారూ, రచయితగారూ! ఈ దురహంకారిని, మొగుడిని ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో తెలియని అధమురాలిని నువ్వెందుకు భరిస్తున్నట్టు? ఆ రోజు... ఆరోజు... నన్నొదలకు సంధ్యా అని చేతిలో చేయి వేయించుకుని ఆపావే, కేవలం నీకోసం.. నీ మీద నా ప్రేమని నిరూపించడం కోసం నీ సుమిత్రని.. ఆ డెవిల్‌ని... భరించి..."

రాజా హృదయం ద్రవించింది. దగ్గరకొచ్చి పట్టుకుంటూ – "సంధ్యా పడుకో." అన్నాడు నెమ్మదిగా.

సంధ్య విసురుగా అతన్ని విదిలించింది. "ఆరోజు నేను దేవతనయ్యానా? ఇప్పుడేమో మొగుణ్ణి అలరించడం రాని చవటనయ్యానా? నిజంగానే నాకు రాదు. నేను నీకు ప్రియురాలిగా ఉందామనుకున్నానేగాని, పతివ్రతలా నటిద్దామనుకోలేదు. చలాన్ని మహా గొప్పగా అభిమానించే నువ్వు, రంగనాయకమ్మ రచనలంటే పడిచచ్చే నువ్వు ఎంత కపటంగా మాట్లాడుతున్నావో! ఎంత ఆత్మవంచన చేసుకుంటూ బ్రతుకుతున్నావో!"

"సంధ్యా, నువ్వు కూల్‌గా ఉన్నప్పుడు నేనన్నీ వివరంగా చెబుతా. అసలు నేను యూనివర్సిటీకి ఇంకో పనిమీద వెళ్ళాను."

"పాపం కాకినాడ వచ్చి ఆమె కూడా నిన్ను కలిసింది. నువ్వు కరిగి నీరై పోయుంటావు." వగరుస్తూ అంది.

"పోనియ్యి సంధ్యా, ఎవరి పాపం వాళ్ళదే. నా తల్లివిగా, నేనెప్పుడో చెప్పాను, నీకంటే ఎవరూ ఎక్కువ కాదని.'"

రాజా మాటలకి సంధ్య వ్యంగ్యంగా నవ్వింది. "అవును. ఎవరూ ఎక్కువ కాదు. ఎలా ఎక్కువవుతారు? నేను కట్టుకున్న భార్యని. పదిమందిలో నీకు గౌరవం తెచ్చిపెట్టేదాన్ని. నీ పిల్లలకి తల్లిని. సంపాదిస్తున్నాను. నువ్వు నన్ను పొరపాటున కూడా వదలవు. నన్ను ఉద్ధరిస్తూనే, నీ గోపికలను ఓదారుస్తూ ఉత్తరాలు రాస్తావు. ప్రొఫెసర్‌కి రికమండేషన్ లెటర్ రాశావనుకో. పోనీ నాతో చెప్పడానికేం? ఎలాగో ఒకలా ఆ అమ్మాయి జీవితం ఒకదారిలో పడిందని ఎన్నోసార్లు అనుకుంటూ ఉంటానుగా?"

"నీది చాలా బ్రాడ్ మైండ్ అని తెలిసినా... ఏమిటో... పోనియ్యి సంధ్యా. అసలు సుమిత్ర ఇప్పుడు నన్ను లెక్కజేసే స్టేజిలో లేదు. చాలా మంది ఫ్రెండ్స్‌ని

సంపాదించింది. నువ్వు చాలా ఆవేశంగా ఉన్నావు. పడుకో. నేనలా బయటకి వెళ్ళొస్తాను.” రాజా వెళ్ళిపోయాడు.

ఇతన్నింకా క్షమించి, భరించే ఓపిక లేదు. లోకం దుమ్మెత్తి పోయనీ, మొగుణ్ణి వదిలేసిన ఆడది అని ముద్ర వేయనియ్యి. రాజాతో కలసి బ్రతకదు గాక బ్రతకదు! ప్రతీసారి ఏవో ఒక కారణాలు చెప్పి క్షమాపణలు వేడుకోగలడు. తన ఈగోని బాగా దెబ్బకొట్టి, తననో రాక్షసిగా మార్చేయగలడు. తనను ఇన్ని అవమానాలకి గురిచేసి పారిపోయిన ఆ సుమిత్రని పాపం, ఓదారుస్తాడా? రేపు ఆ ఓదార్పులోనే భాగంగా ఇంకో కాపురం వెలగబెట్టినా పెడతాడు. అంత చేయగలడు.

ఆదివారం రాత్రి చాలా డల్‌గా – “వస్తాను సంధ్యా” అని బయల్దేరిన రాజాని చూసి, తలూపింది.

“పిల్లలు జాగ్రత్త. వీలుంటే వచ్చే వారం వస్తాను.” అన్నాడు.

“రాకపోయినా పర్వాలేదు.”

“నువ్వలా అన్నా, నేను రాకుండా ఉండలేనుగా! అదే నా బలహీనత.” నవ్వి రాజా వెళ్ళిపోయాడు.

లోపలికి పరిగెత్తుకెళ్ళి గుండె లవిసేలా ఏడ్చింది. ఒక్కోసారి తను అనే మాటలకి ఈ రాజా తనని బాది, తిట్టి గట్టి వార్నింగ్ ఇస్తే బావుండును అనిపిస్తుంది. అతను నా తప్పులెందుకు భరించాలి? తనముందు తల వంచుకుని విధేయతగా, తనెంత విదిలించి మాట్లాడినా ఎందుకు భరించాలి? నిజంగా మంచితనమా? లేక నయవంచనా? ఈ జీవితమంతా ఈ రాజాని అర్థం చేసుకోడానికే సరిపోయేలా ఉంది.

పాప ఏదో అడగడంతో కళ్ళు తుడుచుకుని లేచింది.

***

“తప్పకుండా రావాలి” సుజాత కార్డు అందిస్తూ అంది.

“ఓ!” సంధ్య సంభ్రమంగా కార్డ్ చూసింది.

సింపుల్‌గా అందమైన తెలుగుతనం పలికించే పదాలతో బావుంది కార్డు. నీలంరంగు మీద గోల్డ్ ప్రింట్. కార్డుపైన పసుపు రంగు గులాబీల గుత్తి.

“రవూఫ్ గార్ని తీసుకురండి. నేనిప్పుడు అప్పటి సుజాత కాదు. నేనేం ఫీలవడం లేదు.” గొంతుకేదో అడ్డు పడ్డట్టుగా ఆగి నవ్వింది. సంధ్య ప్రేమగా చెయ్యి నొక్కుతూ, “తప్పకుండా వస్తాం. కాని రవూఫ్ పది రోజుల నుంచి కాలేజీకి రావడం లేదు. నేనూ నా హడావిడిలో పడి ఎవర్నీ అడగలేదు.” అంది.

"జ్వరమొస్తోందని రాధికకి ఎవరో చెప్పారట. కాలేజీకి ఎప్పుడొస్తే అప్పుడు ఈ కార్డ్ ఇచ్చేయండి. నేనీ రాత్రికే ఆలమూరు వెళ్ళిపోతున్నాను." సుజాత పదిసార్లు చెప్పి, ఇంకా కార్డ్స్ పంచడానికి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఇంటికెళ్ళి గబగబా స్నానం చేసి, పాపా బాబుల్ని తీసుకుని రవూఫ్ చిన్నాన్న వాళ్ళింటికి వెళ్ళింది. వాళ్ళు వాళ్ళబ్బాయిని తోడిచ్చి పంపారు. చెప్పాపెట్టకుండా వచ్చినందుకు తను ఏమనుకుంటాడో అనుకుంటూ సందేహంగా లోపలికి అడుగెట్టింది.

ఎదురుగా వాలు కుర్చీలో కూర్చుని, కళ్ళు మూసుకుని దీర్ఘాలోచన చేస్తున్నాడు. గడ్డం పెరిగి ఉంది. మొహం పీక్కుపోయింది.

"రావచ్చా" అంది దగ్గరకెళ్ళి.

కళ్ళు విప్పిన రవూఫ్ కళ్ళలోకి ఆశ్చర్యం, ఆ వెంటనే ఆనందం వరుసగా చోటు చేసుకున్నాయి.

"మీరా" అన్నాడు కంగారు పడుతూ.

"నేనే. అస్సలు నాకింతవరకూ తెలియదు – మీరు సిక్ అయ్యారని." తన చేతిలోని చక్కెరకేళి హస్తం పక్కనే టీపాయ్ మీద పెట్టింది.

రవూఫ్ ఏమీ తోచని వాడిలా ఇంట్లో వాళ్ళమ్మనీ, చెల్లెల్నీ, తమ్ముళ్ళనీ పిలుచుకొచ్చాడు. వాళ్ళంతా పూర్తి తెలుగుదనం పుణికిపుచ్చుకున్నవాళ్ళు. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతున్నారు. "లోపలికి రామ్మా!" అని పిల్లల్నీ, సంధ్యనీ ఆమె తీసుకువెళ్ళింది.

ఆ వయసులో ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యపడుతూ మాట్లాడడం మొదలుపెట్టింది సంధ్య. పిల్లలెవరికీ ఆ రంగూ, ఆ పోలికలూ రాలేదు. ఆమె అందంలో ఠీవీ, చురుకుదనం ఉన్నాయి. వాళ్ళ తాతలు బాగా బ్రతికిన వాళ్ళట. ఆ సంపన్న లక్షణాలు, గతకాలపు వైభవ చిహ్నాలు ఆమె మొహంలో ఎక్కడో కదులుతూనే ఉన్నాయి.

రవూఫ్ తమ్ముడిని పంపి ఏవేవో తెప్పించి మర్యాద చేశాడు. పిల్లలు వెంటనే ఆ ఇంట్లో వాళ్లతో స్నేహం కలిపేసి మేడమీద కెళ్ళిపోయారు. ఓ గంట కాలక్షేపం చేశాక, వచ్చేముందు – "సుజాత పెళ్ళి. తప్పకుండా రమ్మంది." అంటూ కార్డు ఇచ్చింది.

"మా అబ్బాయికి కూడా చేసెయ్యాలమ్మా... బంగారం నా కొడుకు. మంచి సంబంధం చూడండి." అంది ఆమె – ముంతాజ్.

"ఎవరో ఎక్కడో ఎదురుచూస్తూండి ఉంటారు." అంది రవూఫ్‌ని చూసి నవ్వుతూ. వచ్చిందేగాని రవూఫ్‌తో ఏమీ మాట్లాడలేదు. ఎక్కువగా వాళ్ళమ్మగారితోనూ, మిగిలిన కుటుంబ సభ్యులతోనే మాట్లాడింది. అందరికీ చెప్పి సెలవు తీసుకుంటుండగా – "ఉండండి, నేనొచ్చి రిక్షా ఎక్కిస్తాను. ఇక్కడ దొరకవు." అన్నాడు.

రిక్షా కోసం నడుస్తున్నారు. అట్టే జనసంచారం లేని రోడ్డు. రవూఫ్ బుద్ధిమంతుడిలా చేతులు వెనక్కి మడిచికట్టుకుని నడుస్తున్నాడు. పొడగరి అయిన రవూఫ్ బాగా చిక్కడం వల్ల ఇంకా పొడుగ్గా అనిపిస్తున్నాడు.

"ఎప్పటివరకూ లీవ్? ఇంకా నయమవలేదా?"

"క్రిందటి వారమే తగ్గిపోయింది. మలేరియా వచ్చింది."

"అయ్యో!" అంది సంధ్య నొచ్చుకుంటున్నట్టు.

"రాజాగారు బావున్నారా, వస్తున్నారా?"

"ఈమధ్యలో రెండుసార్లు వచ్చారు. ఇంట్లో బోర్ కొట్టడంలేదా? రాకపోయారా మా ఇంటికి?"

"తిడతారేమోనని రాలేదు."

రోడ్డు మీద లైటన్నీ ఒక్కసారి వెలిగాయి. అప్రయత్నంగా ఒకరి మొహంలోకి ఒకరు చూసుకున్నారు. ఇద్దరు పెదిమలమీద నవ్వు వెలిగింది. రేడియో లోంచి – "నా మనసే, వీణియగా మారనీ" అనే పాట సందర్భోచితంగా, తియ్యగా వినిపిస్తోంది.

"అమ్మా రిక్షా ఎక్కుదాం" అని పాప గొడవ చేస్తుండడంతో, రిక్షా ఎక్కేసి, "రేపు రండి వీలయితే" అంది.

"రేపా? ప్రయత్నిస్తాను" రవూఫ్ మాటలు గాలిలో కలిసిపోయాయి.

రిక్షా కదిలిపోయింది. సంధ్యకి వినబడలేదు.

అతను తప్పకుండా వస్తాడనే నమ్మకంతో బాగా ఎదురుచూసింది. రాలేదు. ఆ మర్నాడు కూడా రాలేదు. పక్కింటి మామ్మగారికి చుట్టాలెక్కువ. ఎప్పుడూ వచ్చేపోయే కూతుళ్ళతో, కొడుకులతో ఆమె అసలీ పోర్షన్‌తో ఎక్కువ సంబంధం లేనట్టుగా ఉంటూంటారు.

రెండవ రోజు సాయంత్రం అయిదు గంటల నుంచీ ఎదురుచూడడం ప్రారంభించింది. వీధిలో ఏ స్కూటర్ చప్పుడు వినిపించినా అతనేనేమో అని తెరచి ఉన్న పెద్ద కిటికీ ఊచల్లోంచి చూసేది. నిరాశ భరించడం కష్టమయ్యేది.

అదే రోజు రాత్రి తొమ్మిదింటికి మామ్మగారి మనవడు – "ఆంటీ, మీకు ఫోను" అంటూ వచ్చాడు. 'ఇంత రాత్రపుడు ఎవరా ఫోన్ చేసేది' అనుకుంటూ

ఆదరాబాదరగా వెళ్ళింది.

ఫోన్‌లో గొంతు గుర్తుపట్టడం అసాధ్యంగా ఉంది. "పేరు చెప్పండి" అంది విసుగ్గా.

"నేనండీ రవూఫ్‌ని."

"మీరా?" సంధ్య గుండె గబగబా కొట్టుకుంది. ఫోన్ గట్టిగా పట్టుకుంది.

"థాంక్స్ ఫర్ యువర్ కైండ్ విజిట్."

"ఇది చెప్పడానికా? మీరొస్తారని ఈ రెండు రోజుల్నించీ చూశాను." అనేసి, ఆపై నాలిక కరుచుకుంది.

"నిజంగా?"

"నిజమే."

ఒక్క సెకండు కాలం మౌనం. తరువాత "ఐయామ్ ఫార్చునేట్ హేవ్ ఎ నైస్ ఫ్రెండ్ లైక్ యూ" అన్న మాటలు అస్పష్టంగా వినిపించాయి.

ఆ గదిలోకి ఎవరెవరో వస్తున్నారు, పోతున్నారు. ఇక బావుండదని – "మీరు కాలేజీకి వస్తున్నారా? వీలైతే ఇంటికి రండి" అంది.

"ఎప్పుడొస్తానో చెప్పలేను. కాని, వస్తాను." అంటూ ఫోన్ పెట్టేశాడు.

తన పోర్షన్‌లోకి వచ్చేస్తూ, అదో రకంగా ఫీలై, తనని తాను తిట్టుకుంది సంధ్య.

ఏవిటిది? తనకి ముప్ఫయి వచ్చాయి. అతను తనకన్నా చిన్నవాడై ఉంటాడు. ఈ దిగులు, నైరాశ్యాన్నీ మరిచిపోవడానికి అతని స్నేహం కోరుకుంటోంది తను. ఏ స్నేహమైనా ఎంతకాలం? వస్తే వచ్చాడు లేకపోతే లేదు. రేపు సాయంత్రం తనసలు ఇంట్లో ఉండగూడదు. పిల్లల్ని పార్క్‌కయినా తీసుకెళ్ళి తిప్పుకు రావాలి.

అలా అనుకున్న తరువాత మనసెప్పుడూ తేలికవుతుంది. కొడవటిగంటి వారి 'చదువు' పుస్తకం తీసి చదువుతూ కూచుంది.

# 16

రవూఫ్ కాలేజీకి రావడం తెలుసు, అయినా ఆ ఛాయలకి వెళ్ళకుండా జాగ్రత్తపడింది. అతనూ ఆవరణలో ఎక్కడా సాయంత్రం వరకూ కనబడలేదు. 'అమ్మయ్యా, ఈ రోజు గడిచిపోయింది' అనుకుంటూ ఇంటికెళ్ళి పిల్లల్ని తయారుచేసి పార్కుకు బయల్దేరింది. ఎనిమిదింటివరకూ పిల్లలు హాయిగా ఆడుకున్నారు. బాగా తెలిసినవాళ్ళ కుటుంబం అక్కడ కలిశారు. వాళ్ళతో మాటల్లో పడి తన గ్లాని మరచిపోయింది. రిక్షా ఇంటిముందు ఆగాక దిగుతూ, స్కూటర్ చూసి విభ్రాంతిగా లోపలికి నడిచింది.

పక్కింటి యువకుడు, ఆ మామ్మగారికి అల్లుడో, కొడుకో అతనితో మాట్లాడుతున్న రవూఫ్ – "నమస్తే మేడమ్" అన్నాడు వినయంగా. "ఇతను నా ఫ్రెండ్. నా క్లాస్‌మేట్" అన్నాడు ఆ యువకుడిని పరిచయం చేస్తూ.

అతనికి నమస్కరించి తాళాలు తీసింది. ఏ మనిషినైతే తప్పించుకుందామని అనుకుందో మళ్ళీ అదే మనిషి ప్రత్యక్షమవడం బాగా అనిపించలేదు. వంట గదిలోకి వెళ్ళి పిల్లలకి అన్నాలు పెట్టేసి, వాళ్ళని మంచాల మీద వేసి, కుమారికి కూడా అన్నం పెట్టి మరీ వచ్చింది.

రవూఫ్ తను బోర్లా ఉంచిన పుస్తకంలో కొన్ని పేజీలు దీక్షగా చూస్తున్నాడు.

"ఏంటి వీడు, కదలకుండా జిడ్డుగా పట్టుకున్నాడు అని ఇంతసేపూ వంటగదిలో తిట్టుకుంటూ గడిపారా" అన్నాడు పుస్తకంలో తల ఉంచేసి మాట్లాడుతూ.

"అదేం లేదు, చెప్పండి. బావున్నారుగా."

"ఫిజికల్‌గానా, మెంటల్‌గానా?"

"అవన్నీ నాకు తెలియవు."

పుస్తకం మూసేసి నవ్వుతూ చూశాడు. 'నేను ఓడిపోకూడదు' అనుకుంటూ ఏ భావమూ వ్యక్తం చేయకుండా కూచుంది.

"సంధ్యగారూ, బహుశా నేనింకో రెండు నెలల్లో మస్కట్ వెళ్ళిపోవచ్చు. ఎప్పుడయినా ఉత్తరాలు రాస్తే సమాధానం ఇస్తారా?"

"ఎందుకో అప్పగింతలు?"

"ఏనాటికైనా, ఎటువంటి స్నేహితులైనా ఏదో ఒక రోజు విడిపోవడం తప్పదు కదా! ఆ నిజం తెలిసీ చాలా స్నేహం చేసేస్తాం. మళ్ళీ నాకు అవకాశం వస్తుందో, రాదో చెప్పేస్తున్నాను. నేను ఓ పదిహేను రోజుల నుంచీ మిమ్మల్ని చూడకుండా,

మీతో మాట్లాడకుండా ఉండగలనో లేదో అని నాకు నేను పరీక్ష పెట్టుకున్నాను. ఆ పరీక్షలో ఏం తేలిందంటే... " రెండు అరచేతులూ కలిపి నొక్కుకుంటూ.. "నాకది పెద్ద శిక్ష అని తేలింది. నేను గల్ఫ్ వెళ్ళి ఎలా ఉండగలనో అర్థం కావడం లేదు. దాదాపు నాకు సంబంధించిన పనులన్నీ పూర్తయిపోయాయని బొంబాయి నుంచి మా అంకుల్ ఉత్తరం రాశారు. ఇది కేవలం నాకేనా? మీక్కూడా...."

సంధ్య మొహం జేవురించి ఉండడంతో, "క్షమించండి" అంటూ లేచి నిలబడ్డాడు.

"రవూఫ్" అతి మామూలుగా పిలుద్దామన్నా, సంధ్య గొంతు కోపంగానే పలికింది.

"మనం చిన్నపిల్లలం కాదు. ఈ కబుర్లన్నీ వినాలనీ, తన్మయం చెందాలనీ నాకేం లేదు. ఇష్టమైన వాళ్ళు చాలామంది ఈ జీవితంలో క్రాసవుతునే ఉంటారు. ఆడా మగా ఫ్రీగా మాట్లాడుకునే అవకాశాలు లేవు కాబట్టి, ఏ కొంచెం స్నేహం పెరిగినా మనం ఏదేదో ఊహించుకుంటాం. నా సంగతలా అవతలికి పెట్టండి. ఇటువంటి బెంగల వల్లా, బాధల వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. మీరు మానసికంగా స్తిమితపడ్డాకే నాతో మాట్లాడండి. మీ బాధకి నేను కారణమయ్యాను అంటే నాకదేమీ గొప్పగా అనిపించడం లేదు, సిగ్గుగా అనిపిస్తోంది."

"కాదు కాదు మీరెంత మాత్రం కాదు" రవూఫ్ నిట్టూర్చి ముందుకు నడిచి వెనక్కి తిరిగాడు.

"ఎందుకో, ఇలా చెప్పుకుంటే బరువు దిగుతుందని చెప్పాను కాని, ఇప్పుడు అనవసరంగా మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా అనిపిస్తోంది. క్షమించండి."

"క్షమిస్తాను" నవ్వుతూ చూసింది.

"అమ్మయ్య, ఇప్పటికి నా భయం తగ్గింది" అనుకుంటూ స్పీడ్‌గా వెళ్ళిపోయాడు.

***

రోజులు ఇబ్బంది పెట్టకుండా సునాయాసంగా దొర్లిపోతున్నాయి. రాజా వస్తునే ఉన్నాడు. సంధ్య సెక్స్‌లో సహకరించకపోవడం గురించి చిన్నబుచ్చుకుంటూ మాట్లాడుతూనే ఉన్నాడు. అరుణ పెళ్ళికి వెళ్ళారు. సుజాత పెళ్ళికి కూడా వెళ్ళారు. అప్పుడప్పుడు రాజాతో వాదోపవాదాలతో ఎక్కువ కష్టం లేకుండా, సుఖం గురించి పట్టింపు లేకుండా నిబ్బరంగానే రోజులు నెట్టేస్తోంది సంధ్య.

సంక్రాంతి సెలవలకి ఎక్కువ రోజులు గడుపుతూ ఉండడం వల్ల రాజా చాలా నిర్మొహమాటంగా తన బాధని తెలియజేశాడు.

"నా దగ్గరికి రావడమే పాపమైనట్టుగా నువ్వు ప్రవర్తిస్తుంటే నాకెలా ఉంటుంది?" అని నిలదీశాడు.

"ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నానుగా! ఇంకా ఎందుకు అదే ముఖ్యమైనట్టు మాట్లాడుతావు?" అంది అయిష్టంగా.

"నువ్వు చాలా మారిపోయావు సంధ్యా! ఇదివరకు నేనెక్కడికైనా ఊరు వెడితేనే బెంగపడేదానివి. ఏడ్చి గోల చేసేదానివి. ఇప్పుడు చాలా మారిపోయావు."

"అప్పుడు వేరు. అప్పుడు చిన్నతనం. అయినా మనుషులంతా ఎప్పుడూ ఒకేలాగా ఉండరు కదా?"

"నిజమేలే. ఏది ఏమైనా నువ్వు మారాలి" రాస్తున్న కథ ఆపి మాట్లాడుతున్నాడు. మారడం కేవలం తన బాధ్యతే అన్నట్టు చెప్పడం చూసి సంధ్యకి ఒళ్ళు మండింది.

"ఎందుకు మారద్దు? నేను చాలా మారాలి" అంది కసిగా. అప్పుడు ఆమె మనసులో రవూఫ్ మెదిలాడు.

"గుడ్. వచ్చే సంవత్సరానికల్లా మనం చిలకాగోరింకల్లా ఉండగలమని ఆశిస్తాను." కుర్చీ లోంచి లేచి వచ్చి ఆమె బుగ్గ సున్నితంగా తాకుతూ అన్నాడు.

తనెందుకు రాజాని భరించలేకపోతుంది? సైకియాట్రిస్ట్‌ని కలిస్తే మంచిదేమో! ఈ రకంగా అయితే తనింక చాలా కాలం ఇతనితో బ్రతకాలి కదా? అబ్బో చాలా కష్టమవదూ?

"అదిగో రవూఫ్ గారొస్తున్నారు. రండి సార్" అన్నాడు రాజా కుర్చీ ముందుకు జరుపుతూ. ఈమధ్య ఆదివారాలు రాజా వచ్చినప్పుడే ఇంటికి రావడం అలవాటు చేసుకున్నాడు రవూఫ్. ఇదే మంచిది అనిపించింది సంధ్యకి కూడా. పూర్వపు అలజడులూ, చెప్పుకోలేని బాధలు ఇప్పుడు లేవు.

"ఎల్లుండి నేను బొంబాయి వెడుతున్నా సార్" అన్నాడు రవూఫ్.

"అరే, మేమూ ఎల్లుండి మా ఊరు వెడుతున్నామే" అన్నాడు రాజా.

"మళ్ళీ మీరు తిరిగొచ్చేసరికి నేను ఈ దేశం విడిచిపెట్టేస్తాను."

"రిజిగ్నేషన్ లెటర్లూ అదీ ఇచ్చేశారా? ఫార్మాలిటీస్ అన్నీ అయిపోయాయా?'' తన బాధ ఏమాత్రం బయటకు కనబడనీయకుండా మామూలుగా అడుగుతున్నట్టుగా అంది సంధ్య.

"వారం నుంచీ ఈ గొడవల్లోనే ఉన్నాను. మీకు చెప్పడం కుదరలేదు. ఎన్నాళ్ళనుంచో ఎదురుచూసిన ఛాన్సండీ. అందుకే వెళ్ళిపోతున్నా." సంధ్య వైపు మొహం తిప్పకుండా రాజావైపే చూస్తూ మాట్లాడసాగాడు.

కాఫీ తెచ్చే నెపంతో సంధ్య అక్కడ్నించి వంటగదిలోకి వెళ్ళింది. కణతలు అదిరిపోతున్నాయి. నెస్ కలిపి, పంచదార స్పూన్‌తో తిప్పుతుంటే కన్నీటిబొట్లు గ్లాసు మీద పడ్డాయి. కళ్ళు బాగా తుడుచుకుని, కాఫీ కప్పులతో తీసుకొచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

కప్పు అందుకుంటూ చూసీ చూడనట్టు సంధ్యని గమనించాడు రవూఫ్. అతని మనస్సు కలుక్కుమంది. చేతిలో రాజా రాస్తున్న కథ తాలూకు కాగితాలున్నాయి.

"సంధ్యా! రేపు రాత్రికి రవూఫ్ గారిని డిన్నర్‌కి రమ్మంటున్నాను. మా నారాయణ కూడా వస్తాడు కదా!" అంటూ చూశాడు.

సంధ్య బలవంతంగా నవ్వి, "రండి. మళ్ళీ ఎప్పుడో కదా?" అంది.

ఆ తరువాత అతను కూర్చున్న అరగంటా మామూలుగానే మాట్లాడింది. ఇదీ ఒకందుకు మంచిదే. తన మనస్సు అసలే తెగిన దారాలు అతికించినట్టుగా ఎప్పుడు ఊడిపోతుందో అన్నట్టుగా ఉంది. రవూఫ్ వెళ్ళిపోవడమే చాలా మంచిది అనుకుంది.

మర్నాడు నారాయణ వచ్చాడు. వాళ్ళిద్దర్నీ కబుర్లకి వదిలేసి తను మాత్రం రవూఫ్‌తో గడిపిన పాత రోజులన్నీ స్మరించుకుంటూ సాయంత్రం వరకూ గడిపేసింది. సాయంత్రం నుంచీ చాలా ఓపికగా, చక్కగా డిన్నర్ తయారుచేసింది. కబుర్లతో, ఛలోక్తులతో భోజనాల కార్యక్రమం సరదాగా ముగిసింది. చేతులు కడుక్కుంటూ ఉ ంటే వెనక నుంచి దగ్గరకొచ్చి నాప్‌కిన్‌తో సగం వెలుతురులో సంధ్య నిలబడడం చూశాడు రవూఫ్.

"ఎంత చెప్పినా మీరు వినలేదు. మాతో కలిసి భోజనం చేశారు కాదు."

"మీకు తృప్తిగా వడ్డించుదాం అనుకున్నాను. కాని, మీరేమీ తినలేదు."

నేప్‌కిన్ అందుకుంటూ, "తినలేకపోయాను, అర్థం చేసుకోండి" అంటూ వెళ్ళిపోయాడు.

కాసేపు కార్డ్స్ వేశాక రాజా – "రవూఫ్ గారూ, మీకు అభ్యంతరం లేకపోతే మీ స్కూటర్ ఓ పావుగంట తీసుకుంటాను. మావాణ్ణి బస్‌స్టాండ్‌లో డ్రాప్ చేసొస్తాను" అన్నాడు.

"మీరు రేపు మా ఇంట్లో అప్పజెప్పేయ్యండి. నేనూ వెళ్ళిపోతున్నా. రిక్షా ఎక్కేస్తాను." అన్నాడు రవూఫ్.

"వద్దు వద్దు. ఎంత ఒక్క పావుగంట మీరు కూచోండి. నేను వచ్చేస్తాను." మిత్రుణ్ణి ఎక్కించుకుని వెళ్ళిపోయాడు.

నిలబడి రవూఫ్‌ని చూస్తూ – "కూచోండి" అంది.

"మీ కళ్ళెందు కలా ఎర్రగా ఉన్నాయి?"

"చాలా కాలం నుంచీ అవి అలాగే ఉంటున్నాయి."

సంధ్య తల తిప్పుకుంది. సంధ్య ఏడుస్తోంది, కాని తను అశక్తుడు. ఓదార్చే స్వతంత్రం లేదు. ఓ నెల క్రిందటే ఎంతో బలవంతపెడితే సంధ్య తన చేదు అనుభవం సంగ్రహంగా చెప్పింది. అప్పటినుంచే సంధ్యతో అసలు సిల్లీగా ప్రవర్తించకూడదు, ఆమెను ఏ రకంగానూ కదపకూడదని బాగా నిర్ణయించుకుని, చాలా స్ట్రిక్ట్‌గా ఉంటూ వచ్చాడు. రాజా పట్ల ఏవగింపు పెంచుకోవద్దనీ, చాలా దాంపత్యాలలో ఇటువంటివి సామాన్యమై పోయాయని నచ్చజెప్పాడు. అప్పటి నుంచే సంధ్య కూడా రాజా పట్ల మొండి వైఖరిని తగ్గించుకుంటూ వచ్చింది. తన వైవాహిక జీవితం గురించి ఎంతో శ్రద్ధగా ఆలోచించి, ఎంతో దూరదృష్టితో సలహా చెప్పిన రవూఫ్ అంటే ఎంతో ఇష్టం, కృతజ్ఞత ఈ కొద్దికాలంలోనే సంధ్యలో ఏర్పడింది.

ఇద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. చాలా కాలం నుంచీ సంధ్యకి తన ఫ్యామిలీ ఎఫైర్ పూర్తిగా చెప్పినందుకు చులకనయ్యానేమో అనే న్యూనతాభావం కూడా కలిగింది. అందుకే ఇప్పుడు అనేసింది.

"అన్నన్ని గొడవలలో నలగడం, ఆ అమ్మాయిని ఇంట్లో పెట్టుకోవడం, మా ఆయన్ని సాధించడం ఇవన్నీ విని మీకు ఛీ అనిపించలేదా? ఆ రోజు మీతో అదంతా చెబుతూ ఉండగా ఎవరో వచ్చారు. మళ్ళీ మనం మాట్లాడుకోలేదు.''

"నెవ్వర్" రవూఫ్ ప్రేమగా చూస్తూ అన్నాడు.

"అసలు మీ మనసులోంచి ఆ విషయాన్ని రప్పించడానికే నేను స్నేహం కూడా చేశాను. మీరు చెప్పకముందే ఆ విషయాలు మీ గిరిజగారి స్నేహితుల ద్వారా కొంత తెలుసు. అదీగాక, ఆ అమ్మాయితో ఊరి చివర మీ రాజా కలిసి తిరుగుతుండగా రెండు మూడు సార్లు చూశాను. అందుకే మీ మొహంలో ఎప్పుడూ విషాదరేఖ కనిపించేది నాకు. మీరేమో ఎవ్వరికీ చెప్పరాయె. చివరికి నేను వెళ్ళే ముందరే మీతో అవన్నీ చెప్పించగలిగాను. సంధ్యా, అట్టే టైం లేదు. మీరు నాకో మాట ఇవ్వగలరా?"

"చెప్పండి"

"మీ సెన్సిటివ్‌నెస్, మీ సిన్సియారిటీ మీ జీవితాన్ని ఎక్కడికి తీసుకుపోతుందో తలచుకుంటే ఒక్కోసారి నాకు భయమేస్తూ ఉంటుంది. రాజా, మీరు ఎప్పటికీ ఇలాగే కలిసుండాలని కోరుకుంటాను. కాని ఎప్పుడైనా, జీవితంలో మీకెవరూ లేరనే భావం మిమ్మల్ని బాధిస్తే నాకు రాసెయ్యండి. మీకెవరూ లేరనుకోవద్దు. మరీ కుమిలి కుమిలి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు."

"జీవితాంతం మీరు నాకో సీటు అట్టేబెడతారా ఏం ఖర్మ? మీ ఆవిడొస్తుందీ,

ఎవరీ రాక్షసీ అని తరిమికొడుతుంది. అరే అదేమిటీ?"

రవూఫ్ దగ్గరకెళ్ళి చెయ్యి పట్టుకుంది. రవూఫ్ కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు. తన చేతి మీద చెయ్యి వేసిన సంధ్య చేతిని, సంధ్య మొహాన్ని చూస్తుండిపోయాడు.

వేళాకోళంగా ఏదో అనబోయిన సంధ్యకి కూడా ఏడుపొచ్చేసింది. సంధ్య కన్నీళ్ళు తుడుస్తూ, "వద్దు" అన్నాడు జీరగా.

"రవూఫ్, ఇంతకన్నా మంచి క్షణాలు నాకు రావు. నేను మిమ్మల్ని పెద్దరికంతో కోప్పడేదాన్ని కాని..."

"కాని..." ఆత్రంగా అన్నాడు.

"ఇప్పుడనిపిస్తోంది నాకు... నే... నూ... ఐ... లైక్... యూ... ఐ... లవ్... యూ..." అతని మొహంలోకి చూడలేను అన్నట్టు రెండు చేతులతో మొహం కప్పుకుంది. అతని దగ్గర్నించీ ఏమీ సవ్వడి వినిపించకపోయేసరికి, అతనేమైనా దగ్గరకు తీసుకునే ప్రయత్నంలో ఉన్నాడేమో అనుకుంటూ దూరంగా జరిగి చేతులు తీసింది.

'ఈ క్షణాలు తిరిగి రావు. ఈ మాటలు మరిక వినను' అనుకున్నట్టు నిరాశగా, ఆర్తిగా, కాంక్షగా, ప్రేమగా చూస్తున్నాడతను. ఉంగరాల జుత్తుతో, తదేకంగా చూస్తున్న చూపులతో, భావుకుడిలా, సౌందర్యోపాసకుడిలా, మనోహరంగా అనిపిస్తున్నాడు రవూఫ్.

స్కూటర్ ఆగిన చప్పుడైంది. కిటికీ కింద రెక్క మూసే ఉంది. చటుక్కున కుర్చీలో కూలబడి సంధ్య చేయి అందుకుని ముద్దు పెట్టుకుని – "ప్లీజ్ మీరూ ఆ కుర్చీలో కూర్చోండి" అన్నాడు. మంత్రముగ్ధలా నడిచి వెళ్ళింది. ఆ తరువాత రవూఫ్ వెళ్ళిపోయినా ఏమీ ఏడుపు రాలేదు. ఎవరో మంత్రించినట్టుగా సొమ్మసిల్లి నిద్రపోయింది. రాజా కూడా కదపకుండా ఆమె మీద చెయ్యి వేసి నిద్రలోకి ఒరిగాడు.

***

రవూఫ్ జ్ఞాపకాలని వదిలించుకోడానికి చాలా కష్టపడింది సంధ్య. పూర్వంలా రాజాని విమర్శించే హక్కు ఇప్పుడు తనకి లేదేమో అనిపించేది. పిల్లలు పెరుగుతున్నారు. రాజా వస్తూ పోతూనే ఉన్నాడు. ఆర్నెల్ల కాలంలో చాలావరకూ తనని తాను సరిజేసుకోగలిగింది. రాధిక ఓ క్రిస్టియన్‌ని పెళ్ళి చేసుకుంది. సుజాతకి గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో అపాయింట్‌మెంట్ రావడంతో వెళ్ళిపోయింది. కాంతం మాత్రమే ఉంది.

కాంతం పెళ్ళి ఎప్పుడో మోసంతో జరిగిందట. వెంటనే విడాకులు తీసుకున్నారు. ఆ తరువాత చదువుకుంది. అందరికీ కుమారిగానే తెలుసు. ఈ కాంతం కూడా జీవితంలో స్థిరపడితే ప్రస్తుతం తనకేమీ అసంతృప్తులు ఉండవు – కరిగిపోతున్న

రోజుల్ని చూస్తూ అనుకునేది.

ఇప్పుడు సుమిత్రన్నా పూర్వంలా కోపం లేదు. అప్పటిలా ఆ అమ్మాయి గురించి ఆలోచిస్తుంటే ఉద్రేకం రావడం లేదు. కాలంతో పాటు ఆ గాయం తగ్గుముఖం పడుతూ వచ్చింది. ఇదివరకటి ఆందోళన, నిరాశ, అశాంతి ఇప్పుడంతగా లేవు. ఫారెన్ నుంచి అన్నయ్య లొచ్చిన సందర్భంలో బొంబాయి వెళ్ళి వేసవి సెలవలు గడిపి వచ్చారు.

చాలు. జీవితం ఇంతమాత్రం సాఫీగా గడచిపోతుంటే చాలు. ఇంతమాత్రం స్వతంత్రంగా బ్రతికే హక్కూ, పెళ్ళయినా మంచి మంచి స్నేహితులతో కులాసాగా గడిపే స్వేచ్ఛ మనదేశంలో ఎంతమందికి ఉంది? ఎంతోమంది కన్నా నా జీవితం చాలా నయం. నాకేం తక్కువ...? ఓ సంవత్సర కాలంలో చాలా దృఢత్వాన్నీ సరిపెట్టుకుని సంతోషించగలిగే తత్వాన్ని బాగా అలవాటు చేసుకుంది.

రాజా కూడా మళ్ళీ ఇక్కడికి గాని, బాగా దగ్గరగా ఉన్న ఊళ్ళోకి గాని ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాల కోసం  బాగా ప్రయత్నిస్తున్నాడు.

ఒక రోజు రమ కనబడి ఇంటికి లాక్కుపోయింది. రమ భర్త చాలా పెద్దమనిషిలా – ఎన్నో విషయాలు తెలిసినవాడిలా మాట్లాడుతూ కూర్చున్నాడు. రాజకీయాల గురించి అనర్గళంగా మాట్లాడగలడు. దూరం నుంచి పక్క పోర్షన్‌లో బట్టలు ఉతుకుతున్న తన సవతిని చూపించింది రమ. ఆమె దగ్గరకొచ్చేసరికి పరిచయం చేసింది.

"పూర్వంలా ఏడవడం తగ్గించాను. తొందరగా ముసలిదాన్ని ఎప్పుడవుతానా అని చూస్తున్నాను." అంది రమ ఆమె వెళ్ళిపోయాక.

సన్నగా, పొడుగ్గా సామాన్యమైన రూపంతో చకచకా పని చేసుకుంటున్న ఆమెని చూస్తే సంధ్యకి జాలి అనిపించింది. ఆమెకీ ఇద్దరు పిల్లలు. ఇక ఈ మగవాళ్ళని వదిలే ప్రసక్తి లేదు. ఏనాడో రమలో బాగా చైతన్యం వచ్చి పోరాటానికి మానసిక బలం వస్తే తప్ప ఈ సుడిగుండంలోంచి బయటకి రాలేదు.

రమ ఆ రకంగా తన మనస్సుతో రాజీ పడింది. పూర్వం కన్నా దృఢంగా మారింది.

మరి దుర్గ ఎలా ఉందో? ఆలోచిస్తుండగానే సాయంత్రం దుర్గ బిడ్డనెత్తుకుని వచ్చింది.

"ఎవరూ లేరనుకున్న దౌర్భాగ్యురాలిని. నామీద కనికరం చూపే మొగవాడు దొరికాడు. అన్నిటికన్నా గొప్ప విషయం పండంటి బాబునిచ్చాడు. రేపు అతనితో నా అనుబంధం స్థిరంగా ఉండకపోయినా నాకేం బాధ లేదు. నా కొడుకు నాకు చాలు."

వాణ్ణి బంగారమంత అపురూపంగా చూస్తూ దుర్గ తృప్తిగా అంటుంటే సంధ్య కూడా సంతోషిస్తూ తికమకపడింది.

అప్పుడనుకుంది – ఏది మంచి, ఏది చెడు? – అనేవి నిర్వచనానికి అందని మానవ లక్షణాలు. సమాజపు అస్తవ్యస్తమైన తీరుని బట్టి, ఆర్థిక వ్యవస్థని బట్టి, దోపిడీతనాన్ని బట్టి ప్రేమ సంబంధాలలో, లైంగిక సంబంధాలలో ఎన్నెన్నో మార్పులు వస్తూంటాయి. ప్రేమని జీవితాంతం స్థిరంగా ఒకే మనిషితోనే సరిపెట్టుకోగలగడం ఎక్కడో తప్ప సాధ్యం కాదు. ఆడవాళ్ళు ఉద్యోగాల పేరిట బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టడం మొదలయ్యాక, లైంగిక జీవితాల్లో ఊహించలేనన్ని మార్పులు మొదలయ్యాయి. ఎవరికి వాళ్ళు తమ సంసారంలో తప్ప మిగిలిన చోట్ల ఇవన్నీ సాధ్యమే అనే నిజానికి కట్టుబడతారు. తామే ఈ సమస్యని ఎదుర్కోవాల్సి వచ్చేటప్పటికి అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతుంటారు.

తన జీవితంలో తగ్గిన భావోద్రేకాల గురించి తన కొత్త కొత్త విశ్లేషణల గురించి గిరిజకి ఉత్తరం రాస్తూ, "ఇప్పటికి నాకు నిర్విచారంగా బ్రతకడం అంటే ఏమిటో బాగా తెలిసింది. నేనూ చాలా వ్యాపకాలు కల్పించుకున్నాను. ఎక్కువ సమయం పిల్లలతో, ఉద్యోగంతో సరిపోతుందనుకో. ఆ రోజు నువ్వు నన్ను సరిగ్గా గైడ్ చేసి ఉండకపోతే నేను నిజంగానే పిచ్చిదాన్ని అయిపోయేదాన్ని. సుమిత్ర యూనివర్సిటీలో పెద్ద హీరోయిన్ అయిపోయిందని అరుణ చెబుతూ ఉంటోంది. అయినా నాకేమీ అనిపించడం లేదు. సరిగ్గా స్థిరపడేవరకూ అవసరాలకో, గుర్తింపుకో ఆ అమ్మాయి అలా ప్రవర్తిస్తూనే ఉండొచ్చు. ఇప్పుడు నాకేం కోపం రావడం లేదు. ఈసారి సెలవలు నీ దగ్గర గడుపుదామని అనుకుంటున్నా. మనం కలిసి కబుర్లు చెప్పుకుని చాలా కాలమైంది" అంటూ ముగించింది.

గిరిజ దగ్గర నుంచి వెంటనే సమాధానం వచ్చింది.

"*ప్రియమైన సంధ్యా!*

*నీ ఉత్తరం నాకు చాలా ఆనందం కలిగించింది. రాజా కాకినాడ వచ్చిన నెలకే రాజమండ్రి వచ్చేశాను కదా! కాని నీకు హింట్ ఇవ్వడం మంచిదని రాస్తున్నాను. కాకినాడ కాలేజీలో ఓ తెలుగు లెక్చరర్ ఉంది. వయస్సు ముప్ఫయి మూడు, ముప్ఫయి నాలుగు మధ్య ఉండొచ్చు. ఏ సబ్జెక్టూ సరిగ్గా తెలియక పోయినా 'అన్నీ నాకు తెలుసు' అనే ధోరణిలో రచయితలతో, మంచి మంచి కళాకారులతో స్నేహం చేస్తూంటుంది. పెళ్ళి కాలేదు. రాజా గురించీ, ఈవిడ గురించీ బాగా వార్తలు వినిపిస్తున్నాయి. నాకు మంచి స్నేహితులైన వాళ్ళు కూడా 'ఆ రమణకి అంతకన్నా మార్గాలు లేవు. ఎవరో ఒకర్ని ఎన్నుకుని సంసార సుఖం గడపడం కావాలి. మగవాడితో సంబంధం పెట్టుకోడానికి ఏ మాత్రం సంకోచించదు' అంటున్నారు.*

*రాజాది ఉత్త స్నేహమే అయితే పరవాలేదు. అయినా తనని ఆరాధించే వాళ్ళని చూసి బాగా సంతృప్తి పడే బలహీనత రాజాకి బాగా ఉంది. రచయిత అయినా సరే, ఈ విషయంలో అతను మెచ్యూర్డ్ కాదని నాకు బాగా తెలుసు.*

*ఉద్యోగమో ఉద్యోగమో అంటూ అక్కడే కూచోకు. నేను రాసింది చదివి ఉద్రేకపడకు. నువ్వు ఎదుర్కున్న సంఘటనలన్నీ దాదాపు ప్రతి ఆడదాని జీవితంలోనూ ముందో వెనుకో ఉన్నాయి. నువ్వింకా ఉండాల్సినంత దగ్గరితనం చూపించడం లేదేమో! అతనికింకా ఏదో దొరకలేదనే వెలితి ఉండి పోయి మళ్ళీ ఇలా స్నేహం మొదలుపెట్టాడో? అయిన ఈ విషయంలో రమణదే పూర్తి తప్పు. నేనూ కూడా రాజాని స్వయంగా కలవడమో, లేదా ఉత్తరం రాయడమో చేస్తాను. నేనెప్పుడూ హెచ్చరించడంలో మొహమాటపడను. ముందే ఉంటాను, తెలుసుగా!*

*ఏమీ దిగులుపడకు. పరిష్కరించుకునే శక్తి నీకు బాగా ఉందని తెలుసు.*

*నీ*

*గిరిజ''*

ఉత్తరం చదివి అలాగే చాలాసేపుండిపోయింది. ఇప్పుడీ విషయం ఏమీ వింతగా అనిపించడం లేదు. పైగా ఏది ఎలా జరిగినా తనకేం పర్వాలేదు అనే ఓ భరోసా తనని ఎక్కువ ఆవేశపడకుండా చేసింది. తన పిచ్చిగాని, కుక్కతోక ఎప్పుడూ వంకరే. మాటిమాటికి తన చాతుర్యంతో, మాటకారితనంతో, శృంగారంతో అతన్ని కట్టిపడేసుకునే ఓర్పు తనకింక లేదు. అయినా ఎంత కాలం?

రవూఫ్ వెళ్ళిన కొత్తలో ఉత్తరం రాశాడు. తనూ కరెస్పాండెన్స్ వద్దులే అనుకుని ఒకటో అరో రాసింది. అంతే ఉత్తరాలేమీ కొనసాగడం లేదు. రాజా ప్రవర్తనలో నిజంగా లొసుగుంటే అప్పుడు తనేం చెయ్యాలో నిర్ణయించుకుంటుంది. అప్పుడు తన జీవితాన్ని కొత్తమార్గంలోకి మళ్ళించుకుని హాయిగా బ్రతికేయాలి. తన జీవితం తనది. మాటిమాటికీ తన ప్రశాంతని భగ్నం చేసే అధికారం ఇక ఈ రాజాకి ఇవ్వదు.

గిరిజ దగ్గర నుంచి ఉత్తరం వచ్చిన నాలుగు రోజులకే రాజా దగ్గరనించి ఉత్తరం వచ్చింది. "మూడు రోజులు వరుసగా సెలవలు కలిసొచ్చాయి కాబట్టి రేపు రాత్రికే వస్తున్నాను."

ఇంకో ఉత్తరం... అడ్రసు చూస్తూనే సంతోషంతో విప్పింది. రవూఫ్ అక్షరాలు ముత్యాల సరాలు. అమితమైన సంతోషంతో హాయిగా కుర్చీలో చేరగిలబడి ఉత్తరం చదవడం ప్రారంభించింది.

*"డియర్ సంధ్యా!*

*మీకో గుడ్ న్యూస్. అనుకోకుండా నేను పెళ్ళి చేసుకున్నాను. ఓ అమ్మాయికి రక్షణ నిచ్చిన నేను ఓ మనిషిగా ఆ స్త్రీ సమస్య గురించి ఆలోచించడం ప్రారంభించాను. ఆమె చెప్పిన విషయాలు విన్నాక క్రమంగా సానుభూతి ప్రేమగా మారింది. నా బాధ్యతేదో పెరిగినట్టు ఫీలయి పెళ్ళి చేసుకున్నాను.ఆమెని రక్షించిన నేను ఆమే కావాలనుకోవడం... చాలా ఫన్నీగా లేదు? అయినా నూర్జహాన్ చాలా మంచిది. అమాయకురాలు. భర్త చచ్చిపోయాడు. ఒక బాబు. కొడుకును లక్నోలో తల్లిదండ్రుల దగ్గర వదిలి ఇక్కడికి బ్రతుకుతెరువు కోసం వచ్చింది. నూర్జహాన్ మీద ప్రేమని ఎక్కువ చేసుకోవడానికి బాగా ప్రయత్నిస్తున్నాను.*

*మనసుకి తగిలిన గాయాలకి మందు మరో వ్యక్తి సాంగత్యమే అని నా జీవితమే నిరూపిస్తోంది. నూర్జహాన్‌తో జీవితం చాలా నిశ్చింతగా, హాయిగా ఉంది.*

*మీరెలా ఉన్నారు? మీకన్నా నా గురించి పట్టించుకుని, సంతోషించే వాళ్ళుండరని ముందుగా మీకే రాస్తున్నా.*

*మీ*

*రవూఫ్."*

మర్నాడు రాజా వచ్చాడు. జబ్బుపడిన దానిలా ఉన్న సంధ్యని చూసి, "అలా ఉన్నావేమ్మా?" అన్నాడు దగ్గరకు తీసుకుంటూ.

"రాజా ఒంట్లో ఏమీ బాగోలేదు. ఒక్క సహాయం చేస్తావా?" దీనంగా అంది.


"చెప్పు."

"మీరంతా అప్పుడప్పుడు, పోనీ చాలా అరుదుగానైనా తాగుతూ ఉంటారు కదూ! నాకీ రోజు తాగాలనుంది. తెస్తావా? నిజంగా. నేను సరదాకి అడగడం లేదు." ప్రాధేయపూర్వకంగా చూస్తున్న సంధ్యని చూస్తూ, "ఛా ఏం పన్లు?" అన్నాడు.

"నిజంగా తెచ్చి పెట్టవా? ఒక్కసారి రుచి చూస్తాను" పేలవంగా నవ్వుతూ అంది.

రాజా ఏమనుకున్నాడో ఏమో – "సరే, నువ్వింతగా సరదాపడుతుంటే ఇప్పుడే పట్టుకొస్తాను" అంటూ బయటకి బయల్దేరాడు, భార్య కోరికకి విస్మయానికి లోనవుతూ.

తాగాక కలగబోయే మరుపుని ఊహించుకుంటూ, ఏడుపుని తరిమికొట్టడానికి శతవిధాల ప్రయత్నిస్తూ – "నేను సంధ్యగా ఓడిపోయినా, ఓ మనిషిగా ఎప్పటికీ ఓడిపోను. రవూఫ్‌కి కంగ్రాట్స్ చెబుతూ ఉత్తరం రాయాలి" అనుకుంటూ కళ్ళు మూసుకుంది సంధ్య.



# DOORATEERALU

## Dasari Sireesha

ఎవరి జీవితంలోనైనా సమస్య మొలకెత్తిందంటే ఊబిలో అడుగు పడినట్లే. సమస్యలో చిక్కుకున్న వారి హితులు వారిని ఆ ఊబి లోంచి బయటకి లాగేందుకు ప్రయత్నిస్తే, సమస్యకు కారణమైనవారు ఊబి వైపు లాగుతూంటారు. సమస్యలో చిక్కుకున్న వ్యక్తి ప్రతి అడుగు జాగ్రత్తగా వెయ్యటానికి ప్రయత్నించినా, తెలియకుండానే తడబడ్డ అడుగులు ఊబిలోకి లాగే ప్రమాదమూ ఉంది. ఈ అంశాలన్నీ కనబడ్డాయి నాకీ నవలలో.

వివాహేతర సంబంధం సృష్టించిన ప్రకంపన ఈ నవల. వ్యక్తులు రకరకాల సందర్భాలలో, అప్పటి అవసరాల కోసం ఎలా రాజీపడతారో, ఎలా ఓర్పుగా ఉంటారో, ఎలా స్వార్థపరులవుతారో, ఎలా నిస్సహాయులవుతారో, ఎలా వాళ్ళు వాళ్ళు కాకుండా పోతారో తెలియజెప్పే నవల 'దూరతీరాలు'.

**వేమూరి సత్యనారాయణ**

❖❖❖

దాసరి శిరీషగారు రాసిన 'దూరతీరాలు' నవల దాదాపు పాతికేళ్ల క్రితం ఆంధ్రప్రభ వారపత్రికలో సీరియల్‌గా వచ్చి, అనేక మంది పాఠకుల ఆదరణ పొందింది. ఒక వివాహితుడికి, ఒక అవివాహితతో ఏర్పడిన సంబంధం ఏ విధంగా వారి జీవితాల్లో కల్లోలాన్ని సృష్టించిందో ఈ నవల చెబుతుంది.

పాతికేళ్లనాటి సమాజాన్ని ఈ నవలలో సహజంగా, అందంగా ఆవిష్కరించారు రచయిత్రి. నవల చదువుతుంటే ఆ కాలంలోకి వెళ్లిపోతాము. చదువుకుని, ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడిన స్త్రీలను ఈ నవలలో చూస్తాం. విద్యావంతులైన కొందరు దంపతులు మిగిలిన వారికంటే భిన్నంగా స్నేహితులు, సరదాలు మధ్య స్వతంత్ర్యమైన ఆలోచనలతో, విశాల దృక్పథంతో ఆదర్శవంతంగా జీవించటం కనిపిస్తుంది. అలాటి ఒక జంట కథే ఇది.

**నాదెళ్ళ అనూరాధ**